సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 294

మంగళవారం 14-1-2025




'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'




SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



# భారత్ శుభారంభం

- 42–37తో నేపాల్‌పై విజయం
- ఖోఖో ప్రపంచకప్

**న్యూఢిల్లీ:** తొలి ఖోఖో ప్రపంచకప్‌లో భారత పురుషుల జట్టు శుభారంభం చేసింది. ఇక్కడి ఇందిరాగాంధీ స్టేడియంలో సోమవారం గ్రూప్ ‘ఎ’లో జరిగిన మొదటి లీగ్ మ్యాచ్‌లో భారత్ 42–37 స్కోరుతో నేపాల్‌పై విజయం సాధించింది. మొదటి క్వార్టర్‌లో భారత్ అటాకింగ్‌కు దిగి 24 పాయింట్లు సాధించింది. ఇందులో నేపాల్ ఒక్క పాయింట్ కూడా డిఫెన్స్‌లో రాబట్టుకోలేకపోయింది. రెండో క్వార్టర్‌లో భారత్ కూడా డిఫెన్స్‌లో ఖాతా తెరువలేదు. అటాకింగ్‌లో నేపాల్ 20 పాయింట్లు చేసింది. అయితే భారత్ 4 పాయింట్లతో పైచేయితో మూడో క్వార్టర్ ప్రారంభించింది. ఇందులో మరో 18 పాయింట్లు స్కోరు చేయగా, నేపాల్ డిఫెన్స్ ఒక పాయింట్‌తో సరిపెట్టుకుంది. ఆఖరి క్వార్టర్‌లో అటాకింగ్‌కు దిగిన నేపాల్ 16 పాయింట్లే చేయడంతో భారత్ విజయం ఖాయమైంది. మంగళవారం జరిగే రెండో లీగ్ పోరులో భారత్... బ్రెజిల్‌తో తలపడనుండగా, మహిళల గ్రూప్ ‘ఎ’లో ఆతిథ్య జట్టు తమ తొలి మ్యాచ్‌లో కొరియాతో పోటీపడనుంది. పురుషుల విభాగంలో 20 జట్లు బరిలో వుండగా... గ్రూపులో ఐదు చొప్పున నాలుగు గ్రూపులుగా విభజించి లీగ్ దశ పోటీలు నిర్వహిస్తున్నారు. మహిళల ఈవెంట్‌లో 19 జట్లు బరిలోకి దిగాయి. గ్రూప్ ‘ఎ’లో భారత్ సహా ఇరాన్, మలేసియా, కొరియా నాలుగు జట్లుండగా, మిగతా బి, సి, డి గ్రూపుల్లో ఐదు జట్ల చొప్పున లీగ్ దశలో పోటీపడుతున్నాయి.

**కిక్కిరిసిన స్టేడియం**

మొదటిసారిగా జరుగుతున్న ఈ గ్రామీణ క్రీడ మెగా ఈవెంట్‌కు ప్రేక్షకులు పోటెత్తారు. వేల సంఖ్యలో వచ్చిన అభిమానులతో ఇండోర్ స్టేడియం కిక్కిరిసిపోయింది. అంతకుముందు అట్టహాసంగా జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి భారత ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అనంతరం భారతీయ సంస్కృతిని ప్రతిబింబించేలా కొన్ని సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకుల్ని అలరించాయి. సైకత రూపంలోని పుడమి తల్లి (భూమి) కళ ఆకట్టుకుంది. అనంతరం భారత జాతీయ పతాకం రెపరెపలాడుతూ జట్టు స్టేడియంలోకి రాగా అన్ని జట్లు మార్చ్‌పాస్ట్‌లో పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు పీటీ ఉష, ఖోఖో సమాఖ్య (కేకేఎఫ్ఐ) చీఫ్ సుధాన్షు మిట్టల్, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా, రాజ్యసభ సభ్యులు, బీసీసీఐ సీనియర్ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా తదితరులు పాల్గొన్నారు.



# సాత్విక్–చిరాగ్ జోడీపైనే దృష్టి

**నేటి నుంచి ఇండియా ఓపెన్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నీ**

**న్యూఢిల్లీ:** గతంలో ఎన్నడూ లేని విధంగా ఏకంగా 41 మంది భారత క్రీడాకారులు... స్వదేశంలో జరగనున్న ఇండియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 టోర్నీలో బరిలోకి దిగనున్నారు. నేడు మొదలయ్యే ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో భారత క్రీడాకారులు టైటిల్ సాధించి రెండేళ్లు గడిచాయి. చివరిసారి 2022లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) ద్వయం పురుషుల డబుల్స్ విభాగంలో విజేతగా నిలిచింది. ఈసారి కూడా సాత్విక్–చిరాగ్ శెట్టిలపైనే అందరి దృష్టి కేంద్రీకృతమైంది. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు, ఆకర్షి కశ్యప్, అనుపమా ఉపాధ్యాయ్, మాళవిక బన్సోద్ పోటీపడతారు. తొలి రౌండ్‌లో అనుపమాతో సింధు ఆడనుంది. పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్, ప్రియాన్షు రజావత్, లక్ష్య సేన్, ప్రణయ్, కిరణ్ జార్జి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



# శభాష్... నిశేష్

**జొకోవిచ్‌కు గట్టిపోటీనిచ్చిన తెలుగు సంతతి అమెరికన్ టీనేజర్**

- నాలుగు సెట్‌లలో నెగ్గిన సెర్బియా దిగ్గజం
- డిఫెండింగ్ చాంపియన్ సినెర్ శుభారంభం
- తొలి రౌండ్‌లోనే ఓడిన 11వ సీడ్ సిట్సిపాస్

అటువైపు ప్రత్యర్థి 24 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ విజేత... ఏకంగా 1126 మ్యాచ్‌ల్లో విజయం సాధించిన ప్లేయర్... కెరీర్‌లో ఇప్పటికే 76 గ్రాండ్‌స్లామ్ టోర్నీలు ఆడిన అనుభవం సొంతం... ఇటువైపు ప్లేయర్‌కు ‘వైల్డ్ కార్డు’ ద్వారా కెరీర్‌లోనే తొలి గ్రాండ్‌స్లామ్ మ్యాచ్ ఆడే అవకాశం... ఎదురైన ప్రత్యర్థి తానెంతో ఇష్టపడే ఆటగాడు... ఇద్దరి బలాబలాలు పరిశీలిస్తే మ్యాచ్ ఏకపక్షంగా వరుస సెట్‌లలో ముగియడం ఖాయమని విశ్లేషకుల ఏకాభిప్రాయం... కానీ అలాంటిదేమీ జరగలేదు. ఒకే ఒక్క మ్యాచ్‌తో టెన్నిస్ ప్రపంచాన్ని ఆకర్షించేందుకు వచ్చిన అవకాశాన్ని ఆ కుర్రాడు వదులుకోలేదు. తన అసమాన పోరాటపటిమతో అందరి దృష్టిలో పడ్డాడు. అతడే 19 ఏళ్ల నిశేష్ బసవరెడ్డి... తెలుగు సంతతికి చెందిన అమెరికన్ టెన్నిస్ టీనేజ్ రైజింగ్ స్టార్.. సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో నిశేష్ తొలి రౌండ్‌లోనే ఓడిపోయినా... ప్రతి పాయింట్ సాధించేందుకు జొకోవిచ్‌ను తెగ కష్టపెట్టాడు. నిశేష్‌కు ఎంతో భవిష్యత్ ఉందని మ్యాచ్ అనంతరం జొకోవిచ్ కూడా వ్యాఖ్యానించడం విశేషం.

**మెల్‌బోర్న్:** రికార్డుస్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్ లక్ష్యంగా ఆస్ట్రేలియన్ ఓపెన్ బరిలోకి దిగిన సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ తొలి అడ్డంకిని అధిగమించాడు. ప్రపంచ 107వ ర్యాంకర్, అమెరికన్ రైజింగ్ టీనేజ్ టెన్నిస్ స్టార్ నిశేష్ బసవరెడ్డితో జరిగిన తొలి రౌండ్ పోరులో జొకోవిచ్ గెలిచి 18వ సారి ఈ టోర్నీలో రెండో రౌండ్‌లోకి ప్రవేశించాడు. 2 గంటల 59 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో నిశేష్ 6–4, 3–6, 4–6, 2–6తో జొకోవిచ్ చేతిలో పోరాడి ఓడిపోయాడు. గత నెలలోనే ప్రొఫెషనల్‌గా మారిన 19 ఏళ్ల నిశేష్ ఏమాత్రం తడబడకుండా తన ఆటతీరుతో ఆకట్టుకున్నాడు. బేస్ లైన్ వద్ద సుదీర్ఘ ర్యాలీలు ఆడుతూనే... అడపాదడపా డ్రాప్ షాట్‌లు... కళ్లు చెదిరే రిటర్న్‌లతో వరుసగా 21వ ఏడాది గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆడుతోన్న జొకోవిచ్‌కు ఇబ్బంది పెట్టడంలో నిశేష్ సఫలమయ్యాడు. తొలి సెట్‌లోని ఎనిమిదో గేమ్‌లో జొకోవిచ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన నిశేష్ ఆ తర్వాత తన సర్వీస్‌ను నిలబెట్టుకొని 5–3తో ముందంజ వేశాడు. తొమ్మిదో గేమ్‌లో జొకోవిచ్ సర్వీస్ కాపాడుకోగా... పదో గేమ్‌లో నిశేష్ తన సర్వీస్‌ను నిలబెట్టుకొని తొలి సెట్‌ను 49 నిమిషాల్లో 6–4తో సొంతం చేసుకోవడంతో మ్యాచ్‌ను మైదానంలో ప్రత్యక్షంగా చూస్తున్న వేలాది మంది ప్రేక్షకులు, టీవీల ముందున్న లక్షలాది వీక్షకులు ఆశ్చర్యపోయారు. తొలి సెట్ నెగ్గిన ఉత్సాహంతో రెండో సెట్‌లోనూ నిశేష్ భేషుగ్గా ఆడాడు. అయితే అపార అనుభవజ్ఞుడైన జొకోవిచ్ టీనేజర్ నిశేష్ ఆటతీరుపై అవగాహన పెంచుకొని దూకుడు పెంచాడు. స్కోరు 4–3 వద్ద ఎనిమిదో గేమ్‌లో నిశేష్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన జొకోవిచ్ తొమ్మిదో గేమ్‌లో తన సర్వీస్‌ను కాపాడుకొని 44 నిమిషాల్లో రెండో సెట్ దక్కించుకొని లయలోకి వచ్చాడు. రెండో సెట్‌లోని చివరి గేమ్ ఆడుతున్న సమయంలో నిశేష్ కాలు బెణకడంతో అతను ఆ తర్వాత చురుగ్గా కదల్లేకపోయాడు. మరోవైపు జొకోవిచ్ మరింత జోరు పెంచాడు. మూడో సెట్‌లోని తొలి గేమ్‌లోనే నిశేష్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన జొకోవిచ్ ఆ తర్వాత తన సర్వీస్‌లను కాపాడుకొని 43 నిమిషాల్లో సెట్‌ను సొంతం చేసుకున్నాడు. నాలుగో సెట్‌లో కూడా తొలి గేమ్‌లో, ఐదో గేమ్‌లో నిశేష్ సర్వీస్‌లను బ్రేక్ చేసిన జొకోవిచ్ కళ్లు చెదిరే ఏస్‌తో మ్యాచ్‌ను ముగించాడు. ‘నిశేష్ పరిపూర్ణ క్రీడాకారుడిలా ఆడాడు. అతను ఆడిన కొన్ని షాట్‌లు నన్నే ఆశ్చర్యానికి గురి చేశాయి. చివరి పాయింట్ వరకు పోరాటపటిమతో ఆకట్టుకున్నాడు. భవిష్యత్‌లో నిశేష్ ఆటతీరును చాలాసార్లు చూస్తాము. ఇందులో సందేహం లేదు’ అని మ్యాచ్ ముగిశాక జొకోవిచ్ వ్యాఖ్యానించాడు. 2005లో అమెరికాలో పుట్టి పెరిగిన నిశేష్ స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో విద్యాభ్యాసం చేశాడు. నిశేష్ తల్లిదండ్రులు మురళీ రెడ్డి, సాయిప్రసన్న స్వస్థలం నెల్లూరు జిల్లా. 1999లో ఉద్యోగరీత్యా భారత్ నుంచి అమెరికాకు వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. తొలి రౌండ్‌లో ఓడిన నిశేష్‌కు 1,32,000 ఆస్ట్రేలియన్ డాలర్ల (రూ. 70 లక్షల 47 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 10 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ టోర్నీ ముగిశాక విడుదల చేసే ర్యాంకింగ్స్‌లో నిశేష్ కెరీర్ బెస్ట్ 104వ ర్యాంక్‌కు చేరుకుంటాడు.



జొకోవిచ్

**అల్‌కరాజ్ అలవోకగా...**

పురుషుల సింగిల్స్‌లో సోమవారం స్టార్ ప్లేయర్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. 11వ సీడ్ సిట్సిపాస్ (గ్రీస్) తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టగా... డిఫెండింగ్ చాంపియన్ సినెర్ (ఇటలీ), మూడో సీడ్ అల్‌కరాజ్ (స్పెయిన్) రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టారు. 2023 ఆస్ట్రేలియన్ ఓపెన్ రన్నరప్ సిట్సిపాస్ 5–7, 3–6, 6–2, 4–6తో మికెల్సన్ (అమెరికా) చేతిలో ఓడిపోయాడు. 2018 తర్వాత ఈ టోర్నీలో సిట్సిపాస్ తొలి రౌండ్‌లోనే ఓడిపోవడం గమనార్హం. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో సినెర్ 7–6 (7/2), 7–6 (7/5), 6–1తో నికోలస్ (చిలీ)పై, అల్‌కరాజ్ 6–1, 7–5, 6–1తో షెవ్‌చెంకో (కజకిస్తాన్)పై విజయం సాధించారు. పసారో (ఇటలీ)తో జరిగిన మ్యాచ్‌లో పదో సీడ్ దిమిత్రోవ్ గాయం కారణంగా రెండో సెట్‌లో వైదొలిగాడు.

**మ్యాచ్ గణాంకాలు**

| జొకోవిచ్ | | నిశేష్ |
|---|---|---|
| 23 | ఏస్‌లు | 4 |
| 4 | డబుల్ ఫాల్ట్‌లు | 8 |
| 56 | తొలి సర్వ్‌లో పాయింట్లు | 51 |
| 21 | రెండో సర్వ్‌లో పాయింట్లు | 26 |
| 51 | విన్నర్స్ | 32 |
| 41 | అనవసర తప్పిదాలు | 42 |
| 4/11 | బ్రేక్ పాయింట్లు | 1/3 |
| 14/17 | నెట్ పాయింట్లు | 8/17 |
| 129 | మొత్తం పాయింట్లు | 106 |

**21** టెన్నిస్ ఓపెన్ శకంలో (1968 నుంచి) వరుసగా 21వ ఏడాది జొకోవిచ్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఒక్క విజయమైనా సాధించాడు. ఈ జాబితాలో రోజర్ ఫెడరర్ (22 ఏళ్లు) మాత్రమే ముందున్నాడు.

**429** ఓపెన్ శకంలో అత్యధిక గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ మ్యాచ్‌లు ఆడిన ప్లేయర్‌గా ఫెడరర్ (429 మ్యాచ్‌లు) పేరిట ఉన్న రికార్డును జొకోవిచ్ సమం చేశాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో జొకోవిచ్ రెండో రౌండ్ మ్యాచ్‌లో బరిలోకి దిగితే ఫెడరర్ రికార్డును అధిగమిస్తాడు.

# సాక్షి సినిమా



ధనుష్

## కేజీఎఫ్ నేపథ్యంలో...

**హీ**రో ధనుష్, దర్శకుడు వెట్రిమారన్ కాంబినేషన్ రిపీట్ కానుంది. ఈ కాంబినేషన్‌లో తొలి చిత్రం ‘పొల్లాదవన్’ 2007లో వచ్చింది. ఆ తర్వాత ‘ఆడుకాలం (2011), ‘వడ చెన్నై’ (2018), అసురన్’ (2019) వంటి సక్సెస్‌ఫుల్ మూవీలు వచ్చాయి. తాజాగా వీరి కాంబినేషన్‌లో ఐదో సినిమా రానుంది. ఈ చిత్రాన్ని ఆర్ఎస్ ఇన్ఫోటైన్మెంట్ సంస్థ నిర్మించనుంది. విజయ్ సేతుపతి హీరోగా ఈ సంస్థ నిర్మించిన ‘విడుదల 2’ చిత్రం థియేటర్స్‌లో 25 రోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ఆడియన్స్‌కు ధన్యవాదాలు తెలిపి, తమ నిర్మాణ సంస్థలో ధనుష్–వెట్రిమారన్‌ల కాంబోలో మూవీ ఉంటుందని ‘ఎక్స్’ వేదికగా తెలిపింది ఆర్ఎస్ ఇన్ఫోటైన్మెంట్ సంస్థ. కాగా ధనుష్‌తో వెట్రిమారన్ చేయనున్న మూవీ కేజీఎఫ్ (కోలార్ గోల్డ్ ఫీల్డ్స్) బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుందని, ఈ సినిమాలో మరో అగ్ర హీరో కూడా నటిస్తారని కోలీవుడ్ సమాచారం.



అనిల్ రావిపూడి, ఐశ్వర్యా రాజేశ్, వెంకటేశ్, మీనాక్షీ చౌదరి, ‘దిల్’ రాజు, శిరీష్, భీమ్స్

## సంక్రాంతికి మంచి మూవీతో వస్తున్నాం

**- వెంకటేశ్**

‘‘సంక్రాంతికి వస్తున్నాం’ బాగా వచ్చింది. మీరంతా మీ ఫ్యామిలీతో థియేటర్స్‌కు వచ్చి, మా సినిమాని ఎంజాయ్ చేయండి’’ అన్నారు వెంకటేశ్. ఆయన హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘సంక్రాంతికి వస్తున్నాం’. ఈ చిత్రంలో ఐశ్వర్యా రాజేశ్, మీనాక్షీ చౌదరి హీరోయిన్లుగా నటించారు. ‘దిల్’ రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ చిత్రం నేడు (మంగళవారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ‘బ్లాక్‌బస్టర్ మ్యూజికల్ నైట్’ ఈవెంట్‌లో వెంకటేశ్ మాట్లాడుతూ– ‘‘సంక్రాంతికి వస్తున్నాం’ తరహా సినిమాలను నా ఫ్యాన్స్ ఎక్కువగా ఇష్టపడతారు. అనిల్ ప్రతి సీన్‌ని అద్భుతంగా తీశాడు. మళ్లీ మేము సంక్రాంతికి మంచి సినిమాతో వస్తున్నాం’’ అన్నారు. ‘‘వెంకటేశ్‌గారితో నేను చేసిన మూడో ఫిల్మ్ ఇది. ఆడియన్స్ హ్యాట్రిక్ విజయాన్ని అందిస్తారని ఆశిస్తున్నాం. ఈ సినిమా నా కెరీర్‌లోనే బెస్ట్ ఎంటర్‌టైనర్‌గా నిలవనుంది’’ అని తెలిపారు అనిల్ రావిపూడి. ‘‘వెంకటేశ్‌గారితో కలిసి పనిచేయడం చాలా సంతోషంగా ఉంది. నా కల నిజమైనట్లుగా ఉంది’’ అని పేర్కొన్నారు సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో. ‘‘ఈ సినిమాను ప్రేక్షకులు పెద్ద సక్సెస్ చేస్తారని ఆశిస్తున్నాను’’ అన్నారు ‘దిల్’ రాజు. ఈ వేడుకలో నటుడు ఉపేంద్ర లిమాయే, సింగర్ రమణ గోగుల, లిరిక్ రైటర్స్ రామజోగయ్య శాస్త్రి, భాస్కరభట్ల, ఆర్ట్ డైరెక్టర్ ఏఎస్ ప్రకాశ్, ఎడిటర్ తమ్మిరాజు, డీవోపీ సమీర్ రెడ్డి పాల్గొని, మాట్లాడారు.



బాలకృష్ణ

## మహా కుంభమేళాలో...

‘సింహా, లెజెండ్, అఖండ’ వంటి హిట్ సినిమాల తర్వాత హీరో బాలకృష్ణ, డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం ‘అఖండ 2: తాండవం’. ఎం. తేజస్విని సమర్పణలో 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ మహా కుంభమేళాలో సోమవారం ప్రారంభమైంది. ‘‘ప్రపంచంలోనే అతి పెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళాలో ‘అఖండ 2’ చిత్రీకరణ కొత్త షెడ్యూల్ ప్రారంభమైంది. సినిమాలోని పలు కీలక సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించనున్నాం. సెప్టెంబర్ 25న ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తాం’’ అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమెరా: సి.రాంప్రసాద్, సంతోష్ డి.

## కావాలని మాట్లాడలేదు

**- దర్శకుడు నక్కిన త్రినాథరావు**

**సం**దీప్ కిషన్, రీతూ వర్మ జంటగా త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘మజాకా’. రావు రమేశ్, ‘మన్మథుడు’ మూవీ ఫేమ్ అన్షు కీలక పాత్రలు పోషించారు. ఫిబ్రవరి 21న ఈ మూవీ విడుదల కానుంది. ఈ మూవీ టీజర్ లాంచ్ ఈవెంట్‌లో త్రినాథరావు మాట్లాడిన మాటలు వివాదాస్పదం అయ్యాయి. దీనిపై త్రినాథరావు నక్కిన స్పందించి, ఓ వీడియోను విడుదల చేశారు. దాని సారాంశం ఏంటంటే.. ‘‘మజాకా’ టీజర్ రిలీజ్ ఈవెంట్‌లో నేను మాట్లాడిన మాటలు చాలామంది మహిళల మనసులను నొప్పించాయని అర్థమైంది. అయితే నవ్వించే ప్రయత్నంలో అనుకోకుండా నా నోటి నుంచి వచ్చిన మాటలే తప్ప కావాలని మాట్లాడిన మాటలు కాదు. అయినా ఆ మాటలు అందరి మనసులను నొప్పించాయి కాబట్టి తప్పు తప్పే. కాబట్టి క్షమాపణలు తెలియజేస్తున్నాను. అన్షుగారికి కూడా క్షమాపణలు తెలియజేస్తున్నాను. అలాగే వినోదం కోసం మా హీరోయిన్ రీతూ వర్మను ఏడిపించే క్రమంలో వాడిన మేనరిజమ్ వల్ల కూడా తప్పు జరిగిపోయింది. అది కావాలని చేసింది కాదు. కానీ ఎవరి మనోభావాలైనా దెబ్బతిని ఉంటే వారికీ క్షమాపణలు తెలియజేస్తున్నాను’’ అన్నారు త్రినాథరావు నక్కిన.



త్రినాథరావు నక్కిన, రావు రమేశ్, అన్షు, రీతూ వర్మ, సందీప్ కిషన్

**త్రినాథరావుగారు మంచి వ్యక్తి:** త్రినాథరావు నక్కిన మాటలపై అన్షు స్పందించి, ఓ వీడియోను విడుదల చేశారు. ‘‘మజాకా’ టీజర్‌కి అద్భుతమైన స్పందన వస్తున్నందుకు హ్యాపీగా ఉంది. ఇక త్రినాథరావు నక్కినగారు వేదికపై మాట్లాడిన మాటలు పెద్ద సబ్జెక్ట్ కాదు. ఆయన చాలా మంచి వ్యక్తి. తన కుటుంబంలోని వ్యక్తిగా నన్ను చూసుకుంటారాయన’’ అన్నారు.


## ముచ్చటగా మూడు

‘బేబీ’ సినిమాతో సక్సెస్‌ఫుల్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకున్నారు తెలుగు అమ్మాయి వైష్ణవీ చైతన్య. ప్రస్తుతం ‘డీజే టిల్లు’ ఫేమ్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా చేస్తున్న ‘జాక్’ మూవీలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. ‘బొమ్మరిల్లు’ భాస్కర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదల కానుంది. తాజాగా ఈ యంగ్ బ్యూటీ ముచ్చటగా మూడు సినిమాలకు సైన్ చేశారని సమాచారం. అది కూడా తెలుగులో కాదు... తమిళంలో రెండు సినిమాలు, కన్నడంలో ఓ స్టార్ హీరో ఫిల్మ్‌లో హీరోయిన్‌గా వైష్ణవి అవకాశం దక్కించుకున్నారని తెలిసింది. అలానే తెలుగులోనూ సినిమాలు చేసేందుకు వైష్ణవి కథలు వింటున్నారు. ఇలా ఈ ఏడాది వైష్ణవీ చైతన్య ఫుల్ బిజీగా ఉంటారని ఊహించవచ్చు.



వైష్ణవీ చైతన్య

## విష్ణు దేవాలయాల రహస్యంతో...




విరాట్ కర్ణ

‘పెదకాపు’ చిత్రం ఫేమ్ విరాట్ కర్ణ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘నాగబంధం’. ‘ది సీక్రెట్ ట్రెజర్’ అన్నది ట్యాగ్‌లైన్. ‘డెవిల్: ది బ్రిటిష్ సీక్రెట్ ఏజెంట్’ మూవీతో దర్శకుడిగా మారిన నిర్మాత అభిషేక్ నామా ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. నభా నటేశ్, ఐశ్వర్యా మీనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. లక్ష్మీ ఐరా, దేవాన్ష్ నామా సమర్పణలో ఎన్ఐకే స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్‌పై కిశోర్ అన్నపురెడ్డి నిర్మిస్తున్నారు. ఈ మూవీ నుంచి రుద్రగా విరాట్ కర్ణ ఫస్ట్ లుక్‌ని హీరో రానా దగ్గుబాటి లాంచ్ చేశారు. ‘‘నాగబంధం’ అనేది పాన్–ఇండియన్ ఎపిక్ మూవీ. పద్మనాభస్వామి, పూరి జగన్నాథ్ దేవాలయాల వద్ద ఇటీవల కనుగొన్న గుప్తనిధుల నుండి ప్రేరణ పొంది, ఆధ్యాత్మిక సాహసోపేతమైన ఇతివృత్తం నేపథ్యంలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. భారతదేశంలోని విష్ణు దేవాలయాల చుట్టూ ఉన్న రహస్యాన్ని నాగబంధంలో చూపిస్తున్నాం. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమాని విడుదల చేస్తాం’’ అని యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి కెమెరా: సౌందర్ రాజన్ .ఎస్, సంగీతం: అభే.

## ది రైజ్ ఆఫ్ అశోక

**స**తీష్ నీనాసం హీరోగా నటిస్తున్న మూవీ ‘ది రైజ్ ఆఫ్ అశోక’. వినోద్ దొండలే దర్శకత్వంలో ఈ చిత్రాన్ని వర్ధన్ నరహరి, జైష్ణవి, సతీష్ నీనాసం నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో విడుదల కానున్న ఈ సినిమా షూటింగ్ 80 శాతం పూర్తయింది. ఈ సినిమా ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ‘‘సతీష్ కెరీర్‌లో ఇదొక వినూత్న ప్రయోగం. ఆయన కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్‌గా నిలుస్తుంది. వచ్చే నెల 15న కొత్త షెడ్యూల్‌ను ప్రారంభిస్తాం’’ అని చిత్రయూనిట్ పేర్కొంది. బి. సురేష్, అచ్యుత్ కుమార్, గోపాల్ కృష్ణ దేశ్‌పాండే, సంపత్ మైత్రేయ, యశ్ శెట్టి ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: పూర్ణచంద్ర తేజస్వి .ఎస్‌వీ.



సతీష్ నీనాసం


## ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్

**స**న్నీ లియోన్ ప్రధాన పాత్ర పోషించిన తాజా చిత్రం ‘త్రిముఖ’. రాజేశ్ నాయుడు–శ్రీదేవి మద్దాలి దర్శకత్వం వహించారు. ఈ సినిమా ద్వారా యోగేష్ కల్లే నటుడిగా పరిచయమవుతున్నారు. అకీరా డ్రీమ్ క్రియేషన్స్ బ్యానర్‌పై హర్ష కల్లే నిర్మించారు. నాజర్, సీఐడీ ఆదిత్య శ్రీవాస్తవ్, సుమన్, మొట్ట రాజేంద్రన్, ప్రవీణ్, ఆషు రెడ్డి ఇతర పాత్రల్లో నటించారు. ‘‘ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన చిత్రం ‘త్రిముఖ’. ప్రస్తుతం ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. మార్చిలో ఈ చిత్రం విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం’’ అని చిత్రబృందం పేర్కొంది. ఇదిలా ఉంటే.. ‘త్రిముఖ’లో నటించిన యోగేష్ కల్లే ‘చాణక్యం, బెజవాడ బాయ్స్’ అనే మరో రెండు చిత్రాల్లోనూ నటిస్తున్నారు.



యోగేష్, సన్నీ లియోన్

సత్యమేవ జయతే
# సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 294
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'





## తొలి రోజే కోటిన్నర

మహా కుంభమేళాకు పోటెత్తిన భక్తులు 6 లో

సోమవారం మహాకుంభమేళా తొలిరోజున ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమ స్థలి వద్ద పుణ్యస్నానాలకు తరలివచ్చిన భక్తులు

# సర్కారు నిధుల వేట!

**ఈ నెలలోనే ప్రతిష్టాత్మక పథకాలను ప్రారంభించనున్న సర్కారు**

- వాటి అమలు కోసం తక్షణమే రూ.10వేల కోట్లు అవసరమని అంచనా
- రైతు భరోసాకు రూ.8,200 కోట్లు.. ఆత్మీయ భరోసాకు రూ.600 కోట్లు
- గ్రామ పంచాయతీల్లో రూ.10 లక్షల లోపు బిల్లులు చెల్లిస్తే మరో రూ.800 కోట్లు అవసరం
- వీటికి తోడు కొత్త రేషన్‌కార్డులు, సన్నబియ్యం ఇస్తే మరింత భారం
- ఇందిరమ్మ ఇళ్ల కోసం రూ.20వేల కోట్లు కావాలని సర్కారు లెక్కలు
- **మొత్తంగా రూ.45 వేల కోట్లకుపైనే అవసరమని అంచనాలు..**
- వచ్చే మూడు నెలలపాటు ప్రతి నెలా రూ.10 వేల కోట్లు అప్పు చేసేందుకు ఏర్పాట్లు

2 లో



## సెలవు

సంక్రాంతి పర్వదినం సందర్భంగా నేడు సాక్షి కార్యాలయానికి సెలవు. కావున బుధవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం గురువారం.

## ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అరెస్ట్



- ఎమ్మెల్యే సంజయ్‌పై దాడి చేశారనే ఆరోపణలతో హైదరాబాద్‌లో అదుపులోకి..
- కరీంనగర్‌కు తరలింపు

5 లో

## ఆనందం, ఆరోగ్యం ఇవ్వాలి

సంక్రాంతి సందేశంలో ప్రధాని మోదీ ఆకాంక్ష
ఢిల్లీలో కిషన్‌రెడ్డి ఇంట్లో వేడుకలకు హాజరు 2 లో

# వ్యవసాయం పండుగే..

**కూరగాయల సాగుతో లాభాలు సాధిస్తున్న బండారి వెంకటేశ్**

వ్యవసాయం లాభాసాటిగా లేదంటూ ఎందరో సాగు మానేస్తుంటే.. వ్యవసాయం దండగ కాదు పండుగేనని పలువురు ఆదర్శ రైతులు నిరూపించారు. పంటల పండుగ సంక్రాంతి సందర్భంగా అలాంటి వారిని 'సాక్షి' పలకరించింది. వివరాలివిగో..

జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పెంబట్ల గ్రామానికి చెందిన బండారి వెంకటేశ్ మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలు సాగు చేస్తూ లాభాలు సంపాదిస్తున్నారు.. పదో తరగతి వరకే చదివిన వెంకటేశ్.. గతంలో ఉపాధి కోసం సింగపూర్ వెళ్లారు. ఊర్లో ఆరేడు ఎకరాల భూమి ఉన్నా.. భార్యాపిల్లలను వదిలి, పరాయి దేశంలో బతకడం నచ్చలేదు. తిరిగి వచ్చేసి హడావుడిగా ఆవులతో డైరీ ఫారం పెట్టారు. కానీ అవగాహన లేక నష్టాలు మూటగట్టుకున్నారు.

**కూరగాయల సాగు మొదలుపెట్టి..**

వెంకటేశ్ భార్య విజయ సహకారంతో తమ భూమిలో వ్యవసాయం చేయాలని నిర్ణయించారు. అందరు రైతుల్లా వరి వంటివి కాకుండా.. లాభాసాటిగా ఉండేలా వినూత్న పంటలపై దృష్టిపెట్టారు. మహారాష్ట్ర, బెంగళూర్ తదితర చోట్లకు వెళ్లి, రైతులను కలసి పంటలను పరిశీలించారు. ఈ క్రమంలో టమాటా, బీరకాయ, కాకరకాయ, వంకాయ, కాలీఫ్లవర్, క్యాబేజీ వంటి కూరగాయలు సాగు మొదలుపెట్టారు. మార్కెట్లకు వెళ్లి ఏ సీజన్‌లో, ఏ పంటకు డిమాండ్ ఉంటుందో పరిశీలిస్తూ.. ఎప్పటికప్పుడు పంటలు మార్చుతూ వచ్చారు. సాగులో సేంద్రియ పద్ధతులతో ఖర్చునూ తగ్గించుకున్నారు. మొత్తంగా వ్యవసాయం దండుగ కాదు పండుగేనని నిరూపించారు. ప్రస్తుతం పుచ్చకాయలను పండిస్తున్నారు. వెంకటేశ్ కృషిని చూసిన పలు స్వచ్ఛంద సంస్థలు సత్కరించాయి కూడా. తన తోట వద్దకు వచ్చే రైతులకు అన్ని విషయాలు వివరిస్తూ.. లాభసాటిగా ఎలా ఉండాలనే అవగాహన కల్పిస్తుంటారు. ఉద్యోగం ఉన్నవాళ్లను కాదు రైతునే పెళ్లి చేసుకుంటాననే రోజులు రావాలని ఆయన చెబుతుంటారు.





## 'కులగణన' ఆధారంగానే కొత్త రేషన్ కార్డులు

**మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం**



సాక్షి, హైదరాబాద్: కులగణన సర్వే ఆధారంగానే రేషన్‌కార్డులు లేని కుటుంబాలను గుర్తించి అర్హులకు కొత్త ఆహారభద్రత (రేషన్) కార్డులు జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈనెల 26 నుంచి అర్హులకు కొత్త రేషన్ కార్డులు అందజేయనున్నట్టు ప్రభుత్వం పేర్కొంది. కొత్త రేషన్ కార్డుల మంజూరుకు సంబంధించిన మార్గదర్శకాలను సోమవారం విడుదల చేసింది. రేషన్‌కార్డుల జారీకి సంబంధించి ప్రభుత్వం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం సిఫారసులకు అనుగుణంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరగనున్నట్టు తెలిపింది.

**విధి విధానాలు ఇవే..**

కులగణన సర్వే ఆధారంగా తయారు చేసిన రేషన్‌కార్డులు లేని కుటుంబాల జాబితాను జిల్లా కలెక్టర్లు, జీహెచ్ఎంసీ కమిషనర్‌కు క్షేత్రస్థాయి పరిశీలన కోసం పంపిస్తారు. మండల స్థాయిలో ఎంపీడీవో, మునిసిపాలిటీలలో మున్సిపల్ కమిషనర్ ఈ మొత్తం ప్రక్రియకు బాధ్యులుగా వ్యవహరిస్తారు. జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ)/ డీసీఎస్ఓ పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారు. ముసాయిదా జాబితాను గ్రామసభ, వార్డులో ప్రదర్శించి, చదివి వినిపించి చర్చించిన తర్వాత ఆమోదిస్తారు. గ్రామసభ, వార్డు సభల్లో ఆమోదించిన లబ్ధిదారుల అర్హత జాబితాను మండల, మునిసిపల్ స్థాయిలో ఇచ్చిన లాగిన్‌లో నమోదు చేసి జిల్లా కలెక్టర్, జీహెచ్ఎంసీ కమిషనర్‌లకు పంపాలి. వాటిని పరిశీలించి సంతృప్తి చెందిన వీరు ఆ జాబితాను పౌరసరఫరాల శాఖ కమిషనర్ లాగిన్‌కు పంపించాల్సి ఉంటుంది. తదనుగుణంగా కమిషనర్ కొత్త రేషన్‌కార్డులు జారీ చేస్తారు. రేషన్‌కార్డు పొందేందుకు అర్హత కలిగిన వ్యక్తి ఒకేఒక్క ఆహార భద్రత (రేషన్) కార్డులో తన పేరు ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఆహార భద్రత కార్డుల్లో కొత్తగా సభ్యుల పేర్ల చేర్పులు, తొలగింపులు చేసుకోవచ్చు. దీంతో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న వినతుల పరిష్కారం దిశగా సర్కారు ముందడుగు వేసినట్టయ్యింది.

# ఆనందం.. ఆరోగ్యం ఇవ్వాలి..

**సంక్రాంతి సందేశంలో ప్రధాని మోదీ ఆకాంక్ష ● ఢిల్లీలో కిషన్‌రెడ్డి ఇంట్లో వేడుకలకు హాజరు**

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి నివాసంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం ఢిల్లీలోని ఆయన నివాసంలో జరిగిన ఈ సంబరాలకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మోదీకి కిషన్‌రెడ్డి కుటుంబసభ్యులతోపాటు, ప్రముఖ సినీనటుడు చిరంజీవి తదితరులు స్వాగతం పలికారు. నేరుగా తులసికోట వద్దకు చేరుకొని అక్కడ పూజలు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాలు, పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య భోగి మంటలు వెలిగించారు. గంగిరెద్దులకు వృషభ పూజ చేశారు. అక్కడి నుంచి సంప్రదాయ, జానపద కళాకారుల నృత్యాలు, డప్పు చప్పుళ్ల మధ్య సభాస్థలి వరకు మోదీకి స్వాగతం పలికారు. సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా తీర్చిదిద్దిన వేదికపై ప్రధాని మోదీ జ్యోతి వెలిగించారు. ప్రముఖ గాయని సునీత శ్లోకం ఆలపించగా, ఢిల్లీ నాట్య అకాడమీ బృందం నృత్యంతో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.

**ఇది సంస్కృతి, సమృద్ధి, పునరుద్ధరణ వేడుక: మోదీ**

సంక్రాంతి పండుగ సంస్కృతి, పునరుద్ధరణల వేడుక అంటూ ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. 'నా మంత్రివర్గ సహచరుడు జి.కిషన్‌రెడ్డి నివాసంలో జరిగిన సంక్రాంతి వేడుకలకు హాజరయ్యాను. అద్భుతమైన సాంస్కృతిక కార్యక్రమాన్ని కూడా చూసి ఆనందించాను. ఇది మన సంస్కృతి, వ్యవసాయ సంప్రదాయాలల్లో అంతర్భాగమైన కృతజ్ఞత, సమృద్ధి, పునరుద్ధరణల వేడుక. సంక్రాంతి అందరికీ ఆనందం, మంచి ఆరోగ్యంతోపాటు రాబోయే కాలం మరింత సుసంపన్నమైన పంట చేతికి అందాలని కోరుకుంటున్నాను' అంటూ ట్వీట్ ముగించారు.



సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న ప్రధాని నరేంద్రమోదీ. చిత్రంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, సినీ నటుడు చిరంజీవి తదితరులు



కిషన్ రెడ్డి నివాసంలో జరిగిన వేడుకల్లో భోగి మంటను వెలిగిస్తున్న ప్రధాని మోదీ

**సంకాంత్రి అంటే రైతుల పండుగ: కిషన్‌రెడ్డి**

సంక్రాంతి అంటేనే రైతులు..గ్రామాల పండుగ అని కిషన్‌రెడ్డి అన్నారు. విలేకరులతో మాట్లాడుతూ ఢిల్లీలో తొలిసారిగా తన అధికార నివాసంలో సంక్రాంతి వేడుకలు నిర్వహించానని తెలిపారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్రమంత్రులు, జేపీ నడ్డా, అశ్వినీ వైష్ణవ్, గజేంద్రసింగ్ షెకావత్, జ్యోతిరాదిత్య సింధియా, మనోహర్ లాల్ ఖట్టర్, బండి సంజయ్, సతీష్‌చంద్ర దూబే, శ్రీనివాస్‌వర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలు కె.లక్ష్మణ్, అనురాగ్ ఠాకూర్, ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, రఘునందన్‌రావు, గోడెం నగేష్, బాలశౌరి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డీకే.అరుణతోపాటు, తెలంగాణ, ఏపీకి చెందిన బీజేపీ నేతలు, డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, క్రీడాకారిణి పీవీ.సింధు, మంగ్లీ సిస్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

## 'దావోస్' పెట్టుబడులు సఫలం

- రూ.40వేల కోట్ల పెట్టుబడులొచ్చాయి
- గతేడాది పెట్టుబడుల్లో పురోగతిపై సమీక్షలో సీఎం సంతృప్తి
- కొత్త పెట్టుబడులను ఆకర్షించేందుకు సన్నద్ధం కావాలని అధికారులకు ఆదేశం



మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో శ్రీధర్‌బాబు, వేం నరేందర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి ఏడాది రాష్ట్రానికి భారీగా పెట్టుబడులొచ్చాయని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. గత ఏడాది దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో చేసుకున్న ఒప్పందాలతో రాష్ట్రానికి రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 14 ప్రముఖ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రాగా, 18 ప్రాజెక్టుల ఏర్పాటుకు ఒప్పందాలు కుదిరాయి. వీటిలో దాదాపు 17 ప్రాజెక్టుల ఏర్పాటు సఫలం కావడం పట్ల సీఎం రేవంత్ సంతృప్తి వ్యక్తం చేశారు. 10 ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉండగా, మరో ఏడు ప్రాజెక్టులు ప్రారంభ దశ లో ఉన్నాయని అధికారులు సీఎంకు వివరించారు. దావోస్ లో పర్యటించనున్న నేపథ్యంలో కొత్త పెట్టుబడులు ఆకర్షించడంతోపాటు ఇప్పటికే వచ్చిన పెట్టుబడులతో పరిశ్రమల ఏర్పాటులో పురోగతిపై పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబుతో కలిసి మంగళవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సమీక్షించారు.

**6 రోజుల విదేశీ పర్యటనకు సీఎం**

పెట్టుబడులకు గమ్యస్థానంగా తెలంగాణ ఇప్పటికే దేశంలో అందరి దృష్టిని ఆకర్షిస్తుందని సీఎం రేవంత్ అన్నారు. ఫ్యూచర్ సిటీగా వెలుగొందుతున్న హైదరాబాద్‌లో ఉన్న సానుకూలతలను ప్రపంచ వేదికపై పరిచయం చేసేందుకు సన్నద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. గతేడాది ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న కంపెనీల్లోని ఏఏ కంపెనీలు కార్యకలాపాలను ప్రారంభించాయి.. ఏ దశలో ఉన్నాయి? అని ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 16 నుంచి 19 వరకు సింగపూర్, 20 నుంచి 22 వరకు ముఖ్యమంత్రి దావోస్‌లో పర్యటించనున్నారు. ఆయన వెంట మంత్రి శ్రీధర్‌బాబు, పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు కూడా వెళతారు. దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో పాల్గొంటారు. సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు

**నేడు ఢిల్లీకి సీఎం రేవంత్:** ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మంగళవారం ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. బుధవారం ఢిల్లీలో జరగనున్న ఏఐసీసీ కేంద్ర కార్యాలయం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొంటారు.

# సర్కారు నిధుల వేట!

- ఈ నెలలోనే ప్రతిష్టాత్మక పథకాలను ప్రారంభించనున్న సర్కారు
- వాటి అమలు కోసం తక్షణమే రూ.10వేల కోట్లు అవసరమని అంచనా
- రైతు భరోసాకు రూ.8,200 కోట్లు.. ఆత్మీయ భరోసాకు రూ.600 కోట్లు
- గ్రామ పంచాయతీల్లో రూ.10లక్షల లోపు బిల్లులు చెల్లిస్తే మరో రూ.800 కోట్లు అవసరం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన పథకాలకు అవసరమయ్యే నిధులను అన్వేషించే పనిలో ఆర్థిక శాఖ పడింది. ఆయా పథకాల అమలు కోసం తక్షణమే ఎన్ని నిధులు అవసరం? ఏ నెలలో ఎన్ని నిధులు ఇవ్వాల్సి ఉంటుంది? వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఎంత ప్రతిపాదించాల్సి ఉంటుంది? ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు, జీతాలు, పింఛన్లకు తోడు కొత్త పథకాలకు కలిపి నిధుల సమీకరణ ఎలా? రిజర్వు బ్యాంకు ద్వారా బహిరంగ మార్కెట్‌లో రుణాలు ఏ మేరకు సాధ్యమవుతాయనే లెక్కలు వేసుకుంటోంది. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలతో పాటు దశల వారీగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, కొత్త రేషన్‌కార్డుల జారీతో పెరిగే సబ్సిడీ వ్యయం కలిపి తక్షణమే రూ.10 వేల కోట్లు అవసరమని ఆర్థిక శాఖ అధికారులు తేల్చారు. ఈ నిధులు సర్దుబాటు చేసే పనిలో నిమగ్నమయ్యారు.

**రాబడులకు తోడు అప్పులతో..**



పథకాల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతి నెలా వస్తున్న రాబడులకు తోడు గణనీయంగానే అప్పులు చేయాల్సి వస్తోంది. ప్రస్తుతం నెలకు రూ.11 వేల కోట్ల వరకు రాష్ట్ర ప్రభుత్వానికి సొంత ఆదాయం సమకూరుతోంది. వచ్చే మూడు నెలల్లో అదనంగా నెలకు మరో రూ.2వేల కోట్ల వరకు వస్తాయని ఆర్థిక శాఖ అంచనా వేస్తోంది. మరోవైపు రూ.30 వేల కోట్లు బహిరంగ మార్కెట్ రుణాలను రిజర్వు బ్యాంకు ద్వారా సేకరించనుంది. ఈ మేరకు జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో ప్రతి నెలా రూ.10 వేల కోట్ల చొప్పున కావాలని ఆర్‌బీఐకి ఇండెంట్ కూడా పెట్టింది. మొత్తంగా సమకూరే నిధుల నుంచి ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, పింఛన్లు, సామాజిక పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలు, రెవెన్యూ ఖర్చుతోపాటు రుణ వాయిదాలను చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఖర్చులన్నింటినీ సర్దుబాటు చేసుకుంటూనే కొత్త పథకాలకు నిధులను సమకూర్చడంపై ఆర్థిక శాఖ దృష్టి పెట్టింది. ఇప్పటికే గత రెండు నెలలుగా పెద్ద పెద్ద బిల్లుల చెల్లింపును నిలిపివేసినట్టు తెలిసింది. వచ్చే మూడు నెలలు కూడా ఇదే పద్ధతిని అవలంబిస్తామని, ప్రస్తుతానికి నిధుల లోటు లేకుండా సర్దుబాటు చేస్తామని ఆ శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఎలాంటి ప్రణాళికతో వెళ్లాలన్న దానిపై రూట్ మ్యాప్ సిద్ధమైందని వెల్లడించారు.


### మొత్తంగా రూ.45 వేల కోట్ల దాకా...

ఈ నెల 26వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ప్రారంభించబోతోంది. రైతు భరోసా కింద రాష్ట్రంలోని సుమారు 70లక్షల మంది రైతులకు ఎకరానికి రూ.6 వేల చొప్పున రూ.8,200 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని అంచనా. ఇక భూమి లేని పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద తొలి విడత సాయంగా రూ.6 వేల చొప్పున ఇచ్చేందుకు మరో రూ.600 కోట్లు అవసరమని భావిస్తున్నారు. ఈ పథకం కింద 10 లక్షల మంది రైతు కూలీలు లబ్ధిపొందుతారని అంచనా. ఈ రెండు పథకాలకు ఈనెల 31లోపు నిధులు వెచ్చించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రూ.8,800 కోట్లను ఖజానాకు సమకూర్చడం కోసం ఆర్థిక శాఖ రెండు నెలలుగా కార్యాచరణ అమలు చేస్తోంది.

- మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లేలోపు గ్రామ పంచాయతీల్లో పనులు చేసిన మాజీ సర్పంచ్‌లకు చెల్లించాల్సిన రూ.10లక్షలలోపు బిల్లులను చెల్లించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇవి సుమారు రూ.800 కోట్ల వరకు ఉంటాయని అంచనా.
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం (తొలి విడతలో స్థలమున్న పేదలకు రూ.5 లక్షల సాయం) కోసం ఒక్క ఆర్థిక సంవత్సరంలో రూ.20 వేల కోట్లకుపైగా అవసరమని భావిస్తున్నారు. దశల వారీగా ఈ నిధులు విడుదల చేసే నేపథ్యంలో... ఏ నెలలో ఎంత అవసరమన్న దానిపైనా ఆర్థిక శాఖ లెక్కలు వేసుకుంటోంది.
- ఇక జనవరి 26 నుంచే కొత్త రేషన్‌కార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఆ కార్డుల జారీ పూర్తయ్యాక మార్చి నెల నుంచి రేషన్‌షాపుల్లో సన్నబియ్యం పథకాన్ని అమలు చేసే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 90లక్షల వరకు రేషన్‌కార్డులు ఉండగా.. మరో 10లక్షల వరకు కొత్తవి జారీ చేసే అవకాశం ఉందని పౌరసరఫరాల శాఖ అంచనా వేస్తోంది. మొత్తమ్మీద కోటి కార్డులకు గాను ఒక్కొక్కరికి 6 కేజీల చొప్పున సన్నబియ్యం ఇచ్చేందుకు గణనీయంగా నిధులు కావాలి.
- మొత్తంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం (జనవరి నుంచి మార్చి నెలాఖరు)లోనే రూ.45 వేల కోట్లు కావాలని ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు నిధులు సమకూర్చుకోవడంపై దృష్టి పెట్టినట్టు వివరిస్తున్నారు.

## రేవంత్ ఇచ్చినవి డమ్మీ చెక్కులా?

**90 లక్షల మంది కూలీలకు ఆత్మీయ భరోసా ఎగవేసే ప్రయత్నం : మాజీ మంత్రి హరీశ్‌రావు**



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: రుణమాఫీ కోసం రెండు నెలల క్రితం మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన రైతు విజయోత్సవాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన రూ.2,750 కోట్ల చెక్కుకు సంబంధించిన నిధులు ఇప్పటివరకు రైతుల ఖాతాల్లో జమ కాలేదని..ఎన్నికల్లో డమ్మీ హామీలు ఇచ్చినట్టుగానే ఈ రుణమాఫీకి సంబంధించి డమ్మీ చెక్కు ఇచ్చారా అని మాజీమంత్రి టి.హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. సోమవారం సంగారెడ్డిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనల పేరుతో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ఎకరంలోపు భూమి ఉన్న నిరుపేద రైతులకు అందకుండా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా ఎకరం లోపు భూమి ఉన్న రైతులు రాష్ట్రంలో 24.27 లక్షల మంది ఉన్నారని, వీరిలో దళిత, గిరిజన, బీసీ రైతులే ఎక్కువని చెప్పారు. వీరి కడుపు కొట్టే ప్రయత్నం చేస్తే రైతు కూలీలు తిరగబడతారని హెచ్చరించారు. రాష్ట్రంలో సుమారు కోటి మంది వ్యవసాయ కూలీలుంటే.. కేవలం పది లక్షల మందికే ఈ ఆత్మీయ భరోసా పథకాన్ని ప్రభుత్వం ఇస్తామంటోందని వివరించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీరుపైనా హరీశ్ విమర్శలు చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆరున్నర లక్షల ఎకరాలకు నీళ్లిచ్చిందన్నారు. భట్టి గోబెల్స్‌ను మించిపోతున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, కొనింటి మాణిక్‌రావు, డీసీఎంఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా చైర్మన్ శివకుమార్ పాల్గొన్నారు.







# పథకాల లబ్ధి అర్హులకే..

- పారదర్శకత కోసం గ్రామాల్లో లబ్ధిదారుల పేర్లతో ఫ్లెక్సీలు
- సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క. చిత్రంలో మంత్రులు ఉత్తమ్, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్రంలో అర్హులైన ప్రతీ పేదవాడికి సంక్షేమ పథకాలు అందాలన్నదే తమ అభిమతమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల పథకాలపై ఖమ్మం కలెక్టరేట్‌లో సోమవారం ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ మరో నాలుగు పథకాల అమలుకు ఈనెల 26 నుంచి శ్రీకారం చుడుతున్నామని, ఇందుకు దాదాపు రూ.45వేల కోట్లు వెచ్చించనున్నామని తెలిపారు. అధికారులు లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరిగేలా చూడాలని సూచించారు. గ్రామాల్లో లబ్ధిదా రుల పేర్లతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తామన్నారు.

- ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడు తూ అర్హులైన ప్రతీ ఒక్కరికి పథకాలు చేరడం ఎంత ముఖ్యమో, అనర్హులకు చేరకుండా అడ్డుకో వడం అంతే ముఖ్య మని తెలిపారు.
- రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫ రాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నూతన రేషన్ కార్డుల జారీ, కార్డుల్లో నూతన సభ్యుల నమోదు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు.
- రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ అధికారులు అప్రమత్తంగా ఉంటూ వ్యవసాయ యోగ్యంకాని భూములకు రైతుభరోసా అందకుండా చూడాలన్నారు. లేఅవుట్, నాలా, పరిశ్రమలు, మైనింగ్ భూములపై అన్ని శాఖల సమన్వయంతో గ్రామ శాటిలైట్ మ్యాప్‌ను వాడుతూ అర్హుల ఎంపిక పారదర్శకంగా చేయాలన్నారు.
- రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆలోచనలను అధికారులు పక్కాగా అమలు చేయాలని, ఎక్కడా తప్పు జరగడానికి వీల్లేదన్నారు. లబ్ధిదారుల ఎంపిక గ్రామసభల్లో చేపట్టాలని, పథకాలు నిరంతర ప్రక్రియలా కొనసాగుతాయనే అంశాన్ని అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ సమావేశంలో ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీలు రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాంనాయక్, ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు ముజమ్మిల్ ఖాన్, జితేష్ వి.పాటిల్, ఎమ్మెల్యేలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు పనులకు ప్రాధాన్యం : ఉత్తమ్**

రఘునాథపాలెం: కొద్దిమేర నిధులు కేటాయిస్తే ఎక్కువ ఆయకట్టుకు సత్వరమే సాగునీరు అందే పనులకు తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం మంచుకొండలో రూ.66 కోట్లతో నిర్మించే ఎత్తిపోతల పథకానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి, తుమ్మల, కోమటిరెడ్డిలతో కలిసి శంకుస్థాపన చేశారు. పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడం, కొత్త పనులను మొదలుపెట్టి ప్రతీ ఎకరానికి సాగునీరు ఇవ్వడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

## 'గ్రాడ్యుయేట్' టికెట్ కోసం తెరపైకి కొత్త పేరు

- కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్సీ టికెట్ ఆశిస్తున్న ఎమిగోస్ విద్యాసంస్థల అధినేత
- పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌ను కలసిన ముస్కు రమణారెడ్డి



సాక్షి, హైదరాబాద్: కరీంనగర్ – నిజామాబాద్ – ఆదిలాబాద్ – మెదక్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానంలో పోటీ కోసం కాంగ్రెస్ పార్టీలో కొత్త పేరు తెరపైకి వచ్చింది. ఇప్పటికే నలుగురైదుగురు ఈ టికెట్‌ను ఆశిస్తుండగా ఎమిగోస్ విద్యాసంస్థల చైర్మన్ ముస్కు రమణారెడ్డి కొత్తగా రేసులోకి వచ్చారు. ప్రస్తుతం రాష్ట్ర సచివాలయంలో న్యాయ శాఖలో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న రమణారెడ్డి, సోమవారం టీపీసీసీ చీఫ్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిశారు. ఈ సందర్భంగా తనకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానంలో పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఇప్పటికే ఈ టికెట్ కోసం ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఈయనతో పాటు ప్రొఫెసర్‌గా పనిచేస్తూ, రాజీనామా చేసిన పులి ప్రసన్న హరికృష్ణ, రిటైర్డ్ డీఎస్పీ ముదనం గంగాధర్‌తో పాటు వెల్చాల రాజేందర్ పేర్లను కాంగ్రెస్ పార్టీ పరిశీలిస్తోంది. ఇప్పటికే బీజేపీ తమ అభ్యర్థిని ప్రకటించిన నేపథ్యంలో వీలున్నంత త్వరగా పార్టీ అభ్యర్థిని కూడా ఖరారు చేయాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ స్థానం నుంచి పోటీ చేసే అభ్యర్థి ఎంపిక కోసం మంత్రులు దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌ల నేతృత్వంలోని కమిటీ త్వరలోనే సమావేశం కానుందని గాంధీభవన్ వర్గాలు చెపుతున్నాయి. ఆయా జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, డీసీసీ అధ్యక్షులు, ఇతర ముఖ్య నేతల అభిప్రాయాలను తీసుకున్న తర్వాత ఈ జాబితా నుంచి ఒక పేరును ఖరారు చేస్తారని సమాచారం.

ఆమనగల్లు / రంగారెడ్డి జిల్లా

# సొంత స్టోర్‌లో విక్రయం

**ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఆదర్శంగా నిలుస్తున్న శౌరి జోజప్ప**



రసాయన ఎరువులు, హానికర పురుగు మందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయంతో పంటలు పండించడమే కాదు.. వాటిని సొంతంగా మార్కెటింగ్ చేసుకుంటున్నారు రైతు శౌరి జోజప్ప. ఆమనగల్లుకు చెందిన అర్థం కిరణ్, హైదరాబాద్‌కు చెందిన శౌరి జోజప్ప రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం చుక్కాపూర్ గ్రామ సమీపంలో దాదాపు 30 ఎకరాల్లో తాజావన్ ఆగ్రో ఫామ్స్ పేరుతో సేంద్రియ వ్యవసాయం చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త సుభాష్ పాలేకర్ విధానాల్లో పంటలు పండిస్తున్నారు. 20 ఎకరాల్లో మామిడి, ఎకరాలో జామ, పదెకరాల్లో వివిధ రకాల కూరగాయ పంటలు, ఆకుకూరలు సాగు చేస్తున్నారు. మామిడితోట మధ్యలో అంతర పంటగా 15 రకాల కూరగాయలు, 6 రకాల ఆకుకూరలను పండిస్తున్నారు. 25 దేశీ ఆవులను పోషిస్తూ వాటి పేడను సేంద్రియ సాగుకు వినియోగిస్తున్నారు. దేశీ ఆవుల పాలను, నెయ్యిని విక్రయిస్తున్నారు.


మామిడితోట మధ్యలో సాగుచేస్తున్న కూరగాయలు

### ప్రత్యేకంగా స్టోర్ ఏర్పాటు చేసి..

తాము శ్రమకోర్చి ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటలకు సరైన మార్కెటింగ్ లేకపోతే ఎలాగని భావించిన శౌరి జోజప్ప.. హైదరాబాద్‌లోని కొండాపూర్, తార్నాకలలో తాజావన్ ఆర్గానిక్ స్టోర్ పేరుతో ఈ పండ్లు, కూరగాయలు విక్రయించే స్టోర్లను ఏర్పాటు చేశారు. అంతేకాదు తమ ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో కూడా విక్రయిస్తున్నారు. మార్కెటింగ్ విభాగంలో ఆరుగురికి ఉపాధి కల్పిస్తున్నారు.

**సేంద్రియసాగుపై మక్కువతో.. :** తనకు సేంద్రియ వ్యవసాయం ఎంతో ఇష్టమని.. శౌరి జోజప్ప చెప్పారు. విదేశాల్లో ఉండే తన స్నేహితుడు అర్థం కిరణ్ ప్రోత్సాహంతో ఆయన పాలంలో తొలుత సేంద్రియ సాగును ప్రారంభించానని తెలిపారు. వారానికి రెండుసార్లు పంట ఉత్పత్తులను నగరానికి తరలించి, తమ స్టోర్‌లోవిక్రయిస్తున్నామని, ఇప్పుడిప్పుడే లాభాలు పొందుతున్నామన్నారు.



# ఆ విద్యార్థులకు సంక్రాంతి గురుకులంలోనే...

**ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలో సీఓఈల్లో సెకండియర్ విద్యార్థులకు తరగతుల కొనసాగింపు**

సాక్షి, హైదరాబాద్: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ పరిధిలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీఓ ఈ) జూనియర్ కాలేజీల విద్యార్థులు సంక్రాంతి పండుగను గురుకులంలోనే జరుపుకోనున్నారు. సంక్రాంతి సెలవులు రద్దు కావడంతో వారంతా ప్రత్యేక తరగతులకు హాజరయ్యారు. జేఈఈ మెయిన్ పరీక్షలు సమీపిస్తుండటంతో గురుకుల సొసైటీ రెండో సంవత్సరం విద్యార్థుల సెలవులు రద్దు చేసింది. దీనికి ప్రత్యేకించి ఉత్తర్వులు జారీ చేయకుండా, మౌఖిక ఆదేశాలతోనే ఈ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. మిగిలిన సొసైటీ పరిధిలోని విద్యార్థులకు సంక్రాంతి సెలవులివ్వడంతో వారంతా ఇళ్లకు వెళ్లిపోయారు.

**ప్రవేశ పరీక్షల నేపథ్యంలో సిబ్బందికి అదనపు బాధ్యతలు**

2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎస్సీ గురుకుల సొసైటీలో 5వ తరగతి అడ్మిషన్లతోపాటు 9వ తరగతి వరకు బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి వేర్వేరుగా ప్రవేశ పరీక్షలు నిర్వహించనుంది. గతనెల 21న ప్రవేశ పరీక్షల నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ పరీక్షలకు క్షేత్రస్థాయిలో విస్తత ప్రచారం కల్పించాలని గురుకుల బోధన, బోధనేతర సిబ్బందికి ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా 17వ తేదీ వరకు ఈ ప్రచార కార్యక్రమాలు చేపట్టేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించింది. ప్రతి సిబ్బందికి కనీసం రెండు గ్రామ పంచాయతీలను అప్పగించి, అక్కడి కార్యదర్శితో సమావేశమై ప్రచార కార్యక్రమాలు నిర్వహింపజేయాలని ఎస్సీ గురుకుల సొసైటీ ఆదేశిస్తూ సర్క్యులర్ జారీ చేసింది. ఒక్కో ఉద్యోగి కనీసం వెయ్యి కరపత్రాల పంపిణీ, ఫ్లెక్సీల ఏర్పాటు, బ్యానర్ల ఏర్పాటు, కాలనీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని స్పష్టం చేసింది. అయితే దీనిపై బోధన, బోధనేతర సిబ్బంది తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పండుగ సెలవుల్లో సొంతూర్లకు వెళ్లే సమయంలో ఈ విధంగా విధులు కేటాయించడం పట్ల వారు మండిపడుతున్నారు. ఇతర సొసైటీలకు భిన్నంగా విధులు కేటాయించడాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతున్నారు.

## సీపీఎస్ రద్దు హామీని నిలబెట్టుకోవాలి

- సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్ రద్దు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దాముక కమలాకర్, భూపతిరావు ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల సమయంలో సీపీఎస్‌ను రద్దు చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించారని, ఈ అంశంపై కేబినెట్ భేటీ నిర్వహించి నిర్ణయం తీసుకోవాలని సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

శరీర పరిధియే ధర్మములకు నిలయం కావున, ఆ పరిధి లోపలే చెప్పబడినదాని గీత అన్నారు. భగవంతుడు చెప్పింది కావున భగవద్గీత.
– హిందూ ధర్మం



సాక్షి
మంగళవారం, 14 జనవరి 2025

# చైనా దాగుడుమూతలు!

సాధారణంగా దౌత్య సంబంధాల్లో అనూహ్యతకు తావుండదు. అవతలి దేశం మనతో చెలిమి కోరుకుంటున్నదో లేదో... అది మనవైపో, వేరేవాళ్లవైపో ఊహించటం పెద్ద కష్టం కాదు. కానీ చైనా మటుకు ఇందుకు విరుద్ధం. 'నేనేంటో చెప్పుకోండి చూద్దాం' అన్నట్టు వ్యవహరిస్తుంటుంది. నోటితో నవ్వి నొసటితో వెక్కిరిస్తున్న చందాన ప్రవర్తిస్తుంటుంది. రష్యాలో మూడు నెలల క్రితం బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం జరిగినప్పుడు ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌లు కలుసుకున్నారు. అంతకు రెండు రోజుల ముందు వాస్తవాధీన రేఖ ప్రాంతాలైన డెప్సాంగ్, దెమ్‌చోక్‌లలో ఇరు దేశాల సైన్యాల గస్తీపై అవగాహన కుదిరింది. ఆ ప్రాంతంలో ఇకపై సైనిక విన్యాసాలకు చోటీయరాదనీ, ఉద్రిక్తతలను ఉపశమింపజేయాలనీ దాని సారాంశం. అంతేగాదు... రెండు దేశాలూ దీనిపై వేర్వేరు ప్రకటనలు విడుదల చేశాయి. చాన్నాళ్లుగా నిలిచిపోయిన ఇరుదేశాల ప్రత్యేక ప్రతినిధుల సమావేశం గత నెలలో జరిగింది కూడా. తీరా తాజాగా తూర్పు లద్దాఖ్ ప్రాంతంలో చైనా సైన్యం అధునాతన సాంకేతికతలతో, అన్నిరకాల నేలల్లోనూ పనికొచ్చే వాహనాలతో, డ్రోన్‌లతో, మానవరహిత విమానాలతో విన్యాసాలు నిర్వహించినట్టు బయటపడింది. తన సైనిక సామర్థ్యాన్ని, కొండప్రాంతాల్లో యుద్ధ సంసిద్ధతలను అంచనా వేసుకోవటానికి షిన్‌జియాంగ్ మిలిటరీ కమాండ్ రెజిమెంట్ ఈ విన్యాసాలు నిర్వహించిందంటున్నారు.

అంతక్రితం మాటెలావున్నా 2020 ఏప్రిల్‌లో గాల్వాన్ లోయలో మన సైన్యంతో గిల్లికజ్జాలకు దిగటం ద్వారా చైనా తన కవ్వింపు చర్యల జోరు పెంచింది. అప్పుడు జరిగిన ఘర్షణల్లో మన జవాన్లు 21 మంది చనిపోగా, చైనా కూడా గణనీయమైన నష్టాలు చవిచూసింది. ఆ ఘర్షణల్లోనే బిహార్ రెజిమెంట్‌లో 17వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ అయిన తెలంగాణకు చెందిన బి. సంతోష్‌బాబు వీర మరణం పొందారు. అనంతర కాలంలో ఇరు దేశాల మధ్యా సైనిక అధికారుల స్థాయి చర్చలు జరిగాయి. కొన్ని అంశాల్లో ఒప్పందాలు కుదిరాయి. ఆ ఏడాది ఆగస్టులో రెండు దేశాల విదేశాంగమంత్రులూ భేటీ అయ్యారు. అందులో భారత్–చైనాల మధ్య పంచసూత్ర పథకం కుదిరింది. ఇకపై సామరస్యంగా మెలగాలన్నది ఆ పథకం సారాంశం. దానికి కొనసాగింపుగా రక్షణ మంత్రులు కూడా సమావేశమయ్యారు. ఆ తర్వాత వివాదాస్పద ప్రాంతాల్లో సైనికుల ఉపసంహరణ కూడా మొదలైంది. కానీ సమస్య ఎక్కడిదక్కడే ఉంది. డెప్సాంగ్, దెమ్‌చోక్ ప్రాంతాల విషయం మొదటి నుంచీ జటిలమే. అందువల్లే ప్రస్తుతానికి ఇరు దేశాల సైన్యాలూ ఆ ప్రాంతాల్లో గస్తీ నిర్వహించాలని, ఉద్రిక్తతలు ముదిరే విధంగా ఎవరూ సైన్యాలను మోహరించ రాదని మూడు నెలలక్రితం నిర్ణయించారు. కానీ చైనాకు ఏమైందో కానీ దాన్ని బేఖాతరు చేస్తూ తాజాగా విన్యాసాలు మొదలుపెట్టింది. వారంరోజుల క్రితం షిన్‌జియాంగ్‌లోని వీగర్ స్వయంపాలిత ప్రాంతంలో ఉన్న హోటాన్ నగరానికి సమీపంలో చైనా కొత్తగా రెండు కౌంటీలను ఏర్పాటు చేసిందన్న కథనాలు వెలువడటం గమనించదగ్గది. ఈ రెండూ కేంద్రపాలిత ప్రాంతమైన లద్దాఖ్‌లోని ఆక్సాయ్‌చిన్‌కు సమీపంలో ఉన్నాయి. దానిలోని కొంత భూభాగం ఈ రెండు కౌంటీల్లోనూ ఉన్నదంటున్నారు. ఉద్రిక్తతలు రెచ్చగొట్టడానికి ఇది చాలదా? ఇక బ్రహ్మపుత్ర నదిపై ఒక మెగా డ్యామ్‌ను నిర్మించటానికి చైనా సన్నాహాలు చేస్తున్నదన్న వార్త కూడా ఇటీవలి పరిణామమే. ఎగువ ప్రాంతాల్లో ఆనకట్టలు కట్టినప్పుడు దిగువ ప్రాంతాలకు సాగునీరు, తాగునీరు అందక ఇబ్బందులు తలెత్తుతాయి. భారీవర్షాల సమయంలో దిగువకు నీరు వదలటం వల్ల ఆ ప్రాంతాలు మునుగుతాయి. అందు వల్లే దేశాలమధ్య ప్రవహించే నదులపై నిర్మాణాలకు పూనుకున్నప్పుడు పరస్పరం చర్చించుకుంటాయి. అందరికీ ప్రయోజనం కలిగేలా ఒప్పందాలు కుదుర్చుకుంటాయి. కానీ మెగా డ్యామ్ నిర్మాణాన్ని చైనా ఏకపక్షంగా ప్రకటించింది. దీనిపై మన దేశం తీవ్ర అభ్యంతరం తెలిపింది. ఇక అరుణాచల్‌ప్రదేశ్‌కు మన నాయకులు వెళ్లినప్పుడల్లా చైనాకు ఆగ్రహావేశాలొస్తాయి. అక్కడి ఊళ్లకు సొంత పేర్లు పెట్టుకుని మనల్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేయటం చైనాకు చాన్నాళ్లుగా దురలవాటు.

అందుకే చైనా వ్యవహారశైలి తెలిసినవారెవరూ దాని మాటలు విశ్వసించరు. చెప్పే మాటలకు భిన్నమైన ఆచరణ ప్రదర్శించటం చైనాకు అలవాటైన విద్య. ఇరుగు పొరుగు దేశాలన్నాక సమస్యలు సహజంగా వస్తాయి. వాటిని చర్చించుకోవటం, పరస్పర అంగీకారంతో సామరస్యపూర్వక పరిష్కారాన్ని సాధించటం వివేకవంతమైన చర్య. సమస్యలను దశాబ్దాల తరబడి అలాగే వదిలేస్తే అవి జటిలంగా మారి చివరకు శత్రుత్వానికి దారితీస్తాయి. మనతో ఉన్న వివాదాల విషయంలో చైనా మొదటినుంచీ దాగుడుమూతలు ఆడుతోంది. వివాదాలను పక్కనబెట్టి వ్యాపార వాణిజ్యాలను విస్తరించుకుంటే ఇరు దేశాలూ అభివృద్ధి చెందుతాయని ఊరించి 70వ దశకం చివరిలో మనకు మైత్రీ హస్తం అందించింది మొదలు చైనా తీరుతెన్నులు ఎన్నడూ సక్రమంగా లేవు.

సరిహద్దు పరిణామాలపై మన దేశం అప్రమత్తంగానే ఉన్నదని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీ సోమవారం చేసిన ప్రకటన సూచిస్తోంది. వివాదాస్పద ప్రాంతాల్లో ప్రస్తుతానికి ప్రతిష్టంభన ఉన్నదని ఆయనంటున్నారు. బ్రహ్మపుత్ర నదిపై ఆనకట్ట నిర్మాణం విషయంలోనైనా, లద్దాఖ్ ప్రాంతంలో చైనా సైన్యం కదలికల విషయంలోనైనా మన దేశం దృఢంగా వ్యవహరించాలి. దేశ రక్షణకు అది తప్పనిసరి. కరచాలనం చేస్తూనే కత్తులు దూయటం ఏమైనా కావొచ్చుగానీ దౌత్య కళ కాదని చైనాకు తెలియచెప్పటం అవసరం.

# ఓ సిపాయీ... తెలుసుకొనవోయీ!

కామెంట్



కరణ్ థాపర్

**భాష తెలియని దేశంలో సైనికుడైనా సామాన్యుడే. కొత్త నేలపై కుదురుకోవటం యుద్ధం చేసినంత పని! భాష మాత్రమే కాదు, అక్కడి ఆహారాలకు అలవాటు పడాలి. సంస్కృతులకు సర్దుకుపోవాలి. సంప్రదాయాల కత్తుల వంతెనపై ఒద్దికగా నడవాలి. నడవడికను బుద్ధిగా ఉంచుకోవాలి. ముఖ్యంగా, కరెన్సీని అర్థం చేసుకోవాలి, బేరాలాడాలి. అత్యవసరంలో ప్రాథమిక చికిత్సా, అకాల పరిస్థితుల ముందుచూపూ ఉండాలి. ఇవన్నీ సైనికులకు ప్రభుత్వాలు చెప్పి పంపవు. 'వెళ్లాక తెలుస్తుందిలే' అని బదలీ పత్రాలు ఇచ్చేస్తాయి. అయితే, వెళ్లాక తెలుసుకోవటం కాదు, 'తెలుసుకునే వెళ్లండి' అంటూ నూటపాతికేళ్ల క్రితమే ఒక ప్రసిద్ధ బ్రిటిష్ సిగరెట్ కంపెనీ భారత్ వెళ్లే బ్రిటన్ సైనికుల కోసం హ్యాండ్‌బుక్‌ను ప్రచురించటం విశేషమే!**

'వైల్డ్ ఉడ్‌బైన్' బ్రాండు సిగరెట్లను ఉత్పత్తి చేస్తుండే 18వ శతాబ్దపు ప్రఖ్యాత బ్రిటన్ పొగాకు కంపెనీ 'డబ్ల్యు.డి. అండ్ హెచ్.వో. విల్స్' తాత్కాలిక విధి నిర్వహణలపై భారతదేశానికి తరలివెళ్లే బ్రిటిష్ సైనికుల కోసం మార్గదర్శకాలతో కూడిన ఒక కరదీపికను ప్రచురించినట్లుంది! మన దేశంలో ఆ సైనికుల అపరిచిత స్థానిక వ్యవహారాలను సులభతరం చేయటానికి ఉద్దేశించిన ఆ పుస్తక ప్రతి ఒకటి గతవారం లండన్, పోర్టోబెల్లో రోడ్డులోని పురాతన వస్తువుల దుకాణంలో నా కంట పడింది. చదువుతుంటే ఎంత సరదాగా అనిపించిందో!

భారతదేశం ఎంత పెద్దదో చెప్పడంతో ఆ కర పుస్తకం మొదలౌతుంది. ''ఇండియాలో ఇరవై గ్రేట్ బ్రిటన్‌లను పట్టించ వచ్చు'' అని చెబుతూ, ఆనాటి మన కరెన్సీని, బ్రిటన్ కరెన్సీతో పోల్చి వాటి సమాన విలువలను తెలియబరిచింది. ఆ ప్రకారం: 1 అణా 1 పెన్నీకి సమానం. 11 అణాలు 1 షిల్లింగ్‌కి సమానం (రూపాయికి 16 అణాలు అనే లెక్క ఆధారంగా). 1 రూపాయి 1 షిల్లింగు 5 పెన్నీలకు సమానం. 13 రూపాయల 6 అణాలు ఒక పౌండుకు సమానం.


పుస్తకంలోని ఎక్కువ భాగంలో, సైనికుడు తెలుసుకోవలసిన అవసరం ఉన్న ముఖ్యమైన పదాలను, వాటి అర్థాలను, వాటిని ఉచ్చరించే విధానాన్ని పొందుపరచటం జరిగింది. ఉదాహరణకు, ఎలుక Chew-ha (చూహా), రోడ్ Rust-er (రస్తా), సముద్రం Some-under (సమందర్), చొక్కా Come-ease (కమీజ్), చక్కెర Chee-knee (చీనీ), నీళ్లు Par-knee (పానీ), మహిళ Awe-rut (ఔరత్) అని ఇచ్చారు. (ఈ హిందీ మాటలను పలికే విధానమంతా ఆంగ్ల పదాలకు దగ్గరగా ఉండేలా ఇచ్చారు.)

సైనికుడు స్థానికులతో మాట్లాడవలసి వచ్చినప్పుడు రోజువారీ వాడుక కోసం కొన్ని చిన్న చిన్న వాక్యాలు కూడా ఆ కర పుస్తకంలో ఉన్నాయి. మీరెక్కడికి వెళుతున్నారో తెలుసుకోవాలనుకున్న సైనికుడు "Kid-her jar-ta high?" (కిదర్ జాతా హై?) అంటాడు; అతనికేదైనా అర్థం కాకపోతే, "Tomb key-ah bowl-ta high?" (తుమ్ క్యా బోల్తా హై) అంటాడు. అతను పోస్టాఫీస్ కోసం వెదుకుతుంటే "Dark-car-ner kid-her high?" (డాక్ ఘర్ కిదర్ హై) అని అడుగుతాడు. దుకాణందారు ఎక్కువ రేటు చెప్పినట్లనిస్తే "Darm jars-tea high" (దర్ జాస్తి హై) అంటాడు.

ఇప్పుడు బ్రిటన్ సైనికులు అనారోగ్యం పాలైనప్పుడు ఏం చేయాలని పుస్తకం చెప్పిందో చూద్దాం. జ్వరాలను తగ్గించుకోటానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చెప్పే కచ్చితమైన సూచనలు కొన్ని పుస్తకంలో ఉన్నాయి. ''అనేక కారణాల ఫలితంగా జ్వరం అనేది వస్తుంది. లవణాలు, ఆముదపు నూనె మోతాదులను ఎప్పటికప్పుడు తీసుకోవటం ద్వారా జ్వరాన్ని తగ్గించుకోవచ్చు. అవి ఒంట్లో వేడిని తగ్గిస్తాయి. వీలైనంత వరకు మాట్లాడకుండా, మౌనంగా ఉండండి. ముఖంపైన, తల పైన చల్లటి తడి గుడ్డను వేసుకుని పడుకోండి. ఒకవేళ మలేరియా సోకి, రోగికి చలిపుడుతూ, వణుకు వస్తున్నట్లయితే వేడి టీ చుక్కల్ని తాగిస్తే చెమటలు పడతాయి. వణుకు తగ్గేవరకు రోగికి దుప్పటి కప్పి ఉంచాలి'' అని ఆ కరదీపిక సూచించింది.



భారత, బ్రిటిష్ సైనికులు కలిసి దిగిన ఫొటో




బ్రిటిష్ సైనికుల కోసం ముద్రించిన హ్యాండ్‌బుక్ కవరు పేజీ

పాము కాట్లకు బ్రిటిష్ వారు భయభ్రాంతులయ్యేవారని అనిపిస్తోంది. అందుక్కూడా పుస్తకంలో ప్రాథమిక చికిత్సలు ఉన్నాయి. విషపూరితమైన సర్పం కాటేస్తే ''తక్షణం, తీక్షణమైన చికిత్స'' అవసరం అవుతుంది. అంటే, రక్త ప్రసరణను ఆపటానికి కాటుకు పైభాగాన వస్త్రపు నాడాతో గట్టిగా బిగించి కట్టాలన్న మాట. ఆ తర్వాత, పెదవులపై లేదా నోటిలో పుండ్లు, కోతలు, లేదా పొక్కులు లేని వ్యక్తి ఆ గాయాన్ని పీల్చి, విషాన్ని ఉమ్మేయాలి. ఆ తర్వాత, గాయంపై బలమైన పొటాషియం పెర్మాంగనేట్ ద్రావణాన్ని, (లేదా, ముడి స్ఫటికాలను) అద్దాలి. ఒకవేళ ఆ ప్రదేశంలో సిర, లేదా ధమని ఉన్నందువల్ల కోత పెట్టటానికి వీలు లేకుంటే కాటు వేసిన చోట నిప్పు కణికను, మండుతున్న సిగరెట్‌ను, కాల్చిన తాడు కొసను తాకించాలి.

ఇక్కడ నాకు ఆసక్తిగా అనిపించిన సంగతి: ''ఇవన్నీ చేసేలోగా చేతిలో ఏదైనా బలమైన ఉద్దీపన ఉంటే (బ్రాందీ, విస్కీ మొదలు అమ్మోనియం కార్బొనేట్ కలిసిన శాల్ ఓలటైల్ వరకు ఏదైనా) కొంచెం తాగించాలి. అలా పదిహేను నిముషాలకొకసారి చేయాలి'' అని ఉండటం! బహుశా, మద్యంతో నరాలను శాంతపరచటమే దీని ఉద్దేశం కావచ్చు.

ఈ హ్యాండ్‌బుక్‌లో... 'తగని పనులు – చిట్కాలు' అనే ఒక కీలకమైన విభాగం కూడా ఉంది. ''మండే సూర్యరశ్మిలో తలపై టోపీ లేకుండా బయటికి వెళ్లొద్దు – అది వేసవైనా, చలికాలమైనా''. ''సూర్యాస్తమయానికి ముందు వైన్, బీరు, ఆల్కహాల్ సేవించ వద్దు – (సేవించే అవకాశం వచ్చినప్పటికీ!). ''కొన్ని ఆకులను, ముఖ్యంగా వేపాకులను మీరు అడవిలో ఉన్నప్పుడు మీ టోపీ కింద ఉంచుకోవటం మీ తలను చల్లగా ఉంచుతుంది''. ''ఫ్లానల్ షర్టును వేసుకోవటం మరచిపోవద్దు. శీతాకాలమైనా, వేసవి కాలమైనా అది మీకు సురక్షితమైన కవచం''. ఫ్లానల్ వేడిమిని గ్రహించదు. (ఫ్లానల్‌లో చుట్టిన ఐసు ముక్కలు త్వరగా కరగకపోవటమే ఇందుకు రుజువు)'' అని పుస్తకంలో రాసి ఉంది.

బ్రిటిష్ సైనికుడు ఇండియాలో ఆడగలిగే అనేక ఆటల వివరాలు కూడా ఆ పుస్తకంలో ఉన్నాయి. ''హాకీ, ఫుట్‌బాల్, క్రికెట్, టెన్నిస్, పోలో, గోల్ఫ్, స్విమ్మింగ్, రన్నింగ్, రెజ్లింగ్, బాక్సింగ్, రోయింగ్, షూటింగ్, పిగ్–స్టిక్కింగ్, గేమ్ హంటింగ్ వంటివి... భారతదేశం అందించే ఆసక్తికరమైన ఆటలు, క్రీడల్లో ఇవి కొన్ని మాత్రమే. ఇవన్నీ ఇండియాకు కొట్టిన పిండి అని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

అయితే ముగింపులో ఆ పుస్తకం ఇచ్చిన సలహా నా పొట్టను చెక్కలు చేసింది. ''చివరిగా ఒక మాట. ఎట్టి పరిస్థితిలోనూ ఇండియాలో మీరు మీ ప్రశాంతతను, ఉత్సాహాన్ని, నిద్రను కోల్పోకండి. బ్రిటన్‌పై బెంగ పెట్టుకోకండి. సమయం త్వరగానే గడిచిపోతుంది. అంతేకాదు, సౌతాంప్టన్ హార్బరులో మీకు వీడ్కోలు పలుకుతూ ఊగిన చేతి రుమాలు గతించిపోయిన కాలంలా అనిపిస్తుంది. అన్నిటినీ మించి ఇండియా మంచి దేశం.''

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

## సోషల్ మీడియా

### సాహో అజిత్!



వయసు అనేది కేవలం ఒక సంఖ్య మాత్రమేనని నటుడు అజిత్ కుమార్ మరోసారి రుజువు చేశారు. మన ప్యాషన్‌ను తీర్చుకోవడానికీ, అందులో విజయం సాధించడానికీ వయసు అనేది ఒక పరిమితి కాదు. (దుబాయి కార్ రేసు నేపథ్యంలో.)

– విజయానంద్, డేటా అనలిస్ట్

### ముఖ్యమైన రెండు



సత్యాన్ని పొందాలంటే, ఎవరికైనా వివేకం, వైరాగ్యం ఉండాలి. వివేకం అనేది సత్ (నిజం), అసత్(నిజం కానిది) మధ్య ఉన్న తేడాను తెలుసుకోగలిగే సామర్థ్యం. వైరాగ్యం అంటే – నిజం కాని వస్తువుల పట్ల మమకారాన్ని పెంచుకోకుండా ఉండాలని తెలియడం.

– శ్రీ ఎం, ఆధ్యాత్మిక గురువు

### వాళ్లకు మేలు



అమెరికా డాలర్‌తో పోలిస్తే 'ఐఎన్ఆర్' (ఇండియన్ రూపీ, రూపాయి) అత్యంత తక్కువకు పడిపోయి 86 రూపాయలు అయ్యింది. దీన్ని ఇకనుంచీ 'ఎన్ఆర్ఐ' (ప్రవాస భారతీయులు) అని పిలవొచ్చు. అది వాళ్లకు ఎక్కువ లాభం కలిగిస్తుంది మరి!

– కాజోల్ శ్రీనివాసన్, స్టాండప్ కమెడియన్

### విలువ తెలుసు



జీవిత పాఠాలు: మనలో చీకటి గురించి తెలిసినవాళ్లే, నిజమైన కాంతిని అభినందించగలరు.

– రుజుతా దివేకర్, న్యూట్రిషనిస్ట్

### వస్తూనే ఉంటాయి!



నేననుకోవడం ఇండియాలో అత్యంత సంపన్నమైన వ్యక్తి ఎవరంటే, ప్రభుత్వ వెబ్‌సైట్లకు 'క్యాప్చా'లను సరఫరా చేసే మనిషి. అది ఎప్పటికీ ముగిసిపోని వ్యాపారం.

– రమేశ్ శ్రీవత్స్, వ్యంగ్య వ్యాఖ్యాత

### స్పందనలన్నీ ఒకటి కాదు!



అన్ని ఫీడ్‌బ్యాక్స్ మీద శ్రద్ధ పెట్టాల్సిన పనిలేదు. కొన్ని నిర్మాణాత్మకంగా ఉండి మీకు మేలు చేస్తాయి. కొన్ని విషపూరితంగా ఉండి మీ ఆరోగ్యం మీద ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి. అందుకే వివేకంతో ఉండి, మీ మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి.

– ముఫ్తి మెంక్, ఆధ్యాత్మిక బోధకుడు

## ఇన్‌బాక్స్

### సంక్రాంతి



అరిసెల వంటల ఘుమఘుమలు
గరిసెల ధాన్యపు గలగలలు
విరిసిన బంతుల కళ కళలు
కలిసిన నేస్తపు గుసగుసలు
వాడలు చేరిన వలస పక్షులు
వీడని, పసివాడని పాత గురుతులు
గోరంతలయ్యే చిరుబురులు
కొండంత నవ్వుల పెళపెళలు
గంగిరెద్దు మెడ గంటల గణగణలు
ఊరి గుడిలో మంత్ర ధ్వనులు
వీధివీధినా రంగుల ముగ్గులు
రేపగలూ పిల్లల గంతులు
తెలుగు వారి సంబరాల సంక్రాంతి
అందమైన అనుబంధాలను
మరవనివ్వని వెలుగు జ్యోతి

– డా॥ డి.వి.జి. శంకరరావు

### సాక్షి

సీ॥ వైరాగ్య వాసనల్ పండించు భరతాంబ
దానికి మా హరిదాసు సాక్షి
సంగీతమున జంతుజాలమ్మునే తన్పు
ఇద్దానికో గంగిరెద్దు సాక్షి
సరస సంభాషణా సాహితీ చాతురి
కల్లరి మరదలు పిల్ల సాక్షి
ప్రతిపదార్థమునందు భగవంతునిం జూచు
ముఖ్యమ్ముగా గొబ్బిముద్ద సాక్షి

తె.గీ॥ కాయకష్టమ్ములో లక్ష్మి కలదటంచు
పలుకుచుంటకు పచ్చని పైరు సాక్షి
పల్లె సొగసులకో రంగవల్లి సాక్షి
శ్రమయె సౌందర్యమనగ సంక్రాంతిసాక్షి!

– గురుసహస్రావధాని
డా॥ కడిమిళ్ళ వరప్రసాద్

# పాడి పంటల తల్లికి సమర్పించే బోనం!

సందర్భం



దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

పైరు పచ్చల తెలంగాణకు కొత్త కళ తీసుకొచ్చే పండగ సంక్రాంతి. పొగ మంచు పరుచుకున్న పల్లెలకు భానుడు తన వెచ్చటి కిరణాలతో వసంతోల్లాసానికి తోవ చూపే సమయం. ప్రకృతి, ఎవుసాలతో ముడిపడ్డ ఈ పండగకు తెలంగాణ ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం ఉంది. ఇది కేవలం ఒక పండగ మాత్రమే కాదు. జీవితపు సంబురం. పంటలమ్మకు నిండు మనసుతో సమర్పించుకునే బోనం!

మకర సంక్రాంతి అని పిలుచుకునే ఈ పండగకు తెలుగు పంచాంగంలో చాలా ప్రముఖ స్థానమే ఉంది. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించే ఈ కాలం రాత్రి సమయం తగ్గి పగటి సమయం పెరుగుతుందనేందుకు సూచిక. అంతేకాదు... ఈ మార్పు రానున్న కాలం కొత్త శక్తిని అందిస్తుందనీ, ఆశావహంగా ఉంటుందనీ, వృద్ధి సాధ్యమనీ భరోసా ఇచ్చేది కూడా. అందుకే బతుకును నిర్ణయించే ఈ పండుగను తెలంగాణ మొత్తం ఎంతో ఉత్సాహంతో, సంబరంగా జరుపుకుంటారు. పట్టణాలన్నీ పల్లెలను వెతుక్కుంటూ వెళ్లే సమయం ఇది.

వరి కోతలు ముగిసే సమయానికి వచ్చే సంక్రాంతి... రైతులు తమ శ్రమ ఫలితాలను చూసి మురిసిపోయేందుకూ కారణమవుతుంది. తెలంగాణ ఇప్పుడు దేశంలోనే అత్యధికంగా వరి పండించే రాష్ట్రంగా గుర్తింపు పొందింది. రాష్ట్రం స్వయం సమృద్ధికి, సిరి సంపదలకు ప్రతీకలుగా... రైతు ఇళ్లల్లోని గాదెలు, గిడ్డంగులు కూడా ఇప్పుడు ధాన్యరాశులతో తొణికిసలాడుతూంటాయి. ప్రతి ఇంట్లో పాడి పంటలు సమృద్ధిగా ఉండే కాలం. ఆటుపోట్లను దీటుగా ఎదుర్కోగల తెలంగాణ రైతుల అంకిత భావానికి... అనువైన విధానాల ద్వారా వారికి అండగా నిలిచి వ్యవసాయాన్ని పండుగ చేసిన వైనానికి నిదర్శనం.

రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన తరువాత రాష్ట్రం జరుపుకుంటున్న రెండో సంక్రాంతి ఇది. మునుపటి కంటే ప్రత్యేకమనే చెప్పాలి. మరింత ఆనందోత్సాహాలతో జరుగుతాయన్న భరోసా కూడా ఉంది. ఎందుకంటే రాష్ట్రంలో నిండుకుండల్లా ఉన్న జలాశయాలు ఈ ఏడాది వ్యవసాయం భేషుగ్గా ఉంటుందన్న భరోసా ఇస్తోంటే.. రైతన్నకు అండగా ప్రభుత్వం అమలు చేసిన 'ఇందిరమ్మ రైతు భరోసా', భూమిలేని పేదలకు రూ. 12 వేల సాయం, 'ఇందిరమ్మ ఇళ్ల'కు లబ్ధిదారుల ఎంపిక, కొత్త రేషన్ కార్డుల పంపిణీకి ఏర్పాట్లు, 'భూమాత' పోర్టల్ వంటివి రైతు సంక్షేమాన్ని గ్యారెంటీ చేశాయి కాబట్టి!

**పతంగుల పండుగ**

సంక్రాంతి అంటే పిల్లలు, యువతకు పతంగుల పండుగ. మకర సంక్రాంతి మంద్ర పవనాలు పతంగులను ఆకాశం తాకేలా తీసుకెళ్తాయి. దారం ఆధారంగా నేల నుంచి పైకి ఎగిరే పతంగి జీవితంలో కూడా అలా ఎదగాలనే సందేశాన్ని, దీవెనలను ఇస్తుంది. చలిమంటలు వెచ్చదనపు భరోసాను కల్పించే సమయం.



కుటుంబం మొత్తం ఎంతో సంబురంగా జరుపుకునే పండగ మన మకర సంక్రాంతి. ఇంటి అల్లుళ్లను ఆదరించి వారితో కలిసి పండగ చేసుకోవడం సంప్రదాయం. ఇరుగు పొరుగు... మిత్రబృందాలకు శుభాకాంక్షలు చెప్పుకోవడం ... ఇవన్నీ కుటుంబ, మానవ సంబంధాలను మరింత గట్టి పరిచేవే. సంతోషాన్ని అన్ని దిక్కులా పంచేవే. పెట్టుపోతలు, పిండి వంటలు అన్నీ మనకు జీవితకాలపు జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి. సంక్రాంతి ఇంకో విషయమూ చెబుతుంది మనకు. సాటి మనిషి పట్ల కరుణ కూడా చూపమని. గంగిరెద్దులను ఆడించే కళాకారులు కావచ్చు... హరికీర్తనలతో మన ఉదయాల్లో, హృదయాల్లో పలకరించే హరిదాసులు కావచ్చు... ఉన్నవాడు లేనివాడికి ఇంత పెట్టే సమయం కూడా ఈ సంక్రాంతిది. పండగపూట సమాజంలోని అన్ని వర్గాల వారు సుఖ సంతోషాలతో మెలగాలన్న స్ఫూర్తి అన్నమాట. అందరినీ కలుపుకుని పోయే తెలంగాణ సంస్కృతిలో భాగమిది.

**ప్రతి ఇంట్లో సంక్రాంతి శోభ**

సంక్రాంతి శోభ మొత్తం ఇంటిముందు వేసే ముగ్గుల్లోనే దాగుంటుందంటే అతిశయోక్తి కాదేమో. రంగు రంగుల ముగ్గులు, రేగు పండ్ల తీపి పరిమళంతో ప్రతి ఇల్లూ కొత్త కళతో అలరారుతుంది ఈ పండగ వేళ. కొబ్బరాకు తోరణాలు, పూల మాలలతో గ్రామాలకు గ్రామాలు సింగారించుకుంటాయి. ఇక సంక్రాంతి వచ్చిందంటే తప్పనిసరిగా జరుపుకునే ఓ వేడుక మనింటి ఆడపడుచుల ముగ్గుల పోటీలు. ఇవి కేవలం పోటీలు మాత్రమే కాదు. కళాత్మకమైన ముగ్గులు మహిళల సృజనకు గీటురాయే కాదు. మన సంప్రదాయాలను తరువాతి తరానికి అందించే అవకాశం. పురాణేతిహాసాల స్ఫూర్తితో, ప్రకృతి ప్రేరణతో వైవిధ్య భరితమైన డిజైన్లతో వేసే ముగ్గులు పల్లె వీధులను 'ఓపెన్ ఎయిర్ ఆర్ట్ గ్యాలరీల'ను తలపిస్తూంటాయి. ఇవన్నీ గ్రామ సీమలను ఈ సంక్రాంతికి స్వర్గసీమలను తలపించేలా చేస్తాయి!

పండగంటే పూజ, పునస్కారాలతోపాటు పిండివంటలు కూడా. అరిశెలు, సకినాలు, పొంగళ్ల ఘుమఘుమలు పల్లెగాలిని నింపేస్తాయి. ఇచ్చిన దానికి థ్యాంక్స్ చెప్పడమే కాకుండా... వచ్చే ఏడాది కూడా మీ కరుణ మాపై ఉండాలని దేవుడిని వేడుకుంటున్న భక్తులతో దేవాలయాలు కిటకిటలాడుతుంటాయి. ఆలయాల్లోని ప్రశాంతత... దీపాల మిలమిలలు, మంత్రోచ్చారణలన్నీ కలిపి పండుగకు ఒక ఆధ్యాత్మిక శోభను తీసుకొస్తాయి.

వ్యవసాయంలో రాష్ట్రం సాధించిన ఘనతలకు ప్రగతిశీల పాలన కూడా తోడై రానున్న కాలం కూడా బంగారు కాలమయ్యేందుకు గట్టి పునాదులు పడ్డాయి. రిజర్వాయర్లు, చెరువులు నీటితో నిండి భవిష్యత్తు బాగుందనే భరోసానిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ... సంక్రాంతి స్ఫూర్తిని కొనసాగిద్దాం. తెలంగాణ ప్రజలందరికీ నా హృదయపూర్వక సంక్రాంతి శుభాకాంక్షలు.

వ్యాసకర్త తెలంగాణ ఐటీ, పరిశ్రమల మంత్రి

# సేదదీర్చే సంబరాలు

**ఏమండీ! ఇక లెండి! వాకిటికి రానే వచ్చె సంక్రాంతి! ఏ –/ మేమో ఎన్నడు యోచనల్ తెగవు మీ (కు); ఈ లాగున కూర్చొందురం –/ డీ? మానండి దిగుళ్ళు మీ మనసులో; ఈలోక భారమ్ము మీ–/ రే మోసేరె? సుకమ్ముగా నడపలేరీ కాస్త సంసారమున్!**




'వారానికొకటి చొప్పున వరసగా వస్తూ ఉండే ఈ పండుగలన్నీ పనిపాటులు రుచించని సోమరి పామరులకు. వీటివల్ల ఒరిగేదేమో లేదు. ఓ పక్క సొంత సమస్యలతో, మరొక పక్క సామాజిక సంస్కరణ బాధ్యతలతో సతమతమయ్యే నాలాంటి చింతన పరులకు, ఈ నిరర్థక సంప్రదాయాలూ, ఈ గంగిరెద్దులూ, రంగవల్లులూ గంగవెర్రులెత్తిస్తాయి' అని పండుగనాడు కూడా దిగులు మొగాన పులుముకొని కూర్చొన్న మందకొడి మగడిని మందలిస్తున్న మగువ మాటలు పై పద్యం. పలికించిన వారు కుసుమపేశల కవితోక్తుల ఖని కృష్ణశాస్త్రి గారు అని తెలిసినప్పుడు భావుకుల పులకింత మరింతవక మానదు.

జీవితం సుఖ దుఃఖ మిశ్రమం. సమస్యల అలలు నిరంతరం వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. వాటి పాటుకు దిమ్మెరపోయి, నిత్య జీవితాన్ని నిర్వేదంతో, నిరాసక్తితో నింపుకొనేందుకయితే ప్రయత్నం అక్కర్లేదు. అది దానంతటదే జరుగుతుంది. ఆ అనాసక్తిని అధిగమించి జీవితాన్ని రసభరితంగా, రమణీయంగా దిద్దుకోవటానికి మాత్రం స్వయంకృషి కావాలి. ఉత్సాహాన్నీ, సంతోషాన్నీ సృష్టించుకొని రక్షించుకొనే ప్రయాసా, వివేచనా కావాలి. పండగలు కావాలి, పబ్బాలు కావాలి. సంక్రాంతులూ, సంబరాలూ, సరదాలూ తప్పకుండా కావాలి. వాటి సాయంతో, జీవితపు ఒడుదొడుకుల సేద తీర్చుకుంటూ సాగే సామర్థ్యం కావాలి.

సగటు మనిషి జీవితాన్ని సుసంపన్నం చేస్తూ, సమరస విలసితమైన సామాజిక జీవనానికి దోహదం చేసే పర్వదిన సందర్భాలూ, సంప్రదాయాలూ బహుధా అమూల్యాలు.

ప్రకృతి తల్లి, భువన మోహనమయిన పౌష్యలక్ష్మి అవతారంలో వచ్చి, ఆశీర్వదించేందుకు మన ముందు నిలిచినప్పుడు, ఆమెను స్వాగతించి, సత్కరించి, సేవించి, ఆమె ప్రసాదించిన కానుకలు స్వీకరించి, ఆస్వాదించి, ఆనందించగల వారందరూ అదృష్టశాలులు. అలా చేయలేని నిత్య నిస్సంతోషులు 'వట్టి అమాయకులు'. పాఠకానీకం యావత్తుకూ పండగ శుభాకాంక్షలు!

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** బ.పాడ్యమి రా.3.33 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** పునర్వసు ఉ.10.54 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** సా.6.56 నుండి 8.34 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.51 నుండి 9.39 వరకు తదుపరి రా.10.55 నుండి 11.43 వరకు, **అమృత ఘడియలు:** తె.4.21 నుండి 6.18 వరకు (తెల్లవారితే బుధవారం), మకర సంక్రాంతి, ఉత్తరాయణం ప్రారంభం. ; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.38, **సూర్యాస్తమయం:** 5.40.

షాబాద్/ రంగారెడ్డి జిల్లా

# రైతుగా మారిన లెక్చరర్..

సేంద్రియ పద్ధతిలో పండ్ల తోటలు, ఇతర పంటల సాగు

వ్యవసాయం మానేసి ఉద్యోగాల వైపు వెళుతున్నవారు ఎందరో... కానీ కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కొటాల మండలం విజయనగరం గ్రామానికి చెందిన మాదాసు సునంద లెక్చరర్ ఉద్యోగాన్ని వదిలేసి రైతుగా మారారు. పండ్ల తోటలు, మొక్కజొన్న, కంది, పసుపు వంటి పంటలు సాగు చేసి ఆదర్శ రైతుగా నిలుస్తున్నారు. ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ చదివిన సునంద.. తిరుపతిలోని పద్మావతి ఇన్‌స్టిట్యూట్‌లో రెండేళ్లు అధ్యాపకురాలిగా పనిచేశారు. ఆమె భర్త రవికుమార్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. వ్యవసాయంపై మక్కువ, భర్త సహకారంతో ఆమె ఉద్యోగాన్ని వదిలేసి.. సేంద్రియ సాగుపై దృష్టిపెట్టారు. రెండేళ్ల క్రితం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం పెద్దవేడు గ్రామంలో పొలాన్ని కౌలుకు తీసుకున్నారు.
14 ఎకరాల్లో మామిడి, 5 ఎకరాల్లో సపోటా, ఎకరా ఉసిరి, అర ఎకరంలో కంది, అర ఎకరం పసుపు, రెండెకరాల్లో సీతాఫలం, జామ తదితర పంటలు సాగు చేస్తున్నారు. అంతర పంటగా మొక్కజొన్న వేశారు.

### సేంద్రియ సాగుపై అవగాహన కల్పిస్తున్నా...

సీతాఫలం, జామ తోటలకు మంచి లాభాలు వచ్చాయని, ఇందుకు గుర్తింపుగా జాతీయ ఉత్తమ రైతు అవార్డు కూడా అందుకున్నానని సునంద తెలిపారు. తాము పండించిన ఉత్పత్తులను హైదరాబాద్‌లో విక్రయించడంతోపాటు తెలంగాణ, ఏపీలోని పలు ప్రాంతాలు, బెంగళూరు కూడా రవాణా చేస్తున్నామని వెల్లడించారు. ఆర్గానిక్ సాగుపై రైతులను చైతన్యవంతం చేయడానికి యూట్యూబ్ చానల్, ఫేస్‌బుక్ ద్వారా సమాచారం ఇస్తున్నానని తెలిపారు. హైదరాబాద్ శివార్లలోని మహేశ్వరం మండలం గట్టుపల్లి రైతులకు, మొయినా బాద్ మండలం అజీజ్‌నగర్‌లో ఆకు కూరలు, పండ్లు, పూల సాగు చేస్తున్న రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.





## క్లుప్తంగా...

### దర్శకుడు త్రినాథరావుపై మహిళా కమిషన్ సీరియస్

సాక్షి, హైదరాబాద్: తెలుగు సినిమా దర్శకుడు నక్కిన త్రినాథరావు.. నటి అన్షుపై చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర మహిళా కమిషన్ సీరియస్‌గా తీసుకుంది. మహిళలను అగౌరవపరచే విధంగా మాట్లాడిన ఆయన వ్యాఖ్యలపై కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించి విచారణకు ఆదేశించారు. ఇందులో భాగంగా ఆయనకు నోటీసు జారీ చేస్తామని స్పష్టం చేశారు. మజాకా అనే సినిమా ప్రెస్‌మీట్‌లో త్రినాథరావు ఈ వ్యాఖ్యలు చేశారని చెపుతున్నారు.

### బతికుండగానే రికార్డుల్లో చంపేశారు

నిలిచిన పింఛన్.. ఆందోళనలో వృద్ధుడు




సిరిసిల్ల, కల్చరల్: బతికుండగానే ఓ వృద్ధుడిని రికార్డుల్లో చంపేశారు. దీంతో వృద్ధాప్యంలో ఆసరాగా నిలుస్తున్న పింఛన్ సైతం రాక ఇబ్బందులు పడుతున్నాడు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన బీమనాతిని లక్ష్మీనారాయణ వృద్ధాప్యంలోనూ కుటుంబ పోషణకు ఓ పవర్‌లూమ్ కార్ఖానాలో పనిచేస్తున్నాడు. 2014 డిసెంబర్ నుంచి పెన్షన్ పొందుతున్నాడు. అయితే ఆరు నెలలుగా పెన్షన్ ఆగిపోయింది. ఈ విషయమై జిల్లా గ్రామీణాభి వృద్ధి కార్యాలయాన్ని సంప్రదిస్తే రికార్డుల్లో చనిపోయినట్టు ఉందని, అందుకే పెన్షన్ రావడం లేదని చెప్పారు. తాను బతికే ఉన్నానని, పెన్షన్ పునరుద్ధరించాలని కలెక్టరేట్‌లో అర్జీ పెట్టుకున్నాడు. కానీ స్పందన లేదని వాపోతున్నాడు.

### సంక్రాంతికి భారీగా తరలివెళ్లిన ప్రజలు

బీబీనగర్/చౌటుప్పల్ రూరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా గత ఏడాదితో పోలిస్తే వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారి మార్గంలో వాహనాల రాకపోకల సంఖ్య గణనీయంగా పెరిగింది. గత ఏడాది ఈ మార్గంలో గల యాదాద్రి జిల్లా బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా మీదుగా మూడు రోజుల పాటు రోజుకు 30వేల చొప్పున మొత్తం లక్షా 20 వేల వాహనాలు రాకపోకలు సాగించాయి. అదే ఈ సంక్రాంతిని పురస్కరించుకొని మూడు రోజుల్లో హైదరాబాద్ నుంచి వరంగల్‌వైపు 2 లక్షలకు పైగా వాహనాలు తరలివెళ్లాయి.
**విజయవాడ వైపు..:** ఈసారి హైదరాబాద్ నుంచి ఏపీతో పాటు ఇతర ప్రాంతాలకు ప్రజలు వాహనాల్లో భారీగా తరలి వెళ్లారు. యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్ ప్లాజా గుండా ఈ నెల 10న 48 వేల వాహనాలు, 11న 92 వేల వాహనాలు, 12న 58 వేల వాహనాలు వెళ్లాయి. ఇలా మూడు రోజుల్లో విజయవాడ వైపు 1.98 లక్షల వాహనాలు వెళ్లాయి. గత సంక్రాంతికి 3రోజుల్లో 1.75లక్షల వాహనాలు వెళ్లాయని అధికారులు తెలిపారు.

# కరెంటు చార్జీల పెంపు లేదు



- ఇటీవల సీఎం, డిప్యూటీ సీఎం నిర్వహించిన సమీక్షలో నిర్ణయం
- ప్రస్తుత చార్జీలే 2025-26 లోనూ కొనసాగించాలని ఆదేశం
- వారంలో ఈఆర్సీకి ఏఆర్ఆర్, టారిఫ్ ప్రతిపాదనలు
- రూ.57,448 కోట్లకు చేరిన డిస్కంల మొత్తం నష్టాలు

**డిస్కంలకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టీకరణ**

**వచ్చే ఏడాదిలో చార్జీలు పెంచాలన్న విద్యుత్ సంస్థల విజ్ఞప్తికి నో**

సాక్షి, హైదరాబాద్

వచ్చే ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. చార్జీలు పెంచాలని రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు చేసిన విజ్ఞప్తిని తిరస్కరించింది. ప్రస్తుత విద్యుత్ చార్జీలనే వచ్చే ఆర్థిక సంవత్సరం 2025–26లో యథాతథంగా కొనసాగించాలని స్పష్టం చేసింది. విద్యుత్ చార్జీల పెంపును ప్రతిపాదించకుండానే 2025–26కి సంబంధించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదిక (ఏఆర్ఆర్), టారిఫ్ ప్రతిపాదనలను రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్సీ)కి సమర్పించేందుకు డిస్కంలకు అనుమతినిచ్చింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత విద్యుత్ చార్జీలనే 2025–26లోనూ కొనసాగించాలని ప్రతిపాదిస్తూ వారం రోజుల్లో ఈఆర్సీకి ఏఆర్ఆర్, టారిఫ్ ప్రతిపాదనలను సమర్పిస్తామని డిస్కంల అధికారవర్గాలు వెల్లడించాయి.

ఉత్తర/దక్షిణ డిస్కంలు గత ఆర్థిక సంవత్సరం 2023–24లో రూ.6,299.29 కోట్ల కొత్త నష్టాలను మూటగట్టుకోగా, మొత్తం నష్టాలు రూ.57,448 కోట్లకు ఎగబాకాయి. ఒక్క టీజీఎస్పీడీసీఎల్ నష్టాలే రూ.39,692 కోట్లకు చేరగా, టీజీఎన్పీడీసీఎల్ రూ.17,756 కోట్ల నష్టాల్లో ఉంది. కాగా విద్యుత్ శాఖకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి గత శనివారం ఆ శాఖపై నిర్వహించిన సమీక్షలో.. డిస్కంల నష్టాలను అధికారులు ప్రస్తావించారు. విద్యుత్ చార్జీల పెంపు అనివార్యంగా మారిందని వివరించారు. గృహాలు మినహాయించి కేవలం పారిశ్రామిక, ఇతర వాణిజ్య కేటగిరీల విద్యుత్ చార్జీల పెంపునకు అనుమతించాలని కోరినట్టు తెలిసింది.

**నష్టాల ఊబిలో డిస్కంలు..**

అయితే ప్రస్తుతం రాష్ట్రంలో ఎలాంటి విద్యుత్ చార్జీల పెంపు జోలికి వెళ్లవద్దని సీఎం, డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుత చార్జీలనే వచ్చే ఆర్థిక సంవత్సరంలో కొనసాగిస్తామని ప్రతిపాదిస్తూ ఈఆర్సీకి ప్రతిపాదనలు సమర్పించాలని సీఎం ఆదేశించారని అధికారవర్గాలు తెలిపాయి. వచ్చే శనివారం ఈఆర్సీకి ఈ మేరకు ఏఆర్ఆర్, టారిఫ్ ప్రతిపాదనలను సమర్పించే అవకాశముందని ఓ అధికారి 'సాక్షి'కి తెలిపారు.

**విద్యుత్ సబ్సిడీ పెంచక తప్పదు**

ప్రస్తుత విద్యుత్ చార్జీలతోనే వచ్చే ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ సరఫరా చేస్తే డిస్కంలకు కొత్తగా వచ్చే నష్టాలను డిస్కంలు అంచనా వేసి ఈఆర్సీకి సమర్పించే ప్రతిపాదనల్లో ఆర్థిక లోటుగా చూపించనున్నాయి. ఈఆర్సీ పరిశీలించి ఆమోదించిన నష్టాల మొత్తాన్ని డిస్కంలకు ప్రభుత్వం సబ్సిడీగా ఇస్తేనే విద్యుత్ చార్జీల పెంపు భారం నుంచి ప్రజలకు ఉపశమనం లభించనుంది. గతేడాది నవంబర్ నుంచి ప్రస్తుత ఏడాది మార్చి 31 వరకు రాష్ట్రంలో రూ.1,200 కోట్ల విద్యుత్ చార్జీల పెంపునకు అనుమతి కోరుతూ డిస్కంలు గతేడాది చివర్లో ప్రతిపాదనలు సమర్పించగా, ఈఆర్సీ అనుమతించకపోవడంతో చార్జీల పెంపు భారం నుంచి ఉపశమనం లభించింది. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీలను రూ.11,499 కోట్లకు పెంచేందుకు అంగీకరించడంతో ఇది సాధ్యమైంది. అలాగే వచ్చే ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ సబ్సిడీలను ప్రభుత్వం మరింతగా పెంచితేనే ప్రజలపై చార్జీల పెంపు భారం ఉండదని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

## జాతీయ పసుపు బోర్డు చైర్‌పర్సన్‌గా పల్లె గంగారెడ్డి

**నిజామాబాద్‌లో నేడు బోర్డు కార్యాలయాన్ని వర్చువల్‌గా ప్రారంభించనున్న కేంద్రమంత్రి పీయూష్‌గోయల్**



సాక్షి, న్యూఢిల్లీ/సుభాష్‌నగర్/హైదరాబాద్: జాతీయ పసుపు బోర్డు చైర్‌పర్సన్‌గా పల్లె గంగారెడ్డిని నియమించినట్టు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ, ప్రకటించింది. కేబినెట్ అపాయింట్‌మెంట్స్ కమిటీ సెక్రటేరియట్ ఆమోదించిన ఈ నియామకం నోటిఫికేషన్ తేదీ నుంచి మూడేళ్లపాటు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు, ఏది ముందు అయితే అది అమల్లో ఉంటుంది. ఈ మేరకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ అండర్ సెక్రటరీ మహేందర్ చౌదరి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 37 సంవత్సరాల తర్వాత కేంద్ర ప్రభుత్వం ఒక వస్తువు కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేసింది. జాతీయ పసుపు బోర్డు కార్యాలయాన్ని నిజామాబాద్‌లో మంగళవారం కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. చైర్‌పర్సన్ గంగారెడ్డి సహా జాతీయ పసుపు బోర్డు సెక్రటరీ హేమలత (ఢిల్లీ), డైరెక్టర్ రేమాశ్రీ (కొచ్చి), ఇతర కేంద్ర, రాష్ట్ర, జిల్లా అధికారులు పాల్గొంటారు. అనంతరం నగరంలోని ఓ హోటల్‌లో పసుపు రైతులతో సమావేశం జరుగుతుంది.

**ఇదీ గంగారెడ్డి నేపథ్యం**

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామానికి చెందిన పల్లె గంగారెడ్డి బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు పనిచేశారు. ప్రస్తుతం రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు. గతంలో సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కొనసాగారు.

**ఇది రైతుల విజయం: మంత్రి తుమ్మల**

జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు రైతుల విజయమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. బోర్డును నిజామాబాద్‌లో ఏర్పాటు చేయాలని కేంద్రానికి అనేకసార్లు విజ్ఞప్తి చేశామని గుర్తు చేశారు. పసుపు బోర్డు ప్రారంభిస్తున్నందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పీఎం మోదీ, కేంద్రమంత్రి పీయూష్‌గోయల్‌కు తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు.

## సీడబ్ల్యూసీ చైర్మన్‌గా ముఖేష్‌కుమార్ సిన్హా



సాక్షి, హైదరాబాద్: కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్‌గా ముఖేష్‌కుమార్ సిన్హాను కేంద్ర ప్రభుత్వం నియమించింది. కేంద్ర కేబినెట్ నియామక కమిటీ ఆయన పేరును సిఫారసు చేయగా, ఈ మేరకు నియామక ఉత్తర్వులను కేంద్ర సిబ్బంది, శిక్షణ మంత్రిత్వ శాఖ ఈ నెల 10న జారీ చేసింది. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లోని గోదావరి యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) చైర్మన్‌గా పనిచేస్తున్నారు.

## కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్న రమేశ్ కార్తీక్ నాయక్

'ధావ్లో- గోర్' బంజారా కథలకు సాహిత్య పురస్కారం..



సాక్షి, హైదరాబాద్: 2024 సంవత్సరానికి గాను కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారాన్ని తెలుగు భాష నుంచి రమేశ్ కార్తీక్ నాయక్ అందుకున్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ భువనేశ్వర్‌లోని ఉత్కల్ విశ్వవిద్యాలయం వేదికగా యువ పురస్కారాలను అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్ చేతుల మీదుగా విజేతలకు అందజేసింది. తెలుగు భాష నుంచి రమేశ్ కార్తీక్ నాయక్ తన తొలి కథల సంపుటి 'ధావ్లో- గోర్' బంజారా కథల పుస్తకానికి ఈ అవార్డును అందుకున్నారు. ఈ పురస్కారం అందుకున్న తొలి గిరిజన, పిన్న వయస్కుడిగా (26) రమేశ్ చరిత్ర సృష్టించారు. రమేశ్ రాసిన ధావ్లో–గోర్ బంజారా కథలు తెలుగు రాష్ట్రాల్లోని గోర్ బంజారా అనే గిరిజన సంచార తెగల జీవన శైలికి అద్దంపట్టాయి. ఇదే వేదికపై ఆంగ్ల రచయిత్రి కె.వైశాలి తన మెమోయిర్.. 'హోంలెస్' అనే రచనకుగాను అవార్డును అందుకున్నారు. వీరిద్దరూ హైదరాబాద్‌కు చెందిన వారే కావడం విశేషం.
**బాధ్యత పెంచింది..:** నా అక్షరం మన సంస్కృతిని, సంప్రదాయాలను ప్రతిబింబిస్తే చాలనే ఆలోచనతో రచనలు చేసేవాడిని. నా తొలి కథల సంపుటి ధావ్లో-గోర్ బంజారా కథలకు కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం దక్కడం బాధ్యతను పెంచింది. ఈ పురస్కారం అందించిన స్ఫూర్తితో మరిన్ని రచనలు చేయాలనుంది. నా ప్రయాణంలో కీలక పాత్ర పోషించిన వ్యక్తులు, నా మాతృక గోర్ బంజారాకు ప్రత్యేక ధన్యవాదాలు — రమేశ్ కార్తీక్ నాయక్

## వైఎస్సార్ స్ఫూర్తితో పేదలకు పక్కా ఇళ్లు

- నాలుగేళ్లలో 20 లక్షల ఇళ్లు నిర్మిస్తాం
- మోడల్ హౌస్‌ను ప్రారంభించిన మంత్రి పొంగులేటి

కూసుమంచి: దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి హయాంలో నాటి ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు లక్షలాది ఇందిరమ్మ ఇళ్లను నిర్మించిందని.. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అదే కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇళ్లు నిర్మించనుందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. వైఎస్సార్ స్ఫూర్తితో పేదలకు పక్కా ఇళ్లు ఇవ్వడమే తమ లక్ష్యమని అన్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండల కేంద్రంలో రూ.5 లక్షల వ్యయంతో నిర్మించిన ఇందిరమ్మ నమూనా ఇల్లును సోమవారం ఆయన ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డితో కలసి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రూ.5 లక్షల వ్యయంతో ఇల్లు ఎలా నిర్మించుకోవాలనే అంశంపై అవగాహనకోసం మోడల్ హౌస్‌లు నిర్మిస్తున్నామని తెలిపారు. తద్వారా పేదలపై భారం ఉండదని చెప్పారు. గత ప్రభుత్వంలో వారి పార్టీ వారికే ఇళ్లు ఇచ్చారనే విమర్శలు ఉన్నందున.. తమ ప్రభుత్వంలో కులమతాలు, పార్టీలకతీతంగా



కూసుమంచిలో మోడల్ హౌస్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురాంరెడ్డి

పేదరికాన్నే అర్హతగా చూసి ఇల్లు ఇస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో వచ్చే నాలుగేళ్లలో 20 లక్షల ఇళ్లు నిర్మించాలనే లక్ష్యం కాగా, ఎన్ని కష్టాలు ఎదురైనా దీనిని అధిగమిస్తామని అన్నారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలించకున్నా, ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న తమ కృషిని గుర్తించి ఇతర పార్టీలు చేసే విషపు ప్రచారాలను ప్రజలు నమ్మొద్దని కోరారు. ఈనెల 26 తర్వాత రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, తెల్లరేషన్ కార్డుల జారీ మొదలవుతుందని తెలిపారు. ఆ తర్వాత మంత్రి, కూసుమంచి మండలం దుబ్బతండాలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



భోగి వేడుకల్లో ఎమ్మెల్సీ కవిత

## నూతన ఉత్తేజంతో ముందుకు సాగాలి: ఎమ్మెల్సీ కవిత

బంజారాహిల్స్ (హైదరాబాద్): మన సంస్కృతి, కళలను కాపాడేందుకు తెలంగాణ జాగృతి ఎప్పుడూ ముందుంటుందని ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. సోమవారం బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద హైదరాబాద్ జిల్లా జాగృతి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భోగి వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. భోగి మంటలను వెలిగించి, చిన్నారులకు భోగిపండ్లు పోసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఈ పండుగ నుంచి నూతన ఉత్తేజంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా పార్కు వద్ద నిర్వహించిన సాంస్కృతిక కళాబృందాల కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో జాగృతి నేతలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్ట్

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌పై దాడి చేశారనే ఆరోపణలతో అదుపులోకి..
- హైదరాబాద్‌లో ఓ టీవీ చానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చి బయటికి వస్తుండగా అరెస్టు
- కరీంనగర్‌కు తరలించిన పోలీసులు.. ఆందోళనకు దిగిన బీఆర్ఎస్ శ్రేణులు

సాక్షి హైదరాబాద్/సాక్షిప్రతినిధి,కరీంనగర్/కరీంనగర్ క్రైం: జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌తో దురుసుగా ప్రవర్తించారనే ఆరోపణలతో హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని కరీంనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లో ఓ టీవీ చానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చి బయటికి వస్తుండగా ఆయనను అదుపులోకి తీసుకుని కరీంనగర్‌కు తరలించారు. ఈ క్రమంలో తీవ్ర హైడ్రామా చోటు చేసుకుంది.

**మూడు కేసులు నమోదు..**

కరీంనగర్‌లో ఆదివారం జరిగిన ఓ సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే సంజయ్‌తో పాడి కౌశిక్‌రెడ్డి వాగ్వాదానికి దిగిన విషయం తెలిసిందే. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరుల సమక్షంలోనే సంజయ్‌ను నువ్వు ఏ పార్టీలో ఉన్నావంటూ కౌశిక్‌రెడ్డి నిలదీశారు. బీఆర్ఎస్‌లో గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన స్వార్థపరుడివి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఎమ్మెల్యే సంజయ్‌పై దాడి చేశారంటూ ఆయన పీఏ, సమావేశంలో గందరగోళం సృష్టించారంటూ స్థానిక ఆర్డీవో కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనితో పోలీసులు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై వివిధ సెక్షన్ల కింద మూడు కేసులు నమోదు చేశారు. ఆయనను అరెస్టు చేసేందుకు సోమవారం సాయంత్రం హైదరాబాద్‌కు వచ్చారు. ఇక్కడి జూబ్లీహిల్స్ రోడ్ నం 36 ప్రాంతంలో ఓ టీవీ చానెల్‌లో ఇంటర్వ్యూ ఇచ్చి బయటికి వస్తున్న సమయంలో అదుపులోకి తీసుకుని కరీంనగర్‌కు తరలించారు. చాలా సేపు ఆయన ఎక్కడున్నదీ బయటికి చెప్పలేదు. అర్ధరాత్రి సమయంలో పట్టణంలోని త్రీటౌన్ పోలీసుస్టేషన్‌కు తరలించారు.



సోమవారం హైదరాబాద్‌లో కౌశిక్‌రెడ్డిని అరెస్టు చేస్తున్న పోలీసులు



కరీంనగర్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగిన బీఆర్ఎస్ కార్యకర్తలు

**బీఆర్ఎస్ నేతల ఆందోళన.. హైడ్రామా..**

కౌశిక్‌రెడ్డి అరెస్టు నేపథ్యంలో బీఆర్ఎస్ కార్యకర్తలు నిరసనలకు దిగవచ్చనే అంచనాతో పోలీసులు ముందస్తుగానే భారీ భద్రత ఏర్పాటు చేశారు. మరోవైపు కరీంనగర్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వద్దకు మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ మేయర్ రవీందర్ సింగ్, బీఆర్ఎస్ నగరశాఖ అధ్యక్షుడు చల్లా హరిశంకర్, నేతలు ఏనుగు రవీందర్‌రెడ్డి, దావ వసంత, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు చేరుకున్నారు. కౌశిక్‌రెడ్డి అరెస్టును ఖండిస్తూ నినాదాలు చేశారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు ఆందోళన చేస్తున్నవారిని అరెస్టు చేసి కొత్తపల్లి పోలీసుస్టేషన్‌కు తరలించారు.

**సమాధానం చెప్పలేకే అణచివేత: కేటీఆర్**

రైతు రుణమాఫీని ఎగవేసి, దళితబంధుకు పాతరేసిన కాంగ్రెస్ సర్కారును ప్రశ్నిస్తే.. సమాధానం చెప్పలేక సీఎం అణచివేత చర్యలకు దిగుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అరెస్టు అక్రమం, అత్యంత దుర్మార్గమని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ''పూటకో అక్రమ కేసు పెట్టడం, రోజుకో బీఆర్ఎస్ నేతను అన్యాయంగా అరెస్టు చేయడం రేవంత్ సర్కారుకు అలవాటుగా మారింది. సీఎం చేతకానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకే ఇలాంటి దిగజారుడు పనులకు దిగుతున్నారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిన సీఎంపై చర్య తీసుకోవాల్సింది పోయి, ప్రజల పక్షాన ప్రశ్నించిన కౌశిక్‌రెడ్డిపై కేసులు పెట్టడమే ఇందిరమ్మ రాజ్యమా?' అని కేటీఆర్ ప్రశ్నించారు.

**వెంటనే విడుదల చేయాలి: హరీశ్‌రావు**

ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న ప్రజా ప్రతినిధులపై అక్రమంగా కేసులు పెట్టడం, పార్టీ కార్యాలయాలపై దాడులు చేయడం సిగ్గుచేటని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. అణచివేతలు, నిర్బంధాలు, దాడులకు బీఆర్ఎస్ పార్టీ బెదరదన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**సంజయ్ దురుసుగా మాట్లాడారు: గంగుల**

కరీంనగర్: సమీక్షా సమావేశంలో ప్రభుత్వ తీరును ప్రశ్నించిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని పోలీసులు బలవంతంగా బయటికి లాక్కెళ్లారని.. ఆయనే గొడవకు కారణమంటూ అక్రమ కేసులు పెట్టడం ఏమిటని బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మండిపడ్డారు. కరీంనగర్‌లోని తన నివాసంలో సోమవారం గంగుల మీడియాతో మాట్లాడారు. ''అధికారిక సమావేశానికి ఆహ్వానిస్తేనే నేను, కౌశిక్‌రెడ్డి వెళ్లాం. సమావేశం ప్రారంభంలోనే ఎమ్మెల్యే సంజయ్ తన పక్కనే కూర్చున్న కౌశిక్‌రెడ్డిని మాటలతో అసహనానికి గురిచేశారు. దీనితో ఆగ్రహించిన కౌశిక్‌రెడ్డి ముందు నీది ఏ పార్టీనో చెప్పి ప్రసంగించాలని నిలదీశారు. ఈ సమయంలో కౌశిక్‌రెడ్డిపైనే సంజయ్ దురుసుగా ప్రవర్తించారు'' అని తెలిపారు. అక్కడే ఉన్న మంత్రులు దీనిని అడ్డుకోకపోగా.. క్షణాల్లో వచ్చిన పోలీసులు కౌశిక్‌రెడ్డిని బలవంతంగా లాక్కెళ్లి బయటకు నెట్టేశారని మండిపడ్డారు.

**కేసీఆర్, కేటీఆర్ రాజీనామా చేస్తే నేనూ చేస్తా..: ఎమ్మెల్యే సంజయ్**

గతంలో కాంగ్రెస్, టీడీపీ, బీఎస్పీ, ఇతర పార్టీల ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్న కేసీఆర్, కేటీఆర్‌లు తమ పదవులకు రాజీనామా చేస్తే తాను కూడా రాజీనామా చేస్తానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాడి చేశారంటూ నమోదైన కేసుకు సంబంధించి ఆయన కరీంనగర్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. అనంతరం సంజయ్ మీడియాతో మాట్లాడారు. కౌశిక్‌రెడ్డి తన హక్కులకు భంగం కల్పించారని, చేతిపై కొట్టారని, అవమానించారని పేర్కొన్నారు. తనపై జరిగిన దాడి కౌశిక్‌రెడ్డి ఒక్కడి పనేనా, ఎవరి ప్రోత్సాహమైనా ఉందా? అనేది తెలియాలన్నారు.

**కౌశిక్‌రెడ్డిపై స్పీకర్‌కు ఫిర్యాదు**

కరీంనగర్‌లో జరిగిన జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అనుమతి మేరకు తాను మాట్లాడుతుండగా ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అడ్డుకున్నారని ఎమ్మెల్యే సంజయ్ సోమవారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. అసభ్య పదజాలం ఉపయోగిస్తూ తనను తోసివేశారని, దాడికి యత్నించారని పేర్కొన్నారు. కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరారు.






సోమవారం మహా కుంభమేళా తొలి రోజు ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న అసంఖ్యాక భక్త జనం

# తొలి రోజే కోటిన్నర

## మహా కుంభమేళాకు పోటెత్తిన భక్తులు

| | | |
|---|---|---|
| భారీగా పుష్య పూర్ణిమ పుణ్యస్నానాలు | జనసంద్రంగా మారిన ప్రయాగ్‌రాజ్ సంగమస్థలి | పులకించిపోతున్న విదేశీ భక్తులు |
| నేడు వైభవంగా తొలి షాహీ స్నాన్ | పీఠాధిపతులు, సాధువులతో వేడుక | 2 కోట్లకు పైగా భక్తులు వస్తారని అంచనా |

**సాక్షి, న్యూఢిల్లీ:** ప్రపంచంలోనే అతి పెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళా సోమవారం అంగరంగ వైభవంగా మొదలైంది. భారీగా పోటెత్తిన భక్తులతో తొలి రోజే ప్రయాగ్‌రాజ్ జనసంద్రమైంది. ఏ వైపు చూసినా కనుచూపు మేరా కట్టలు తెగినట్టుగా జనప్రవాహమే. ఎముకలు కొరికే చలి. దట్టంగా కమ్ముకున్న పొగమంచు. అతి శీతల జలాలు. ఇవేవీ భక్తుల ఉత్సాహానికి అడ్డుకట్ట వేయలేకపోయాయి. తెల్లవారుజాము కల్లా త్రివేణి సంగమ స్థలి ఇసుక వేసినా రాలనంత జనంతో నిండిపోయింది. శంఖనాదం, మంత్రోచ్చారణల నడుమ గంగా, యమున, సరస్వతి కలిసే చోట మేళా లాంఛనంగా ప్రారంభమైంది. ఆ వెంటనే 'జై గంగా మాతా', 'హరహర మహాదేవ్', 'జై శ్రీరాం' నినాదాలు మిన్నంటాయి. తర్వాత భక్తుల పుణ్య స్నానాలు మొదలయ్యాయి. తెల్లవారుజామున తొలి విడత స్నానాల్లో పాల్గొన్న వారిని యూపీ ప్రభుత్వం హెలికాప్టర్ ద్వారా పూలు చల్లి స్వాగతించింది. సోమవారం సాయంత్రానికే ఏకంగా 1.65 కోట్ల మందికి పైగా పుష్య పౌర్ణమి స్నానం ఆచరించినట్టు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. మంగళవారం సంక్రాంతి సందర్భంగా 13 అఖాడాలతో పాటు దేశ నలుమూలలకు చెందిన పలు ఆధ్యాత్మిక పీఠాల అధిపతులు, సాధుసంతులు తొలి షాహీస్నాన్ (రాజస్నానం) ఆచరించనున్నారు. ఈ సందర్భంగా భక్తుల సంఖ్య మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. ఫిబ్రవరి 26న మహాశివరాత్రిన చివరి రాజస్నానంతో మేళా ముగియనుంది.

### వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

144 ఏళ్లకు ఓసారి వచ్చే అత్యంత అరుదైన ఈ ఆధ్యాత్మిక వేడుకలో పాల్గొనేందుకు విదేశీయులు కూడా భారీ సంఖ్యలో ప్రయాగ్‌రాజ్ చేరుకున్నారు. స్థానికులు, భక్తులు, సాధుసంతులతో కలిసి శంఖాలూదుతూ, భజనలు చేస్తూ భక్తి భావనతో పులకించిపోయారు. ఈసారి కుంభమేళా ఆధ్యాత్మికత, సంస్కృతి, మత విశ్వాసాలు, సంప్రదాయాలతో పాటు అధునాతన టెక్నాలజీకి కూడా అద్దం పట్టేలా జరుగుతోంది. 'ఏక్‌తా కా మహాకుంభ్' హాష్‌ట్యాగ్ సోమవారం సోషల్ మీడియాలో టాప్ ట్రెండింగ్‌లో నిలిచింది. భక్తులు, సాధువులు రాకపోకలకు ఏర్పాటు చేసిన 30 బల్లకట్టు వంతెనలతో పాటు ఈ మహా క్రతువును నిర్వహణకు కేటాయించిన 10 వేల ఎకరాల స్థలమూ కిక్కిరిసి కన్పిస్తోంది. 1.5 లక్షల మరుగుదొడ్లను 15 వేలకు పైగా పారిశుద్ధ కార్మికులు ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నారు. మహిళలు బట్టలు మార్చుకునేందుకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేశారు. మహాకుంభ్‌ను గ్రీన్, డిజిటల్, ప్లాస్టిక్‌రహితంగా యోగి సర్కారు ప్రకటించింది. తొలి రోజే మేళాలో తప్పిపోయిన 500 పై చిలుకు మందిని సొంతవారి చెంతకు చేర్చారు. 2 లక్షల గుడారాలతో వెలిసిన టెంట్ సిటీ ప్రపంచంలోనే అతి పెద్ద తాత్కాలికంగా రికార్డు సృష్టించింది.


ప్రత్యేక ఆకర్షణగా స్టీవ్ జాబ్స్ భార్య

ఆపిల్ సహ వ్యవస్థాపకుడు దివంగత స్టీవ్ జాబ్స్ భార్య లారెన్ పావెల్ జాబ్స్ మహా కుంభమేళాలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆమె శనివారం వారణాసిలో విశ్వనాథ ఆలయాన్ని సందర్శించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం హైందవేతరులు విశ్వనాథ లింగాన్ని తాకేందుకు వీల్లేదు. దాంతో ఆమె తలపై దుపట్టా ధరించి గర్భాలయం వెలుపల నుంచే అభిషేకంలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం 40 మంది బృందంతో కలిసి శనివారం రాత్రి కుంభ్‌నగర్ చేరుకున్నారు. నిరంజనీ అఖాడాకు చెందిన చెందిన స్వామి కైలాసానంద గిరి ఆశ్రమంలో బస చేశారు. పసుపు రంగు సల్వార్, చేతిలో రక్షసూత్రం, మెడలో రుద్రాక్ష మాలతో నిరాడంబరంగా సన్యాసి వేషధారణలో కనిపించారు. సంప్రదాయ మట్టి కప్పులో వేడివేడి మసాలా టీ ఆస్వాదించారు. ఆమె గురువారం దాకా కుంభమేళాలో పాలుపంచుకుంటారు. భారతీయ సంప్రదాయాలు, ఆధ్యాత్మికత అంటే లారెన్‌కు అపారమైన గౌరవమని స్వామి కైలాసానంద గిరి చెప్పారు. ఆమెకు కమలగా నామకరణం చేసినట్టు వివరించారు.

### లక్షల్లో కల్పవాస దీక్షలు

**తొలి** రోజే లక్షలాది భక్తులు కల్పవాద దీక్ష తీసుకున్నారు. యూపీలోని బుందేల్‌ఖండ్‌కు చెందిన దినేశ్ స్వరూప్ బ్రహ్మచారికి ఇది వరుసగా 41వ కల్పవాసం కావడం విశేషం! దీక్షధారుల్లో యువత కూడా ఎక్కువ సంఖ్యలో కనిపించారు. వారిలో యూపీఎస్సీ వంటి అత్యున్నత పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న వాళ్లు కూడా ఉన్నారు. కుంభమేళాలో నెలపాటు కల్పవాసం చేస్తే వందేళ్ల తపస్సు చేసిన ఫలం దక్కుతుందని పద్మపురాణం, మహాభారతం చెబుతున్నాయి. అందులో భాగంగా 21 రకాల నియమనిష్టలు పాటించాల్సి ఉంటుంది.

### రూ.1,296కే హెలికాప్టర్ రైడ్

**కుంభమేళా** విహంగవీక్షణానికి హెలికాప్టర్ సేవలను యూపీ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. కేవలం రూ.1,296 చెల్లించి 7 నిమిషాల పాటు ఆకాశంలో చక్కర్లు కొడుతూ ఆధ్యాత్మిక శోభను తిలకించవచ్చు. సంగమ ప్రాంతానికి హెలికాప్టర్ ద్వారా చేరే వెసులుబాటూ కల్పించారు. ఒక్కో ప్రాంతానికి ఒక్కో రేటును నిర్దేశించారు.

### ప్రత్యేకమైన రోజు ఇది: మోదీ, యోగి

భారత ఆధ్యాత్మిక వారసత్వాన్ని మహా కుంభమేళా ప్రతిబింబిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ పేర్కొన్నారు. ''భక్తి, విశ్వాసం, సంప్రదాయాల సంగమం జాతి, మతం, సరిహద్దులకు అతీతంగా ఇన్ని కోట్ల మందిని ఒక్కచోటికి చేర్చింది. భారతీయ విలువలు, సంస్కృతిని గౌరవించే కోట్లాది మందికి ఇది ప్రత్యేకమైన రోజు. పవిత్ర స్నానాలు ఆచరించి, దైవాశీస్సులు పొందేందుకు ఇంతమంది రావడం హర్షణీయం'' అంటూ మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆయన త్వరలో కుంభమేళాలో పాల్గొననున్నారు. మేళా ప్రాంతంలో భక్తులు మోదీ, యోగి కటౌట్ల వద్ద భారీగా ఫొటోలు దిగుతుండటం విశేషం.


పుణ్యస్నానం అనంతరం ప్రార్థనలు చేస్తున్న భక్తురాలు

### అద్భుతం: విదేశీ భక్తులు

#### భారీ సంఖ్యలో పోటెత్తుతున్న వైనం

**కుంభమేళాకు** విదేశీయులు భారీ సంఖ్యలో పోటెత్తుతున్నారు. వారిలో పలువురు ఆసక్తి, జిజ్ఞాస కొద్దీ వచ్చినవారు కాగా చాలా మంది పూర్తిస్థాయిలో సన్యాసులుగా మారి మోక్షమార్గం పట్టినవాళ్లు కూడా ఉండటం విశేషం. జీవితంలో ఏదీ శాశ్వతం కాదని అర్థమైన మీదట మోక్షార్థిగా మారానని విదేశీ సన్యాసి బాబా మోక్షపురి చెప్పుకొచ్చాడు. అమెరికాకు చెందిన ఆయన పూర్వాశ్రమ నామం మైకేల్. సైన్యంలో పని చేశాడు. తర్వాత కొన్నేళ్ల క్రితం జునా అఖాడాలో చేరి సన్యాసం స్వీకరించాడు. ''నాకిది తొలి కుంభమేళా. అద్భుతమైన ఆధ్యాత్మిక ప్రకంపనలతో పరవశించిపోతున్నా'' అంటూ హర్షం వెలిబుచ్చాడు. రొమారియో (బ్రెజిల్), జూలీ (స్పెయిన్) తదితర విదేశీయులు కూడా అదే అభిప్రాయం వెలిబుచ్చారు. కుంభమేళాలో పాల్గొనే మొత్తం భక్తుల సంఖ్యే ప్రపంచంలో సగం దేశాల జనాభా కంటే కూడా ఎక్కువని తెలిసి తెగ ఆశ్చర్యపోయినట్టు జూలీ చెప్పుకొచ్చింది. ''అంతటి వేడుక ఎలా జరుగుతుందన్నది నా ఊహకు కూడా అందలేదు. అందుకే ప్రత్యక్షంగా చూసి తీరాలని వచ్చా'' అని వివరించింది.

# మాట ఇస్తే నిలబెట్టుకుంటా!

## సరైన సమయంలో సక్రమంగా పనులు: మోదీ • జమ్మూ కశ్మీర్‌లో సోనామార్గ్ సొరంగం ప్రారంభం


సోనామార్గ్ టన్నెల్‌ను ప్రారంభిస్తున్న మోదీ

**సోనామార్గ్:** ''మోదీ మాటిచ్చాడంటే తప్పడు. నెరవేర్చి తీరతాడు. అన్ని పనులనూ సరైన సమయంలో సక్రమంగా పూర్తి చేసి చూపిస్తా'' అని ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. జమ్మూకశ్మీర్‌లో వ్యూహాత్మకంగా కీలకమైన 6.5 కిలోమీటర్ల పొడవైన నూతన సొరంగాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. నిర్మాణ దశలో జెడ్-మోర్ టన్నెల్‌గా పిలిచిన ఈ సొరంగానికి సోనామార్గ్‌గా నామకరణం చేశారు. జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత మోదీ ఇక్కడికి రావడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. ''మోదీ మాటిస్తే నెరవేరుస్తాడు. కేంద్రంలో మా ప్రభుత్వం తొలిసారి కొలువుతీరాకే అత్యంత సంక్లిష్టమైన ఈ సొరంగ పనులు మొదలయ్యాయి. మేం మొదలుపెట్టిన పనులను మేమే పూర్తి చేశాం. మూడోసారి అధికారంలోకి రాగానే సొరంగం నిర్మాణం పూర్తి చేశాం. గతంలో చలికాలంలో 3 నుంచి 4 నెలలు భారీ మంచు, కొండచరియలు విరిగిపడటం, హిమపాతం వంటి ప్రతికూల వాతావరణంతో ఈ ప్రాంతం గుండా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులుండేవి. ఇప్పుడు ఏ సీజన్‌లోనైనా శ్రీనగర్, సోనామార్గ్, లేహ్ మధ్య రాకపోకలు సాగించవచ్చు. లద్దాఖ్ ప్రాంతానికి ఇకపై ఎలాంటి ప్రయాణ ఇబ్బందులు లేకుండా సాఫీగా చేరుకోవచ్చు'' అని ప్రధాని చెప్పుకొచ్చారు.

### కశ్మీర్‌లో మార్పు తెచ్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నాం

'' మా ప్రభుత్వ కృషి వల్లే కశ్మీర్ లోయలో పరిస్థితుల్లో మార్పులు వస్తున్నాయి. ఆంక్షల చట్రంలో నలిగిన శ్రీనగర్‌లోని లాల్‌చౌక్‌లో ఇప్పుడు ఎంతో మార్పులు చూస్తున్నాం. ఇప్పుడు ఐస్‌క్రీమ్ కోసం కుటుంబాలు రాత్రిపూట కూడా లాల్‌చౌక్‌కు వెళ్తున్నాయి. కళాకారులైన నా స్నేహితులు ఇక్కడి పోలో వ్యూ పాయింట్‌ను నేడు ముఖ్య వ్యాపార కూడలిగా మార్చేశారు. శ్రీనగర్‌లో జనం ఎంచక్కా కుటుంబంతో కలిసి సినిమాలకూ వెళ్లగలుగుతున్నారు. ఇంతటి పెను మార్పులు గతంలో ఏ ప్రభుత్వ హయాంలోనూ జరగలేదు. కొన్ని నెలల క్రితం శ్రీనగర్‌లో ఏకంగా అంతర్జాతీయ మారథాన్ జరిగింది. ఆరోజు మారథాన్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సైతం పాల్గొన్నారు. ఆ వీడియో వైరల్ అయింది. ఢిల్లీలో కలిసినప్పుడు ఆయన్ను మనస్ఫూర్తిగా అభినందించా'' అని అన్నారు.

### నూతన శకమిది

''ఇది జమ్మూకశ్మీర్‌కు నిజంగా నూతన శకం. జమ్మూకశ్మీర్ భారత్‌కు కిరీటం. అదెప్పుడూ మరింత అందంగా, సుసంపన్నంగా ఉండాలి. జమ్మూకశ్మీర్‌లో శాంతియుత వాతావరణం వెల్లివిరుస్తోంది. అదిప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది. కశ్మీర్ తన సొంత అభివృద్ధి అధ్యాయాన్ని లిఖించుకుంటోంది'' అని అన్నారు. టన్నెల్‌ను ప్రారంభించాక మోదీ ఓపెన్‌టాప్ వాహనంలో సొరంగంలోకి వెళ్లి పరిశీలించారు. అక్కడి నిర్మాణ కార్మికులతో మాట్లాడి వారిని అభినందించారు. టన్నెల్ నిర్మాణ సమయంలో గత ఏడాది అక్టోబర్ 20న కార్మికులపై ఉగ్రదాడి సందర్భంగా చనిపోయిన ఏడుగురికి మోదీ నివాళులర్పించారు. సున్నా డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత ను సైతం లెక్కచేయకుండా టన్నెల్ ప్రారంభోత్సవానికి సోనామార్గ్, గగన్‌గిర్, గుండ్, కంగన్ గ్రామాల నుంచి వేలాది మంది స్థానికులు రావడం విశేషం.

### దిల్, ఢిల్లీ మధ్య దూరం చెరిపే నేత

#### మోదీపై ఒమర్ పొగడ్తలు

కార్యక్రమంలో పాల్గొన్న జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా మోదీను ద్దేశించి మాట్లాడుతూ పొగడ్తల్లో ముంచెత్తారు. '' దిల్‌కు, ఢిల్లీకి మధ్య దూరాలను చెరిపేసే నేత మీరు. ఇచ్చిన వాగ్దానాలను నెరవేరుస్తున్నారు. గత 15రోజుల్లోనే మీరు పాల్గొంటున్న రెండో కార్యక్రమం ఇది. జనవరి ఆరున జమ్మూ కోసం ప్రత్యేకంగా రైల్వేడివిజన్ ఏర్పాటుచేశారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పి నాలుగు నెలల్లోనే ఆ హామీ నెరవేర్చారు. ఇక ఈ ప్రాంతానికి మళ్లీ రాష్ట్రహోదా ఇస్తామన్న హామీనీ త్వరలో నెరవేరుస్తారని బలంగా విశ్వసిస్తున్నాం. సోనామార్గ్ టన్నెల్ వంటి ప్రాజెక్టుల పూర్తితో జమ్మూకశ్మీర్‌కు ఢిల్లీకి మధ్య దూరాలు తగ్గి అనుసంధానత పెరుగుతోంది'' అని ఒమర్ అన్నారు.

### రూ.2,716 కోట్ల వ్యయంతో..

**రూ.2,716** కోట్ల వ్యయంతో సముద్రమట్టానికి 8,650 అడుగుల ఎత్తులో ఈ సొరంగాన్ని నిర్మించారు. గందేర్‌బల్ జిల్లాలో శ్రీనగర్-లేహ్ జాతీయ రహదారిపై గగన్‌గిర్, సోనామార్గ్ గ్రామాల మధ్యలో ఒకేసారి ఇరువైపుల వాహనాలు వెళ్లేలా టన్నెల్ నిర్మాణం పూర్తిచేశారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణికులు సొరంగంలో చిక్కుకుపోతే బయట పడేందుకు వీలుగా సొరంగానికి సమాంతరంగా 7.5 మీటర్ల వెడల్పుల్లో ఎమర్జెన్సీ ఎగ్జిట్ ద్వారాలను నిర్మించారు. టన్నెల్ ప్రారంభ కార్యక్రమంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, సీఎం ఒమర్, జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా సైతం పాల్గొన్నారు.

## సరిహద్దుల్లో ఇంకా ప్రతిష్టంభనే: ఆర్మీ చీఫ్

**న్యూఢిల్లీ:** భారత్, చైనా సైన్యాల మధ్య తూర్పు లద్దాఖ్‌లోని వాస్తవాధీన రేఖ(ఎల్‌ఏసీ) వెంబడి ఇప్పటికీ కొంత ప్రతిష్టంభన కొనసాగుతూనే ఉందని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీ వెల్లడించారు. తూర్పు లద్దాఖ్ ప్రాంతం సున్నితంగా, స్థిరంగా ఉందని తెలిపారు. గస్తీ, పశువుల మేత తదితర చిన్న విభేదాలను పరిష్కరించే అధికారాలను కోర్ కమాండర్‌లకు తాజాగా అప్పగించినందున ఇవి తర్వాత్తర్వాత పెద్ద సమస్యలుగా మారే అవకాశాలు లేవని తెలిపారు. ఆర్మీ చీఫ్ సోమవారం మీడియాతో మాట్లాడారు. రెండు దేశాల సైన్యం మధ్య ఘర్షణాత్మక వాతావరణాన్ని నివారించేందుకు ప్రస్తుతానికి కొన్ని ప్రాంతాల్లో తాత్కాలికంగా గస్తీని నిలిపివేసినందుకు బఫర్ జోన్‌ల వంటివి ఏర్పాటు చేయలేదని ఆయన వివరించారు.

### బంగ్లా హైకమిషనర్‌కు సమన్లు

**న్యూఢిల్లీ:** సరిహద్దుల వెంట ఫెన్సింగ్ ఏర్పాటుపై అభ్యంతరం తెలుపుతూ భారత హైకమిషనర్ ప్రణయ్ వర్మకు బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ సమన్లు ఇవ్వడం తెలిసిందే. దాంతో ఈ విషయమై ఢిల్లీలోని బంగ్లాదేశ్ తాత్కాలిక హైకమిషనర్‌కు నూరుల్ ఇస్లాంకు భారత్ సోమవారం సమన్లు జారీ చేసింది. విదేశాంగ శాఖ కార్యాలయానికి పిలిపించింది. రెండు దేశాల ఒప్పందాలు, ప్రొటోకాల్స్ మేరకే ఫెన్సింగ్ నిర్మాణం చేపట్టినట్లు వివరించింది. వాటిమేరకు బంగ్లాదేశ్ పూర్తిగా సహకరిస్తుందని ఆశిస్తున్నట్టు తెలిపింది.

# మళ్లీ విజృంభించనున్న కార్చిచ్చు

## మంటలను మరింతగా ఎగదోస్తున్న పెనుగాలులు

• 24కు పెరిగిన మృతుల సంఖ్య


లాస్ ఏంజెలెస్‌లో రెస్టారెంట్లు, కాఫీ షాప్‌లు, వ్యాపార సముదాయాలతో కళకళలాడిన భవనం నేడిలా బుగ్గిపాలైంది

**లాస్ ఏంజెలెస్:** అమెరికాలోని లాస్ ఏంజెలెస్ అటవీ ప్రాంతాలను బూడిదచేస్తున్న కార్చిచ్చు మళ్లీ కన్నెర్రజేయనుందని వాతావరణ శాఖ తాజాగా హెచ్చరించింది. పసిఫిక్ పాలిసేడ్స్ ప్రాంతంలోని దావాగ్నిని ఇప్పటిదాకా కేవలం 14 శాతం మాత్రమే అదుపులోకి తెచ్చిన నేపథ్యంలో వాతావరణ విభాగ నివేదికలు స్థానికుల్లో భయాందోళనలను మరింత పెంచాయి. గంటకు 110 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయని, దీంతో అడవిలో కార్చిచ్చు మరింత విస్తరించే ప్రమాదముందని అమెరికా నేషనల్ వెదర్ సర్వీస్ సోమవారం ప్రకటించింది. మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు వీయనున్న శాంటా అనా పెనుగాలులతో ప్రమాదం పొంచి ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. బుధవారం సాయంత్రం దాకా 'రెడ్ ఫ్లాగ్' వార్నింగ్ అమల్లో ఉంటుంది. మరోవైపు అటవీప్రాంతాల్లో అగ్నికీలల సంబంధ అగ్నిప్రమాద ఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య తాజాగా 24కు పెరిగింది. ఇంకా డజన్ల మంది జాడ తెలియాల్సిఉంది. మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్ ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పటికే ఒక్క లాస్ ఏంజెలెస్ సిటీ, కౌంటీ పరిధుల్లో లక్ష మందిని సురక్షిత ప్రాంతాలకువెళ్లాలని సూచించగా, మిగతా చోట్ల కలిపి మరో 87,000 మందికి సురక్షిత స్థలాలకు వెళ్లాలని స్థానికయంత్రాంగం హెచ్చరికలుచేసింది. ఆరు చోట్ల కార్చిచ్చు వ్యాపించగా పసిఫిక్ పాలిసేడ్స్, ఏటోన్ ప్రాంతాల్లోని దావాగ్ని మాత్రమే ఇంకా అత్యంత ప్రమాదకరస్థాయిలో కొనసాగుతు న్నాయి. ఫ్రాన్స్ రాజధాని పారిస్ నగరంలో 60 శాతం విస్తీర్ణానికి సమానమైన అటవీభూములను పాలిసేడ్స్, ఏటోన్, హర్స్ట్ కార్చిచ్చులు బూడిదకుప్పలుగా మార్చేశాయి. మొత్తంగా అన్ని కార్చిచ్చుల కారణంగా 40,000కుపైగా ఎకరాల్లో అటవీప్రాంతం పూర్తిగా కాలిపోయింది. 12,000కు పైగా ఇళ్లు, దుకాణాలు, పాఠశాలలు తగలబడ్డాయి. అయితే దుప్పటిలా కమ్మేసిన పొగ, దుమ్ము చాలా వరకు తగ్గడంతో కొన్ని ప్రాంతాల్లో పాఠశాలలు తెరిచారు.

### బాణాసంచా వల్లే: వాషింగ్టన్ పోస్ట్

నూతన సంవత్సర వేడుకల్లో జనం కాల్చిన బాణాసంచా కారణంగానే పసిఫిక్ పాలిసేడ్స్‌లో అగ్గిరాజుకుందని వాషింగ్టన్ పోస్ట్ వార్తాసంస్థ ఒక కథనంలో పేర్కొంది. రేడియో సంప్రదింపులు, ఆ ప్రాంతంలో బాణాసంచా కాల్చడానికి ముందు, ఆ తర్వాత తీసిన ఉపగ్రహ ఛాయా చిత్రాలు, స్థానికుల ఇంటర్వ్యూలతో ఈ విషయాన్ని నిర్ధారించుకున్నట్లు తన కథనంలో పేర్కొంది. పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చిన ప్రదేశంలో అగ్గిరవ్వలు అడవిలో పడి దావాగ్ని మొదలైందని, అయితే వెంటనే దానిని ఆర్పేశారు. కానీ దావాగ్ని తాలూకు నిప్పుకణికలు కొన్ని అలాగే ఉండిపోయి భీకరగాలుల సాయంతో నెమ్మదిగా మళ్లీ దావాగ్నికి ఆజ్యంపోశాయని వాషింగ్టన్ పోస్ట్ తెలిపింది. గత మంగళవారం తొలుత పసిఫిక్ పాలిసేడ్స్‌లో మంటలు అంటుకున్నప్పుడు స్థానికులు ఫిర్యాదుచేసినా అగ్నిమాపక సిబ్బంది ఆలస్యంగా రావడంతో మంటలు అదుపుతప్పి చివరకు లాస్ ఏంజెలెస్ చరిత్రలోనే మరో అతిపెద్ద దావాగ్నిలా ఎదిగాయని ఆరోపణలున్నాయి. ''ఆరోజు మేం వెంటనే ఫోన్లుచేశాం. కానీ లాస్‌ఏంజెలెస్ ఫైర్ డిపార్ట్‌మెంట్(ఎల్‌ఏఎఫ్‌డీ) నుంచి స్పందన రాలేదు. 45 నిమిషాలతర్వాత ఒక హెలికాప్టర్ వచ్చి నీళ్లు పోసి వెళ్లిపోయింది. మంటలు మాత్రం ఆరలేదు'' అని స్థానికులు మైఖేల్ వాలంటైన్ దంపతులు చెప్పారు.

### ప్రైవేట్ నీటిట్యాంక్‌లకు గిరాకీ

**తమ** ప్రాంతంలో చెలరేగుతున్న మంటల నుంచి తమ ఇళ్లను కాపాడుకునేందుకు స్థానికులు ఆపసోపాలు పడుతున్నారు. దీంతో ప్రైవేట్ నీటిట్యాంక్‌లకు గిరాకీ అమాంతం పెరిగింది. ఇదే అదనుగా ప్రైవేట్ వాటర్‌ట్యాంక్ సంస్థలుచార్జీలు మోతమోగిస్తున్నాయి. లాస్ ఏంజెలెస్‌లోని సంపన్నులు ప్రభుత్వ అగ్నిమాపక సిబ్బంది వచ్చేదాకా ఆగకుండా ప్రైవేట్ ఫైర్‌ఫైటర్‌లను రప్పిస్తున్నారు. అయితే ఆ సేవలందించే సంస్థలు గంటకు 2,000 డాలర్లు అంటే రూ.1,73,000 చార్జ్ చేస్తున్నాయి. రియల్ ఎస్టేట్ దిగ్గజాలు రిక్ కరుసో, కీత్ వాసర్‌మ్యాన్ సహా చాలా మంది ఇదే బాటపట్టారు. '' నా ఫోన్ ఆగకుండా మోగుతూనే ఉంది. సంస్థ మొదలైననాటి నుంచి హాలీవుడ్‌లో ఇంతస్థాయి డిమాండ్ ఎప్పుడూ లేదు'' అని కవర్ట్6 ఫైర్‌ఫైటింగ్ సేవల సంస్థ యజమాని క్రిస్ డన్ చెప్పారు. '' నగరపాలకులను నమ్మలేమని ఈవారం ఘటనతో తేలిపోయింది. నా దగ్గర డబ్బుంది. అయితేమాత్రం ఏం లాభం. ఇళ్లు తగలబడ్డాయి'' అని ఒక హాలీవుడ్ ప్రముఖుడు వాపోయాడు.

## సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ కె.వినోద్ చంద్ర

**న్యూఢిల్లీ:** పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె.వినోద్ చంద్రకు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి లభించింది. ఈ నెల 7న జస్టిస్ వినోద్ చంద్రను సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. జస్టిస్ వినోద్ చంద్ర సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులైనట్లు సోమవారం కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రాం మేఘ్వాల్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 2011 నవంబర్ 8న కేరళ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన జస్టిస్ వినోద్ చంద్రకు 2023 మార్చి 29న పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతిని అందుకున్నారు. సుప్రీంకోర్టుకు మంజూరైన జడ్జీ పోస్టులు 34 కాగా, తాజాగా జస్టిస్ వినోద్ చంద్ర చేరికతో 33కు చేరుకోనుంది.

## యూజీసీ నెట్ వాయిదా

**న్యూఢిల్లీ:** మకర సంక్రాంతి, పొంగల్ పండుగలను దృష్టిలో ఉంచుకుని జనవరి 15వ తేదీన జరగాల్సిన యూజీసీ-నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్)ను వాయిదా వేస్తున్నట్లు ఎన్‌టీఏ ఎగ్జామ్స్ డైరెక్టర్ రాజేశ్ కుమార్ సోమవారం తెలిపారు. జనవరి 16వ తేదీన జరగాల్సిన పరీక్షను యథా ప్రకారం నిర్వహించనున్నామన్నారు. జనవరి 3వ తేదీ మొదలైన ఈ కంప్యూటర్ ఆధారిత పరీక్షలు జనవరి 16వ తేదీ వరకు జరగాల్సి ఉందని రాజేశ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# సాక్షి హైదరాబాద్

మంగళవారం । 14 । జనవరి । 2025






కైట్ ఫెస్టివల్ ప్రారంభోత్సవానికి హాజరైన ప్రజలు

**గరిష్టం/కనిష్టం 28.0/18.0**

**వాతావరణం**

నగరంలో మంగళవారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉదయం వేళల్లో పొగ మంచు వాతావరణం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. రాత్రి వేళ చలితీవ్రత పెరుగుతుంది.





## 'భోగి'భాగ్యం

నగరమంతటా సంక్రాంతి శోభ వెల్లివిరుస్తోంది. మూడురోజుల పండుగలో భాగంగా సోమవారం తెల్లవారుజామున వాడవాడలా భోగి మంటలు వేసి సంబరాలు జరుపుకొన్నారు. కూకట్‌పల్లిలోని మలేషియా టౌన్‌షిప్‌లో భోగి మంటలు వేసిన దృశ్యం.

## రంగ్.. పతంగ్







సంక్రాంతి వేళ..నగరం పతంగుల పండుగకు ఆతిథ్యం ఇస్తోంది. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం నుంచి ఇంటర్నేషనల్ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ ప్రారంభమైంది. దేశ విదేశాలకు చెందిన ఔత్సాహికులు..స్థానికులు పాల్గొని రంగు రంగుల..వైవిధ్యభరితమైన పతంగులను ఎగురవేసి సందడి చేశారు. పర్యాటక రంగాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడమే లక్ష్యంగా ఈ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు. ఈ ఫెస్టివల్ ఈ నెల 15 వరకు కొనసాగనుంది. – సాక్షి, సిటీబ్యూరో

## సిటీ గజగజ

### తగ్గిన గరిష్ట ఉష్ణోగ్రత

- పగటి పూట 27.2 డిగ్రీలు నమోదు

**సాక్షి, సిటీబ్యూరో:** హైదరాబాద్ మహానగరంతో పాటు శివారు ప్రాంతాలను చలి వణికిస్తోంది. పగటి ఉష్ణోగ్రత సాధారణం కంటే తక్కువగా నమోదవుతుండగా, కనిష్ట ఉష్ణోగ్రత 15 డిగ్రీలకు పడిపోయింది. చలికి తోడు పొగమంచు కూడా దట్టంగా వ్యాపిస్తోంది. దీంతో ఉదయం వేళల్లో ప్రయాణాలు సాగించే వారికి రోడ్డు కనిపించక తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. సోమవారం నగరంలో గరిష్ట ఉష్ణోగ్రత 27.2 డిగ్రీలు నమోదైంది. ఇది సాధారణం కంటే 2.3 డిగ్రీలు తక్కువ. రాబోయే మూడు రోజులు రాత్రి పూట ఉష్ణోగ్రత మరింత తగ్గుముఖం పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. చలి కారణంగా వృద్ధులు, చిన్నారులు, రాత్రి వేళ ఉద్యోగాలు, పనులు చేసేవారు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

## నేడు సాలార్జంగ్ మ్యూజియం బంద్

**చార్మినార్:** సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఈనెల 14న మంగళవారం సాలార్జంగ్ మ్యూజియం మూసి ఉంటుందని సంబంధిత అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులు గమనించాలని సూచించారు.

## నుమాయిష్‌కు పోటెత్తిన జనం

**అబిడ్స్:** ఎగ్జిబిషన్‌కు సందర్శకులు పోటెత్తారు. సోమవారం భోగి వేడుకలు..సెలవు దినం కావడంతో పెద్దఎత్తున సందర్శకులు తరలివచ్చారు. దాదాపు 60 వేల మంది సందర్శకులు వచ్చారని ఎగ్జిబిషన్ నిర్వాహకులు తెలిపారు. ఎగ్జిబిషన్‌లోని స్టాల్స్ అన్ని సందర్శకులతో నిండిపోయాయి. సెలవు దినం కారణంగా మధ్యాహ్నం నుంచే మహిళలు, పెద్దలు, చిన్నారులు పెద్ద ఎత్తున ఎగ్జిబిషన్‌కు తరలివచ్చారు. అజంతా గేట్, గాంధీభవన్, గోషామహల్ గేట్ల వద్ద సందర్శకులు కిక్కిరిసి పోయారు. అబిడ్స్ ఏసీపీ చంద్రశేఖర్, బేగంబజార్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. ఈ నెల 3వ తేదీన ప్రారంభమైన ఎగ్జిబిషన్‌ను సోమవారం నాటికి దాదాపు 3 లక్షల మంది సందర్శించినట్లు అంచనా.

# పండగపూట చీకట్లే!

### గ్రేటర్‌లో వెలగని వీధిదీపాలు

- జీహెచ్‌ఎంసీ–ఈఈఎస్ఎల్ మధ్య 'స్ట్రీట్' ఫైట్
- పరస్పర ఆరోపణలతో పనులకు ఆటంకం
- ఈ చీకట్లు తొలగేదెన్నడని ప్రశ్నిస్తున్న ప్రజలు



**సాక్షి, సిటీబ్యూరో:**

- గ్రేటర్ పరిధిలోని ఒక విభాగానికి కొంతకాలం ఉన్నతాధికారిగా వ్యవహరించి, ప్రస్తుతం ఒక ప్రత్యేక కమిషన్‌కు చైర్మన్‌గా వ్యవహరిస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఒక స్ట్రీట్‌లైట్ కోసం జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులను సంప్రదించాల్సి వచ్చింది.
- జీహెచ్‌ఎంసీలోనే పనిచేస్తున్న మరో అధికారి తమ ప్రాంతంలో స్ట్రీట్ లైట్స్ కోసం సంబంధిత విద్యుత్ విభాగానికి చెప్పుకున్నా సమస్య పరిష్కారం కాలేదు.
- ఎంతోకాలంగా స్ట్రీట్‌లైట్స్ వెలగకపోవడంతో తమ పరిధిలో ప్రజల నుంచి తిట్లు తినాల్సి వస్తోందంటూ కొందరు కార్పొరేటర్లు ఇటీవల జీహెచ్‌ఎంసీ కమిషనర్ చాంబర్ ముందు ఆందోళన నిర్వహించారు.
- జీహెచ్‌ఎంసీ పాలకమండలి సమావేశం జరిగినప్పుడల్లా స్ట్రీట్‌లైట్స్ సమస్యపై సభ్యులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు.

...నగరంలో వీధి దీపాల సమస్యలకు నిదర్శనాలీ ఘటనలు.

గ్రేటర్ నగరంలో పలు ప్రాంతాల్లో ఎంతోకాలంగా వీధిదీపాలు (స్ట్రీట్ లైట్స్) వెలగడం లేదు. అదుగో పనులు చేస్తున్నాం..ఇదుగో కొత్త వెలుగులొస్తున్నాయని అధికారుల హామీలు తప్ప ఆచరణలో కనిపించడం లేదు. నగరంలో వీధిదీపాల సమస్యలు పరిష్కరిస్తున్నామని, కొత్త సంవత్సరానికల్లా కొత్త వెలుగులతో నగరంలో చీకట్లు తొలగిపోతాయని అధికారులు పేర్కొన్నప్పటికీ చీకట్ల పరిస్థితులు మారలేదు. కొత్త సంవత్సరమే కాదు..ఏకంగా సంక్రాంతి పండుగ వచ్చినా, నగరంలో వీధి దీపాల కాంతులు మాత్రం రాలేదు.

**ఏమిటీ స్ట్రీట్ ఫై(లై)ట్ ?**

జీహెచ్‌ఎంసీ పరిధిలో స్ట్రీట్‌లైట్స్ నిర్వహణ పనులు చేస్తున్న ఈఈఎస్ఎల్(ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్)కు జీహెచ్‌ఎంసీకి మధ్య నెలకొన్న వివాదం ప్రజలకు శాపంగా మారింది. తమకు సక్రమంగా జీహెచ్‌ఎంసీ చెల్లింపులు చేయనందున పనులు చేయడం లేదని ఈఈఎస్ఎల్ అంటోంది. ఈఈఎస్ఎల్ ఒప్పందానికనుగుణంగా పనులు సవ్యంగా చేయకపోయినా ఎంతో కాలం చెల్లింపులు చేశామని, సక్రమంగా పనులు చేయనందునే చెల్లింపులు తాత్కాలికంగా నిలిపినట్లు జీహెచ్‌ఎంసీ వర్గాల సమాచారం. రెండింటి మధ్య దాదాపు రూ.70 కోట్లకు సంబంధించిన వివాదం ముదిరింది. నిర్వహణ పనులు చేయాల్సిన ఈఈఎస్ఎల్ పనులు చేయడం లేదు. ఈఈఎస్ఎల్ థర్డ్ పార్టీగా నియమించుకున్న ఏజెన్సీలకు చెల్లింపులు చేయడం లేదు. ఏజెన్సీలు తమకు వేతనాలివ్వనందున తాము పనులు చేయలేమని కార్మికులు గత మూడునెలలుగా పనుల నిరాకరణ చేస్తున్నారు. వాయిదా చెల్లింపులు జరిగిన కొద్దిరోజులు మాత్రం మూడు రోజులు పనిచేస్తే నాలుగు రోజులు మానేస్తున్నారు. తర్వాత మొత్తానికే మానేస్తున్నారు. దీంతో పనులు జరగక ఎక్కడి చీకట్లు అక్కడే ఉన్నాయి

**ఇదీ ఒప్పందం**

- గ్రేటర్ నగరంలో ఎల్ఈడీ స్ట్రీట్‌లైట్స్ ఏర్పాటు, నిర్వహణ పనులకు ఈఈఎస్ఎల్ 2018లో జీహెచ్‌ఎంసీతో ఒప్పందం కుదుర్చుకుంది. ఆమేరకు..2018 మే నుంచి 2025 ఏప్రిల్ వరకు నగరంలో వెలుగుల నిర్వహణ ఈఈఎస్ఎల్‌దే. రహదారులతోపాటు లింక్‌రోడ్లు, ఫ్లైఓవర్లు, పార్కులు, చెరువులు, శ్మశానవాటికలు, తదితర ప్రాంతాల్లోనూ లైట్ల ఏర్పాటు, నిర్వహణ ఈఈఎస్ఎల్‌దే. ఎల్ఈడీ లైట్ల వల్ల జీహెచ్‌ఎంసీకి ఏడేళ్లలో దాదాపు రూ.673 కోట్లు ఆదా అవుతుందని అప్పట్లో పేర్కొన్నారు. దాంతో మిగిలే నిధులే ఈఈఎస్ఎల్‌కు చెల్లిస్తామని జీహెచ్‌ఎంసీ రూ.563.58 కోట్లకు ఒప్పందం కుదుర్చుకుంది. ఇప్పటికే మెజార్టీ చెల్లింపులు జరిగినట్లు సమాచారం. అయినా తమకు జీహెచ్‌ఎంసీ భారీ మొత్తం బకాయిలున్నట్లు ఈఈఎస్ఎల్ చెబుతోంది.
- ఒప్పందం మేరకు వెలగాల్సిన వీధిదీపాలు 5,40,494. కానీ ఈ మేర వెలగడం లేదు. ఈ లైట్లలో 98 శాతం వెలిగితేనే చెల్లింపులు చేయాలి. కానీ, ఈ నిబంధన గురించి గతంలోని అధికారులు పట్టించుకోకుండా 80 శాతం వెలగని రోజుల్లో కూడా చెల్లింపులు చేశారనే ఆరోపణలున్నాయి. అంతేకాదు..జీహెచ్‌ఎంసీలోని ఓ అధికారి ఈఈఎస్ఎల్‌తో కుమ్మక్కై లైట్లు వెలగకపోయినా చెల్లింపులు జరిపారని, వెలగని కాలానికి విధించాల్సిన పెనాల్టీలు మొక్కుబడిగా మాత్రమే విధించారనే ఆరోపణలూ ఉన్నాయి. అలా జీహెచ్‌ఎంసీకి నష్టం కలిగించిన వారున్నా, పట్టింపులేని జీహెచ్‌ఎంసీలో ఆ విషయాలు వెలుగుచూడలేదనే ఆరోపణలున్నాయి.
- స్ట్రీట్‌లైట్స్ ఆటోమేటిక్‌గానే వెలిగేందుకు, ఆరిపోయేందుకు 30,239 ఎస్ఎంఎస్‌లు (స్విచింగ్ పాయింట్లు) ఉండాల్సి ఉండగా లేవు.
- 2017లో ఏడాదికి జీహెచ్‌ఎంసీకి విద్యుత్ బిల్లుల ఖర్చు రూ.137 కోట్లు. ఎల్ఈడీల వల్ల 2019 నాటికి అది రూ. 94 కోట్లకు తగ్గాలి. కానీ 2022–23లో సైతం రూ.106 కోట్లకు పైగా చెల్లించారు.

**డేంజర్ ప్రాంతాల్లోనూ అంతే..**

కొత్తగా ఏర్పాటైన కాలనీలు, కమ్యూనిటీల్లో రాత్రివేళ ప్రమాదాలు, చోరీలకు ఆస్కారాలున్నట్లు పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులు గుర్తించారు. ఈమేరకు ఆయా ప్రాంతాల్లో కొత్తగా స్ట్రీట్‌లైట్స్ వేసేందుకు దాదాపు రూ.3 కోట్ల మేర ఉపకరణాలు, బల్బుల కొనుగోలు టెండర్లు పూర్తిచేశారు. సామాగ్రి వస్తున్నా పనులు చేసే వారు లేకపోవడంతో కొత్త ప్రాంతాల్లోనూ లైట్లు వేయడం లేదు. కొన్ని ప్రాంతాల్లో పోల్స్ పాతి ఎన్నో రోజులవుతున్నప్పటికీ, బల్బులు వేసే పరిస్థితి లేక పోల్స్ అలంకారప్రాయంగా మారాయి.

# చైనీస్ మాంజా విక్రయాలకు చెక్

### నాలుగు నెలల ముందే టాస్క్‌ఫోర్స్ పోలీసుల నిఘా



వివరాలు వెల్లడిస్తున్న అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు

- నగర వ్యాప్తంగా 148 మందిపై 107 కేసులు
- రూ.90 లక్షల చైనీస్ మాంజా స్వాధీనం

**చాంద్రాయణగుట్ట:** ప్రమాదాలకు కారణమవుతున్న నిషేధిత చైనీస్ మాంజా విక్రయాలు జరగకుండా ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకున్నామని నగర టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు తెలిపారు. పురానీహవేలీలోని తన కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..గతేడాది లంగర్ హౌజ్‌లో చైనీస్ మాంజాతో ఆర్మీ జవాన్ మృతి చెందడం, ఎన్నో పక్షులు కూడా ప్రమాదాలకు గురవడాన్ని దృష్టిలో పెట్టుకుని అక్టోబర్ 1వ తేదీ నుంచి పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశానుసారం టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర పర్యవేక్షణలో నగర వ్యాప్తంగా ఏడు ప్రత్యేక టీమ్‌లతో మాంజా విక్రయాలపై దృష్టి సారించామన్నారు. ఈ క్రమంలో ఇప్పటి వరకు 107 కేసులు నమోదు చేసి 148 మంది వ్యాపారులను పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి దాదాపు రూ.90 లక్షల విలువైన 7335 మాంజా చెరక్(ఉండ)లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇందులో సౌత్ జోన్‌లో 15 కేసులు, సౌత్ ఈస్ట్ జోన్-17, ఈస్ట్ జోన్-19, సౌత్ వెస్ట్ జోన్-32, ఈస్ట్ జోన్-19, నార్త్ జోన్-14, సెంట్రల్ జోన్-04, వెస్ట్ జోన్-06 కేసుల చొప్పున నమోదయ్యాయన్నారు. పర్యావరణానికి కూడా హాని చేకూర్చే ఈ మాంజాను ఎవ్వరూ వాడకూడదని హెచ్చరించారు. ఎవరైనా దాచి పెట్టి విక్రయాలు చేపడుతున్నట్లు సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్లు ఎస్.రాఘవేంద్ర, సైదబాబు పాల్గొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న చైనీస్ మాంజా

## తప్పిన మాంజా పంజా!

- సీనియర్ ఐపీఎస్ రమేష్‌కు ఎదురైన అనుభవం
- తృటిలో ప్రమాదం తప్పిందంటూ 'ఎక్స్'లో పోస్టు



**సాక్షి, సిటీబ్యూరో:** సీనియర్ ఐపీఎస్ అధికారి మస్తీపురం రమేష్ మాంజా పంజా నుంచి తృటిలో తప్పించుకున్నారు. ఈ విషయాన్ని తన 'ఎక్స్' ఖాతా ద్వారా వెల్లడించారు. 'శనివారం ఉదయం మార్నింగ్ వాక్ చేస్తున్నా. ఓ చెట్టుకు వేలాడుతున్న మాంజా, పతంగ్ హఠాత్తుగా కంటికి కనిపించడంతో అప్రమత్తమయ్యా. లేదంటే అది నా మెడకు, ఆపై కాళ్లకు చుట్టుకుని హాని చేసేదే' అంటూ పోస్టు చేశారు. సంక్రాంతి నేపథ్యంలో పతంగులు సందడి ఎక్కువగా ఉంటుందని, వీటిని ఎగురవేసే వాళ్లు చిరిగిన వాటితో పాటు తెగిన దారం, మాంజా పారవేసే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని రమేష్ సూచించారు. నిర్లక్ష్యం చేస్తే అది ఎదుటి వారికి ముప్పుగా పరిణమిస్తుందనే విషయం గుర్తించుకోవాలని హితవు పలికారు. ప్రస్తుతం రమేష్ డీజీపీ కార్యాలయంలో ప్రొవిజనింగ్ అండ్ లాజిస్టిక్స్ విభాగానికి నేతృత్వం వహిస్తున్నారు.



చిక్కుకున్న మాంజా

# ఈ గాలి పీలిస్తే డేంజరే..!



- పడిపోయిన ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్
- రాత్రి 10 గంటల వరకు శబ్ద కాలుష్యంతో ఇబ్బందులు

### గ్రేటర్‌లో నాలుగేళ్ల గరిష్టానికి వాయు కాలుష్యం

**సాక్షి, సిటీబ్యూరో:** నగరంలో అంబరాన్నంటిన కొత్త సంవత్సరం వేడుకలు, సంక్రాంతి పండగకు స్వగ్రామాలకు ప్రయాణమైన లక్షలాది వాహనాలు వెరసి వాయు కాలుష్యంపై తీవ్రప్రభావాన్ని చూపిస్తున్నాయి. పండగకు వరుస సెలవులు తోడవడంతో హైదరాబాద్ నుంచి సుమారు 30 శాతం మంది ప్రజలు తమ సొంత గ్రామాలకు బయలుదేరారు. దీంతో నగరంలో నడిచే వాహనాల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని అంతా భావించారు. స్వచ్ఛమైన గాలి దొరుకుతుందని ఊహించారు. అయితే అవన్నీ ఊహలేనని చెబుతూ వాయు నాణ్యత ఇండెక్స్ డేంజర్ బెల్స్ మోగిస్తోంది. ఈ ఏడాది జనవరి 1న ఏక్యూఐ (ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్) 151గా నమోదు కాగా, 11న మరోమారు 150ని తాకింది. వార్షిక సరాసరి 136గా నమోదైంది. 2021లో వార్షిక ఏక్యూఐ 149గా నమోదు అయ్యింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనల ప్రకారం ఏక్యూఐ 50 లోపు ఉంటే స్వచ్ఛమైన గాలి ఉన్నట్లు లెక్క. 100 వరకు మోస్తరుగా ఉన్నట్లు. 100– 150 కి చేరితే మాత్రం నాణ్యత లోపించిందని లెక్క. ప్రస్తుతం నగరంలో గాలి నాణ్యత 122 నుంచి 151 మధ్య నమోదవుతోంది. ఏటా డిసెంబరు, జనవరి నెలల్లోనే గాలి నాణ్యత ఇలా తగ్గుముఖం పడుతోంది. గత ఏడాది జులైలో 53గా గాలి నాణ్యత ఉండగా, ఆరు నెలల్లోనే సుమారుగా రెండున్నర రెట్లు క్షీణించింది. ఈ వాయువులు పీలిస్తే ఆరోగ్యం చెడిపోతుందని, ముఖ్యంగా శ్వాసకోశ వ్యాధులు, ఊపిరితిత్తుల సమస్యలు వస్తాయని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు తగిన జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు.

**గత కొన్నేళ్లుగా జనవరిలో నమోదైన వాయు నాణ్యత సూచీ ఇలా..**

| సంవత్సరం | ఏక్యూఐ |
|---|---|
| 2020 | 145 |
| 2021 | 149 |
| 2022 | 132 |
| 2023 | 117 |
| 2024 | 121 |
| 2025 | 136 |

**మోత మోగిపోతోంది..**

నగరంలో వాయు కాలుష్యానికి తోడు శబ్ద కాలుష్యం కూడా మోత మోగిస్తోంది. ఉదయం నుంచే సాధారణానికి మించి శబ్దాలు నమోదవుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనల ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో శబ్ద కాలుష్యం 55 డెసిబెల్స్ కంటే తక్కువ ఉండాలి. హైదరాబాద్ నగరంలో సుమారుగా 80 డెసిబెల్స్ వరకు ఉంటుంది. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పరిమితికి మించి శబ్ద కాలుష్యం నమోదవుతోంది. రాత్రి పూట ప్రధాన రహదారులపై ప్రైవేటు వాహనాలు పెద్ద శబ్దాలతో హారన్‌లు మోగిస్తున్నాయి.

# కేరళలో చోరీ..సికింద్రాబాద్‌లో షెల్టర్!

### తిరునల్వేలిలో జ్యువెలరీ దుకాణాన్ని దోచేసిన రామకృష్ణన్

- గత ఏడాది ఆగస్టులో చోటు చేసుకున్న ఈ భారీ దొంగతనం
- సొత్తు తల్లికి ఇచ్చి నగరానికి వచ్చి ప్రైవేట్ ఉద్యోగిగా మకాం
- సాంకేతిక ఆధారాలతో నిందితుడిని పట్టుకున్న అక్కడి కాప్స్
- అతడి ఇంటి నుంచి సొత్తు సీజ్, అవమానంతో తల్లి ఆత్మహత్య



**సాక్షి, సిటీబ్యూరో:** కేరళలోని తిరునల్వేలి జిల్లా మూలక్‌రాయ్‌పట్టిలో ఉన్న జ్యువెలరీ దుకాణంలో రెండు కేజీలకు పైగా బంగారు ఆభరణాలు చోరీ చేసి, నాలుగున్నర నెలలుగా పరారీలో ఉన్న రామకృష్ణన్‌ను అక్కడి పోలీసులు శనివారం సికింద్రాబాద్‌లో అరెస్టు చేశారు. విచారణలో భాగంగా ఆ సొత్తును తాను తల్లి మీనాక్షి వద్దే ఉంచానని చెప్పాడు. దీంతో ప్రత్యేక బృందం తిరునల్వేలి సమీపంలోని రెట్టార్కులం గ్రామంలోని వారి ఇంటిపై దాడి చేసి సొత్తు స్వాధీనం చేసుకున్నారు. ఈ అవమానాన్ని తట్టుకోలేక మీనాక్షి ఆదివారం ఉదయం ఆత్మహత్య చేసుకుంది.

**అక్కడ చోరీ చేసి సిటీకి వచ్చి...**

మూలక్‌రాయ్‌పట్టికి చెందిన వి.రెహ్మాన్ అక్కడే కొన్నేళ్లుగా జ్యువెలరీ దుకాణం నిర్వహిస్తున్నారు. ఆ సమీపంలోని రెట్టార్కులం గ్రామానికి చెందిన రామకృష్ణన్ ప్రైవేట్ ఉద్యోగి. జల్సాలకు అలవాటు పడిన ఇతగాడు కొన్నేళ్లుగా తిరునల్వేలి చుట్టుపక్కల ప్రాంతాల్లో చిన్న చిన్న దొంగతనాలు చేస్తున్నాడు. ఇప్పటి వరకు పట్టుబడకపోవడంతో పోలీసు రికార్డుల్లోకి ఎక్కలేదు. గత ఏడాది ఆగస్టులో ఇతడి కన్ను రెహ్మాన్ నిర్వహిస్తున్న జ్యువెలరీ దుకాణంపై పడింది. ఆ నెల 22 రాత్రి షెల్టర్ పగులకొట్టి లోపలకు ప్రవేశించిన రామకృష్ణన్ 2.22 కేజీల బంగారం, రూ.3 లక్షల నగదు తస్కరించాడు. ఆ సొత్తును బయటకు తీయకుండా దాచి ఉంచి, కొన్నాళ్లు తన స్వస్థలానికి దూరంగా ఉంటే పోలీసులకు చిక్కనని భావించాడు.

**స్నేహితుడిది అంటూ తల్లికి ఇచ్చి...**

మర్నాడు దుకాణం తెరిచిన వెంటనే కనిపించిన సీన్‌తో తన దుకాణంలో జరిగిన చోరీ విషయం రెహ్మాన్ గుర్తించాడు. దీనిపై మూలక్‌రాయ్‌పట్టి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. దర్యాప్తు కోసం తిరునల్వేలి ఎస్పీ నేతృత్వంలో తొమ్మిది ప్రత్యేక బృందాలు ఏర్పడ్డాయి. గుర్తించిన జ్యువెలరీ దుకాణం నుంచి తస్కరించిన నగదు తన వద్ద ఉంచుకున్న రామకృష్ణన్ బంగారం మాత్రం నేర్పుగా ప్యాక్ చేశాడు. రెట్టార్కులంలోని తల్లికి దీన్ని ఇచ్చి ఇంట్లో ఉంచాలని సూచించాడు. దుబాయ్ వెళ్తున్న తన స్నేహితుడు కొన్ని విలువైన వస్తువులు ప్యాక్ చేసి, భద్రపరచాలని ఇచ్చాడంటూ ఆమెను నమ్మించాడు. నగదుతో గత ఏడాది ఆగస్టు 23న కేరళ నుంచి హైదరాబాద్ చేరుకున్నాడు. హోటళ్లలో బస, ఖరీదైన మద్యం, ఆహారం, జల్సాలతో మూడు నెలల్లోనే రూ.3 లక్షలు ఖర్చు చేసేశాడు.

**నిర్మాణం వద్ద కాపలాదారుడిగా పని...**

దీంతో సికింద్రాబాద్‌లోని ఓ నిర్మాణం వద్ద కాపలాదారుడిగా ప్రైవేట్ ఉద్యోగంలో చేరాడు. కనీసం ఏడాది పాటు ఇక్కడ తలదాచుకుని ఆపై స్వస్థలానికి వెళ్లాలని భావించాడు. ఆ తర్వాత తల్లి వద్ద ఉన్న సొత్తును విక్రయించి సొమ్ము చేసుకోవాలని అనుకున్నాడు. సికింద్రాబాద్‌లో కొత్త ఫోన్ నెంబర్ తీసుకున్న రామకృష్ణన్ దాన్ని వినియోగించి తల్లి మీనాక్షితో మాట్లాడటం మొదలెట్టాడు. మూలక్‌రాయ్‌పట్టి చోరీ కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసు బృందాలు సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాల ఆధారంగా రామకృష్ణన్‌ను నిందితుడిగా గుర్తించాయి. అయితే అతడి ఆచూకీ కోసం చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో తల్లి ఫోన్‌పై నిఘా ఉంచాయి. ఆమెకు సికింద్రాబాద్‌లో ఉన్న నెంబర్ నుంచి ఫోన్లు వస్తున్నట్లు గుర్తించాయి. దీంతో శనివారం ఇక్కడకు వచ్చిన ఓ స్పెషల్ టీమ్ రామకృష్ణన్‌ను పట్టుకుంది. ప్రాథమిక విచారణలోనే అతగాడు విషయాలన్నీ బయటపెట్టాడు.

**తీవ్ర అవమానంగా భావించిన మీనాక్షి..**

నిందితుడిని తీసుకుని కేరళ బయలుదేరిన పోలీసులు జ్యువెలరీ దుకాణంలో చోరీ చేసిన సొత్తు అతడి తల్లి వద్ద ఉందనే విషయాన్ని అక్కడి టీమ్‌కు చెప్పారు. దీంతో ఓ బృందం ఆదివారం ఉదయం రెట్టార్కులం గ్రామంలోని రామకృష్ణన్ ఇంట్లో దాడి చేసి 2.22 కేజీల బంగారం స్వాధీనం చేసుకున్నారు. ఈ పరిణామంతోనే తన కుమారుడు దొంగగా మారాడనే విషయం మీనాక్షికి తెలిసింది. దీనికి తోడు గ్రామంలో అందరూ చూస్తుండగా పోలీసులు తమ ఇంట్లో సోదాలు చేయడం, చోరీ బంగారం రికవరీ చేయడాన్ని తీవ్ర అవమానంగా భావించింది. దీంతో పోలీసులు వెళ్లి కొద్దిసేపటిలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుస్టేషన్‌కు వచ్చి తిరిగి వెళ్లిన ఆమె భర్త ఈ విషయం గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. 'సోమవారం రామకృష్ణన్‌ను రెట్టార్కులం తీసుకువెళ్లి మీనాక్షి అంత్యక్రియలు పూర్తి చేయించాం. ఆపై కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించాం. అతడు ఇలాంటి మరికొన్ని నేరాలు చేసినట్లు అనుమానం ఉంది. కస్టడీలోకి తీసుకుని ఆ కోణంలో విచారిస్తాం' అని తిరునల్వేలికి చెందిన ఓ ఉన్నతాధికారి 'సాక్షి'కి ఫోన్ ద్వారా తెలిపారు.

సంక్రాంతి సందడి



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నివాసంలో సోమవారం జరిగిన సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు, సబితాఇంద్రారెడ్డి, దయాకర్‌రావు, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తదితరులు

## ఫిలింనగర్‌లో భారీ చోరీ..

**ఫిలింనగర్:** వృద్ధ దంపతుల ఇంట్లో భారీగా నగదు, నగలు చోరీకి గురైన సంఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-92లో నివసించే అరుణాదేవి, లక్ష్మయ్య దంపతులు ఈ నెల 10న ఉదయం వైకుంఠ ద్వార దర్శనం చేసుకునేందుకు సమీపంలోని గుడికి వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చారు. ఆ తర్వాత కొద్దిసేపటికి అరుణాదేవి జిమ్‌కు వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చింది. 11న ఉదయం అరుణాదేవి నిద్ర లేచి బయటికి వచ్చి చూడగా బాత్‌రూమ్ తలుపులు పగులగొట్టి ఉన్నాయి. ఆ పక్కనే జ్యువెలరీ బాక్స్‌లు పడి ఉండటంతో ఆందోళనకు గురైన ఆమె అల్మారా తెరిచి చూడగా అందులో ఉన్న రూ.1.50 లక్షల నగదు, బంగారు గాజులు, నెక్లెస్‌లు తదితర ఆభరణాలన్నీ చోరీకి గురైనట్లు గుర్తించింది. తాము ఇంట్లో లేని సమయంలో లేదా నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు కిటికీలో నుంచి లోపలికి ప్రవేశించి చోరీకి పాల్పడి ఉండవచ్చునని బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఫిలింనగర్ క్రైమ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## యువకుడి ఆత్మహత్య

**శామీర్‌పేట్:** ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం శామీర్‌పేట పోలీస్ స్టేసన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మెదక్ జిల్లా, రామాయంపేట్‌కు చెందిన ప్రసాద్ (26), తూంకుంట మున్సిపాలిటీలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నాడు. ఆదివారం అదే పెట్రోల్ బంకు సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. అప్పుల బాధతో పాటు లోన్ యాప్స్ వేధింపుల కారణంగా ప్రసాద్ ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని పోలీసుల దర్యాప్తులో తేలింది. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మోతాదుకు మించి ట్యాబ్లెట్లు వేసుకుని వ్యక్తి మృతి

**పోచారం:** మోతాదుకు మించి ట్యాబ్లెట్లు వేసుకున్న ఓ మధుమేహ వ్యాధిగ్రస్తుడు మృతి చెందిన సంఘటన సోమవారం పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఇస్మాయిల్‌ఖాన్‌గూడకు చెందిన రుద్రగడ వెంకట సత్యనారాయణ (71) మధుమేహ వ్యాధితో బాధపడుతున్నాడు. ఆదివారం ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లిన అతను తిరిగి రాలేదు. సాయంత్రం వేణు అనే వ్యక్తి ఫోన్ చేసి కరీంగూడ చెరువు వద్ద సత్యనారాయణ అపస్మారక స్థితిలో ఉన్నట్లు అతడి కుమారుడు హరిచరణ్‌కు సమాచారం అందించాడు. దీంతో హరిచరణ్ అక్కడికి వెళ్లి తన తండ్రిని రాంపల్లిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. షుగర్ ట్యాబ్లెట్లను మోతాదుకు మించి తీసుకోవడం వల్లే సత్యనారాయణ మృతి చెందినట్లు తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.




# పార్కింగ్ కష్టాలకు చెక్



## తుది దశలో మల్టీ లెవెల్ పార్కింగ్ కాంప్లెక్స్ పనులు

- ఫిబ్రవరి మొదటి వారంలో ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు
- కాంప్లెక్స్ ప్రారంభమైతే తీరనున్న పార్కింగ్ సమస్య
- నుమాయిష్ సందర్శకులకు ఊరట



**నాంపల్లి:** మెట్రో రైలు ప్రయాణికులకు పార్కింగ్ తిప్పలు తప్పనున్నాయి. నాంపల్లిలో నిర్మిస్తున్న అధునాతన మల్టీ లెవెల్ పార్కింగ్ కాంప్లెక్స్ మరో నెల రోజుల్లో అందుబాటులోకి రానుంది. ఈ పార్కింగ్ కాంప్లెక్స్ పనులు తుది దశకు చేరుకున్నాయి. అన్ని పనులు పూర్తయితే ఫిబ్రవరి మొదటి వారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ట్రయల్స్ కూడా నిర్వహించారు. ఈ భవన సముదాయం అందుబాటులోకి వస్తే నాంపల్లి ప్రాంతంలో టూ వీలర్, ఫోర్ వీలర్ పార్కింగ్ సమస్య నుంచి గట్టెక్కడమే కాకుండా ట్రాఫిక్ సమస్యకు కూడా శాశ్వత పరిష్కారం లభించనుంది. దీనికితోడు నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగే నుమాయిష్‌కు వచ్చే సందర్శకులు పార్కింగ్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడే ప్రభుత్వ, ప్రభుత్వేతర కార్యాలయాలు, వివిధ పార్టీలకు చెందిన కార్యాలయాలు ఉన్నాయి. ఆయా కార్యాలయాలకు వచ్చే నేతలు, కార్యకర్తలు నిత్యం పార్కింగ్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. అలాగే ఏవైనా సభలు, సమావేశాలు జరిగినా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.

### బహుళ అంతస్తుల్లో..

నాంపల్లి కేంద్రంగా కంప్యూటరైజ్డ్ మల్టీ లెవెల్ పార్కింగ్ నిర్మాణం కోసం 2018లో శంకుస్థాపన చేశారు. గత ప్రభుత్వ హయాంలోనే పూర్తి కావాల్సిన కాంప్లెక్స్ నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరిగింది. ఈ పనులను ఢిల్లీకి చెందిన ఓ ప్రైవేట్ సంస్థ చేపడుతోంది. పూర్తి జర్మన్ టెక్నాలజీతో నగరంలో తొలి మల్టీ లెవెల్ పార్కింగ్ కావడం గమనార్హం. ఈ కాంప్లెక్స్‌లో మొత్తం 15 అంతస్తులు ఉన్నాయి. 10 అంతస్తులను పార్కింగ్‌కు కేటాయించారు. మిగతా ఐదు అంతస్తుల్లో రెండు సినిమా స్క్రీన్లతో ఒక థియేటర్, రెస్టారెంట్లు, ఇతరత్రా వ్యాపార సముదాయాలను అందుబాటులోకి తెస్తున్నారు. ఈ పార్కింగ్ అందుబాటులోకి వస్తే 250 కార్లు, 200 ద్విచక్రవాహనాలను పార్కింగ్ చేసుకునే వీలుంది. కారుకు గంటకు రూ.30, టూ వీలర్‌కు గంటకు రూ.10 చొప్పున వసూలు చేయనున్నారు. మల్టీ లెవల్ పార్కింగ్ కాంప్లెక్స్‌లో బీ1, బీ2, బీ3 అండర్ గ్రౌండ్ అంతస్తులు ఉంటాయి. 5 నుంచి 11 అంతస్తుల వరకు పార్కింగ్ కోసం కేటాయించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో పార్కింగ్‌కు సంబంధించి నాలుగు ఎంట్రీ ఎగ్జిట్ టెర్మినల్స్ ఉంటాయి. ఆయా టెర్మినల్స్ వద్ద ఉన్న టర్న్ టేబుల్స్‌పై వాహనాలను వదిలితే లిఫ్టుల ద్వారా నిర్దిష్ట అంతస్తుకు చేరుకుంటాయి. సైజును బట్టి తగిన ప్లాట్లలో పార్కింగ్ చేస్తారు. పార్కింగ్ ప్రక్రియకు కేవలం ఒక్క నిమిషం మాత్రమే సమయం పట్టనుంది. కార్లను తిరిగి తీసుకోవడానికి టర్న్ టేబుల్స్ వద్దనున్న కార్డ్‌ల రీడర్ల వద్ద స్మార్ట్ కార్డును స్వైప్ చేస్తే.. కారు నిర్దిష్ట టర్న్ టేబుల్ వద్దకు చేరుకుంటుంది. టర్న్ టేబుల్‌పై ఉన్న కారును రివర్స్ చేసే బాధ లేకుండా టర్న్ టేబులే మన వాహనాన్ని కావాల్సిన దిక్కుకు రొటేట్ చేస్తుంది. దీంతో పార్కింగ్ నుంచి కారును రెండు నిమిషాల్లోనే బయటికి తీసేందుకు వీలవుతుంది. ఇక పార్కింగ్ చార్జీలు చెల్లించేందుకు స్మార్ట్ కార్డులను ఉపయోగించాల్సి ఉంటుంది. రెగ్యులర్‌గా పార్కింగ్ చేసేవారికి ఆర్‌ఎఫ్ఐడీ స్మార్ట్ కార్డులను జారీ చేయనున్నారు. మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ప్రత్యేక చొరవతో ప్రారంభోత్సవానికి సన్నాహాలు ముమ్మరం చేశారు.

## టాటా ఏస్ బోల్తా.. 15 మందికి గాయాలు



బాధితులను ఆసుపత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

**భువనగిరిటౌన్:** టాటా ఏస్ వాహనం బోల్తా పడి 15 మందికి గాయాలైన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణ శివారులోని బైపాస్ రోడ్డుపై సోమ వారం చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, ఘట్కేసర్ మండలం, ఎదులాబాద్‌కు చెందిన 15 మంది కుటుంబ సభ్యులు హన్మకొండ జిల్లాలోని ఐనవోలు జాతరకు టాటా ఏస్ వాహనంలో బయల్దేరారు. మార్గమధ్యలో భువనగిరి పట్టణ శివారులోని బైపాస్ రోడ్డుపై వాహనం ముందు టైరు పేలడంతో బోల్తా పడింది. ఈ ఘటనలో మల్లేష్, లక్ష్మి, బాలమ్మ, శ్రీను, రాజు, సంతోష్‌కు తీవ్ర గాయాలు కాగా.. మరో తొమ్మిది మందికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బందికి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బాధితులను వారి బంధువులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

## జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ జ్యూరీకి ఎంపిక

**తుర్కయంజాల్:** జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం మున్సిపాలిటీ పరిధిలోని మునగనూర్‌కు చెందిన ఉడావత్ లచ్చిరామ్ దరఖాస్తు చేసుకున్నారు. తెలంగాణ నుంచి ఆరుగురు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. లచ్చిరామ్ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ జ్యూరీకి ఎంపికయ్యారు. దీంతో కేంద్ర ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ నేషనల్ బుక్‌ట్రస్ట్ ఆఫ్ ఇండియాలో శాశ్వత సభ్యత్వం కలిగించడంతో పాటు, రూ.10వేల విలువైన పుస్తకాలను ఉచితంగా అందజేసింది. ఈ మేరకు సోమవారం లచ్చిరామ్ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసి పలు పుస్తకాలను వారికి బహూకరించారు. లచ్చిరామ్ జ్యూరీకి ఎంపిక కావడంపై వారు అభినందనలు తెలిపారు.

# తగ్గిన విద్యుత్ వినియోగం

**సాక్షి, సిటీబ్యూరో:** సంక్రాంతి పండగకు నగరవాసులు తమ ఇళ్లకు తాళాలు వేసి...పల్లెటూర్లకు తరలి వెళ్లారు. అకస్మాత్తుగా గృహాలు, కార్యాలయాల్లో విద్యుత్ ఉపకరణాల వినియోగం పడిపోయింది. పారిశ్రామిక వాడల్లోని పలు పరిశ్రమలతో పాటు, వ్యాపార, వాణిజ్య సంస్థలు ఉద్యోగులకు సెలవు ప్రకటించి, కార్యాలయాలకు తాళాలు వేశాయి. ఉత్పత్తులు, రోజువారీ కార్యకలాపాలు నిలిపి వేయడంతో రోజు వారి విద్యుత్ వినియోగం గణనీయంగా తగ్గింది. జనవరి 7న అత్యధికంగా 3271 మెగావాట్ల(60.07 మిలియన్ యూనిట్లు) విద్యుత్ డిమాండ్ నమోదు కాగా, తాజాగా 13న ఏకంగా 2500 మెగావాట్లకు(51.34 మిలియన్ యూనిట్లు) పడిపోయింది. సాధారణ రోజులతో పోలిస్తే పండుగ వేళ 700 మెగావాట్ల విద్యుత్ వాడకం తగ్గడం గమనార్హం. మంగళవారం గృహ, వాణిజ్య, పారిశ్రామిక విద్యుత్ వినియోగం మరింత తగ్గే అవకాశం లేకపోలేదు. ఇదిలా ఉండగా సంక్రాంతి నేపథ్యంలో చిన్నారులు తమ ఇళ్లపై ఎగరేసే పతంగ్‌లు విద్యుత్ తీగల పాలిట శాపంగా మారుతున్నాయి. పతంగ్‌లకు ఉన్న మాంజా వైర్లకు చుట్టుకోవడం, వైర్ల మధ్య చిక్కుకున్న పతంగ్‌లను తీసే క్రమంలో దారాన్ని గట్టిగా లాగడం వల్ల వైర్లు మెలికపడి షార్ట్‌సర్క్యూట్‌లు తలెత్తుతున్నాయి. నిజానికి విద్యుత్ సంస్థలు డిమాండ్‌కు మించి సరఫరా చేస్తున్నప్పటికీ..పతంగ్‌ల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో అంతరాయాలు తప్పలేదు. పండగ పూట తరచూ విద్యుత్ అంతరాయాలు తలెత్తడం తో వినియోగదారులు కొంత అసహనానికి గురయ్యారు.

**గ్రేటర్‌లో విద్యుత్ వినియోగం ఇలా**

| తేదీ | మెగావాట్లు | మిలియన్ యూనిట్లు |
|---|---|---|
| 06 | 3146 | 58.80 |
| 07 | 3271 | 60.07 |
| 08 | 3242 | 60.01 |
| 09 | 3250 | 59.06 |
| 10 | 3261 | 60.49 |
| 11 | 2863 | 56.95 |
| 12 | 2653 | 52.60 |

# విద్యుదాఘాతంతో డీసీఎం డ్రైవర్ మృతి



మీర్జా అసద్ బేగ్ మృతదేహం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

**మైలార్‌దేవ్‌పల్లి:** ప్రమాదశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఓ డీసీఎం డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.

పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం, గుల్బర్గ కేఎస్‌ఆర్‌టీసీ కాలనీకి చెందిన మిర్జా అసద్ బేగ్(54) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం అతను డీసీఎంలో స్క్రాప్ తీసుకువచ్చి కాటేదాన్‌లో పార్కు చేస్తున్నాడు. పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న విషయాన్ని గుర్తించక అతను వాహనం డోర్ తెరవడంతో ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. షార్ట్ సర్క్యూట్ కారణంగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సెరాయ్ గ్రాండేలో పోలీసుల తనిఖీలు

**గచ్చిబౌలి:** గచ్చిబౌలిలోని సెరాయ్ గ్రాండే హోటల్‌లో మాదాపూర్ ఎస్ఓటీ, రాయదుర్గం లా అండ్ ఆర్డర్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. డ్రగ్స్, అసాంఘిక కార్యకలాపాలపై రొటీన్‌గా తనిఖీలు నిర్వహించినట్లు తెలుస్తోంది. ఇది ఇలా ఉండగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బంధువుకు చెందిన హోటల్‌లో పోలీసులు ఎలాంటి సెర్చ్ నోటీసు లేకుండా తనిఖీలు చేశారని సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ విషయమై రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న మాట్లాడుతూ రొటీన్ చెకప్‌లో భాగంగానే తనిఖీలు నిర్వహించామని ఎలాంటి డ్రగ్స్ లభించలేదన్నారు. పండుగ సమయంలో హోటల్స్‌లో పేకాట ఆడే అవకాశం ఉందన్నారు. ఉద్దేశ పూర్వకంగా తనిఖీలు చేపట్టలేదని అన్నారు. సెర్చ్ వారెంట్ లేకుండా ఎంట్రీ, ఎగ్జిట్ వే నుంచి పెద్ద సంఖ్యలో పోలీసులు లోపలికి వచ్చి తనిఖీలు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

## నిత్య పెళ్లి కొడుకు ఆటకట్టు

- మాయమాటలు చెప్పి ముగ్గురితో వివాహం
- రెండో భార్య ఫిర్యాదుతో నిందితుడి అరెస్ట్



లక్ష్మణ్‌రావు (ఫైల్)

**జవహర్‌నగర్:** మాయమాటలు చెప్పి ముగ్గురు మహిళలను వివాహం చేసుకున్న వ్యక్తిని జవహర్ నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జవహర్‌నగర్, గబ్బిలాల్‌పేటకు చెందిన లక్ష్మణరావు ర్యాపిడో డ్రైవర్‌గా పని చేసేవాడు. 2014లో తన బంధువుల అమ్మాయి అనూషను వివాహం చేసుకున్న అతను మనస్పర్థల కారణంగా దూరంగా ఉంటున్నాడు. 2021లో బాలాజీనగర్‌కు చెందిన లీలావతి అనే యువతిని మెదక్ చర్చిలో వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. ఆ తర్వాత కొన్నాళ్లకు లక్ష్మణ్‌రావు లీలావతి దూరంగా ఉంటూ తప్పించుకు తిరుగుతున్నాడు. అతను మల్కాజిగిరిలో ఉంటున్నట్లు తెలియడంతో లీలావతి కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూడగా లక్ష్మణ్‌రావు శబరి అనే మరో మహిళను వివాహం చేసుకున్నట్లు గుర్తించి నివ్వెరపోయారు. ఒకరికి తెలియకుండా మరొకరిని మోసం చేసి ముగ్గురు మహిళలను వివాహం చేసుకున్నాడు. లీలావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## ప్రమాదవశాత్తు మంటల్లో పడి వ్యక్తి మృతి

**మొయినాబాద్:** వ్యర్థాలను కాలుస్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు మంటల్లో పడి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని చిలుకూరులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన బ్యాగరి మల్లేశ్(60) స్థానిక ఎస్ లిక్కర్ మార్ట్ వైన్స్‌లో పని చేస్తున్నాడు. ఆదివారం ఆయన రాత్రి 9.30గంటల ప్రాంతంలో వ్యర్థాలను కాలుస్తూ మంటల్లో పడిపోయాడు. స్థానికులు గమనించి వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. క్షతగాత్రుడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే మల్లేశ్ చనిపోయాడని.. వైన్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

## విద్యుత్ షాక్‌తో రైతు మృతి

**మంచాల:** వ్యవసాయ పొలం వద్ద విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరుట్ల గ్రామానికి చెందిన పోలమోని సత్తయ్య (70) తన వ్యవసాయ పొలం వద్ద కూరగాయాల తోటలకు నీళ్లు పెట్టడానికి సోమవారం ఉదయం వెళ్లాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు కాళ్లు తగలడంతో షాక్‌వచ్చి అక్కడికక్కడే మృతి చెందాడు. చుట్టు పక్కల రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# కొత్త రేషన్ కార్డులపై మళ్లీ ఆశలు..!

- కార్డులు లేని కుటుంబాలు 10 లక్షలపైనే
- ప్రజాపాలనలో 5 లక్షలపైనే దరఖాస్తులు
- 16 నుంచి క్షేత్ర స్థాయి పరిశీలన
- నిరుపేదల ఉరుకుల పరుగులు
- దరఖాస్తు చేసుకోని వారి పరిస్థితేంటి..?



**సాక్షి,సిటీబ్యూరో:** కొత్త రేషన్ కార్డులపై మళ్లీ ఆశలు రేకెత్తిస్తున్నాయి. గత ప్రభుత్వం నూతన కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అంటూ కాలయాపన చేయగా, ఆ తర్వాత అధికారంలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఏడాదిగా అదే పాట పాడుతూ వస్తోంది. గతేడాదిలో జరిగిన ప్రజాపాలన కార్యాక్రమంలో ఆరు గ్యారంటీల పథకాలతో పాటు ప్రత్యేకంగా రేషన్ కార్డుల కోసం కూడా పెద్ద ఎత్తున దరఖాస్తులు చేసుకున్నారు. తాజాగా రేషన్ కార్డుల దరఖాస్తులపై 'ఈనెల 16 నుంచి 20వ వరకు క్షేత్ర స్థాయి విచారణ నిర్వహిస్తాం. 21 నుంచి 24 తేదీల మధ్య వార్డు సభల్లో లబ్ధిదారుల ముసాయిదా విడుదల చేస్తాం. అర్హులకే అందేలా, పారదర్శకంగా ఉండేందుకు ప్రజాభిప్రాయ సేకరణ చేస్తాం. అర్హుల వివరాలను 21 నుంచి 25 వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసి 26 నుంచి కొత్త కార్డులు జారీ చేస్తామని' మంత్రి ప్రకటనతో పేద కుటుంబాల్లో ఆశలు రేపినట్లయింది.

### ప్రజాపాలనలో 5.73 లక్షల దరఖాస్తులు

ప్రజాపాలనలో కొత్త రేషన్ కార్డుల కోసం సుమారు 5.73 లక్షల కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నాయి. అలాగే సుమారు 24 లక్షల 74 వేల 325 కుటుంబాలు వివిధ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్నాయి. అందులో ఐదు గ్యారంటీ పథకాల కోసం సుమారు 19,01,256 కుటుంబాలు, రేషన్స్ కార్డు కోసం 5,73,069 కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కాగా, మరో 20 శాతం పేద కుటుంబాలు పాత అడ్రస్‌లతో కూడిన ఆధార్, ఇతరత్రా పత్రాలు లేని కారణంగా దరఖాస్తు చేసుకోలేదని తెలుస్తోంది.

### ఏటేటా..

పదేళ్ల నుంచి పౌరసరఫరాల శాఖ ఆన్‌లైన్ ద్వారానే సేవలందిస్తోంది. కొత్త రేషన్ కార్డులు, పాత కార్డులో చేర్పులు, మార్పుల కోసం ఆన్‌లైన్ లాగిన్ ద్వారానే దరఖాస్తులు స్వీకరించి నూతన కార్డుల మంజూరు, పాత కార్డుల అప్‌డేషన్ చేస్తూ వస్తోంది. దాని ఆధారంగానే ఆన్‌లైన్ ప్రతులు జారీ చేస్తూ వస్తోంది. అయితే ఆన్‌లైన్ సివిల్ సప్లయిస్‌లో లాగిన్‌లో నమోదు కాకుండా కొత్త కార్డుల మంజూరు అనుమానమే అన్న ప్రశ్నార్థకంగా తయారైంది. దరఖాస్తులపై కేవలం ఐదు రోజుల్లో క్షేత్రస్థాయి విచారణ, ఆ తర్వాత మరో 5 రోజుల్లో డేటా ఎంట్రీ నమోదు ఎలా సాధ్యమన్న ప్రశ్న తలెత్తుతోంది. హడావుడిలో అర్హులకు అన్యాయం జరిగి అనర్హులకు కార్డులు మంజూరయ్యే అవకాశాలు లేకపోలేదని వాదన వినిపిస్తోంది.

### పదేళ్ల క్రితం..

తెలంగాణ ఏర్పాటు అనంతరం తెల్ల రేషన్‌కార్డులు రద్దు చేసి దానిస్థానంలో ఆహార భద్రత కార్డులుగా మార్పు చేసింది. మరోవైపు టాక్స్ పేయర్ సాకుతో సొంత ఇళ్లు, నాలుగు చక్రాల వాహనం కలిగి ఉన్న వారితోపాటు వరసగా మూడు నెలలు రేషన్ డ్రా చేయని కుటుంబాల కార్డులను రద్దు చేసింది. ఆ తర్వాత అప్పటి సర్కార్ సరిగ్గా నాలుగేళ్ల క్రితం ఏకంగా కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తుల చేసుకునే పౌరసరఫరాల శాఖ వెబ్‌సైట్ లాగిన్‌ను నిలిపివేసింది. అప్పటివరకు పెండింగ్ దరఖాస్తులను 360 డిగ్రీల కోణంలో పరిశీలించి కేవలం నలభై శాతం మాత్రమే క్లియర్ చేసి మిగితా దరఖాస్తులను తిరస్కరించింది. 2021 ఫిబ్రవరి నుంచి కొత్త కార్డుల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే వెసులు పాటు కూడా లేకుండా పోయింది. ఆ లాగిన్ పునః ప్రారంభమైతే కానీ ఆన్‌లైన్ ప్రక్రియలో దరఖాస్తుల చేసుకునే అవకాశం లేకుండా పోయింది. గతేడాది ప్రభుత్వం ఆహ్వానించకున్నా.. కొత్త రేషన్ కార్డులు కోసం పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చి చేరాయి.

**కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు ఇలా**

| జోన్ | దరఖాస్తులు |
|---|---|
| ఎల్బీనగర్ | 81,641 |
| చార్మినార్ | 1,40,807 |
| ఖైరతాబాద్ | 98,267 |
| కూకట్‌పల్లి | 87,147 |
| శేరిలింగంపల్లి | 64,829 |
| సికింద్రాబాద్ | 93,004 |
| కంటోన్మెంట్ | 7,374 |

### రేషన్ కార్డులు లేని కుటుంబాలు...

మహానగరంలో సుమారు 10 లక్షలకు పైగా కుటుంబాలకు రేషన్ కార్డులు లేనట్లు ఇటీవల నిర్వహించిన సర్వేలో బహిర్గతమైంది. దేశ నలుమూలల నుంచి వలసలు పెరగడంతో హైదరాబాద్ మహానగరంలో జనాభా సుమారు కోటిన్నరపైగా చేరింది. కుటుంబాల సంఖ్య 50 లక్షలకుపైగా ఉండగా అందులో నిరుపేద కుటుంబాలు 27.21 లక్షలు లక్షల వరకు ఉన్నట్లు అంచనా. హైదరాబాద్-రంగారెడ్డి-మేడ్చల్ జిల్లా పరిధిలో రేషన్ కార్డులు కలిగిన కుటుంబాల సంఖ్య 17.21 లక్షల పై ఉన్నట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

## క్లుప్తంగా...

### డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

**రహమత్‌నగర్:** బోరబండ డివిజన్ సైట్-3 సంతోష్‌నగర్ డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్‌ఐ జూబ్లీహిల్స్ జోన్ కమిటీ కార్యదర్శి దాదిమల్ల కృష్ణ మాట్లాడుతూ ముగ్గుల పోటీలు మహిళల్లో ఐక్యతాభావాన్ని పెంపొందిస్తాయన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు శేషగిరిరావు, ఆనంద్, శ్రీను, విష్ణు, శైలజ, నీతూ, రాధాభారతి తదితరులు పాల్గొన్నారు.

### ఐఐఎంసీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదాపై హర్షం

**ఖైరతాబాద్:** ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కళాశాల అటానమస్ స్టేటస్ (స్వయం ప్రతిపత్తి) సాధించి 2025-26 విద్యా సంవత్సరం నుంచి అకాడమిక్ ఎక్సలెన్స్‌లో అడుగు పెడుతోందని కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్ తెలిపారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కళాశాల 1973లో వందమంది విద్యార్థులతో ప్రారంభమై ఇప్పుడు 17వందల మంది విద్యార్థులకు చేరుకుందని, 2023లో 3వ సైకిల్‌లో 3.27 స్కోర్ సాధించి ఎన్ఎఎసీచే ఎప్లస్ గ్రేడ్‌తో గుర్తింపు పొందిందని కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్ తెలిపారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ 2025-26 విద్యా సంవత్సరం నుంచి 10 సంవత్సరాల కాలానికి ఐఐఎంసీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా లేఖను అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఇంతటి విజయాన్ని సాధించినందుకు కళాశాల సెక్రటరీ చల్లా ప్రసన్నకుమార్, ఇతర యజమాన్య సభ్యులు ప్రిన్సిపాల్ కూర రఘువీర్, అధ్యాపకేతర బృందం హర్షం వ్యక్తం చేశారు.

### విజేతలకు ట్రోఫీ, రూ. 25వేల చెక్కు అందజేత



ట్రోఫీని అందజేస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి

**ఖైరతాబాద్:** దివంగత పి.జనార్దన్‌రెడ్డి జ్ఞాపకార్థం పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 5వ పీజేఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఖైరతాబాద్‌లోని జీహెచ్ఎంసీ ప్లే గ్రౌండ్‌లో నిర్వహించారు. జంటనగరాల నుంచి మొత్తం 66 టీంలు పాల్గొనగా విజేతగా మాసాబ్ ట్యాంక్ సీసీ టీం విజేతగా నిలిచింది. విజేత టీంకు పీజేఆర్ ఫౌండేషన్ తరఫున రూ. 25వేల రూపాయల నగదు చెక్కు, ట్రోఫీని ఫౌండేషన్ చైర్మన్ పి.విజయారెడ్డి విజేత టీంకు అందజేశారు.

### మానుకోట ఆత్మగౌరవ యాత్రను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఉద్యమకారుల ఫోరం నాయకులు

**రహమత్‌నగర్:** మానుకోటలో ఈనెల 19న జరుగనున్న తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ యాత్రను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు పిలుపునిచ్చారు. రహమత్‌నగర్‌లో సోమవారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇందన్‌కుమార్, జూబ్లీహిల్స్ కన్వీనర్ చంద్రశేఖర్, సెక్రటరీ యండి గౌస్, యూత్ నాయకుడు శివకుమార్‌లు మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడిన ఉద్యమకారులకు ఏమాత్రం గుర్తింపు లేకుండా పోయిందన్నారు. ఉద్యమకారుల ఫోరం డాక్టర్ చీమ శ్రీనివాస్ నేతృత్వంలో 19వ తేదీన జరిగే ఆత్మగౌరవ యాత్రకు జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున ఉద్యమకారులు తరలి వెళుతున్నట్లు వారు తెలిపారు. ఇందులో భాగంగా డివిజన్ల వారీగా సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు వారు వివరించారు. ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు.



వాహనాల రద్దీ లేకుండా ఉన్న బంజారాహిల్స్ రోడ్ నెం. 2



బంజారాహిల్స్ రోడ్ నెం. 10 తెలంగాణ భవన్‌రోడ్డు

## పట్నం పల్లెకుపోయిన వేళ..!

సంక్రాంతి సందర్భంగా నగరవాసులంతా తమ సొంతూళ్లకు వెళ్లడంతో సోమవారం చాలాచోట్ల నగర రహదారులన్నీ బోసిపోయి కనిపించాయి. ముఖ్యంగా నిత్యం రద్దీగా ఉండే పంజగుట్ట, బంజారాహిల్స్, ఫిలింనగర్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి. ఎటువంటి ట్రాఫిక్ లేకపోవడంతో కొన్ని జంక్షన్లలో సిగ్నలింగ్ వ్యవస్థను కూడా పోలీసులు నిలిపివేయడం విశేషం. మరో రెండురోజుల వరకు పరిస్థితి ఇదే విధంగా ఉంటుందని ట్రాఫిక్ పోలీసులు అంచనా వేస్తున్నారు. – బంజారాహిల్స్

## భోగ భాగ్యాల భోగి..!

- భోగితో ప్రారంభమైన సంక్రాంతి వేడుకలు
- భోగి మంటల చుట్టూ నృత్యాలు చేస్తూ సందడి చేసిన మహిళలు
- ఆకట్టుకున్న గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలు



బంజారాహిల్స్ రోడ్ నెం.14లో



బంజారాహిల్స్ రోడ్ నెం. 9 కమలాస్ వైట్ హౌజ్ అపార్ట్‌మెంట్ వద్ద...

**బంజారాహిల్స్:** బస్తీ, కాలనీ తేడా లేకుండా ప్రతి ఒక్కరూ మూడు రోజులపాటు ఉత్సాహంగా జరుపుకునే పండుగే సంక్రాంతి. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో ప్రతి లోగిలి ఇప్పటికే సంక్రాంతి శోభను సంతరించుకోగా సోమవారం భోగి పండుగతో అసలు పర్వదినం ప్రారంభమైంది. సూర్యుడు దక్షిణాయానంలో ఉండే చివరి రోజును భోగిగా చెప్పుకుంటారు. ఈ ఏడాది భోగికి మరో విశిష్టత చేకూరింది. సోమవారం పుష్యమాసం, పౌర్ణమి, అర్ధ నక్షత్రం కలిసి రావడంతో ఈ రోజును శివ ముక్కోటిగా వేద పండితులు పేర్కొంటున్నారు. 110 ఏళ్లకోసారి ఈ అద్భుత కలయిక వస్తుందని పండితులు చెబుతున్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఈ భోగి నాడు పేడతో చేసిన పిడకలు, నెయ్యితో పాటు ఇంట్లోని పాత కలప వస్తువులను భోగి మంటల్లో వేసి మనలోని దుర్గుణాలు పోయి ఈ సంక్రాంతి నుంచి మనలో ప్రగతి కాంతి వెల్లివిరియాలని కోరుకున్నారు. భోగి మంటలు వేసుకుని వాటి చుట్టూ నృత్యాలు చేస్తూ చిన్నారులు, పెద్దలు సంక్రాంతికి ఘనంగా ఆహ్వానం పలికారు. కేబీఆర్ పార్కు వద్ద ఏర్పాటు చేసిన భోగి వేడుకల్లో కేబీఆర్ పార్కు వాకర్లు ఉత్సాహంగా గడిపారు. హరిదాసు చుట్టూ వాకర్లు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. బస్తీల్లో, కాలనీల్లో గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలు చేస్తూ కనిపించారు. వేకువ జామునే మహిళలు తమ ఇళ్ల ముందు అందమైన రంగవల్లులు వేసి మురిసిపోయారు.



బంజారాహిల్స్‌లో హరిదాసు చుట్టూ నృత్యాలు చేస్తున్న మహిళలు



కేబీఆర్ పార్కు వద్ద భోగి వేడుకల్లో యువతుల నృత్యాలు



కేబీఆర్ పార్కు వద్ద భోగి వేడుకల్లో వాకర్లు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నసీఎన్ రెడ్డి



గాలి పటాలను విడుదల చేస్తున్న బాబా ఫసియుద్దీన్



భోగి వేడుకల్లో సీనియర్ బీఆర్ఎస్ నాయకులు సురేందర్ యాదవ్ తదితరులు

## చైనా మాంజా విక్రయాలపై చర్యలు తీసుకోండి

జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ కె. వెంకటేశ్వరరెడ్డి



సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

**బంజారాహిల్స్:** సంక్రాంతి పండుగ సందర్భంగా పతంగులు ఎగురవేసే వారు ప్రమాదకరమైన చైనా మాంజాను ఉపయోగిస్తే గుర్తించి ఆ మాంజాను ఎక్కడి నుంచి కొనుగోలు చేశారో తెలుసుకుని వారిపై చర్యలు తీసుకోవాలని జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ కె. వెంకటేశ్వరరెడ్డి సూచించారు. చైనా మాంజాపై అప్రమత్తంగా ఉండాలని, ఇదిచాలా ప్రమాదకరమని, ఎక్కడైనా చైనా మాంజాను వాడినా, అమ్మినా, సరఫరా చేసినా వారిపై చర్యలు ఉంటాయన్నారు. చైనా మాంజాను నిషేధించడం జరిగిందన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. సిబ్బంది ఎక్కడైనా చైనా మాంజా విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే కేసులు నమోదు చేయాలని సూచించారు. ఇదిలా ఉండగా నిషేధిత చైనా మాంజా విక్రయిస్తున్న వారిని 2019లో 30 మందిపై, 2023లో 51 మందిపై, గత ఏడాది 83 మందిపై కేసులు నమోదు చేయడం జరిగిందని ఏసీపీ వెంకటగిరి తెలిపారు.

## రేపటితో ముగియనున్న 'వింటర్ ఉత్సవ్ మేళా'



సాగర తీరంలో ఆకట్టుకుంటున్న వింటర్ ఉత్సవ్ మేళా

**ఖైరతాబాద్:** పీపుల్స్ ప్లాజా వేదికగా ఆకట్టుకుంటున్న వింటర్ ఉత్సవ్ మేళా ఈ నెల 15తో ముగుస్తుందని నిర్వాహకులు మిర్జా రఫీక్‌బేగ్ తెలిపారు. సంక్రాంతి సందర్భంగా నగరవాసులు ఆహ్లాదంగా గడిపేందుకు వింటర్ ఉత్సవ్ మేళా మంచి వేదిక అని, కుటుంబ సమేతంగా ప్రతి ఒక్కరు మేళాలో ఆహ్లాదంగా గడపవచ్చని తెలిపారు. నెలరోజుల పాటు నగరవాసులను ఆకట్టుకున్న వింటర్ ఉత్సవ్ మేళా 15వ తేదీతో ముగుస్తుందన్నారు. ఈ సంక్రాంతిని సాగరతీరంలో ఆహ్లాదంగా జరుపుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భోగి సందర్భంగా సోమవారం మేళాకు భారీగా సందర్శకులు తరలివచ్చారు.

## 'వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ నివేదిక ఇవ్వకూడదు'

**లిబర్టీ:** ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ నివేదిక ఇవ్వకూడదని మాల మహానాడు జాతీయ సలహాదారుడు వి.కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. వర్గీకరణ సాకుతో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఎస్సీ పోస్టులను భర్తీ చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని ఆరోపించారు.

సోమవారం మాల మహానాడు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జస్టిస్ షమీం సారథ్యంలోని ఏకసభ్య కమిషన్ రాష్ట్ర ప్రభుత్వం నియమించిందని ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ అభిప్రాయ సేకరణ చేస్తుందని పేర్కొన్నారు. రాజ్యాంగ విరుద్ధంగా కమిషన్ నివేదికనిస్తే సహించబోమని హెచ్చరించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 ప్రకారం ఎస్సీ వర్గీకరణ చెల్లదని స్పష్టంగా పేర్కొన్నప్పటికీ ప్రభుత్వం ఏకపక్షంగా ఎస్సీ వర్గీకరణ కోసం ఏకసభ్య కమిషన్ ఎందుకు వేసిందని కృష్ణస్వరూప్ నిలదీశారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దళితుల్లో మళ్లీ చిచ్చు పెట్టాలని ప్రయత్నిస్తుందని ఆరోపించారు. కాలం చెల్లిన వర్గీకరణ వాదనకు స్వస్తి చెప్పి రాజ్యాంగ హక్కుల కోసం దళితులు పోరాటం చేయటానికి ఏకం కావాలని ఆయన కోరారు.

### ప్రత్యేక రైళ్లను నడపాలి

**లిబర్టీ:** హైదరాబాద్ మహానగరం నుంచి కుంభమేళాకు వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక రైళ్లను నడిపితే భక్తులకు ఎంతో మేలు కలుగుతుందని సనాత ధర్మ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు పుట్టి యాదగిరి ముదిరాజ్ అన్నారు. ప్రయాగ్‌రాజ్ కుంభమేళా జరగనున్న నేపథ్యంలో హైదరాబాద్ నగరం నుంచి లక్షలాదిమంది భక్తులు వెళ్లే అవకాశం ఉన్నందున రైల్వే శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఫిబ్రవరి 26వ తేదీ వరకు జరిగే కుంభమేళా దృష్టిలో ఉంచుకొని రైల్వే అధికారులు ముందస్తు ప్రత్యేక రైళ్లు నడిపి భక్తులకు సహకరించాలని అన్నారు. హైదరాబాద్ మహానగరం నుంచే కాకుండా తెలంగాణలోని 33 జిల్లాల నుంచి భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు వెళ్తారని ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చొరవ చూపాలని ఆయన రైల్వే అధికారులను కోరారు.

### వ్యక్తి అదృశ్యం

**ఫిలింనగర్:** అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే...ఫిలింనగర్‌లోని భగత్‌సింగ్ కాలనీలో నివసించే జి.యాదగిరి (31) ఊబర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 7వ తేదీన భార్య పోచమ్మతో గొడవ జరిగింది. అదేరోజు ఇంట్లో చెప్పకుండా భార్య ఫోన్ కూడా తీసుకుని వెళ్లిపోయాడు. ఎంతకీ తిరిగిరాకపోయే సరికి ఆమె భర్త పనిచేస్తున్న ఆఫీసుతో పాటు అన్ని ప్రాంతాలు గాలించినా ఫలితం లేకుండాపోయింది. ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ రావడంతో యాదగిరి భార్య ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని గాలిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 87125 70298 నెంబర్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

### ఐదు టిప్పర్లు సీజ్

**బంజారాహిల్స్:** నిషేధిత వేళల్లో తిరుగుతున్న ఐదు టిప్పర్లను బంజారాహిల్స్ ట్రాఫిక్ ఎస్ఐ వి.ప్రభాకర్‌రెడ్డి పట్టుకొని బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఈ ఐదు టిప్పర్లను సీజ్ చేశారు. వాహనాలు తనిఖీలు చేస్తున్న సమయంలో ట్రాఫిక్ పోలీసులకు రద్దీ సమయంలో నో ఎంట్రీ ఉండగా ఈ టిప్పర్లు రాకపోకలు సాగిస్తున్నట్లు గుర్తించి వీటిని నడుపుతున్న మునిచందర్, ఎం.నాగరాజు, ఎం.బాబు, వి.గిరిబాబు, ఎం.సంతోష్‌లపై కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కనుల పండువగా గోదాదేవి కల్యాణం

- పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు

**బంజారాహిల్స్:** ధనుర్మాసంలో నిర్వహించే శ్రీగోదా రంగనాథస్వాముల కల్యాణ మహోత్సవం సోమవారం ఆలయాల్లో వైభవోపేతంగా నిర్వహించారు. అర్చక స్వాములు సంప్రదాయబద్ధంగా ఈ వేడుకను ఘనంగా జరిపారు. మంగళవాయిద్యాల నడుమ భక్తులు హారతులు ఇస్తుండగా, వేద పండితులు మంత్రోచ్చరణలు చేస్తుండగా అర్చకులు ఈ కల్యాణ తంతును అంగరంగ వైభవంగా జరిపారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-14లోని వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకుడు అద్దంకి శశికాంతాచార్యులు ఈ వేడుకను నిర్వహించారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకులు యలమంచిలి దేవేష్ పవన్ తేజ ఆధ్వర్యంలో గోదాదేవి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీనగర్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం, ఫిలింనగర్ దైవ సన్నిధానంలో అమ్మవారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా విచ్చేశారు. అదే విధంగా జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-17లోని శ్రీసీతారామ స్వామి దేవాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు రాఘవాచార్యులు నేతృత్వంలో శ్రీగోదా రంగనాథ స్వామి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.



శ్రీసీతారామస్వామి దేవాలయంలో...



బంజారాహిల్స్ రోడ్డునెంబర్-14లో...



బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లో...



వేడుకల్లో భక్తులు...



శ్రీనగర్‌కాలనీలో...

## ఎంబీఏ విద్యార్థిని అదృశ్యం



విద్యార్థిని రేణుకాదేవి

**ఖైరతాబాద్:** ఎంబీఏ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని కనిపించకుండా పోయిన సంఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎఎస్ఐ శ్రీరాములు తెలిపిన వివరాల ప్రకారం .... ఖైరతాబాద్ డివిజన్ మహాభారత్‌నగర్‌లో నివాసముండే తలారి ఎల్లయ్య, విజయలక్ష్మి దంపతులకు ఇద్దరు సంతానం కాగా వీరి కుమార్తె తలారి రేణుకాదేవి (22) ఎంబీఏ రెండో సంవత్సరం చదువుతోంది. ఆదివారం ఉదయం షాపునకు వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిన తిరిగి రాలేదు. దీంతో రేణుకాదేవి తల్లి విజయలక్ష్మి ఖైరతాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. యువతి ఆన్‌లైన్‌లో పరిచయమైన వ్యక్తితో వెళ్లి ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ దిశగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## 'మరువంపుపూల మట్టితీగ' పుస్తకావిష్కరణ



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ధర్మకేతనం సాహిత్య కళాపీఠం ఆధ్వర్యంలో ఎస్‌వీ.రఘువీర్ కవిత్వంపై రూపొందించిన మరువంపుపూల మట్టితీగ పుస్తకావిష్కరణ సభ సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు డాక్టర్ కేవీ.రమణాచారి మాట్లాడుతూ.. వివిధ అంశాలను కవిత్వం రూపంలో తీసుకురావడం అభినందనీయం అన్నారు. అనంతరం బ్రహ్మశ్రీ నారాయణదాసు శ్రీరామచార్యులు స్మారక సాహితీ పురస్కారాన్ని వి.జయప్రకాష్, అవధాని అవుసుల భానుప్రకాష్, నారాయణదాసు వెంకటశేషమ్మ సాహితీ పురస్కారాన్ని కొలను రాజ్యలక్ష్మీ, పూర్లపాటి రాజేశ్వరీకి అందజేశారు. అనంతరం పలువురు కవులు, రచయితలను సన్మానించారు. సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎస్.బాలచారి, కాళోజీ నారాయణరావు పురస్కార గ్రహీత అమ్మంగి వేణుగోపాల్, నేటి నిజం సంపాదకులు బైస దేవదాస్, రచయిత్రి కొండపల్లి నిహారిణి, కళాపీఠం సభ్యులు ఎస్‌వీ.తేజోధర్మ పాల్గొన్నారు.

## 18న 'బయాన్ ఏ గాలిబ్' ఉర్దూ గజల్-కథక్ నృత్య ప్రదర్శన



నాంపల్లి: సామాజిక సంక్షేమానికి అంకితం చేస్తూ ప్రముఖ ఉర్దూ కవి మీర్జా గాలిబ్ సంస్మరణార్థం మానవీయ కళ్యాణ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 7 గంటలకు మాదాపూర్‌లోని శిల్పకళా వేదికపై ఉర్దూ గజల్-కథక్ నృత్య ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు మానవీయ కళ్యాణ్ ట్రస్ట్ సీఈఓ డాక్టర్ కౌస్తుబ్ ధుమాల్ పేర్కొన్నారు. ఈ మేరకు రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నృత్య ప్రదర్శన వివరాలను వెల్లడించారు. మీర్జా గాలిబ్‌కు సాంస్కృతిక నివాళిలో భాగంగా బయాన్ ఏ గాలిబ్ శీర్షికన దేశంలోనే రెండవ ప్రదర్శనగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. అనంతరం ఆయుర్వేద నిపుణుడు సుధాంశు మణి ప్రదర్శన వివరాలు, లక్ష్యాలను ఆన్‌లైన్‌లో విశ్లేషించారు. ప్రదర్శనను వీక్షించడానికి ఆసక్తి కలిగిన వీక్షకులు, గజల్స్ అభిమానులు బుక్‌మై షో ద్వారా టికెట్లను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు సంస్థ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ చంద్రిక ఫోన్ నంబర్-8790448984.

## మాలలపై విమర్శలతోనే ఎదిగిన మంద కృష్ణమాదిగ

ఉస్మానియా యూనివర్సిటీ: మాలలపై విమర్శలతోనే మంద కృష్ణమాదిగ నాయకుడిగా ఎదిగారని మాల సంఘాల జేఏసీ మందాల భాస్కర్ అన్నారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో మాలలపై అనేక విమర్శలు చేసి ప్రధానమంత్రిని అన్న అనే స్థాయికి ఎదిగిన మంద కృష్ణమాదిగ తాజాగా డిప్యూటీ సీఎం మల్లుబట్టి విక్రమార్క, సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల గద్దర్‌పై విమర్శలు చేస్తున్నారని అన్నారు. తెలంగాణ సాంస్కృతిక సారథిలో ఉద్యోగం చేస్తున్న కళాకారులు ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొన్నందుకు ప్రభుత్వం ఇచ్చిన నోటీసులకు మల్లుబట్టి విక్రమార్క, వెన్నెలకు సంబంధం లేకున్నా వారిని ఆయన విమర్శించడం అవగాహన రాహిత్యమన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ముసుగులో బ్లాక్‌మెయిల్ రాజకీయాలు మానుకోవాలని హెచ్చరించారు. న్యాయబద్ధమైన ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు మాలలు ఎప్పటికీ వ్యతిరేకం కాదన్నారు. కె.వీరస్వామి, మాదాసు రాహుల్, ప్రేమ్‌కుమార్, పసరకొండ కిశోర్, కొప్పు అర్జున్, మదునూరి రాహుల్, చేతన్ పాల్గొన్నారు.

## చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు



చిక్కడపల్లి: చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్ హెచ్చరించారు. పీఎస్ పరిధిలోని పాలమూరుబస్తీ, జవహర్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గాలిపటాల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చైనా మాంజాతో వాహనదారులు గాయాలపాలవుతున్నారని, పక్షులు మృత్యువాత పడుతున్నాయని అన్నారు. ఎవరూ చైనా మాంజా వినియోగించవద్దని సూచించారు. డీఐ శేఖర్, ఇన్‌స్పెక్టర్లు అభిలాష్, మౌనిక, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఈస్ట్ టూ వెస్ట్ మెట్రో

## రెండో దశ విస్తరణతో సుమారు 230 కిలో మీటర్లు

- శామీర్‌పేట్, మేడ్చల్ నుంచి నేరుగా ఎయిర్‌పోర్ట్
- పటాన్‌చెరు నుంచి హయత్‌నగర్
- అందుబాటులోకి అతిపెద్ద కారిడార్లు

సాక్షి, సిటీబ్యూరో: మెట్రో రెండో దశ విస్తరణతో హైదరాబాద్ ప్రజారవాణా ముఖచిత్రంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకోనున్నాయి. ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన నార్త్‌సిటీ మెట్రో కారిడార్లతో ఉత్తర, దక్షిణాలను కలిపే అతి పెద్ద మెట్రో కారిడార్లు అందుబాటులోకి రానున్నాయి. శామీర్‌పేట్, మేడ్చల్ నుంచి నేరుగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు రాకపోకలు సాగించవచ్చు. రెండో దశలో ప్రతిపాదించిన అన్ని కారిడార్లు పూర్తయితే హైదరాబాద్ మెట్రో 230.4 కిలో మీటర్ల వరకు విస్తరించనుంది. ప్రస్తుతం మూడు కారిడార్లలో 69 కిలోమీటర్లు మెట్రో సదుపాయం ఉంది. రెండో దశలో 190.4 కిలోమీటర్ల కారిడార్లు విస్తరించనున్నారు. వీటితో పాటు ఫోర్త్‌సిటీకి ప్రతిపాదించిన మరో 40 కిలో మీటర్లు కూడా పూర్తయితే మొత్తం 230 కిలోమీటర్లతో చెన్నై, బెంగళూర్ నగరాల మెట్రోల సరసన చేరే అవకాశం ఉంది. రెండో దశలో మొదట 5 కారిడార్లలో 76.4 కిలోమీటర్లు నిర్మించాలని ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత 'బి' విభాగంగా నార్త్‌సిటీకి రెండు కారిడార్లలో 45 కిలో మీటర్ల విస్తరణకు ప్రణాళికలను రూపొందించారు. వీటితో పాటు ఎయిర్‌పోర్టు నుంచి స్కిల్ యూనివర్సిటీ వరకు మరో 40 కిలోమీటర్లు కూడా ఈ రెండో దశలోనే పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అన్ని వైపులా మెట్రో కారిడార్లు వినియోగంలోకి వస్తే లక్షలాది మంది ప్రయాణికులు అతిపెద్ద కారిడార్లలో రాకపోకలు సాగించే అవకాశం ఉంటుంది. మొదట విస్తరించనున్న 5 కారిడార్లలో 2028 నాటికి సుమారు 8 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే అవకాశం ఉందని అంచనా. నార్త్‌సిటీ రెండు కారిడార్లతో కలిపి సుమారు 10 లక్షల నుంచి 12 లక్షల మంది పయనించవచ్చని అంచనా. 2030 నాటికి 15 లక్షలు దాటనుంది.

### శామీర్‌పేట్ టూ ఎయిర్‌పోర్టు..

శామీర్‌పేట్ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి, వివిధ జిల్లాల నుంచి దేశవిదేశాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులు శామీర్‌పేట్ నుంచి ప్యారడైజ్, ఎంజీబీఎస్, చాంద్రాయణగుట్ట మీదుగా ఎయిర్‌పోర్టు వరకు సుమారు 62 కిలోమీటర్ల కారిడార్ వినియోగంలోకి రానుంది. మేడ్చల్ నుంచి కూడా ఎయిర్‌పోర్టు వరకు ఇంచుమించు 63 కిలోమీటర్ల కారిడార్ అందుబాటులోకి రానుంది. ప్రయాణికులు సికింద్రాబాద్ నుంచి ఉప్పల్, నాగోల్ మీదుగా కూడా రాకపోకలు సాగించవచ్చు. దీంతో మొదటి, రెండో కారిడార్లలో మెట్రోలు మారాల్సి ఉంటుంది. మరోవైపు మేడ్చల్, శామీర్‌పేట్ ప్రాంతాల నుంచి నేరుగా కోకాపేట్, రాయదుర్గం, హైటెక్‌సిటీ ఐటీ సంస్థలకు కూడా కనెక్టివిటీ ఏర్పడుతుంది.



### హయత్‌నగర్ నుంచి పటాన్‌చెరు..

హయత్‌నగర్ నుంచి పటాన్‌చెరు వరకు నగరంలో మరో అతిపెద్ద కారిడార్‌లో కూడా మెట్రో పరుగులు తీయనుంది. దీంతో తూర్పు, పడమరల మధ్య సుమారు 50 కిలోమీటర్ల వరకు మెట్రో కనెక్టివిటీ ఏర్పడనుంది. ప్రస్తుతం ఈ రూట్‌లో ఎల్‌బీనగర్ నుంచి మియాపూర్ వరకు 29 కిలోమీటర్లు మెట్రో అందుబాటులో ఉంది. కొత్తగా మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు 13.4 కిలోమీటర్లు, ఎల్‌బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు 7.1 కిలోమీటర్లు కొత్తగా నిర్మించడం వల్ల మొత్తం 50 కిలోమీటర్లు నిరాటంకమైన రవాణా సదుపాయం లభించనుంది. ప్రస్తుతం ఈ రూట్‌లో లక్షలాది మంది ప్రయాణికులు సిటీ బస్సులు, సొంత వాహనాలపై ఆధారపడి రాకపోకలు సాగిస్తున్నారు. ఈ ఒక్క కారిడార్‌లోనే ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

### ఎక్కడి నుంచి ఎక్కడి వరకైనా..

మరోవైపు ఇప్పుడు ఉన్న మూడు కారిడార్లలో కేవలం 69 కిలోమీటర్ల వరకు మెట్రో సదుపాయం ఉంది. దీంతో ప్రయాణికులు ఎక్కడో ఒక చోట మెట్రో నుంచి ప్రత్యామ్నాయ రవాణా సదుపాయంలోకి మారాల్సి వస్తోంది. రెండో దశలో 'ఏ' 'బీ' కారిడార్లు, స్కిల్‌యూనివర్సిటీ కారిడార్ కూడా పూర్తయితే నలువైపులా ఎక్కడి నుంచి ఎక్కడికైనా మెట్రో ప్రయాణ సదుపాయం లభించనుంది.

## ప్రారంభదశలో ఉండే స్టార్టప్‌లకు పూర్తి మద్దతు

నేషనల్ అలుమ్ని అసోసియేషన్, ఏంజెల్స్ ఇండియాతో టీహబ్ భాగస్వామ్యం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటూ..

రాయదుర్గం: దేశంలోని ప్రముఖ స్టార్టప్ ఇంక్యుబేటర్ టీ హబ్- నేషనల్ అలుమ్ని అసోసియేషన్, ఐఎస్‌ఎస్‌ఈఏడీ ఏంజిల్స్ ఇండియాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని టీహబ్ సోమవారం ప్రకటించింది. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో టీహబ్ ప్రతినిధులు, రెండు సంస్థల ప్రతినిధులతో సమావేశమై ఒప్పందం చేసుకున్నారు. ఇందులో భాగంగా టీ హబ్‌లో ప్రారంభ దశలో ఉండే స్టార్టప్‌లకు ఐఎస్‌ఎస్‌ఈఏడీ ఏంజిల్స్ నుంచి నిధులు, మార్గదర్శకత్వానికి పూర్తి మద్దతు అందించడం, ఆవిష్కరణలను ప్రోత్సహించనుంది. ఐఎస్‌ఎస్‌ఈఏడీ నేషనల్ అలుమ్ని అసోసియేషన్, టీహబ్ ఒప్పందం ప్రీ-సీడ్, సీడ్ ఫండింగ్ అవసరమైన స్టార్టప్‌ల జాబితాను సిద్ధం చేస్తుంది. ఐఎస్‌ఎస్‌ఈఏడీ ఏంజిల్స్ 50,000 డాలర్ల నుంచి 2,50,000 డాలర్ల వరకు నిధుల అవకాశాలను అందిస్తుంది. పరిశ్రమ నిపుణులు, పూర్వ విద్యార్థుల నుంచి మెంటర్‌సిప్ మద్దతు, స్టార్టప్‌లు పిచ్ డేస్, డెమోడేస్ వంటి నెట్‌వర్కింగ్ అవకాశాలకు యాక్సెస్‌ను పొందుతాయి. నేటి ప్రస్తుత పోటీ ప్రపంచానికి తట్టుకునేలా స్టార్టప్‌లను తయారు చేయడం, ఆవిష్కరించడం కోసమే ఈ ఒప్పందం చేసుకున్నట్లు టీహబ్ సీఈఓ సుజిత్ జాగిర్దార్ స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఐటీశాఖ ముఖ్య వ్యూహ అధికారి, ఐఎస్‌ఎస్‌ఈఏడీ పూర్వ విద్యార్థి శ్రీకాంత్ లంక మాట్లాడుతూ నైపుణ్యం కలిగిన స్టార్టప్‌లు విపరీతంగా ఎదగడానికి గ్లోబల్ అవకాశాలు, వనరులు కలిగి ఉన్నాయన్నారు. ప్రారంభదశ స్టార్టప్‌లు ఎదుర్కొంటున్న సవాళ్లకు ప్రత్యేకమైన అవగాహన ఈ ఒప్పందం ద్వారా ఏర్పడుతుందన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఐఎస్‌ఎస్‌ఈఏడీ నేషనల్ అలుమ్ని అసోసియేషన్ అధ్యక్షుడు వివేక్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల మనిషి మర్రి చెన్నారెడ్డి

కవాడిగూడ: తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడు, సీఎం, గవర్నర్‌గా బాధ్యతలు నిర్వర్తించి ఆ పదవులకే వన్నె తెచ్చిన మహోన్నత వ్యక్తి దివంగత మర్రి చెన్నారెడ్డి అని పలువురు వక్తలు కొనియాడారు. ఇందిరాపార్కులోని రాక్ గార్డెన్స్‌లో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చెన్నారెడ్డి 106వ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా మాజీ మంత్రి కె.జానారెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యులు వి.హన్మంతరావు, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, ఎమ్మెల్యే కాలే యాదయ్య, గోనె ప్రకాష్‌రావు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, మాజీ ఎంపీ రాజమోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ వాజీద్‌హుస్సేన్, మర్రి చెన్నారెడ్డి కుటుంబసభ్యులు మర్రి రవీందర్‌రెడ్డి, మర్రి ఆదిత్యారెడ్డి, మర్రి పురోవర్‌రెడ్డి, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, ప్రముఖ న్యాయవాది పులిగారి గోవర్ధన్‌రెడ్డి తదితరులు హాజరై మర్రి చెన్నారెడ్డి సమాధి వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.



## హరిదాసుగా శానిటరీ సూపర్‌వైజర్




- స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కల్పిస్తూ..
- కుషాయిగూడ వీధులు, మార్కెట్‌లో విస్తృత ప్రచారం

కుషాయిగూడ: సంక్రాంతి పండగ వేళ కాప్రా సర్కిల్ శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్ హరిదాసుగా మారారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా సోమవారం కుషాయిగూడ వీధులు, మార్కెట్‌లో తిరుగుతూ తడి పొడి చెత్తపై అవగాహన కల్పించారు. తడి పొడి చెత్తను ఆటో రిక్షా కార్మికులకు వేర్వేరుగా అందజేసి స్వచ్ఛతకు తోడ్పడాలని సూచించారు. మరో ప్రత్యేక విషయంపై ఆయన విస్తృత ప్రచారం చేశారు. వ్యాపార సముదాయాలు, ఇళ్లలో నిరుపయోగంగా ఉన్న ప్లాస్టిక్ వస్తువులు, బాటిల్స్, ఎలక్ట్రానిక్ వస్తువులు, న్యూస్ పేపర్లు, బట్టలు, పుస్తకాలను మల్లాపూర్‌లోని రెడ్యూస్ రీ యూస్ రీ సైకిల్(ఆర్‌ఆర్‌ఆర్) యూనిట్‌లో రీసైకిల్ చేసే ప్రక్రియపై అవగాహన కల్పించారు. అలాంటి వస్తువులను కాప్రా సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌కు అందించి సహకరించాలని డీసీ జగన్ కోరారు. తడి చెత్తను కంపోస్టుగా, పొడి చెత్తను రీసైకిల్ చేసుకునే విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛత సాధ్యమవుతుందని, సామాజిక బాధ్యతగా తడి, పొడి చెత్తలను వేర్వేరుగా అందజేసి స్వచ్ఛతకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ సిబ్బంది శివకృష్ణ, మంజుల, లక్ష్మీ, వరలక్ష్మీ పాల్గొన్నారు.



## లౌకిక పాలనకు గుర్తుగా పతంగుల ఎగురవేత

'సంఘాలను ఏకతాటిపైకి తీసుకురావడం, సంక్రాంతి గాలిపటాల ఎగురవేత' కార్యక్రమాన్ని జూబ్లీహిల్స్ రోడ్ నంబర్-25లో అసఫ్ జాహీల 9వ నిజాం రౌనక్ యార్ ఖాన్ ఎస్టేట్‌లో జరిగాయి. అసఫ్ జాహీ రాజవంశానికి చెందిన 9వ నిజాం లౌకికపాలనకు గుర్తుగా 50 ఏళ్లుగా హోలీ, సంక్రాంతి తదితర పండగలను నిర్వహించుకుంటున్నారు. - సాక్షి, సిటీబ్యూరో

# భారత వాతావరణ శాఖ @150 ఏళ్లు

## బేగంపేటలోని ఐఎండీ హైదరాబాద్ కేంద్రంలో ఓపెన్ డే

- ఇక్కడ అందించే సేవలపై విద్యార్థులకు అవగాహన
- నేడు ఐఎండీపై వర్చువల్‌గా మాట్లాడనున్న ప్రధానమంత్రి



పరికరాల గురించి సందర్శకులకు తెలియజేస్తున్న ఐఎండీ హైదరాబాద్ సంచాలకులు నాగరత్న

సనత్‌నగర్: ఇండియా మెటిరోలాజికల్ డిపార్ట్‌మెంట్(భారత వాతావరణ శాఖ) ఆవిర్భవించి 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా బేగంపేట ఎయిర్‌పోర్ట్ కాలనీలోని హైదరాబాద్ వాతావరణ కేంద్రంలో ఓపెన్ డే నిర్వహించారు. మూడు రోజుల పాటు సాధారణ సందర్శకులకు అనుమతిస్తూ ఇక్కడ జరిగే కార్యకలాపాలను నేరుగా తెలుసుకునే అవకాశం కల్పించారు. అందులో భాగంగా మొదటి రోజు సోమవారం పలు విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు ఇక్కడి వాతావరణ కేంద్రాన్ని సందర్శించి ఐఎండీ అందిస్తున్న సేవలు, వినియోగించే పరికరాల గురించి నిపుణులను అడిగి తెలుసుకున్నారు. ఐఎండీ ద్వారా హెచ్చరికలను ఏవిధంగా జారీ చేస్తారో విద్యార్థులకు వివరించారు. వెదర్ ఫోర్‌కాస్ట్, ఇన్‌స్టుమెంటేషన్, డాప్లర్ వెదర్ రాడార్, ఆగ్రోమెటిరోలాజీ, ఏవీయేషన్, ఫ్లడ్ మెటిరోలాజీ తదితర విభాగాలు, వాటి పని తీరు గురించి సైంటిస్టులు విద్యార్థులకు తెలియజేశారు. వాతావరణ సమాచారాన్ని రోజుకు నాలుగుసార్లు నమోదు చేసి హెచ్చరికలు జారీ చేస్తామని తెలిపారు. భారీ వర్షపాతం, ఉరుములు, వడగళ్లు తుఫానులు, ఆకస్మిక వరదలు, పట్టణ వరదలు, కరువు తదితర అంశాలకు సంబంధించి రాబోయే ఏడు రోజుల పాటు అన్ని జిల్లాలకు హెచ్చరికలు పంపి ప్రభుత్వం, అధికారులు, ప్రజలను ఏవిధంగా అప్రమత్తం చేస్తారో సందర్శకులకు తెలియజేశారు. జీహెచ్‌ఎంసీలో జోన్ల వారీగా హెచ్చరికలు పంపించే వ్యవస్థ ఏవిధంగా ఉంటుందో, అందుబాటులో ఉన్న ప్రసార మాధ్యమాలతో పాటు వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ఎక్స్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా సమాచారాన్ని చేరవేసే విధానం గురించి వివరించారు. డాప్లర్ వాతావరణ రాడార్ హైదరాబాద్ చుట్టూ 250 కిలో మీటర్ల వరకు వాతావరణ పర్యవేక్షణ జరుపుతుందని, మేఘాల కదలిక, తీవ్రత వివరించే వాల్యూమ్ స్కాన్, మేఘాలు వర్షించే వర్షపాతం, క్షితిజ సమాంతర గాలులకు సంబంధించిన చిత్రాలను ఏవిధంగా నమోదు చేయబడతాయో చెప్పారు. 10 నిమిషాల వ్యవధిలోనే డాప్లర్ వెదర్ రాడార్ నుంచి సేకరించిన చిత్రాల ఆధారంగా వాతావరణ విశ్లేషణ ఏవిధంగా జరుపుతారో విద్యార్థులకు తెలియజేశారు. రైతులకు వాతావరణ సమాచారాన్ని అందించడానికి 1987లో ఏర్పాటైన వ్యవసాయ వాతావరణ సలహా విభాగం పనితీరు, ప్రత్యేక వ్యవసాయ బులెటిన్ల జారీ వంటి అంశాలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఐఎండీ హైదరాబాద్ హెడ్ నాగరత్న మాట్లాడుతూ ఐఎండీ ఏర్పడి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను రూపకల్పన చేయడం జరిగిందన్నారు. సెమినార్లు, సైన్స్ ఎక్స్‌పోలు, విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు, రక్తదాన శిబిరాలు, రన్ ఫర్ వెదర్, మొక్కలు నాటడం వంటి ఎన్నో కార్యక్రమాలను చేపట్టినట్లు వివరించారు. మంగళవారం ఐఎండీపై ప్రధానమంత్రి వర్చువల్‌గా మాట్లాడనున్నట్లు తెలిపారు.



వాతావరణం గురించి తెలియజేసే పరికరాల ప్రదర్శన

## ర్యాంప్ వాక్ అదిరింది



సాక్షి, హైదరాబాద్: మహిళల ఆరోగ్య సమస్యలను థీమ్‌గా ఎంపిక చేసుకుని నగరంలో ఏర్పాటు చేసిన మిసెస్ ఇండియా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ 2025 గ్రాండ్‌ఫినాలే ఫ్యాషన్ షోలో మహిళలు క్యాట్ వాక్‌తో అదరగొట్టారు. ఆదివారం రాత్రి నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మూడు కేటగిరీలలో 70 మందికిపైగా పోటీ పడ్డారు. గద్వాల్ చేనేత కార్మికులకు మద్దతు ఇవ్వడం కోసమే చేనేత వస్త్రాలతో ఈ ప్రదర్శన నిర్వహించినట్లు నిర్వాహకులు మమత త్రివేది తెలిపారు. మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ పాల్గొనడం సంతోషంగా ఉందని ఆమె పేర్కొన్నారు.

**మిసెస్ ఇండియా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విజేతలు:** తెలంగాణ నుంచి లక్ష్మి తేజ, క్లాసిక్ కేటగిరీ మైత్రేయి అమృత సారంగి, సూపర్ క్లాసిక్ కేటగిరీ డా.రశ్మీ కండ్లికర్, ఇతర కిరీట విజేతలు సాక్షి జైన్, డా. సుష్మా రెడ్డి, సుదీప్తా డాష్, నిత్య సోని, మితాలీ అగ్రావాల్ కొనకంచి, అర్పితా మజుందార్, ప్రియాంక తారే, శ్రుతి జె, డా.పీ. సీత, మనోరంజని ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి శ్రీమతి కేటగిరీ పులిపాటి విశాలాక్ష్మి, క్లాసిక్ కేటగిరీ డా.యక్కల రాజ్యలక్ష్మి, ఇతర కేటగిరీ విజేతలు కావ్య మండవ, డా. విజయ స్పందన తదితరులు ఎంపికయ్యారు.

## ఆన్‌లైన్‌లో డ్రగ్స్ విక్రయాలు

- నలుగురి అరెస్ట్
- నిందితుల్లో బీఆర్‌ఎస్ కౌన్సిలర్ కుమారుడు



పోలీసుల అదుపులో నిందితులు

నాగోలు: సోషల్ మీడియా వేదికగా డ్రగ్స్ దందా నిర్వహిస్తున్న నలుగురు యువకులను ఎల్‌బీనగర్ పోలీసులు చేసి వారి నుంచి 5 గ్రాముల ఎండీఎంఏ, నాలుగు సెల్‌ఫోన్లు, ఒమ్ని వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జిల్లెలగూడ గౌతంనగర్‌కు చెందిన తెనుగు అజయ్, కర్మన్‌ఘాట్‌కు చెందిన గడికాన మహేందర్ కుమార్, సూర్యాపేట విద్యానగర్‌కు చెందిన గుండూరి జాపన్యరెడ్డి అలియాస్ రికీ, సూర్యాపేట జిల్లా టేకుమాట్లకు చెందిన దాసరి విల్సన్ స్నేహితులు. గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడిన వీరు అందుకు అవసరమైన డబ్బుల కోసం డ్రగ్స్ దందా నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా వాట్సాప్, ఇతర సోషల్ మీడియా వేదికల ద్వారా కస్టమర్లను ఆకర్షించి దందా కొనసాగిస్తున్నారు. బెంగళూర్‌లో డ్రగ్స్ కొనుగోలు చేసి నగరంలో అవసరమైన వారికి సరఫరా చేస్తున్నారు. వీరు మొదటగా డ్రగ్స్ కావాల్సిన వారిని వాట్సాప్ ద్వారా సంప్రదిస్తారు. వారికి ఎంత అవసరమో తెలుసుకుని అందుకయ్యే మొత్తాన్ని ఫోన్ పే, గూగుల్ పే ద్వారా ట్రాన్స్‌ఫర్ చేయించుకుంటారు. ఆర్డర్ కన్ఫర్మ్ అయిన తర్వాత ఏదో ఒక పిన్ లొకేషన్ ఎంచుకుని ఎవరికీ అనుమానం రాకుండా అక్కడ డ్రగ్స్ పెడతారు. సదరు లొకేషన్ ఫొటోలను కొనుగోలుదారుడికి పంపిస్తారు. కొందరు యువకులు ఎల్‌బీనగర్ కామినేని చౌరస్తా సమీపంలోని మారుతి రెసిడెన్సీ హోటల్ రూమ్ నంబర్-306లో డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎల్‌బీనగర్ పోలీసులు సోమవారం దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి డ్రగ్స్, సెల్‌ఫోన్లు, ఓమ్ని వ్యాన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. నిందితుల్లో ఒకరైన జాపన్యారెడ్డి సూర్యాపేట మున్సిపల్ 46వ వార్డ్ కౌన్సిలర్ పావని కృపాకర్ కుమారుడు కావడం గమనార్హం. అతడిపై సూర్యాపేటతో పాటు ఇతర ప్రాంతాల్లో కేసులు ఉన్నట్లు సమాచారం.

## ముగిసిన ఉద్యాన్ ఉత్సవ్



రాష్ట్రపతి నిలయంలో సంక్రాంతి సంబురాలు, సాంస్కృతిక ప్రదర్శనలు

కంటోన్మెంట్: బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో 12 రోజుల పాటు ×ఉద్యాన్ ఉత్సవ్× పేరిట సాగిన పూలు, హార్టికల్చర్ షో సోమవారం ముగిసింది. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ ఉత్సవాన్ని తొలిసారిగా రాష్ట్రపతి నిలయంలో ఏర్పాటు చేశారు. ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న అధికారులు, నిర్వాహకులు, వలంటీర్లకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. 12 రోజుల పాటు సాగిన ఉద్యాన్ ఉత్సవ్‌ను 1.30 లక్షల మంది సందర్శించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని మంగళవారం రాష్ట్రపతి నిలయాన్ని మూసివేస్తున్నట్లు తెలిపారు. తిరిగి బుధవారం నుంచి సాధారణ సందర్శకులను అనుమతిస్తామని పేర్కొన్నారు. మేనేజ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సాగర్ హనుమాన్ సింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్ మంత్రిత్వశాఖ అడిషనల్ కమిషనర్ డాక్టర్ ప్రశాంత్ అర్మోరికర్, రాష్ట్రపతి భవన్ డిప్యూటీ డైరెక్టర్ భరత్ భూషన్, అగ్రికల్చర్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్ మంత్రిత్వ శాఖ జాయింట్ డైరెక్టర్(ఎగ్జిబిషన్) జస్బీర్ సింగ్, సాంస్కృతిక శాఖ అకౌంట్స్ ఆఫీసర్ ప్రజాపతి, రాష్ట్రపతి నిలయం మేనేజర్ రజని ప్రియ, మేనేజ్ డైరెక్టర్ ఇరప్ప కుంబార్, అసిస్టెంట్ ఇంజినీర్ మనోజ్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, మంగళవారం, 14 జనవరి 2025



సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో సోమవారం పతంగోత్సాహం..



# ఆకర్షకులు

## అరుదైన పంటల సాగులో యువకులు

- వినూత్న ప్రయోగాలతో తీరొక్క పంటలు
- సరస్వతిగూడలో ఖర్జూర, మేడ్చల్‌లో రుద్రాక్ష
- శంకర్‌పల్లిలో వక్క..గుర్రంగూడలో కుంకుమపువ్వు
- పులిమామిడిలో యాపిల్, దెబ్బగూడలో అవకాడో
- నగర శివారు రైతుల వెరైటీ పంటల సాగు..

కేవలం ఐటీ, పారిశ్రామిక స్టార్టప్‌లకు మాత్రమే కాదు.. అరుదైన పంటల ఆవిష్కర్తలకు నగరంలోని శివారు ప్రాంతాలు వేదికగా నిలుస్తున్నాయి.. బీటెక్ కోర్సులు పూర్తి చేసి, ఐటీ, ఇతర సాంకేతిక సాగులో ఆరితేరాల్సిన జిల్లా యువత.. అరుదైన పంటల పరిశోధనలు, సాగుపై దృష్టి సారించింది. అందమైన కాశ్మీర్ లోయల్లో మాత్రమే సాగయ్యే అరుదైన కుంకుమ పువ్వు బాలాపూర్ మండలం గుర్రంగూడలో సాగవుతుండగా, కేరళ తీరం వెంట మాత్రమే సాగయ్యే వక్క తోటలు శంకర్‌పల్లిలోనూ సాగవుతున్నాయి. ఇక సిమ్లా, ఇతర శీతల ప్రదేశాల్లో మాత్రమే కనిపించే యాపిల్ ప్రస్తుతం కందుకూరు మండలం పులిమామిడిలోనూ దర్శనమిస్తున్నాయి. సౌదీ అరేబియా దేశాల్లో విరివిగా పండే ఖర్జూర సరస్వతి గూడలో నోరూరిస్తుంది. ఇప్పటి వరకూ విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న అవకాడో ప్రస్తుతం దెబ్బగూడలోనూ లభిస్తుంది. నేపాల్ సరిహద్దులో అరుదుగా లభించే రుద్రాక్ష.. ప్రస్తుతం మేడ్చల్ మండలం రాయిలాపూర్‌లో సాగవుతుండటం గమనార్హం.. - సాక్షి, సిటీబ్యూరో



### ఆశ్రమ అవసరాల కోసం..

యాపిల్ అనగానే హిమాచల్‌ప్రదేశ్, కశ్మీర్ మాత్రమే గుర్తొస్తుంది. కందుకూరు మండలం పులిమామిడిలోని మట్టిలో ఈ పంటను ఎందుకు పండించకూడదని భావించాం. ఆ మేరకు 2021 డిసెంబర్‌లో హిమాచల్‌ప్రదేశ్ నుంచి తెచ్చిన మొక్కలు నాటాం. పూర్తిగా సేంద్రీయ పద్ధతిలో చేస్తున్న సాగుతో ఒక్కో మొక్క నుంచి 100 నుంచి 200 పండ్ల వరకూ దిగుబడి వచ్చింది. 40 డిగ్రీల ఉష్ణోగ్రతను కూడా తట్టుకొని దిగుబడి వస్తుండటం విశేషం. పంటను పూర్తిగా ఆశ్రమ అవసరాల కోసమే వినియోగిస్తున్నాం.

– శార్దూల్ జోషి, శ్రీనిఖిల్ చేతనా కేంద్రం (యాపిల్)

### ఎస్‌బీఐలో ఉద్యోగం చేస్తూ..

పూర్వ మహబూబ్‌నగర్ జిల్లా అచ్చంపేటలో వ్యవసాయ కుటుంబం. నల్లగొండ ఎన్జీకాలేజీలో డిగ్రీ, ఉస్మానియాలో ఎంబీఏ పూర్తి చేశాను. ప్రస్తుతం కోఠి ఎస్‌బీఐలో పని చేస్తున్నా. అచ్చంపేటలో పదెకరాలు, సరస్వతి గూడలో ఏడెకరాలు ఉంది. యూట్యూబ్ ద్వారా అనంతపూర్‌లో ఖర్జూర సాగు చేస్తున్న విషయం తెలుసుకున్నా. ఆ మేరకు ఆరేళ్ల క్రితం మొత్తం 17 ఎకరాల్లో 1260 మొక్కలు నాటాను. ఎకరాకు రూ.5 లక్షల వరకూ వచ్చింది. మూడేళ్ల క్రితం దిగుబడి ప్రారంభమైంది. తొలిసారిగా 1.50 టన్నుల దిగుబడి వచ్చింది. ఆ తర్వాత 55 నుంచి 60 టన్నుల దిగుబడి వచ్చింది.

– ఏమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, అచ్చంపేట (ఖర్జూర)





### విదేశాల నుంచి తిరిగొచ్చి..

బీటెక్ పూర్తి చేసి, ఎంబీఏ కోసం పదేళ్ల క్రితం లండన్ వెళ్లాను. అక్కడ సరైన ఉపాధి అవకాశాలు లేక వెనక్కి తిరిగొచ్చా. అవకాడోపై అవగాహన ఉండటంతో అటువైపు చూశా.. మూడేళ్ల క్రితం 1.10 ఎకరాల విస్తీర్ణంలో 220 అవకాడో మొక్కలు నాటాను. సాధారణంగా 25 డిగ్రీల వాతావరణంలో మాత్రమే పెరిగే అవకాడో 40 డిగ్రీలకుపైగా నమోదైన ఉష్ణోగ్రతలను సైతం తట్టుకొని నిలబడింది. డ్రిప్ సాయంతో మొక్కలకు నీరు అందించా. చీడపీడల సమస్యే కాదు.. పెట్టుబడికి పైసా ఖర్చు కూడా కాలేదు. ఒక్కో చెట్టు నుంచి 150 నుంచి 200 కాయలు దిగుబడి వచ్చింది. ఆన్‌లైన్‌లో చూసి, స్వయంగా తోట వద్దకే వచ్చి కొనుగోలు చేస్తున్నారు.

– రమావత్ జైపాల్, దెబ్బడిగూడ (అవకాడో)





### వక్కసాగులో విశ్రాంత వైద్యుడు..

ఐడీపీఎల్ బాలానగర్‌లో ఫ్యామిలి ఫిజీషియన్‌గా నాలుగు దశాబ్దాల పాటు సేవలు అందించా. శంకర్‌పల్లి మాసానిగూడలోని భూమిలో ఏదైనా చేయాలని భావించా. ఏలూరులో నా స్నేహితుడు విజయసారధి సూచనలతో 2015లో నాలుగు ఎకరాల్లో.. ఎకరాకు 300 చొప్పున వక్క మొక్కలు నాటాను. 2023లో తొలి సారిగా పంట దిగుబడి 1500 కేజీలు వచ్చింది. కేజీ రూ.350 నుంచి రూ.400 పలుకుతుంది. వక్కతోటలోనే అంతరపంటలుగా మిరియాలు, యాలకులు, జాజికాయ, జాపత్రి, లవంగాలు, అల్లం, యాపిల్, ద్రాక్ష, బ్లూ బెర్రీ, బ్లాక్ బెర్రీ, అవకాడో, మ్యాంగో, జామ వంటి పండ్ల మొక్కలను సాగు చేస్తున్నా. మరో ఏడాదిలో పండ్ల దిగుబడి ప్రారంభమవుతుంది.

– డాక్టర్ విజయ్‌కుమార్ కొడాలి, బోధన్ (వక్కసాగు)

### బీటెక్ చదువుతూనే..

బాలాపూర్ మండలం గుర్రంగూడ మాది. ఇబ్రహీంపట్నం గురునానక్ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నా. వ్యవసాయ కుంటుంబం కావడంతో నాన్నతో పాటు తరచూ పొలానికి వెళ్తుంటా. కాశ్మీర్‌లో ప్యాంపూర్, పుల్వామా జిల్లాల్లో అరుదుగా పండే కుంకుమ పువ్వు పంటను ఎంచుకున్నా. మార్కెట్లో దీనికి విపరీతమైన డిమాండ్ ఉంది. కల్తీని నివారించి, నాణ్యమైన పువ్వును అందివ్వాలనుకున్నా. ఇంటిపై ఖాళీగా ఉన్న ఓ గదిలో 2024 సెప్టెంబర్‌లో సాగు ప్రారంభించాను. రూ.5 లక్షలు ఖర్చు అయ్యింది. ఇప్పటి వరకూ 20 గ్రాముల వరకూ సేకరించాం. ఒక గ్రాము రూ.800 నుంచి రూ.1000 వరకూ పలుకుతోంది.

– లోహిత్‌రెడ్డి, గుర్రంగూడ (కుంకుమ పువ్వు)

### రాయలాపూర్‌లో రుద్రాక్ష..

ఫిన్లాండ్‌కు చెందిన మహిళను వివాహం చేసుకుని మేడ్చల్ మండలం రాయలాపూర్ గ్రామ శివారులో స్థిరపడ్డారు. ఇంటి చుట్టూ వివిధ రకాల చెట్లు నాటారు. దక్షిణ భారతదేశంలో అత్యంత అరుదుగా కనిపించే రుద్రక్ష మొక్కలను ఇంటి ముందు నాటారు. ప్రస్తుతం దిగుబడి ప్రారంభమైంది. జనవరి, ఫిబ్రవరిలో కాయలు తెంపి, ఆరబెడుతుంటారు. ప్రదీప్ ఇటీవల వెయ్యి రుద్రాక్షలతో పూజ చేయడం కొసమెరుపు.

– ప్రదీప్, మేడ్చల్ (రుద్రాక్ష)



# భోగి పళ్ల.. భాగ్యం..
# ఆరోగ్య సూత్రం..

- ఆచారాల వెనుక ఆరోగ్య రహస్యం
- ముగ్గు, ముచ్చట్లు.. విందు వినోదాలు
- ఆహ్లాదాన్ని కలిగించే గాలిపటాల ఆటలు

'భోగిపండ్లు పిల్లలకు పోయడం వల్ల ఎన్ని ఆరోగ్యలాభాలు ఉన్నాయో తెలుసా?' ఇలాంటి సంభాషణలు పండుగ సమయాల్లో ఆధునికుల్లో సంప్రదాయాల పట్ల పెరుగుతున్న ఆసక్తికి, ఆరోగ్య స్పృహకు దోహదం చేస్తోంది అనేదానికి నిదర్శనం.. క్షణం తీరిక లేదంటూ ఉరుకులు, పరుగులు తీసే నగరవాసులు గంటల కొద్దీ సమయం వెచ్చించి మరీ పండుగ సంప్రదాయాలను అనుసరించడానికి దోహదం చేస్తోంది. - సాక్షి, సిటీబ్యూరో



తెల తెలవారకముందే వాకిలి శుభ్రం చేసి, ఆవు పేడతో కళ్లాపి చల్లి, ముగ్గులు దిద్దేవారు పెద్దవాళ్లు. అందమైన ముగ్గు వల్ల మనసు ఆహ్లాదభరితం అవుతుంది. తొలిజాములో పడే లేలేత సూర్యకాంతి వల్ల చర్మ సమస్యలు తగ్గుతాయి. డీ-విటమిన్ పుష్కలంగా లభించి ఎముకలు బలపడతాయి. అలాగే గొబ్బెమ్మలు ఆవుపేడతో చేస్తారు. దీని వల్ల హానికారక క్రిములు నివారించవచ్చు అని నగరంలోని ఓ గేటెడ్ కమ్యూనిటీ నివాసి ప్రశాంతి చెబుతున్నారు.

### ఆరోగ్య'భోగ్యం'..

భోగి రోజు చిన్న పిల్లలకు పోసే భోగి పళ్లు ఆరోగ్యకరం. వీటిలో అక్షింతలు, చిల్లర నాణేలు కలిపి పిల్లల తలపై వేయడంతో దిష్టిపోతుంది. రేగుపళ్లలో ఉండే సీ-విటమిన్, ఓషధ గుణాల వల్ల పిల్లల చర్మ సమస్యల నివారణకు దోహదం చేస్తుంది. ఒకప్పుడు మా అమ్మ నాకు పోయిస్తే విసుక్కునేదాన్ని. ఇందులోని ఆరోగ్యలాభాలు తెలిశాక నా పిల్లలకు తప్పనిసరిగా భోగిపళ్లు పోస్తున్నాను' అని చెప్పారు కుకట్‌పల్లి నివాసి స్వాతి.

### ఆకాశమంత.. ఆరోగ్యం..

చలికాలం డల్‌గా ఉండే వాతారణాన్ని హుషారెక్కించేవి పతంగులే. వీటిని ఎగరేయడంలో చిన్నా, పెద్దా ఆసక్తితో శరీరం చురుగ్గా మారుతుంది. 'పిల్లలతో స్నేహంగా మెలిగే అవకాశం కలుగుతుంది. పిల్లలో ఎక్కువ సమయం గడపడం వల్ల వారు మనతో ఓపెన్‌గా ఉండే అవకాశం ఏర్పడుతుంది' అని రామ్‌నగర్ నివాసి అనంతకిషోర్ చెబుతున్నారు.

### పిండితో దండిగా..

చలికాలంలో శరీరానికి వేడి కలిగించే నువ్వుల వంటలు వడ్డించడంలో ఆరోగ్యశ్రేయస్సు దాగి ఉంది. రోగనిరోధకశక్తిని పెంచే నువ్వులు, బెల్లం, మినుములు ఇవన్నీ సంక్రాంతి పిండివంటల్లో తప్పనిసరి భాగం. ప్రొటీన్లు, విటమిన్లు పుష్కలంగా అందించేలా ఈ వంటల శైలి ఉంటుంది.

### విభూదీ వైద్యమే..

భోగి మంట అయ్యాక అందులోని బూడిద తీసి నుదుటిన ధరించడంలోనూ వైద్యపరమైన ఉపయోగం దాగుంది. దీనిలో వేసే వేప, గంధం వంటివి సీజనల్ బాక్టీరియాపై పనిచేస్తాయి. శ్వాస కోస వ్యాధులను తగ్గిస్తుంది. టెక్నాలజీ పుణ్యమాని మనకి అనుకోకుండానే తెలుస్తున్నాయి. సంప్రదాయాలను పాటించడంతో పాటు పదిమందికీ తెలియజేస్తున్నాం.. అంటూ మల్కాజ్‌గిరి నివాసితులు రామకృష్ణ, మాధవి.

### ఆరోగ్యానికి మార్గం..



పండుగ సంప్రదాయం ఆరోగ్యానికి మార్గం అనేది నిజమే. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కొన్ని మార్చుకోకపోతే అనారోగ్యం బారిన పడాల్సి వస్తుంది. ఉదాహరణకు ముగ్గులు వేయడం శారీరక శ్రమ పరంగా మహిళలకు మంచిదే. అయితే ముగ్గుల్లో వాడుతున్న రంగులు సహజమైనవి అవ్వాలి. అలాగే.. చలి వాతావరణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తప్పనిసరి. పిండి వంటలు ఆరోగ్యకరమే, కానీ వాటిని మనం జీర్ణం చేసుకోగలిగినంత పరిమాణంలోనే తీసుకోవాలి. తప్పకుండా ఇంట్లో తయారు చేసినవే అయ్యి ఉండాలి. సంప్రదాయంతో పాటు ప్రస్తుత కాలమాన పరిస్థితులు కూడా దృష్టిలో పెట్టుకోవాలి

–డా.కిషోర్ రెడ్డి, అమోర్ హాస్పిటల్స్.



# పల్లవించిన ప్రజ్ఞ



- తండ్రి అనువాదం.. కూతురు ప్రవచనం
- 13 ఏళ్ల వయసులో తిరుప్పావై ప్రవచనాలు
- సొంతంగా యూ ట్యూబ్ ఛానల్
- రోజురోజుకూ పెరుగుతున్న వీక్షకుల సంఖ్య

బంజారాహిల్స్: యథా రాజా.. తథా ప్రజా.. అన్నట్లు.. ఇంటి వాతావరణం ఆధ్యాత్మిక భావాలతో నిండి ఉంటే, ఆ ఇంట పుట్టిన యువతరం కూడా ఆ దారినే అనుసరిస్తారు. అందుకు చక్కటి ఉదాహరణే కొమాండూరు ప్రజ్ఞ రాఘవన్. తమిళ వైష్ణవులైన ఐటీ ఉద్యోగి కోమాండూరు రాఘవన్, భార్గవి దంపతుల మొదటి సంతానం ప్రజ్ఞ రాఘవన్. ఈమె పల్లవి మోడల్ స్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతోంది. 13 ఏళ్ల చిన్నారి మూడేళ్ల ప్రాయం నుంచే నాయనమ్మ కొమాండూరు నళిని శ్రీనివాసన్ ప్రోత్సాహంతో భక్తి శ్లోకాలను చక్కటి ఉచ్ఛరణతో అలవోకగా పాడడం నేర్చుకుంది. తమిళులకు అతి పవిత్రమైన ధనుర్మాసంలో ప్రతిరోజూ తిరుప్పావై పాశురాలు పాడడం ఆనవాయితీ. నాయనమ్మ, తల్లిదండ్రులు క్రమం తప్పకుండా పాటించే ఈ తిరుప్పావై పారాయణం..ఆ ఆండాళ్ తల్లి అనుగ్రహంతో పుట్టిందని భావించే ప్రజ్ఞకు సహజంగానే అలవడింది.

### తమిళులైనా.. తెలుగులో..

జన్మతః తమిళులైనా, ప్రాంతీయ భాష అయిన తెలుగుపై ఉన్న గౌరవంతో, నాయనమ్మ నేర్పిన తెలుగు పాఠాలు, ప్రజ్ఞ తెలుగు ఉచ్ఛరణకు మరింత మెరుగులు దిద్దేలా చేశాయి. ఇది గమనించిన తండ్రి రాఘవన్ ప్రజ్ఞ చేత తిరుప్పావై పాశురాలను పాడించి, తన పేరుతో ప్రారంభించిన 'యువర్స్ ప్రజ్ఞ' అనే యూట్యూబ్ ఛానల్‌లో మూడు సంవత్సరాలుగా ధనుర్మాసం 30 రోజులు ప్రసారం చేస్తూ వస్తున్నారు. తిరుప్పావైకి సంబంధించి తండ్రి సేకరించి పొందుపరిచిన వ్యాఖ్యానాన్ని భావయుక్తంగా, స్వచ్ఛమైన పదోచ్చారణతో ప్రవచన శైలిలో అందిస్తోంది.

### పేరుకు తగ్గ 'ప్రజ్ఞ'..

ప్రజ్ఞ ప్రవచన తీరు చూస్తే పేరుకు తగ్గ ప్రజ్ఞా పాటవాలు చూపుతోంది అని ఎందరో పెద్దల కొనియాడారు. ఈ ఏడాది రాఘవన్ తమిళ పాశురాలను తెలుగులో పాట శైలిలో చేసిన అనువాదాన్ని తన వాక్పటిమతో, పాశుర భావానికి తగినట్లు అందరికీ అర్థమయ్యేలా వ్యాఖ్యానించి తెలుగు భాషాభిమానులు, ఆధ్యాత్మికవేత్తల నుంచి రెట్టింపు ప్రశంసలు పొంది శభాష్ అనిపించుకుంది. ప్రతిభను గుర్తించిన సుబ్బు మ్యూజికల్ అకాడమీ అధ్యక్షులు శ్రీధరం రామ సుబ్రహ్మణ్యం ఈ నెల 12న నిర్వహించిన సంగీత విభావరిలో గౌరవ అతిథి కొమరవోలు శ్రీనివాసరావు, నరేష్‌కుమార్ ప్రజ్ఞను జ్ఞాపికతో సత్కరించారు. ప్రజ్ఞ సంగీత విభావరులలో గాయకుడైన తండ్రి రాఘవన్‌తో పలు కార్యక్రమాల్లో, సినీ సంగీతంలోనూ శ్రోతలను ఆకట్టుకోవడం కొసమెరుపు.

జనగామ/ జనగామ జిల్లా

# అంతర పంటలతో అద్భుతాలు

విభిన్నమైన వ్యవసాయంతో ఆకట్టుకుంటున్న ఒగ్గు సిద్ధులు

సేంద్రియ వ్యవసాయం చేయడమే కాదు.. అందులోనూ అంతర పంటలుగా విభిన్నమైన నువ్వులు, సుగంధ ద్రవ్యాలు, ఆయుర్వేద మొక్కలను సాగు చేస్తూ ఆకట్టుకుంటున్నారు.. రైతు ఒగ్గు సిద్ధులు. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం ఇటికాలపల్లికి చెందిన ఆయన.. పదో తరగతి చదివే సమయంలో కంటి సమస్యలకు లోనయ్యారు. దానితో చదువు మధ్యలోనే ఆపేశారు. తల్లిదండ్రులకు సాయంగా పొలం వద్దకు వెళ్లేవారు. ఈ క్రమంలో 2016లో సేంద్రియ వ్యవసాయం మొదలు పెట్టారు. మొట్టమొదట రెండెకరాల్లో బీపీటీ రకం బియ్యాన్ని రసాయన ఎరువులు, పురుగుమందులు లేకుండా సాగు చేసి విజయం సాధించారు. అదే స్ఫూర్తితో అనేక ప్రయోగాలు చేస్తూ ముందుకెళుతున్నారు.

**రకరకాల పంటలతో..**

తన పొలంలో బ్లాక్ రైస్, రక్తశాలి, రెడ్ రైస్, బహురూపి (ఎనర్జీ రైస్), గొట్టి వడ్లు, మైసూర్ మల్లిక వంటి రకాల వరి సాగు చేశారు. వాటిని రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలతోపాటు బెంగళూరు, మహారాష్ట్రలకు కూడా ఎగుమతి చేశారు. ప్రతీసారి పంట మార్పిడి చేస్తూ వస్తున్నారు. కొబ్బరి తోటను వేసి, అందులో అంతర పంటగా నువ్వుల సాగు చేపట్టారు. అంతేకాదు ఈ పంట సాళ్ల మధ్య మిరియాలు, జాజికాయ, జాపత్రి, సపోటా, అరటి, అశ్వగంధ వంటి వాటి సాగుపై దృష్టిపెట్టారు. దేశీ ఆవులను పెంచుతున్న ఆయన.. ఆర్గానిక్ నెయ్యి తయారు చేసి విక్రయిస్తారు. ఇంటికి అవసరమైన అన్ని కూరగాయలను సొంతంగానే సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ఏటా ఏడెనిమిది లక్షల వరకు సంపాదిస్తున్నానని.. 2030 సంవత్సరం నాటికి నెలకు లక్ష రూపాయలను వ్యవసాయంపైనే సంపాదించేలా ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నానని రైతు సిద్ధులు చెబుతున్నారు.





## తెలుగు ప్రజలకు జగన్ సంక్రాంతి శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: సంక్రాంతి పర్వదినం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. మన సంస్కృతి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, సొంత గ్రామాల మీద మమకారానికి మనమంతా ఇచ్చే గౌరవానికి సంక్రాంతి పండుగ ప్రతీక అని పేర్కొన్నారు. భోగి మంటలు, రంగ వల్లులు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, గాలిపటాల సందళ్లు, పచ్చని పైరుల కళకళలు గ్రామాల్లో సంక్రాంతి శోభను తీసుకువచ్చాయన్నారు. ప్రతి కుటుంబం ఎంతో సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. అలాగే సంక్రాంతి పండుగ అందరి కుటుంబాల్లో భోగభాగ్యాలు నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ భోగి, సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ సోషల్‌మీడియా వేదిక 'ఎక్స్'లో వైఎస్ జగన్ పోస్టు చేశారు.

## రైతన్న జీవితాల్లో వెలుగులు కొనసాగాలి

కేసీఆర్ సంక్రాంతి శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: రైతుల జీవితాల్లో వెలుగులు నింపడం ద్వారా మాత్రమే సంక్రాంతి శోభ ద్విగుణీకృతమవుతుందని మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. రాష్ట్ర ప్రజలకు ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పండిన పంటల రాశులతో ఇళ్లు కళకళలాడుతుండగా, రైతు జీవితాల్లో సంక్రాంతి శోభ నిండుదనాన్ని సంతరించుకుంటుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# పేరు, ఇంటి పేరూ మార్చుకోవచ్చు

దరఖాస్తుదారుల తప్పిదాలతోనే పాస్‌పోర్టుల జారీలో జాప్యం

'మీతో-సాక్షి'లో పాఠకుల సందేహాలకు ఆర్‌పీఓ జొన్నలగడ్డ స్నేహజ సమాధానాలు

సరైన ధ్రువపత్రాలు ఉంటే పాస్‌పోర్టు పొందడం చాలా సులువు

- పోలీసు వెరిఫికేషన్ కీలకం.. కేసులుంటే కోర్టు ఆదేశాల మేరకు నడుచుకుంటాం
- అపాయింట్‌మెంట్‌ను రెండు సార్లు రీషెడ్యూల్ చేసుకోవచ్చని వెల్లడి



మన దేశం దాటి బయటికి వెళ్లాలంటే.. పాస్‌పోర్టు తప్పనిసరి. దీనికోసం కఠినమైన నిబంధనలు ఉంటాయని, పాస్‌పోర్టు పొందడం పెద్ద ప్రహసనమనే భావనలో చాలా మందిలో ఉంటుంది. అయితే సరైన ధ్రువపత్రాలు ఉంటే పాస్‌పోర్టు పొందడం చాలా సులువని ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి (ఆర్‌పీఓ) జొన్నలగడ్డ స్నేహజ చెప్పారు. దరఖాస్తుదారులు చేసే తప్పిదాలతోనే పాస్‌పోర్టుల జారీ ఆలస్యం అవుతుందని, ఇతర సమస్యలు వస్తాయని స్పష్టం చేశారు. 'మీతో-సాక్షి'ద్వారా పాఠకుల సందేహాలకు ఆమె సమాధానాలు ఇచ్చారు.

- సాక్షి, హైదరాబాద్

నా ఆధార్‌లో, మిగతా గుర్తింపుకార్డుల్లో అడ్రస్ వేర్వేరుగా ఉంది. వాటితో పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకోవచ్చా?

- పూలగుజ్జ యాకయ్య, చెర్లపాలెం, మహబూబాబాద్

➤ ప్రస్తుతం దరఖాస్తుదారు నివసిస్తున్న చిరునామాకు సంబంధించిన ధ్రువీకరణపత్రం ఒకటి కచ్చితంగా ఉండాలి. ప్రభుత్వ విభాగాలేవైనా జారీ చేసిన గుర్తింపుకార్డుతోపాటు డ్రైవింగ్ లైసెన్సు, ఆధార్ కార్డు, రెంటల్ అగ్రిమెంట్, గ్యాస్ బిల్లుల్లో ఏదో ఒకటి చిరునామా ప్రూఫ్‌గా జత చేయవచ్చు.

పాస్‌పోర్టు కోసం స్లాట్ బుక్ చేసుకుని, ఫీజు చెల్లించాను. ప్రమాదానికి గురవడంతో ఆ రోజు వెళ్లలేదు. రీషెడ్యూల్ చేసుకోవచ్చా?

- కె.సుధారాణి, హైదరాబాద్

➤ రీషెడ్యూల్‌కు అవకాశం ఉంది. సాధారణ పాస్‌పోర్టు కోసం ఒకసారి దరఖాస్తు చేసుకోవడానికి, ఆ అపాయింట్‌మెంట్‌ను రెండుసార్లు రీషెడ్యూల్ చేసుకోవడానికి అవకాశం ఉంది. తత్కాల్ పాస్‌పోర్టు కోసమైతే ఒకేసారి రీషెడ్యూల్ చేసుకోవచ్చు. ఆపైన రీషెడ్యూల్ అవసరమైన వాళ్లు తగిన ఆధారాలతో ఆర్‌పీఓ కార్యాలయానికి ఈ–మెయిల్ చేయాలి.

నా మీద ఓ కేసు పెండింగ్‌లో ఉంది. కోర్టు ఆర్డర్ తీసుకుంటే ఒక ఏడాది కాలపరిమితితో పాస్‌పోర్టు ఇచ్చారు. రెన్యూవల్ చేయించుకుంటే 10 ఏళ్లకు ఇస్తారా? లేక మళ్లీ కోర్టు ఆర్డర్‌తో రావాలా?

- కె.వెంకట్‌రెడ్డి, ఉప్పర్‌గూడ

➤ కేసు వీగిపోయి, పోలీసు క్లియరెన్స్ ఉంటే మాత్రమే పదేళ్ల కాలపరిమితితో పాస్‌పోర్టు జారీ చేస్తాం. కేసులున్న వారి విషయంలో న్యాయస్థానం ఆదేశాల మేరకు నడుచుకుంటాం. ప్రస్తుత నిబంధనల ప్రకారం దరఖాస్తు తేదీకి ముందు ఐదేళ్లలో ఎవరికైనా రెండేళ్లకు మించి శిక్షపడి ఉంటే... వారికి శిక్షపడిన తేదీ నుంచి ఐదేళ్ల వరకు పాస్‌పోర్టు జారీ చేయం. న్యాయస్థానం నుంచి ఏవైనా ఆదేశాలు ఉంటే అమలు చేస్తాం.

మీతో సాక్షి

నా భార్యది రెండో వివాహం. ఆమె పాస్‌పోర్టులో మొదటి భర్తకు సంబంధించిన ఇంటి పేరు ఉంది. అది మా ఇంటి పేరుకి ఎలా మార్చుకోవాలి?

- జి.ప్రదీప్‌రెడ్డి, హైదరాబాద్

➤ ఇందుకోసం మొదటి భర్త నుంచి విడాకులు పొందిన ధ్రువీకరణతోపాటు మీ వివాహానికి సంబంధించిన మ్యారేజ్ సర్టిఫికెట్ సమర్పించాలి. పాస్‌పోర్టు రీ–ఇష్యూ కింద చేంజ్ ఇన్ పర్టిక్యులర్స్ ఆప్షన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

నా ఇంటి పేరు టెన్త్ సర్టిఫికెట్‌లో తప్పుగా పడింది. పాస్‌పోర్టులో అలాగే వచ్చింది. ఆధార్, పాన్‌కార్డుల్లో సరిగ్గానే ఉంది. పాస్‌పోర్టులో ఎలా మార్చుకోవాలి?

- పి.వెంకటేశ్వర్లు, జమ్మికుంట

➤ ఇంటి పేరు, పేరులో స్పెల్లింగ్ తప్పు వస్తే.. ఆ వివరాలు సరిగా ఉన్న ఏవైనా రెండు ప్రభుత్వ గుర్తింపుకార్డులతో దరఖాస్తు చేసుకోవచ్చు. పేరు పూర్తిగా మార్చుకోవాలంటే మాత్రం రెండు దినపత్రికల్లో ప్రకటనలు ఇవ్వడం లేదా గెజిట్ నోటిఫికేషన్ తప్పనిసరి. దీనితోపాటు కొత్త పేరుతో ఉన్న రెండు గుర్తింపుకార్డుల ఆధారంగా దరఖాస్తు చేసుకోవాలి.

తల్లిదండ్రులు విడిపోయినప్పుడు మైనర్లకు పాస్‌పోర్టు తీసుకోవడానికి ఏ సర్టిఫికెట్లు సమర్పించాలి?

- సాయి, ఆర్కేపురం, హైదరాబాద్

➤ ఇందుకోసం అనెగ్జర్–సీ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. న్యాయస్థానం ఇచ్చిన కస్టడీ ఆర్డర్‌ను జత చేయాలి. తల్లిదండ్రుల్లో ఎవరికైనా విజిటేషన్ రైట్స్ ఉంటే వారి నుంచి ఎన్‌ఓసీ అడుగుతాం. సాధారణ పాస్‌పోర్టు మాత్రమే ఇస్తారు. తత్కాల్‌లో పాస్‌పోర్టు పొందే అవకాశం లేదు.

నా భార్య పాస్‌పోర్టు వారి పుట్టింటి పేరుతో ఉంది. మా ఇంటి పేరుతో ఎలా మార్చుకోవాలి?

- రాఘవేంద్ర, హైదరాబాద్

➤ వివాహమైన మహిళలు పాస్‌పోర్టులో ఇంటిపేరు మార్చుకోవడానికి విడిగా ఎలాంటి పత్రాలు ఇవ్వనక్కర్లేదు. అడ్రస్ ప్రూఫ్‌గా భర్త పాస్‌పోర్టు కాపీ ఇవ్వవచ్చు. భర్త పాస్‌పోర్టు వేరే చిరునామాతో ఉంటే మరో అడ్రస్ ప్రూఫ్ ఇవ్వాలి. ఆ అడ్రస్ ప్రూఫ్‌లో మహిళ పేరు కొత్త ఇంటి పేరుతో ఉండాలి.

పాఠకుల మరికొన్ని ప్రశ్నలకు ఆర్‌పీఓ జొన్నలగడ్డ స్నేహజ ఇచ్చిన సమాధానాలు సాక్షి ప్లస్ (ఈ-పేపర్)లో...



## యాదాద్రిలో కనుల పండువగా గోదాదేవి కల్యాణం

అమ్మవారి కల్యాణానికి పట్టు వస్త్రాలు సమర్పించిన అసెంబ్లీ స్పీకర్

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం గోదాదేవి–శ్రీరంగనాథుల కల్యాణోత్సవాన్ని ఆచార్యులు ఘనంగా నిర్వహించారు. తొలుత శ్రీస్వామి అమ్మవార్లను విశేషంగా అలంకరించి ఆలయ తిరు, మాడ వీధిలో సంప్రదాయంగా అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలతో వెంట నడిచారు. గోదాదేవి, శ్రీరంగనాథుల కల్యాణ సేవను తిరు, మాడవీధిలో భక్తుల మధ్య ఊరేగించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో గోదాదేవి – శ్రీరంగనాథులను అధిష్టించి కల్యాణ తంతును ప్రారంభించారు. పంచనారసింహుల సమక్షంలో జరుగుతున్న ఈ కల్యాణ వేడుకను ఆచార్యులు శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ వేడుకల్లో ఆలయ ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి దంపతులు, ఆలయ ప్రధానార్చకులు, అర్చకులు, వేద పండితులు, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. మంగళవారం సంక్రాంతి పర్వదినాన అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించే కార్యక్రమాన్ని ప్రధానాలయంలో అర్చకులు నిర్వహించనున్నారు. కాగా, ఆలయాన్ని సందర్శించిన శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, ఈవో భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదంతో పాటు శ్రీస్వామి వారి చిత్ర పటాన్ని అందజేశారు.

### వెన్నముద్ద కృష్ణుడిగా శ్రీనృసింహుడు



యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో అధ్యయనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం ఉదయం శ్రీస్వామి వారిని వెన్నముద్ద కృష్ణుడిగా.. రాత్రి కాళీయమర్ధన అలంకార సేవలో ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. శ్రీస్వామి వారి సేవకు ముందు పారాయణికులు పారాయణం చేశారు.

## చోరీ బంగారాన్ని సీజ్ చేయొచ్చు

పోలీసులకు అధికారం ఉంటుందన్న హైకోర్టు

మణప్పురం ఫైనాన్స్ పిటిషన్ కొట్టివేత

సాక్షి, హైదరాబాద్: చోరీ బంగారాన్ని, నగలను సీజ్ చేసే అధికారం సీఆర్‌పీసీ సెక్షన్ 102 (బీఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ 106) కింద పోలీసులకు ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. ఎఫ్‌ఐఆర్ నమోదు మొదలు ఇతర విచారణ అంతా పోలీసులు జరపవచ్చని చెప్పింది. ఇలాంటి విషయాల్లో కోర్టులు ఎలాంటి మార్గదర్శకాలు జారీ చేయలేవని తేల్చి చెప్పింది. అయితే, తమ బంగారాన్ని విడుదల చేయాలని కోరుతూ ట్రయల్‌కోర్టులో మణప్పురం సంస్థ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని సూచించింది. చోరీ బంగారాన్ని తనఖా పెట్టుకోవడం సరికాదని, వెంటనే తమకు అప్పగించాలంటూ పోలీసులు ఇచ్చిన నోటీసులపై మణప్పురం ఫైనాన్స్ లిమిటెడ్ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలు చేసింది. ఇలా 2021 నుంచి దాఖలైన 16 పిటిషన్లపై న్యాయ మూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మార్గదర్శకాల మేరకే బంగారాన్ని తాకట్టు పెట్టుకున్నామని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. రుణాన్ని మంజూరు చేసే వ్యక్తి వివరాలన్నీ ధ్రువీకరించుకున్న తర్వాతే రుణం ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. పోలీసుల నోటీసుల ప్రకారం నగలను అప్పగించినట్లయితే రుణాన్ని తిరిగి రాబట్టుకోవడం సాధ్యం కాదన్నారు. అయితే దర్యాప్తు జరుగుతుండగా కోర్టును ఆశ్రయించడం సరికాదని, మణప్పురం పిటిషన్‌ను కొట్టివేయాలని జీపీ మహేశ్‌రాజే వాదించారు. మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసి విచారణను అడ్డుకోవద్దని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఇలాంటి కేసుల్లో పోలీసులకు ఎలాంటి మార్గదర్శకాలు జారీ చేయలేమన్నారు. గతంలో కర్ణాటక కోర్టు ఇలాంటి పిటిషన్‌ను కొట్టివేసిందని గుర్తు చేశారు. బంగారం చోరీ చేసింది కాదని నిరూపిస్తేనే జోక్యం సాధ్యమవుతుందని చెప్పారు. నగలకు సంబంధించి మణప్పురం ఫైనాన్స్ సంస్థ ట్రయల్ కోర్టును ఆశ్రయించవచ్చని సూచించారు. మణప్పురం సంస్థ దాఖలు చేసిన పిటిషన్లను కోర్టు కొట్టివేసింది.



ఏపీలో కోడి పందేల జాతర మొదలైంది. ఉమ్మడి గోదావరి జిల్లాల్లో హైటెక్ హంగులు.. మినీ స్టేడియంలను తలపించిన బరుల్లో కోళ్లు కత్తులు దూశాయి. భారీ టెంట్లు.. వీవీఐపీ, వీఐపీ, సామాన్య జనానికి వేర్వేరుగా ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది కోడి పందేల జాతర రాయలసీమ జిల్లాలకు పాకింది.

కోనసీమ జిల్లా మురమళ్లలో స్టేడియాన్ని తలపించేలా భారీ సెట్టింగుల మధ్య కోడిపందేల నిర్వహణ

## తిరుమల లడ్డూ విక్రయ కేంద్రంలో అగ్నిప్రమాదం

షార్ట్ సర్క్యూట్ కారణం

తిరుమల : శ్రీవారి లడ్డూ విక్రయ కేంద్రంలో షార్ట్ సర్క్యూట్‌తో సోమవారం స్వల్ప అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. 47వ కౌంటర్లో అకస్మాత్తుగా యూపీఎస్ వైర్ కాలిపోవడంతో మంటలు వచ్చి పొగ వ్యాపించింది. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది మంటలను అదుపుచేశారు. సిబ్బంది సకాలంలో స్పందించడంతో ఎటువంటి ప్రమాదం చోటుచేసుకోలేదని టీటీడీ ఓ ప్రకటనలో తెలిపింది.



మంటలు రావడంతో కంప్యూటర్ సీపీయూ వైర్లను తొలగిస్తున్న ఉద్యోగి

## అధికారిక లాంఛనాలతో మందా జగన్నాథం అంత్యక్రియలు



మందా జగన్నాథం కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న కేటీఆర్

సైదాబాద్ (హైదరాబాద్): నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ మందా జగన్నాథం అంత్యక్రియలు అధికార లాంఛనాలతో సోమవారం జరిగాయి. చంపాపేటలోని ఆయన నివాసంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్య, మాజీ ఎంపీ కేశవరావు, ఆర్‌ఎస్. ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్యే సత్యనారాయణ, మంద కృష్ణమాదిగ, కాంగ్రెస్ నేతలు మధుయాష్కీ, సంపత్‌కుమార్, పలువురు నాయకులు జగన్నాథం కుటుంబసభ్యులను పరామర్శించారు. లోక్‌సభ సభ్యునిగా ఆయన ప్రజలకు ఎంతో సేవ చేశారని, నిత్యం ప్రజల గురించి ఆలోచించే ఓ సీనియర్ నాయకుడ్ని రాష్ట్రం కోల్పోయిందని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రాష్ట్ర ఏర్పాటుకు ఎంతో కృషి చేసి, ఎప్పుడూ తెలంగాణ అభివృద్ధిని ఆయన కోరుకునే వారని కేటీఆర్ అన్నారు. చంపాపేట వైశాలీనగర్ నుంచి ధోబీఘాట్ వరకు మందా జగన్నాథం అంతిమయాత్ర సాగింది.

## అందుబాటులోకి మరో పర్యాటక ప్రాంతం

'అక్క మహాదేవి–దోమలపెంట స్టే ప్యాకేజీ'కి రూపకల్పన

సాక్షి, హైదరాబాద్: మరో పర్యాటక ప్రాంతం ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. నల్లమల అడవుల్లో ప్రకృతి ఒడిలో రెండురోజులు (ఒకరోజు రాత్రి) సేదదీరేందుకు అవకాశం కల్పించేలా అటవీ అధికారులు ఈ ట్రావెల్ ప్యాకేజీని రూపొందించారు. అటవీశాఖ ఎకో టూరిజం ప్రాజెక్ట్‌లో భాగంగా దీనిని అందుబాటులోకి తీసుకొస్తున్నారు. 'అక్క మహాదేవి–దోమలపెంట స్టే ప్యాకేజీ'లో దోమలపెంట పరిసర ప్రాంతాల్లో పర్యటనలో భాగంగా మొదటిరోజు పర్యాటకులను సఫారీ వాహనాల్లో ఆక్టోపస్ వ్యూ పాయింట్, వజ్రాల మడుగు వాచ్‌టవర్ సందర్శనకు తీసుకెళతారు. అక్కడే కొండల్లో, నదీ పరిసరాల్లో విహరించే ఏర్పాట్లు చేశారు. రెండోరోజు.. సఫారీలోనే అక్కమహాదేవి ట్రెక్కింగ్ పాయింట్‌కు తీసుకెళతారు. అక్కడి నుంచి ట్రెక్కింగ్ చేస్తూ అక్కమహాదేవి గుహలకు పర్యాటకులు చేరుకుంటారు. ఈ మార్గమధ్యలో నల్లమల అడవి అందాలు, జంతువుల కదలికలను వీక్షిస్తూ ముందుకు సాగేలా ఏర్పాటు చేశారు. సందర్శకులు అక్కమహాదేవి గుహను చేరుకున్నాక, వారు అక్కడ మహాశివుడిని దర్శించుకోవచ్చు. ఈ టూర్‌కు సంబంధించి రూ.6,500 నుంచి రూ. 8 వేల వరకు టారిఫ్‌ను నిర్ణయించారు. రెండు రోజులు సఫారీ, వ్యూపాయింట్, ట్రెక్కింగ్, అక్కమహాదేవి గుహల సందర్శన వంటి వాటికి కలిపి ఈ మొత్తాన్ని వసూలు చేస్తారు. వివరాలకు www. amrabadtigerreserve.com వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని దోమలపెంట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఒక ప్రకటనలో తెలిపారు.

# క్లస్టర్ల వారీగా సర్వే

- క్షేత్రస్థాయిలో సాగు యోగ్యం కాని భూముల నిర్ధారణ
- ఆ భూములకు రైతు భరోసా నుంచి మినహాయింపు
- ఈనెల 16 నుంచి 20 వరకు అన్ని మండలాల్లో సర్వే
- ఒక క్లస్టర్ పరిధిలో 5 వేల ఎకరాల వరకు వ్యవసాయ భూములు
- నాలుగేళ్లుగా 'క్రాప్ బుకింగ్ యాప్'లో సాగులో లేని భూముల వివరాల నమోదు
- భూభారతి పోర్టల్‌లోకి ఈ భూముల వివరాల అప్‌లోడ్



సాక్షి, హైదరాబాద్: సాగు యోగ్యం కాని భూముల జాబితా తయారీకి రంగం సిద్ధమైంది. అధికార యంత్రాంగం క్లస్టర్ల వారీగా క్షేత్ర స్థాయిలో సర్వే చేసి, సాగు యోగ్యం కాని భూముల జాబితాను రూపొందించనుంది. సాగు యోగ్యం కాని భూములకు రైతుభరోసా వర్తింపజేయకూడదని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈనెల 16వ తేదీ నుంచి 20 తేదీ వరకు రాష్ట్రంలోని అన్ని మండలాల్లో ఏకకాలంలో సర్వే జరగనుంది. ఒక క్లస్టర్ పరిధిలో 5వేల ఎకరాల వరకు వ్యవసాయ భూములు ఉంటాయి. ఈ క్లస్టర్‌కు వ్యవసాయ శాఖ నుంచి ఒక వ్యవసాయ విస్తరణాధికారి (ఏఈవో)ని, రెవెన్యూ నుంచి డిప్యూటీ తహసీల్దార్ లేదా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను నియమించి, వీరి ద్వారా క్షేత్రస్థాయి సర్వే చేయించనున్నారు. మండలంలోని అన్ని క్లస్టర్లలో జరిగే సర్వేను మండల వ్యవసాయ అధికారి, తహసీల్దార్ పర్యవేక్షిస్తారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెళ్లాయి.

**క్రాప్ బుకింగ్ యాప్ వివరాల ఆధారంగా..**

రాష్ట్రంలో వానాకాలం, యాసంగి రెండు కాలాల్లో సాగు చేయని పట్టా భూముల వివరాలు ఇప్పటికే అన్ని జిల్లాల వ్యవసాయ శాఖ అధికారులకు చేరాయి. ఒక్కో జిల్లాలోని మండలాల వారీగా రెవెన్యూ గ్రామం యూనిట్‌గా ఈ జాబితా ఉంది. వ్యవసాయ శాఖ గత నాలుగేళ్లుగా ఆయా సీజన్లలో సాగైన పంటల వివరాలను 'క్రాప్ బుకింగ్ యాప్'లో నమోదు చేస్తోంది. ఒక సీజన్‌లో ఒక రైతు ఆయా సర్వే నంబర్లలో ఉన్న భూముల్లో ఎన్ని ఎకరాల్లో ఎంత పంట వేశాడనే విషయాన్ని ఈ యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఈ మేరకు ఆయా సర్వే నంబర్లలో సాగు కాకుండా ఉన్న భూముల వివరాలు కూడా అందులో ఉంటాయి. అంటే పట్టా పాస్ పుస్తకంలో వ్యవసాయ భూమిగా ఉన్నప్పటికీ.. ఆ సర్వే నంబర్‌లో కళాశాల భవనం గానీ, రియల్ ఎస్టేట్ వెంచర్, మైనింగ్ వంటి వ్యవసాయేతర పనులకు గానీ వినియోగిస్తున్నట్లైతే ఆ వివరాలను కూడా పొందుపరిచారు. ఈ విధంగా ఈ నాలుగేళ్లలో సాగు చేయకుండా వదిలేసిన భూముల వివరాలను వ్యవసాయ శాఖ ఈ యాప్ ద్వారా సేకరించింది.

**సర్వే నంబర్ యూనిట్‌గా..**

'క్రాప్ బుకింగ్ యాప్'లోని వివరాల ఆధారంగా పట్టాదారు పాస్ పుస్తకంను యూనిట్‌గా తీసుకొని అందులో రైతు పేరిట ఎన్ని ఎకరాల భూమి ఉంటే ఆ మేరకు ప్రభుత్వం 'రైతుబంధు' పథకం కింద పెట్టుబడి సాయం బ్యాంకు ఖాతాలో జమచేసేది. పాస్ పుస్తకం నుంచి వ్యవసాయ యోగ్యం కాని భూమి గల సర్వే నంబర్‌ను తొలగించే విధానం రైతుబంధు పథకంలో లేదు. తాజాగా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రైతుభరోసాకు సంబంధించి భూభారతి పోర్టల్‌లో కొత్త సాఫ్ట్‌వేర్ వినియోగిస్తున్నట్లు తెలిసింది. దీని ప్రకారం పట్టా పాస్ పుస్తకం యూనిట్‌గా కాకుండా సర్వే నంబర్‌ను యూనిట్‌గా తీసుకొని అందులో ఉన్న భూములకు రైతుభరోసా అమలు చేయనున్నారని సమాచారం. సదరు సర్వే నంబర్‌లో వ్యవసాయ యోగ్యం కాని పట్టా భూములు ఉంటే వాటిని ప్రత్యేకంగా నోటిఫై చేసి, రైతుభరోసా సాయం నుంచి వాటిని మినహాయించనున్నారు.

**భూభారతి పోర్టల్‌లోకి అప్‌లోడ్**

క్రాప్ బుకింగ్ యాప్ నుంచి సేకరించిన సాగులో లేని భూముల వివరాలను 'భూభారతి' పోర్టల్‌లోకి వ్యవసాయ శాఖ అప్‌లోడ్ చేసింది. ఏఈవోలు భూభారతి పోర్టల్‌లో ఆయా క్లస్టర్లలో ఉన్న భూముల జాబితాను చూడవచ్చు. ఈ వివరాల ఆధారంగా ఈనెల 16 నుంచి క్షేత్రస్థాయికి వెళ్లి ఆ భూముల్లో పంటలు సాగయ్యాయో లేదో పరిశీలించి నిర్ధారిస్తారు. తర్వాత ఆ భూముల వాస్తవ స్థితిని పోర్టల్‌లోకి ఎక్కిస్తారు. వ్యవసాయ యోగ్యం కాని భూముల తుది జాబితాను రూపొందించి జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ)కి పంపిస్తారు. డీఏఓ ఆమోదంతో 21, 21 తేదీల్లో గ్రామ సభలు నిర్వహించి వ్యవసాయ యోగ్యం కాని భూముల జాబితాను ప్రచురిస్తారు. అక్కడ ఏవైనా అభ్యంతరాలు, సూచనలు వస్తే వాటిని నమోదు చేసుకుని మండలాధికారుల ద్వారా జిల్లా అధికారులకు పంపిస్తారు. 23వ తేదీన తుది జాబితా రూపొందిస్తారు. 24న జిల్లా ఇన్‌చార్జి మంత్రి, జిల్లా మంత్రుల ఆమోదంతో ప్రభుత్వానికి పంపిస్తారు. అనంతరం 26వ తేదీ నుంచి సాగు యోగ్యమైన భూములకు రైతుభరోసా కింద రైతుల ఖాతాల్లో భరోసా డబ్బులు జమవుతాయి.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
మంగళవారం ॥ 14-1-2025



**థీమ్‌తో బొమ్మల కొలువు**
సంక్రాంతికి ప్రతియేటా ఐదు రోజులు బొమ్మలు కొలువు పెడుతుంటాం. చిన్నప్పటి నుంచి నాకున్న సరదా ఇది. నేను, మా అమ్మాయి, మనవరాలు కలిసి రకరకాల బొమ్మలను, వాటి అలంకరణను స్వయంగా చేస్తాం. ప్రతి ఏటా ఒక థీమ్‌ను ఎంచుకుంటాం. అందకు పేపర్, క్లే, అట్టలు, పూసలు, క్లాత్స్.. ఎంచుకుంటాం. ఈ సారి ఉమెన్ పవర్ అనే థీమ్‌తో నవదుర్గలు పెట్టాం. అమ్మ వార్ల బొమ్మలు ఇప్పటికీ ఇంట్లో ఉన్నాయి. గుడిలాగా అలంకారం చేశాం. గుడికి అమ్మాయిలు వస్తున్నట్టు, పేపర్లతో అమ్మాయిల బొమ్మలను చేశాం. తిరుపతి చందనం బొమ్మల సేకరణ కూడా ఉంది. ఆ బొమ్మలతో కైలాసం అనుకుంటే శివపార్వతులుగా, తిరుపతి అనుకుంటే వెంకటేశ్వరస్వామి, పద్మావతి... ఇలా థీమ్‌కు తగ్గట్టు అలంకరణ కూడా మారుస్తాం. ఈ బొమ్మల కొలువుకు మా బంధువులను, స్నేహితులను పిలుస్తుంటాం. ఎవరైనా అడిగితే వాళ్లు వచ్చేవరకు ఉంచుతాం.

– శీలా సుభద్రాదేవి, రచయిత్రి



మంచుకు తడిసిన ముద్దబంతులు... ముగ్గులు...
పూలు విచ్చుకున్న గుమ్మడి పాదులు... కళ్లాపిలు....
వంట గదుల్లో తీపీ కారాల ఘుమఘుమలు...
కొత్త బట్టలు... కొత్త అల్లుళ్ల దర్పాలు...
పిల్లల కేరింతలు... ఓపలేని తెంపరితనాలు
సంక్రాంతి అంటే సందడే సందడి.

మరి మేమేం తక్కువ అంటున్నారు సినిమా తారలు.
మా సంక్రాంతిని వినుమా అని ముందుకొచ్చారు.
రచయిత్రులు ఊసుల ముత్యాల మాలలు తెచ్చారు.
'ఫ్యామిలీ' అంతా సరదాగా ఉండే సంబరవేళ ఇది.
ప్రతిరోజూ ఇలాగే పండగలా సాగాలని కోరుకుంటూ
సంక్రాంతి శుభాకాంక్షలు తెలియచేస్తున్నాం.

ఇన్‌పుట్స్ : సాక్షి సినిమా, ఫ్యామిలీ బ్యూరో

# సంక్రాంతి వచ్చెనట సందడి తెచ్చెనట!



## తెలుగువారి పెద్దపండుగ

మన పండుగలను ఎన్నో అంశాలను మిళితం చేసి ప్రయోజనాత్మకంగా రూపొందించారు మన పెద్దలు. ప్రకృతిలో వచ్చే మార్పులకు అనుగుణంగా పండుగ విధులుగా చెప్పి వ్యక్తిగత, కుటుంబపరమైన, సామాజిక క్షేమాలని కలిగించేవిగా వాటిని రూపొందించారు. మన పండుగల్లో ఖగోళ, ఆయుర్వేద, ఆర్థిక మొదలైన శాస్త్రవిజ్ఞానాలు మిళితమై ఉంటాయి. తెలుగువారి ప్రధానమైన పండుగ సంక్రాంతిలో కూడా అంతే!

ప్రధానంగా చాంద్రమానాన్ని పాటించే తెలుగువారు సౌరమానాన్ని పాటించే ముఖ్యమైన సందర్భం ఇది. సూర్యుడు ధనూరాశిలో ప్రవేశించినప్పటి నుండి ధనుర్మాసం అంటారు. అది డిసెంబరు 15 కాని, 16వ తేదీ కాని అవుతుంది. అప్పటి నుండి మకర సంక్రమణం వరకు అంటే జనవరి 14 కాని, 15 వ తేదీ వరకు కాని ఉంటుంది.

సూర్యుడు మకర రాశిలో ప్రవేశించే రోజు మకర సంక్రాంతి. ఆ రోజు నుండి సూర్యుడు తన గమన దిశని దక్షిణం నుండి ఉత్తరానికి మార్చుకుంటాడు కనుక మకర సంక్రమణానికి ప్రాధాన్యం. ఆ రోజు పితృదేవతలకి తర్పణాలు ఇస్తారు. బొమ్మల కొలువుపెట్టుకునే సంప్రదాయం కొన్ని ప్రాంతాలలో ఉంది.

అసలు ప్రధానమైనది సంక్రాంతి. ఈ పుణ్యకాలంలో దానాలు, తర్పణాలు ప్రాధాన్యం వహిస్తాయి. ఈ సమయంలో చేసే దానాలకి ఎన్నో రెట్లు ఎక్కువ ఫలితం ఉంటుంది. దానికి కారణం ఈ మూడురోజులు పాతాళం నుండి వచ్చి భూమిని పరిపాలించమని శ్రీమహావిష్ణువు బలిచక్రవర్తికి వరం ఇచ్చాడు. కనుక బలి తనకి ఇష్టమైన దానాలు చేస్తే సంతోషిస్తాడు. అందులోనూ గుమ్మడికాయను దానం చేయటం మరీ శ్రేష్ఠం. గుమ్మడిని దానం ఇస్తే భూగోళాన్ని దానం ఇచ్చినంత ఫలితం. మకరరాశిలో ఉండే శ్రవణానక్షత్రానికి అధిపతి అయిన శని శాంతించటానికి నువ్వుల దానం చేయటం శ్రేయస్కరం. వస్త్ర దానం,పెరుగుదానంతో పాటు, ఏ దానాలు చేసినా మంచిదే. భోగినాడు ఏ కారణంగానైనా పేరంటం చేయనివారు ఈ రోజు చేస్తారు. అసలు మూడురోజులు పేరంటం చేసే వారున్నారు.

సంక్రాంతి మరునాడు కనుమ. కనుమని పశువుల పండగ అని కూడా అంటారు. ఈ రోజు పశువుల శాలలని శుభ్రం చేసి, పశువులని కడిగి, కొమ్ములకి రంగులు వేసి,పూలదండలని వేసి, ఊరేగిస్తారు. వాటికి పోటీలు పెడతారు. ఎడ్లకి పరుగు పందాలు, గొర్రె పొట్టేళ్ళ పోటీలు, కోడిపందాలు మొదలైనవి నిర్వహిస్తారు. నాగలి, బండి మొదలైన వాటిని కూడా పూజిస్తారు. ఇప్పుడు ట్రాక్టర్లకి పూజ చేస్తున్నారు. భూదేవికి, రైతులకి, పాలేర్లకి, పశువులకి, వ్యవసాయ పనిముట్లకి కూడా తమ కృతజ్ఞతలని తెలియచేయటం పండుగలోని ప్రతి అంశంలోనూ కనపడుతుంది. మాంసాహారులు ఈరోజు మాంసాహారాన్ని వండుకుంటారు. సాధారణంగా కోడి పందెంలో ఓడిపోయిన కోడినో, గొర్రెనో ఉపయోగించటం కనపడుతుంది. ఓడిపోయిన జంతువు పట్ల కూడా గౌరవమర్యాదలని చూపటం అనే సంస్కారం ఇక్కడ కనపడుతుంది. పంటను పాడుచేసే పురుగులని తిని సహాయం చేసినందుకు పక్షులకోసం వరి కంకులను తెచ్చి కుచ్చులుగా చేసి, ఇంటి ముందు వసారాలలో కడతారు. కొన్నిప్రాంతాలలో ఇప్పటికీ కనుమనాడు గుడిలో వరి కంకుల గుత్తులను కట్టే సంప్రదాయం కొనసాగుతోంది.

'కనుమ నాడు కాకైనా కదలదు','కనుమ నాడు కాకైనా మునుగుతుంది','కనుమ నాడు మినుము తినాలి' అనే సామెతలు కనుమకి పితృదేవతలకు ఉన్న సంబంధాన్ని సూచిస్తాయి. మొత్తం నెల రోజులు విస్తరించి, నాలుగు రోజుల ప్రధానంగా ఉన్న పెద్ద పండగ సంక్రాంతి తెలుగువారికి ఎంతో ఇష్టమైన వేడుక.



- డా. ఎన్.అనంతలక్ష్మి

### ముక్కనుము

ముక్కనుము నాడు ప్రత్యేకంగా చేయవలసినవి పెద్దగా కనిపించవు. పండగలో అలసిపోయిన వారి విశ్రాంతి కోసం కావచ్చు. కానీ, కొంత మంది కనుమునాడు కాక ఈ రోజుని మాంసాహారం తినటానికి కేటాయిస్తారు. సంక్రాంతికి అందరూ తమ గ్రామాలకి చేరుకుంటారు. అల్లుళ్లు, ముఖ్యంగా కొత్త అల్లుళ్లు తప్పనిసరి. నెల రోజులు విస్తరించి, నాలుగు రోజులు ప్రధానంగా ఉండే సంక్రాంతి పెద్ద పండుగ. పెద్దల పండుగ కూడా. పెద్ద ఎత్తున చేసుకునే పండుగ కూడా.



## పండగ వైభోగం చూతము రారండి
- రోహిణి



తమిళ, మలయాళ, కన్నడ సినిమాలలో ఎంతో పెద్ద పేరు తెచ్చుకున్న రోహిణి అనకాపల్లి అమ్మాయి అనే విషయం చాలామందికి తెలియదు. అయిదేళ్ల వయసులో చెన్నైకి వెళ్లిపోయినా... అనకాపల్లి ఆమెతోనే ఉంది. అనకాపల్లిలో సంక్రాంతి జ్ఞాపకాలు భద్రంగా ఉన్నాయి. నటి, స్క్రీన్ రైటర్, పాటల రచయిత్రి, డబ్బింగ్ ఆర్టిస్ట్ రోహిణి మొల్లెటి... 'సంక్రాంతి ఇష్టమైన పండగ' అంటుంది, ఆనాటి పండగ వైభోగాన్ని గుర్తు చేసుకుంటుంది.

నా చిన్నప్పుడు .. సంక్రాంతికి స్కూల్‌కి సెలవులు ఇచ్చేవారు. అదో ఆనందం. అలాగే కొత్త బట్టలు కొనిపెట్టేవాళ్లు. ఇంట్లో చక్కగా పిండి వంటలు చేసి పెట్టేవాళ్లు. ఫుల్లుగా తినేవాళ్లం. మాది అనకాపల్లి. నాకు ఐదేళ్లప్పుడు చెన్నై వెళ్లిపోయాం. సో... నాకు ఊహ తెలిశాక జరుపుకున్న పండగలన్నీ చెన్నైకి సంబంధించినవే.

సంక్రాంతికి నెల ముందే నెల గంట పడతారు. అప్పట్నుంచి రోజూ ముగ్గులు పెట్టేవాళ్లం. అయితే ఎవరి ముగ్గు వారిది అన్నట్లు కాకుండా మా ముగ్గుకి ఇంకొకరు రంగులు వేయడం, మేం వెళ్లి వాళ్ల ముగ్గులకు రంగులు వేయడం... ఫైనల్లీ ఎవరి ముగ్గు బాగుందో చూసుకోవడం... అవన్నీ బాగుండేది. నేను రథం ముగ్గు వేసేదాన్ని. ఇక సంక్రాంతి అప్పుడు గంగిరెద్దుల సందడి, హరిదాసులను చూడడం భలేగా అనిపించేది.

సంక్రాంతి నాకు ఇష్టమైన పండగ. ఎందుకంటే మనకు అన్నం పెట్టే రైతుల పండగ అది. వారికి కృతజ్ఞత తెలపాలనుకుంటాను. రైతుల విలువ పిల్లలకు చెప్పాలి. ఏమీ చెప్పకుండా పండగ చేసుకుంటే ఇది కూడా ఓ వేడుక అనుకుంటారు... అంతే. అసలు ఈ పండగ ఎందుకు చేసుకుంటున్నామో పిల్లలకి చెప్పాలి. అర్థం తెలిసినప్పుడు ఇంకాస్త ఇన్‌వాల్వ్ అవుతారు.

ఇప్పుడు పండగలు జరుపుకునే తీరు మారింది. వీలైనంత వైభవంగా చేయాలని కొందరు అనుకుంటారు. అయితే ఎంత గ్రాండ్‌గా చేసుకుంటున్నామని కాదు... అర్థం తెలుసుకుని చేసుకుంటున్నామా? లేదా అనేది ముఖ్యం. తాహతుకి మించి ఖర్చుపెట్టి పండగ చేసుకోనక్కర్లేదన్నది నా అభిప్రాయం.

సంక్రాంతి అంటే నాకు గుర్తొచ్చే మరో విషయం చెరుకులు. చాలా బాగా తినేవాళ్లం. ఇప్పుడూ తింటుంటాను. అయితే ఒకప్పటి చెరుకులు చాలా టేస్టీగా ఉండేవి. ఇప్పటి జనరేషన్ చెరుకులు తింటున్నారో లేదో తెలియడం లేదు. షుగర్ కేన్ జ్యూస్ తాగుతున్నారు. అయితే చెరుకు కొరుక్కుని తింటే పళ్లకి కూడా మంచిది. మన పాత వంటకాలు, పాత పద్ధతులన్నీ మంచివే. ఇలా పండగలప్పుడు వాటి గురించి చెప్పడం, ఆ వంటకాలు తినిపించడం చేయాలి.

## నెల్నాళ్లూ ఊరంతా అరిసెల వాసన

పండగ మూడు రోజులు కాదు మాకు నెల రోజులూ ఉండేది. వ్యవసాయం, గోపోషణ సమృద్ధిగా ఉండటం వల్ల నెల ముందు నుంచే ధాన్యం ఇల్లు చేరుతుండేది. నెల గంటు పెట్టగానే పీట ముగ్గులు వేసేవారు. వాటిల్లో గొబ్బిళ్లు పెట్టేవారు. రోజూ గొబ్బిళ్లు పెట్టి, వాటిని పిడకలు కొట్టేవారు. ఆ గొబ్బి పిడకలన్నీ పోగేసి, భోగిరోజున కర్రలు, పిడకలతోనే భోగి మంట వేసేవాళ్లు. మామూలు పిడకల వాసన వేరు, భోగి మంట వాసన వేరు. ప్రధాన సెలబ్రేషన్ అంటే ముగ్గు. బొమ్మల కొలువు పెట్టేవాళ్లం. అందరిళ్లకు పేరంటాలకు వెళ్లేవాళ్లం. ఊరంతా అరిసెల వాసన వస్తుండేది. కొత్త అటుకులు కూడా పట్టేవారు. చెరుకు గడలు, రేగుపళ్లు, తేగలు, పిల్లల ఆటలతో సందడిగా ఉండేది.



బంతిపూల కోసం అక్టోబర్‌లో మొక్కలు వేసేవాళ్లం. అవి సంక్రాంతికి పూసేవి. కనుమ నాడు గోవులను అలంకరించి, దండం పెట్టుకునే వాళ్లం. చేసుకున్న పిండి వంటలు పంచుకునేవాళ్లం. హరిదాసులకు, గంగిరెద్దుల వాళ్లకు ధాన్యాన్ని ఇచ్చేవాళ్లం. ఇప్పటికీ పండగలను పల్లెలే సజీవంగా ఉంచుతున్నాయి. పట్టణాల్లో మాత్రం కొన్నేళ్లుగా టీవీల్లోనే సంక్రాంతి సంబరాలను చూస్తున్నాం.

– రమారావి, కథకురాలు, ఆధ్యాత్మికవేత్త

## నా జీవితంలో సంక్రాంతి చాలా స్పెషల్
- మీనాక్షీ చౌదరి

'ఆరు నెలలు సావాసం చేస్తే వీరు వారవుతారు' అనేది మన అచ్చ తెలుగు సామెత. తెలుగుతనం ఉట్టిపడే పేరున్న మీనాక్షీ చౌదరి తెలుగు అమ్మాయి కాదు. ఉత్తరాది అమ్మాయి మీనాక్షీ చౌదరి కాస్త బాపు బొమ్మలాంటి తెలుగింటి అమ్మాయిగా మారడానికి మూడు సంవత్సరాల కాలం చాలదా! మీనాక్షీ నటి మాత్రమే కాదు స్విమ్మర్, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి కూడా. ఫెమినా మిస్ ఇండియా గ్రాండ్ ఇంటర్నేషనల్ (2018) కిరీటాన్ని గెలుచుకుంది. 'ఇచ్చట వాహనములు నిలపరాదు' సినిమా తో తెలుగు తెరకు సైలెంట్‌గా పరిచయం అయిన చౌదరి 'హిట్: ది సెకండ్ కేస్'తో హిట్ కొట్టింది. సూపర్‌హిట్ సినిమా 'లక్కీభాస్కర్' లో సుమతిగా సుపరిచితురాలైంది. కొందరికి కొన్ని పండగలు ప్రత్యేకమైనవి. సెంటిమెంట్‌తో కూడుకున్నవి. మీనాక్షీ చౌదరికి కూడా సరదాల పండగ సంక్రాంతి ప్రత్యేకమైనది. సెంటిమెంట్‌తో కూడుకున్నది. ఈ హరియాణ అందాల రాశి చెప్పిన సంక్రాంతి ముచ్చట్లు ఇవి.

మాది హర్యానా రాష్ట్రంలోని పంచకుల. మూడేళ్లుగా నేను హైదరాబాద్‌లో ఉంటూ తెలుగు సినిమాల్లో పని చేస్తున్నాను కాబట్టి సంక్రాంతి పండగ గురించి నాకు తెలుసు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రతి జనవరిలో ఒక సెలబ్రేషన్ (సంక్రాంతి) ఉంది. సంక్రాంతి–సినిమా అనేది ఒక బ్లాక్ బస్టర్ కాంబినేషన్. సినిమా ఇండస్ట్రీకి సంక్రాంతి అన్నది సినిమాల రిలీజ్‌కి, సెలబ్రేషన్స్‌కి చాలా మంచి సమయం. కుటుంబమంతా కలిసి సందడిగా పూజలు చేసి సెలబ్రేట్ చేసుకోవడం చాలా సంతోషంగా ఉంటుంది. అది నాక్కూడా చాలా ఎగ్జయిటెడ్‌గా ఉంటుంది. గాలిపటాలంటే నాకు చాలా ఇష్టం. కానీ, ఎగరేయడంలో నేను చాలా బ్యాడ్ (నవ్వుతూ). అయినా, మా ఫ్రెండ్స్‌తో కలిసి మా ఊర్లోనూ, హైదరాబాద్‌లోనూ ఎగరేసేందుకు ప్రయత్నిస్తుంటాను. హైదరాబాద్‌లో ప్రతి ఏటా అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్ నిర్వహించడం సంతోషించదగ్గ విషయం. ఎందుకంటే గాలిపటాలు ఎగరేయడం అన్నది కూడా ఒక ఆటే.



### సంక్రాంతి టు సంక్రాంతి

2024 నాకు చాలా సంతోషంగా, గ్రేట్‌ఫుల్‌గా గడిచింది. గత ఏడాది మంచి సినిమాలు, మంచి కథలు, పాత్రలు, మంచి టీమ్‌తో పని చేయడంతో నా కల నిజం అయినట్లు అనిపించింది. 2025 కూడా అలాగే ఉండాలని, ఉంటుందని కోరుకుంటున్నాను. చూస్తుంటే సంక్రాంతి టు సంక్రాంతి వరకు ఓ సర్కిల్‌లా అనిపిస్తోంది. నా జీవితంలో కూడా సంక్రాంతి చాలా స్పెషల్. ఎందుకంటే గత ఏడాది నేను నటించిన 'గుంటూరు కారం' వచ్చింది.. ఈ ఏడాది కూడా 'సంక్రాంతికి వస్తున్నాం' విడుదలవుతోంది! అందుకే చాలా సంతోషంగా... ఎగ్జయిటింగ్‌గా ఉంది.

## మర్చిపోలేని పండుగ
- అంజలి

'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' లో సీత ఎవరండీ? అచ్చం మన పక్కింటి అమ్మాయి. మన బంధువుల అమ్మాయి. తన సహజ నటనతో 'సీత' పాత్రకు నిండుతనం తెచ్చిన అంజలికి... 'మాది రాజోలండీ' అని చెప్పుకోవడం అంటే ఇష్టం. మూలాలు మరవని వారికి జ్ఞాపకాల కొరత ఉంటుందా! కోనసీమ పల్లె ఒడిలో పెరిగిన అంజలి జ్ఞాపకాల దారిలో వెళుతుంటే....మనం కూడా ఆ దారిలో వెళుతున్నట్లుగానే, పల్లె సంక్రాంతిని ప్రత్యక్షంగా చూస్తున్నట్లుగానే ఉంటుంది! ఒకటా ... రెండా... పండగకు సంబంధించిన ఎన్నో విషయాలను నాన్‌స్టాప్‌గా చెబుతుంది. అంజలి చెప్పే కోనసీమ సంక్రాంతి ముచ్చట్లు తెలుసుకుందాం...



చిత్ర పరిశ్రమలోకి రావాలనుకునే తెలుగమ్మాయిలందరికీ నటి అంజలి ఓ స్ఫూర్తి. మనందరి అమ్మాయి.. తెలుగమ్మాయి.. ఈ పెద్ద పండుగను ఎలా జరుపుకుంటుందంటే...

కోనసీమజిల్లా రాజోలు మా ఊరు. గోదావరి జిల్లాల్లో సంక్రాంతి పండుగ గురించి పెద్దగా చెప్పక్కర్లేదు.. అందరికీ వారం ముందు నుంచి పండుగ మొదలయితే, మాకు నెల ముందు నుంచే ఇంకా చెప్పాలంటే పండుగయిన తర్వాతి రోజే.. వచ్చే సంక్రాంతి కోసం ఏర్పాట్లు చేస్తుంటాం. మా తాతయ్య సుబ్బారావుగారు పండుగలంటే అందరూ కలసి చేసుకోవాలని చెప్పేవారు. అందుకే, చిన్నప్పటి నుంచే నాకు అదే అలవాటు. మా ఫ్యామిలీ చాలా పెద్దది. అందరూ వస్తే ఇల్లు మొత్తం నిండిపోయేది. అయినా సరే, ఏ పండుగైనా అందరం కలసే జరుపుకుంటాం. ఇంట్లోనూ పొలాల్లోనూ ఘనంగా పూజలు నిర్వహిస్తాం. చిన్నప్పుడు కజిన్స్ అందరం కలసి ఉదయాన్నే భోగి మంటలు వేయటానికి, అందులో ఏమేం వేయాలో అనే విషయాల గురించి వారం ముందు నుంచే మాట్లాడుకునేవాళ్లం. తాతయ్య పిండివంటలన్నీ చేయించేవారు. అందుకే, ఈ పండుగ కోసం ఎంతో ఎదురు చూసేదాన్ని. కాని, సిటీకి వచ్చాక అంత ఎంజాయ్‌మెంట్ లేదు. చిన్నతనంలో మా పెద్దవాళ్లు ముగ్గు వేస్తే, మేము రంగులు వేసి, ఈ ముగ్గు వేసింది మేమే అని గర్వంగా చెప్పుకుని తిరిగేవాళ్లం. అందుకే, ముగ్గుల పోటీల్లో నేనెప్పుడూ పాల్గొనలేదు. గాలిపటాన్ని కూడా ఎవరైనా పైకి ఎగరేసిన తర్వాత ఆ దారాన్ని తీసుకుని నేనే ఎగరేశా అని చెప్పుకుంటా. అందుకే, సంక్రాంతి నాకు మరచిపోలేని పండుగ.

## నిండుగా పొంగితే అంతటా సమృద్ధి

సంక్రాంతి పండగ అనగానే తెల్లవారకుండానే పెద్దలు పిల్లల్ని నిద్రలేపడం, చలికి వణుకుతూ ముసుగుతన్ని మళ్లీ పడుకోవడం ఇప్పటికీ గుర్తు వస్తుంటుంది. సందడంతా ఆడపిల్లలదే. ముగ్గులు వేయడం, వాటిల్లో గొబ్బెమ్మలు పెట్టి, నవధాన్యాలు, రేగుపళ్ల వేసేవాళ్లం. ముగ్గులు వేయడం, గొబ్బెమ్మలు పెట్టడం, ఆవు పిడకల మీద మట్టి గురిగలు పెట్టి, పాలు పొంగించేవాళ్లం. ఎటువైపు పాలు పొంగితే అటువేపు సస్యశ్యామలం అవుతుందని నమ్మకం. నిండుగా పొంగితే అంతటా సమృద్ధి. మిగిలిన గురుగుల్లోని ప్రసాదాన్ని అలాగే తీసుకెళ్లి లోపలి గదుల్లో మూలకు పెట్టేవారు ఎలుకల కోసం. సాధారణ రోజుల్లో ఎలుకలు గింజలు, బట్టలు కొట్టేస్తున్నాయని వాటిని తరిమేవారు. అలాంటిది సంక్రాంతికి మాత్రం, బయట పక్షులతోపాటు ఇంట్లో ఎలుకలకు కూడా ఇలా ఆహారం పెట్టేవాళ్లు. ముగ్గులు పెట్టడంలో ఇప్పుడూ పోటీపడే అమ్మాయిలను చూస్తున్నాను. మేం ఉండేది వనపర్తిలో. అప్పటి మాదిరిగానే ఇప్పుడూ జరుపుకుంటున్నాం.



– పోల్కంపల్లి శాంతాదేవి, రచయిత్రి

## ముగ్గుల లోకంలోకి
- దివి వాధ్యా

గాలిపటాల వయ్యారాల వరకు దివి చెప్పే సంక్రాంతి కబుర్లు...

దివి పదహారు అణాల తెలుగు అమ్మాయి. ఎం.టెక్ అమ్మాయి దివి మోడలింగ్‌లోకి ఆ తరువాత సినిమాల్లోకి వచ్చింది. 'బిగ్‌బాస్4'తో లైమ్‌లైట్‌లోకి వచ్చింది. హీరోయిన్‌గా చేసినా, పెద్ద సినిమాలో చిన్న పాత్ర వేసినా తనదైన మార్కును సొంతం చేసుకుంది. గ్లామర్ పాత్రలలో మెరిసినా, నాన్-గ్లామరస్ పాత్రలలో కనిపించినా తనదైన గ్రామర్ ఎక్కడికీ పోదు! మంచి పాత్రల కోసం ఎదురుచూస్తున్నట్లుగానే... మహా పండగ సంక్రాంతి కోసం ఎదురు చూడడం దివికి ఇష్టం. సంక్రాంతి వస్తే చాలు... ఆమెకు రెక్కలు వస్తాయి. సరాసరి వెళ్లి విజయవాడలో వాలిపోతుంది. పండగ సంతోషాన్ని సొంతం చేసుకుంటుంది. భోగిమంటల వెలుగు నుంచి గగనసీమలో గాలిపటాల వయ్యారాల వరకు దివి చెప్పే సంక్రాంతి కబుర్లు...



మాది హైదరాబాదే అయినా, నేను పుట్టింది విజయవాడలో. ఊహ తెలిసినప్పటి నుంచి సంక్రాంతి వచ్చిందంటే చాలు, విజయవాడలోని మా అమ్మమ్మగారి ఇంట్లో వాలిపోతా. వారం ముందు నుంచే మా ఇంట్లో పండుగ సందడి మొదలయ్యేది. మా మామయ్యలు, పిన్నులు, చుట్టాలందరితో కలసి గారెలు, అరిసెలు ఇలా ఇతర పిండి వంటలు చేసుకుని, ఇరుగు పొరుగు వారికి ఇచ్చుకుంటాం. పండుగ రోజు ఉదయాన్నే లేచి భోగి మంటలు వేసుకునేవాళ్లం. తర్వాత నలుగు పెట్టుకుని స్నానం చేసి, ముగ్గులు పెడతాం. అమ్మమ్మ పూజ చేస్తే, మేమంతా పక్కనే కూర్చొని, దేవుడికి దండం పెట్టుకునేవాళ్లం. కానీ ఆ రోజుల్ని ఇప్పుడు చాలా మిస్ అవుతున్నా. ఏది ఏమైనా సంక్రాంతికి కచ్చితంగా ఊరెళతాను. ఆ మూడు రోజుల పాటు బయటి ప్రపంచాన్ని మర్చిపోయి కుటుంబ సభ్యులతో కలసి పండుగ చేసుకోవటం నాకు చాలా ఇష్టం. సాయంత్రం స్నేహితులతో కలసి సరదాగా గాలిపటాలు ఎగరేస్తా. ఇప్పుడు నటిగా ఎదుగుతున్న సమయంలో సంక్రాంతి జరుపుకోవటం మరింత ఆనందంగా ఉంది. ఊరెళితే చాలు, అందరూ ఇంటికొచ్చి మరీ పలకరిస్తుంటారు. వారందరినీ చూసినప్పుడు నాపై నాకే తెలియని విశ్వాసం వస్తుంది. చివరగా సంక్రాంతికి ప్రత్యేకించి గోల్స్ లేవు కాని, అందరినీ సంతోషంగా ఉంచుతూ, నేను సంతోషంగా ఉంటే చాలు. ఇక నన్ను బాధించే వ్యక్తులకు, విషయాలకు చాలా దూరంగా ఉంటా.

ఇంటర్వ్యూ: శిరీష చల్లపల్లి

**స్టాక్ మార్కెట్లు**

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▽ | 1,049 | 76,330 |
| నిఫ్టీ ▽ | 346 | 23,086 |

**విదేశీ సూచీలు** (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

| సూచీ | విలువ | | మార్పు |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 18,967 | ▽ | 194 |
| డోజోన్స్ | 42,091 | △ | 152 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 8,224 | ▽ | 24 |
| డాక్స్ | 20,133 | ▽ | 82 |
| షాంఘై | 3,161 | ▽ | 8 |
| నికాయ్ | 39,190 | ▽ | 415 |


అమెరికా, బ్రిటన్, జర్మనీ, చైనా, జపాన్

**బులియన్** రూ.లలో — ముంబై

| | |
|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) | 78,308 |
| బంగారం (99.5 స్వచ్ఛత) | 77,994 |
| వెండి (కేజీ) | 89,800 |

**ఫారెక్స్ రేట్లు** రూ.లలో

| | కరెన్సీ | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఒకటి | 85.48 | 86.50 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఒకటి | 105.80 | 108.66 |
| € | యూరో | ఒకటి | 87.27 | 89.87 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఒకటి | 53.68 | 55.01 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్ | ఒకటి | 52.22 | 54.40 |
| S$ | సింగపూర్ డాలర్ | ఒకటి | 60.50 | 65.19 |
| SAR | సౌదీ రియాల్ | ఒకటి | 22.03 | 23.58 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | ఒకటి | 22.52 | 24.30 |
| ¥ | చైనా యువాన్ | ఒకటి | 10.84 | 12.67 |




రెండేళ్లలో అతిపెద్ద క్రాష్

# రుపీ.. టపీ!

ముంబై: రూపాయి విలువ రోజురోజుకూ తెగ్గోసుకుపోతోంది. డాలర్ మారకంలో సోమవారం ఏకంగా 66 పైసలు బలహీనపడి జీవితకాల కనిష్ట స్థాయి 86.70 వద్ద స్థిరపడింది. అమెరికా కరెన్సీ బలపడంతో పాటు చమురు ధరలు భగ్గుమనడంతో దేశీయ కరెన్సీ భారీ కోతకు గురైంది. ఫారెక్స్ మార్కెట్లో రోజంతా తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనైంది రూపాయి... ఏ దశలోనూ కోలుకోలేక చివరికి ఇంట్రాడే కనిష్టం (86.70) వద్ద ముగిసింది. దాదాపు రెండేళ్ల తర్వాత (2023 ఫిబ్రవరి 6న 68 పైసలు) దేశీయ కరెన్సీకి ఇదే అతిపెద్ద పతనం. గతేడాది డిసెంబర్ 30 ముగింపు 85.52 నుంచి రూపాయి ఏకంగా 118 పైసలు పడింది. 'ఫారెక్స్ నిల్వలు 634 బిలియన్ డాలర్లకు దిగిరావడం, వర్ధమాన దేశాల కరెన్సీలూ క్షీణిస్తున్న తరుణంలో రూపాయి పతనంపై ఆర్‌బీఐ జోక్యాన్ని తగ్గించుకుంది. మరోవైపు బ్రెంట్ క్రూడాయిల్ ధర 3 నెలల గరిష్టానికి ఎగసింది. డాలర్ ఇండెక్స్ రెండేళ్ల గరిష్టం 109.91 స్థాయికి చేరింది. దీంతో రూపాయి భారీగా క్షీణించింది' అని ఫిన్‌రెక్స్ ట్రెజరీ అడ్వైజర్స్ ఎండీ అనిల్ కుమార్ బన్సాలీ తెలిపారు.

# మహా బ్రాండ్ మేళా!

ప్రపంచంలోనే అతి పెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళా ఘనంగా ప్రారంభమైంది. 12 ఏళ్లకోసారి వచ్చే ఈ సంరంభానికి భక్తులు పోటెత్తనున్నారు. దీంతో ఈ భారీ కార్యక్రమంలో వ్యాపార అవకాశాలను వెతుక్కుంటున్నాయి కంపెనీలు. ఒక వైపు తమ ఉత్పత్తుల విక్రయాలపై దృష్టి పెడుతూనే మరోవైపు బ్రాండ్‌ని మరింతగా జనాల్లోకి తీసుకెళ్లేందుకు భారీగా కూడా ఖర్చు పెడుతున్నాయి.

**కుంభమేళాలో రూ. 2 లక్షల కోట్ల వ్యాపార అవకాశాలు**

- కార్పొరేట్ల ఖర్చు రూ. 3,000 కోట్లు...
- పది సెకన్ల ప్రకటనలకు రూ. 5 లక్షలు

ఉత్తర్ ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో 45 రోజుల పాటు సాగే మహా కుంభమేళాకు దాదాపు 40 కోట్ల మంది దీనికి హాజరవుతారని అంచనా. ఇందులో రూ. 2 లక్షల కోట్ల పైగా వ్యాపార అవకాశాలు ఉంటాయని స్వయంగా ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ చెప్పారు. దీనితో ఆ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు బడా బ్రాండ్లు మహా కుంభ మేళాకు క్యూ కట్టాయి. కోట్ల సంఖ్యలో మేళాకి వచ్చే భక్తుల దృష్టిని ఆకర్షించేందుకు పోటీపడుతున్నాయి. ఇందులో భాగంగా డాబర్ ఆమ్లా, వాటికా బ్రాండ్లు మహిళల కోసం చేంజింగ్ రూమ్‌లు ఏర్పాటు చేస్తున్నాయి. పిల్లల సంరక్షణ కోసం డాబర్ లాల్ తేల్ స్పెషల్ బేబీ కేర్ రూమ్‌లను ఏర్పాటు చేస్తున్నాయి. అటు ఆడియో కథల ప్లాట్‌ఫాంకు ఎఫ్‌ఎం ఈ కార్యక్రమం సందర్భంగా తమ ఓటీటీ యాప్ 'భక్తి'ని ఆవిష్కరిస్తోంది. ఇందుకోసం టెంట్లు, కియోస్కులతో బ్రాండ్‌కి ప్రచారం చేస్తోంది. ఐటీసీ బ్రాండ్ బింగో! .. స్థానిక పాటలపై రీల్స్ చేస్తోంది. మదర్ డెయిరీ సంస్థ పాలు, పాల ఉత్పత్తుల విక్రయానికి 45 కియోస్కులు ఏర్పాటు చేస్తోంది. ఇక ఆతిథ్య రంగ సంస్థలు సైతం ఈ అవకాశాన్ని అందిపుచ్చుకునే పనిలో ఉన్నాయి. ఒబెరాయ్ హాస్పిటాలిటీ సంస్థ దాదాపు 175 లగ్జరీ టెంట్లు ఏర్పాటు చేస్తోంది. ఐటీడీసీ కూడా యోగా, మెడిటేషన్, సాంస్కృతిక కార్యక్రమాల్లాంటి ఫీచర్లతో లగ్జరీ టెంట్ల ద్వారా పర్యాటకులను ఆకర్షించే ప్రయత్నాల్లో ఉంది. మహా కుంభమేళాలో క్యాంపా తదితర ఉత్పత్తులను విస్తృతంగా అందుబాటులో ఉంచడంతో పాటు పలు సేవలు కూడా అందిస్తున్నట్లు రిలయన్స్ కన్జూమర్ ప్రొడక్ట్స్ (ఆర్‌సీపీఎల్) తెలిపింది. భక్తులు, పర్యాటకులు సేదతీరేందుకు క్యాంపా ఆశ్రమ్, ఆరామ్ స్థల్ మొదలైనవి ఏర్పాటు చేసినట్లు పేర్కొంది.



### హోర్డింగ్‌లకు రూ. పది లక్షలు ...


కుంభమేళా సందర్భంగా కార్పొరేట్ కంపెనీలు దాదాపు రూ. 3,000 కోట్లు ఖర్చు చేయనున్నట్లు అంచనా. కార్యక్రమం ఆసాంతం హోర్డింగ్‌లు లేదా ఫ్లెక్స్ బోర్డ్‌లు కొనసాగించాలంటే రూ. 10 లక్షలు, ఎల్‌ఈడీ స్క్రీన్లపై 10 సెకన్ల ప్రకటనకు రూ. 5 లక్షలు ఖర్చు చేయాల్సి ఉంటుందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. మొత్తం 45 రోజుల పొడవునా ప్రచారం కోసం బ్రాండ్లు కనీసం రూ. 50 లక్షల నుండి రూ. 1 కోటి వరకు వ్యయం చేస్తుందని భావిస్తున్నారు. ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వమే ఈ కార్యక్రమంపై ఏకంగా రూ. 5,000 కోట్లు ఖర్చు పెడుతోంది. ప్రపంచవ్యాప్తంగా భక్తులు తరలిరానుండటంతో బ్రాండింగ్‌కి ఇది భారీ అవకాశంగా ఉంటుందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

– సాక్షి, బిజినెస్ డెస్క్

- ➡ మహిళల కోసం డాబర్ ఆమ్లా, వాటికా చేంజింగ్ రూమ్స్
- ➡ డాబర్ దంత్ స్నాన్ జోన్స్, పిల్లల కోసం డాబర్ లాల్ తేల్ ప్రత్యేక సంరక్షణ గదులు
- ➡ మదర్ డెయిరీ 45 కియోస్కులు
- ➡ 'భక్తి' ఓటీటీ యాప్‌ను ప్రారంభిస్తున్న కుకు ఎఫ్‌ఎం
- ➡ ఐటీడీసీ లగ్జరీ టెంట్లు
- ➡ మహా కుంభమేళా ప్రకటనల హక్కులను హైదరాబాద్‌కి చెందిన కంపెనీ శ్రేయాస్ మీడియా దక్కించుకుంది.

# బేర్.. ఎటాక్!

- ప్రపంచ ప్రతికూలతలు పడేశాయ్
- భగ్గుమన్న క్రూడాయిల్ ధరలు
- నాలుగో రోజూ నష్టాలే
- సెన్సెక్స్ 1,049 పాయింట్లు క్రాష్
- నిఫ్టీ 346 పాయింట్లు పతనం



ముంబై: ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని బలహీన సంకేతాల ప్రభావంతో స్టాక్ సూచీలు సోమవారం ఒకశాతానికి పైగా నష్టపోయాయి. అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడమూ, విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలూ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. సెన్సెక్స్ 1,049 పాయింట్లు క్షీణించి 76,330 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 346 పాయింట్లు కోల్పోయి 23,086 వద్ద ముగిసింది. సూచీలకిది నాలుగోరోజూ నష్టాల ముగింపు. ఉదయం స్వల్ప నష్టాలతో మొదలైన సూచీలు రోజంతా అదే బాటలో నడిచాయి. అన్ని రంగాల షేర్లలో విక్రయాలు వెల్లువెత్తాయి. ఒక దశలో సెన్సెక్స్ 1,129 పాయింట్లు క్షీణించి 76,250, నిఫ్టీ 384 పాయింట్లు పతనమై 23,047 వద్ద ఇంట్రాడే కనిష్టాలు తాకాయి. ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపుపై అనుమానాలు, ద్రవ్యోల్బణం పెరగొచ్చనే ఆందోళనలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

**4 రోజుల్లో 24.7 లక్షల కోట్లు ఆవిరి**

స్టాక్ మార్కెట్ వరుస పతనంలో భాగంగా నాలుగు రోజుల్లో రూ.24.69 లక్షల కోట్ల సంపద ఆవిరైంది. సోమవారం ఒక్కరోజే రూ.12.61 లక్షల కోట్లు హరించుకు పోయింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలోని కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.417.05 లక్షల కోట్ల(4.82 ట్రిలియన్ డాలర్లు)కు దిగివచ్చింది.

### మార్కెట్లో మరిన్ని సంగతులు

- → అధిక వాల్యుయేషన్లు, వృద్ధిపై ఆందోళనలతో ఇన్వెస్టర్లు భారీ ఎత్తున చిన్న, మధ్య తరహా షేర్లను భారీగా విక్రయించారు. బీఎస్‌ఈ స్మాల్ క్యాప్ సూచీ 4.17%, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 4.14 శాతం నష్టపోయాయి. బీఎస్‌ఈ ఎక్స్ఛేంజీలో మొత్తం 3,562 కంపెనీల షేర్లలో 2,876 షేర్లు నష్టపోగా, 508 షేర్లు ఏడాది కనిష్టాన్ని తాకింది.
- → సూచీల వారీగా బీఎస్‌ఈ రియల్టీ ఇండెక్స్ 6.50% అత్యధికంగా పతనమైంది. యుటిలిటీ 4.50%, సర్వీసెస్ 4.35% చొప్పున పడ్డాయి.

### ఎందుకీ పతనం..

- ➡ అమెరికా డిసెంబర్ వ్యవసాయేతర ఉద్యోగాలు (2.56 లక్షలు) అంచనాలను మించాయి. నిరుద్యోగ రేటు 4.2% నుంచి 4.1 శాతానికి దిగివచ్చింది. అధిక ఉద్యోగాల నియామకంతో ఫెడరల్ రిజర్వ్ ఈ ఏడాదిలో వడ్డీరేట్ల తగ్గింపుపై అనుమానాలు తలెత్తాయి. ద్రవ్యోల్బణం పెరగొచ్చనే ఆందోళనలు మొదలయ్యాయి. బాండ్లపై రాబడులు 14 ఏళ్ల గరిష్టం 4.79% భారీగా పెరిగాయి. దీంతో ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులు ఈక్విటీల్లోంచి బాండ్లలోకి మళ్లిస్తున్నారు.
- ➡ భారత్, చైనాకు చౌకగా చమురును అందిస్తున్న రష్యా క్రూడాయిల్ ఉత్పత్తి సంస్థలపై అమెరికా కఠిన ఆంక్షలు విధించడంతో అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు మూడు నెలల గరిష్టానికి చేరుకున్నాయి. భారత్ దిగుమతి చేసుకొనే బ్రెంట్ క్రూడాయిల్ ధర 1.5% పెరిగి 81.67 స్థాయికి చేరింది. తన చమురు అవసరాల్లో 85 శాతాన్ని దిగుమతి చేసుకొనే భారత్‌కు అధిక ధరలు నష్టదాయకం. పెరిగిన దిగుమతుల బిల్లు చెల్లించేందుకు ప్రభుత్వం వద్దనున్న విదేశీ మారక నిల్వలు కరిగించాల్సి వస్తుంది.
- ➡ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి 6.4 శాతానికి పరిమితమవుతుందని కేంద్రం ముందస్తు అంచనా వేసింది. పలు అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థలు 2024–25 ఏడాది కార్పొరేట్ ఆదాయాలు ఒక అంకె వృద్ధికే పరిమితం కావచ్చని చెబుతున్నాయి. కార్పొరేటు ఆదాయాలు, జీడీపీ వృద్ధి అంచనాలు మార్కెట్ వర్గాలను నిరాశపరిచాయి.

# స్టాండర్డ్ గ్లాస్ లిస్టింగ్ భేష్!



లిస్టింగ్ వేడుకలో ఎండీ నాగేశ్వర రావు, సీఎఫ్‌వో ఆంజనేయులు పాతూరి (కుడి)

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఐపీవో సబ్‌స్క్రిప్షన్ గ్రాండ్ సక్సెస్ అయ్యాక స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో సోమవారం లిస్ట్ అయ్యాయి. ఇష్యూ ధర రూ.140తో పోలిస్తే 22.86 శాతం ప్రీమియంతో రూ.172 వద్ద ఎన్‌ఎస్‌ఈలో, 25.71 శాతం ప్రీమియంతో రూ.176 వద్ద బీఎస్‌ఈలో లిస్ట్ అయ్యాయి. ఒక్కో షేరు 16.57 శాతం ప్రీమియంతో ఎన్‌ఎస్‌ఈలో రూ.163.20 వద్ద, 16.68 శాతం ప్రీమియంతో బీఎస్‌ఈలో రూ.163.35 వద్ద స్థిరపడింది. ఎన్‌ఎస్‌ఈలో 4.53 కోట్లు, బీఎస్‌ఈలో 35.78 లక్షల షేర్లు ట్రేడయ్యాయి. బీఎస్‌ఈలో షేరు ఒకానొక దశలో 29.78 శాతం దూసుకెళ్లి రూ.181.70 తాకింది. ముగింపు ధర వద్ద బీఎస్‌ఈలో కంపెనీ మార్కెట్ విలువ రూ.3,258.7 కోట్లకు చేరింది. 'పెట్టుబడిదారులు చూపిన నమ్మకానికి కృతజ్ఞతలు. వాటాదారులందరికీ వృద్ధి, ఆవిష్కరణ, విలువను అందించడానికి కట్టుబడి ఉన్నాము. మీ నిరంతర మద్దతు కోసం ఎదురుచూస్తున్నాము' అని స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ ఎండీ నాగేశ్వర రావు కందుల ఈ సందర్భంగా తెలిపారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
హెచ్‌సీఎల్ టెక్ లాభం ప్లస్
5.2 శాతానికి తగ్గిన రిటైల్ ద్రవ్యోల్బణం

# భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

## విద్య, ఉద్యోగ సమాచారం

### ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, న్యూఢిల్లీలో 30 అప్రెంటిస్‌లు

న్యూఢిల్లీలోని ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్.. గ్రాడ్యుయేట్, టెక్నీషియన్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 30.
- » **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్-20, టెక్నీషియన్(డిప్లొమా) అప్రెంటిస్-10.
- » **విభాగాలు:** సివిల్, ఎలక్ట్రికల్, సైన్స్ అండ్ టెక్నాలజీ.
- » **అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా, ఇంజనీరింగ్ ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** 18 నుంచి 30 ఏళ్లు మించకూడదు.
- » **స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లకు రూ.10,000, డిప్లొమా అప్రెంటిస్‌లకు రూ.8,500.
- » **ఎంపిక విధానం:** విద్యార్హత, మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఆన్‌లైన్‌లో నింపి తర్వాత ప్రింట్ అవుట్‌ను, అర్హతకు సంబంధించి సర్టిఫికేట్ జిరాక్స్ కాపీలను జతచేసి జేజీఎం/హెచ్‌ఆర్‌ఎం, ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, సీ-4, జిల్లా సెంటర్, సకేట్, న్యూఢిల్లీ-110017 చిరునామకు పంపించాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.01.2025
- » **వెబ్‌సైట్:** http://https//www.ircon.org

### దక్షిణ మధ్య రైల్వేలో 4,232 అప్రెంటిస్‌లు

సికింద్రాబాద్‌లోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్‌ఆర్‌సీ)-దక్షిణ మధ్య రైల్వే ఎస్‌సీఆర్ వర్క్‌షాప్/యూనిట్‌లలో.. యాక్ట్ అప్రెంటిస్ శిక్షణలో ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 4,232.
- » **ఎస్‌సీఆర్ యూనిట్ ప్రదేశాలు:** సికింద్రాబాద్, లాలగూడ, మెట్టుగూడ, ఖాజీపేట, హైదరాబాద్, విజయవాడ, బిట్రగుంట, గూడూరు జంక్షన్, కాకినాడ పోర్టు, కొండపల్లి, మచిలీపట్నం, నర్సాపూర్, ఒంగోలు, రాజమండ్రి, రాయనపాడు, నల్లపాడు, గుంటూరు, గుంతకల్, తిమ్మనచర్ల, యాదగిరి, నాందెడ్, పూర్ణ జంక్షన్, ముద్‌ఖేడ్.
- » **ట్రేడుల వారీగా ఖాళీలు:** ఏసీ మెకానిక్-143, ఎయిర్ కండిషనింగ్-32, కార్పెంటర్-42, డీజిల్ మెకానిక్-142, ఎలక్ట్రానిక్ మెకానిక్-85, ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్-10, ఎలక్ట్రీషియన్-1053, ఎలక్ట్రికల్(ఎస్-టి) (ఎలక్ట్రీషియన్)-10, పవర్ మెయింటెనెన్స్(ఎలక్ట్రీషియన్)-34, ట్రైన్ లైటింగ్(ఎలక్ట్రీషియన్)-34, ఫిట్టర్-1742, మోటార్ మెకానిక్ వెహికల్(ఎంఎంవీ)-08, మెషినిస్ట్-100, మెకానిక్ మెషిన్ టూల్ మెయింటెనెన్స్(ఎంఎంటీఎం)-10, పెయింటర్-74, వెల్డర్-713.
- » **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి.
- » **వయసు:** 28.12.2024 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **ఎంపిక విధానం:** పదో తరగతి, ఐటీఐలో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు సడలింపు ఉంటుంది.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 27.01.2025
- » **వెబ్‌సైట్:** https://scr.indianrailways.gov.in

### ఎన్‌ఏఆర్‌ఎల్ తిరుపతిలో 19 జూనియర్ రీసెర్చ్ ఫెలోలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలోని నేషనల్ అట్మాస్ఫియరిక్ రీసెర్చ్ ల్యాబొరేటరీ(ఎన్‌ఏఆర్‌ఎల్).. జూనియర్ రీసెర్చ్ ఫెలోల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 19.
- » **అర్హత:** ఫిజిక్స్/అట్మాస్ఫియరిక్ సైన్స్/స్పేస్ ఫిజిక్స్/మెటలర్జీ తదితర విభాగాల్లో పీజీతో పాటు సీఎస్‌ఐఆర్-యూజీసీ నెట్/గేట్/జామ్/జేఈఎస్‌టీ ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వేతనం:** నెలకు రూ.37,000.
- » **వయసు:** 24.01.2025 నాటికి 28 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, పీడబ్ల్యూడీ, ఎక్స్ సర్వీస్‌మెన్ అభ్యర్థులకు వయో సడలింపు ఉంటుంది.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.01.2025
- » **వెబ్‌సైట్:** https://www.narl.gov.in

# అవుతారా.. స్పెషలిస్ట్ ఆఫీసర్!

**ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేశారా.. బ్యాంకింగ్ రంగంలో కొలువులు కోరుకుంటున్నారా.. అయితే మీకు ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంకు.. బ్యాంక్ ఆఫ్ బరోడా స్వాగతం పలుకుతోంది!! బ్యాచిలర్ డిగ్రీ మొదలు అగ్రికల్చరల్, బీటెక్, ఎంబీఏ, సీఏ తదితర అర్హతలతో స్పెషలిస్ట్ ఆఫీసర్స్ పోస్టుల భర్తీకి తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది. మూడంచెల ఎంపిక ప్రక్రియలో విజయం సాధిస్తే.. జేఎంజీఎస్-1 నుంచి ఎస్‌ఎంజీఎస్-5 వరకు.. పలు హోదాల్లో కొలువుదీరే అవకాశముంది. ఈ నేపథ్యంలో.. బ్యాంక్ ఆఫ్ బరోడా పోస్టులు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం తదితర వివరాలు..**




- » 1,267 పోస్టులకు బ్యాంక్ ఆఫ్ బరోడా నోటిఫికేషన్
- » స్పెషలిస్ట్ విభాగాల్లో ప్రొఫెషనల్స్ నియామకాలు
- » మూడు దశల ఎంపిక ప్రక్రియ ద్వారా ఎంపిక
- » రూ.67 వేల నుంచి రూ.1,27,660 వరకు నెల వేతనం

సంప్రదాయ డిగ్రీ మొదలు ప్రొఫెషనల్ డిగ్రీలు, బీటెక్, ఎంబీఏ వంటి కోర్సుల ఉత్తీర్ణులు సైతం బ్యాంకింగ్ రంగంలో కొలువులపై ఆసక్తి చూపుతున్నారు. ఇలాంటి వారికి చక్కటి అవకాశంగా నిలుస్తోంది.. బ్యాంక్ ఆఫ్ బరోడా తాజా నోటిఫికేషన్.

### మొత్తం పోస్టులు 1,267

బ్యాంక్ ఆఫ్ బరోడా తాజాగా విడుదల చేసిన నోటిఫికేషన్ ద్వారా మొత్తం 1,267 ఖాళీల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. ఇందులో అగ్రికల్చర్ మార్కెటింగ్ ఆఫీసర్ 150 పోస్ట్‌లు, అగ్రికల్చరల్ మార్కెటింగ్ మేనేజర్ 50 పోస్ట్‌లు, మేనేజర్ (సేల్స్) 450 పోస్ట్‌లు, మేనేజర్ క్రెడిట్ అనలిస్ట్ 78 పోస్ట్‌లు, సీనియర్ మేనేజర్ క్రెడిట్ అనలిస్ట్ 46 పోస్ట్‌లు, సీనియర్ మేనేజర్(ఎంఎస్‌ఎంఈ రిలేషన్‌షిప్) 205 పోస్ట్‌లు తదితరాలు ఉన్నాయి.

### అర్హతలు

ఆయా పోస్ట్‌లను అనుసరించి బ్యాచిలర్ డిగ్రీతో పాటు సంబంధిత స్పెషలైజేషన్లలో బీటెక్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/మేనేజ్‌మెంట్ పీజీ/పీజీ డిప్లొమా లేదా పీజీ ఉత్తీర్ణత లేదా సీఏ/సీఎంఏ/సీఎఫ్‌ఏ/సీఎస్/బీటెక్(సంబంధిత స్పెషలైజేషన్లలో)/ ఎంసీఏ/బీఎస్సీ(కంప్యూటర్స్)/ఎమ్మెస్సీ(కంప్యూటర్స్) ఉత్తీర్ణత ఉండాలి.

### అనుభవం

పలు హోదాల్లో స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్ట్‌ల భర్తీ చేపడుతున్న బ్యాంక్ ఆఫ్ బరోడా పని అనుభవం సైతం ఉండాలని నిర్దేశించింది. ఆయా పోస్ట్‌లను అనుసరించి కనీసం రెండేళ్ల నుంచి గరిష్టంగా ఎనిమిదేళ్ల పని అనుభవం ఉండాలని పేర్కొన్నారు. ఐటీ విభాగంలోని పోస్ట్‌లకు సదరు స్పెషలైజేషన్లలో సర్టిఫికేషన్ ఉంటే ప్రాధాన్యతనిస్తారు.

### ఆకర్షణీయ వేతనం

ఆయా పోస్ట్‌లకు ఎంపికైన వారికి ఆర్షణీయ వేతనం లభిస్తుంది. సీనియర్ మేనేజర్, చీఫ్ మేనేజర్ పోస్ట్‌లకు ఆకర్షణీయ వేతనాలు ఉంటాయి. వీరికి నెలకు రూ.2.8 లక్షల నుంచి రూ.3.3 లక్షల వరకు వేతనం లభిస్తుంది. మిగతా పోస్ట్‌లకు సంబంధించి ఎంఎంజీఎస్-2 హోదాలో బేసిక్ పే రూ. 93,960, ఎంఎంజీఎస్-3 హోదాలో రూ.1,05,280 బేసిక్ పే, ఎస్‌ఎంజీఎస్-4 హోదాలో రూ. 1,20,940 బేసిక్ పే లభిస్తుంది.

### మూడంచెల ఎంపిక

ఆయా పోస్ట్‌ల భర్తీకి మూడు దశల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. ఇందులో మొదటగా రాత పరీక్ష ఉంటుంది. ఆ తర్వాత సైకో మెట్రిక్ టెస్ట్ జరుగుతుంది. చివరగా గ్రూప్ డిస్కషన్/పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటాయి.

### నాలుగు విభాగాల్లో రాతపరీక్ష

- ఎంపిక ప్రక్రియలో తొలిదశ రాత పరీక్షను నాలుగు విభాగాల్లో నిర్వహిస్తారు. ఇందులో రీజనింగ్(25 ప్రశ్నలు-25 మార్కులు), ఇంగ్లిష్ లాంగ్వేజ్(25 ప్రశ్నలు-25 మార్కులు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (25 ప్రశ్నలు-25 మార్కులు), ప్రొఫెషనల్ నాలెడ్జ్(75 ప్రశ్నలు-150 మార్కులు) నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- ఇలా మొత్తం నాలుగు విభాగాల్లో 150 ప్రశ్నలు-225 మార్కులకు పరీక్ష జరుగుతుంది.

### ప్రొఫెషనల్ నాలెడ్జ్ కీలకం

అభ్యర్థులను తదుపరి దశకు ఎంపిక చేసే క్రమంలో ప్రొఫెషనల్ నాలెడ్జ్ విభాగంలో పొందిన మార్కులనే పరిగణనలోకి తీసుకుంటారు. ఇందులో సాధించిన మార్కుల ఆధారంగా మెరిట్ జాబితా రూపొందించి.. తదుపరి దశలకు ఎంపిక చేస్తారు. రీజనింగ్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌లను కేవలం అర్హత విభాగాలుగానే నిర్దేశించారు. వీటిలో కనీస అర్హత మార్కులు సాధించాల్సి ఉంటుంది.

### చివరగా జీడీ/పీఐ

రాత పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా ఒక్కో పోస్ట్‌కు అయిదుగురు లేదా ఆరుగురిని చొప్పున ఎంపిక చేసి.. వారికి చివరి దశలో గ్రూప్ డిస్కషన్(జీడీ),పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇందులో భాగంగా అభ్యర్థుల్లోని ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్‌ను, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ఆప్టిట్యూడ్, సృజనాత్మకత స్థాయిలను పరిశీలిస్తారు.

### సీజీఎం స్థాయికి చేరుకునే అవకాశం

ఎంఎంజీఎస్-2, 3, ఎస్‌ఎంజీఎస్-4 హోదాల్లో కెరీర్ ప్రారంభించిన వారు భవిష్యత్తులో చీఫ్ జనరల్ మేనేజర్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుంది.

### ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2025, జనవరి 17
- **పరీక్ష తేదీ:** మార్చిలో నిర్వహించే అవకాశం.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విశాఖపట్నం.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.bankofbaroda.in/career/currentopportunities

### రాత పరీక్షలో రాణించేలా

#### రీజనింగ్

పరీక్షలో కీలకమైన ఈ విభాగంలో మంచి మార్కుల కోసం కోడింగ్-డీ కోడింగ్, బ్లడ్ రిలేషన్స్, డైరెక్షన్, సిలాజిజమ్ అంశాలను బాగా ప్రాక్టీస్ చేయాలి.

#### ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఇడియమ్స్, సెంటెన్స్ కరెక్షన్, వొకాబ్యులరీ, సెంటెన్స్ రీ అరేంజ్‌మెంట్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూట్స్‌పై అవగాహన పెంచుకోవాలి. ఇంగ్లిష్ వొకాబ్యులరీపై పట్టు సాధించాలి. ఇంగ్లిష్ దినపత్రికలు చదవడం, వినియోగిస్తున్న పదజాలం, వాక్య నిర్మాణంపై దృష్టి పెట్టాలి.

#### క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

ఈ విభాగం కోసం అర్థమెటిక్ అంశాలు (పర్సంటేజెస్, నిష్పత్తులు, లాభ-నష్టాలు, నంబర్ సిరీస్, బాడ్‌మాస్ నియమాలు) బాగా ప్రాక్టీస్ చేయాలి. గత ప్రశ్న పత్రాలు పరిశీలించి వెయిటేజీకి అనుగుణంగా డేటా ఇంటర్‌ప్రిటేషన్, డేటా అనాలిసిస్‌లపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలి.

#### ప్రొఫెషనల్ నాలెడ్జ్

ప్రొఫెషనల్ నాలెడ్జ్ విభాగం ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలంటే.. అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకున్న స్పెషలైజేషన్, దానికి సంబంధించి.. బ్యాచిలర్, పీజీ స్థాయి పుస్తకాలను అధ్యయనం చేయాలి. ముఖ్యమైన కాన్సెప్ట్‌లను అప్లికేషన్ అప్రోచ్‌తో చదవాలి. అంతేకాకుండా ఆయా విభాగాలకు సంబంధించి గత ప్రశ్న పత్రాలు, ఇతర పోటీ పరీక్షల ప్రశ్న పత్రాలను సాధన చేయడం ఉపయుక్తంగా ఉంటుంది.

#### గ్రూప్ డిస్కషన్/పర్సనల్ ఇంటర్వ్యూ

జీడీ/పీఐలో రాణించేందుకు సమకాలీన అంశాలపై అవగాహన పెంచుకోవాలి. అదే విధంగా ఆయా అంశాలపై స్పష్టమైన అభిప్రాయాలు కలిగుండాలి. అంతేకాకుండా తమ అభిప్రాయాల్ని సమర్థించుకునేలా భావ వ్యక్తీకరణ సామర్థ్యం పెంచుకోవాలి.అన్ని పోస్ట్‌లకు పని అనుభవం ప్రాధాన్యంగా నిలుస్తోంది. కాబట్టి ఇప్పటి వరకు నిర్వహించిన విధులు, పనితీరు గురించి కూడా ప్రశ్నలు అడిగే అవకాశం ఉంటుంది. వీటికి కూడా సన్నద్ధమవ్వాలి.

**కెరీర్ కౌన్సెలింగ్**
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- బయాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- జనరల్ స్టడీస్- కెమిస్ట్రీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం-జనరల్ అవేర్‌నెస్


JOS ALUKKAS
A TRADITION OF FINE JEWELLERY
పొంగి పొరలే బంగారం
ఇల్లంతా సౌభాగ్యం
మకర
సంక్రాంతి
శుభాకాంక్షలు
ప్రతి కొనుగోలుపై
విలువైన బహుమతి
పొందండి
T & C Apply
20%
తగ్గింపు
వజ్రాలపై
7%
తగ్గింపు
ప్లాటినంపై
0%
తరుగు
వెండి ఆభరణాలకు
బంగారం
ఎక్స్ఛేంజ్
మీ పాత బంగారు ఆభరణాలను
సరికొత్త BIS HUID హాల్‌మార్క్
బంగారు ఆభరణాలకు ఎక్స్ఛేంజ్ చేసుకోండి
అధిక లాభాలతో
HYDERABAD: Greenlands Road, BEGUMPET, Ph: 040-23404567
Madinaguda, CHANDANAGAR, Ph: 040-29802916 | Chaitanyapuri Main Road,
DILSUKHNAGAR, Ph: 040-24045916 | Kukatpally Main Road, KPHB COLONY,
Ph: 040 – 23053916. Shop online at www.josalukkasonline.com
జోస్ ఆలుక్కాస్
A TRADITION OF FINE JEWELLERY
PUSH360

రఘునాథపాలెం / ఖమ్మం జిల్లా

# సాగుతో ఎంతో బాగు

## విభిన్నమైన పంటలతో ముందుకెళ్తున్న రైతు రామారావు

సాధారణంగా చాలా మంది రైతులు ఒకట్రెండు పంటలు మాత్రమే పండిస్తుంటారు. ఒకవేళ వాటిని మార్చినా మరో ఒకట్రెండు రకాలే ప్రయత్నిస్తారు. కానీ ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం కోయచెలక గ్రామానికి చెందిన చెరుకూరి రామారావు.. విభిన్నమైన పంటలను ఒకేసారి, అదీ సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తూ గుర్తింపు పొందారు. తమ కుటుంబానికి ఉన్న 20 ఎకరాలకుతోడు మరో ఐదెకరాలు కౌలుకు తీసుకుని మరీ రకరకాల పంటలను సాగు చేస్తున్నారు.

**విభిన్నమైన పంటలతో..**

రామారావు తమ వ్యవసాయ క్షేత్రంలో అన్ని రకాల కూరగాయలను సాగు చేస్తున్నారు. సొరకాయ, బొప్పాయి, మిర్చి, టమాటా, దోసకాయ, క్యాబేజీ, పసుపు, వంకాయ, కాలీఫ్లవర్, బ్రోకలీ వంటి పంటలు సాగు చేస్తున్నారు. బొప్పాయి, సీతాఫలం పండ్ల తోటలూ వేశారు. ఈ తోటల్లో చెరుకు, మిర్చి, పసుపు వంటివాటిని అంతర పంటలుగా సాగు చేస్తూ అదనపు ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. కేవలం సేంద్రియ ఎరువులతోనే పంటలు పండించడమే కాదు... ఆ ఎరువును కూడా స్వయంగా తన పొలంలోనే తయారు చేసుకుంటున్నారు. పండించిన పంటలను మార్కెటింగ్ చేయడంలో ఆయన కుటుంబ సభ్యులు తోడ్పడుతున్నారు. తాను 12 ఏళ్లుగా సేంద్రియ వ్యవసాయం చేస్తున్నానని.. అనేక రకాల పంటలు సాగు చేస్తున్నానని రామారావు తెలిపారు. ప్రజలకు ఆరోగ్యకరమైన కూరగాయలు, పండ్లు అందించాలన్నదే తన లక్ష్యమని.. అందుకే ఎక్కడా పొరపాటున కూడా రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా సాగు చేస్తానని పేర్కొన్నారు.



సొర తోటలో రైతు రామారావు

# 'తెలంగాణ జరూర్ ఆనా'

## ఇదే పర్యాటకరంగ నినాదం: మంత్రి జూపల్లి
## పరేడ్ గ్రౌండ్‌లో కైట్స్ అండ్ స్వీట్స్ ఫెస్టివల్ ప్రారంభం
## అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు





కైట్స్ ఫెస్టివల్‌లో భారీ గాలిపటం వద్ద స్మిత సబర్వాల్. పతంగి ఎగురవేస్తున్న మంత్రులు పొన్నం, జూపల్లి

కంటోన్మెంట్ (హైదరాబాద్): ప్రపంచం నలుమూలల నుంచి పర్యాటకులు 'తెలంగాణ జరూర్ ఆనా'అనే విధంగా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ కైట్-స్వీట్ ఫెస్టివల్‌ను రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పర్యాటకరంగ అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ పిలుపునిచ్చిన 'తెలంగాణ జరూర్ ఆనా'నినాదానికి అనుగుణంగా పర్యాటకరంగాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు. ప్రజలు నెలకు కనీసం రెండు రోజులపాటు వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తే మానసిక, శారీరక ఉల్లాసంతో పాటు పర్యాటక అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. అందరినీ పండుగలో భాగస్వాములను చేసేందుకు ఇంటర్నేషనల్ కైట్ అండ్ స్వీట్, ఫుడ్, కల్చరల్, హ్యాండిక్రాఫ్ట్స్ ఫెస్టివల్‌ను సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు.

**ఫెస్టివల్‌కు ఆదరణ పెరిగింది: పొన్నం**

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గతేడాదితో పోలిస్తే కైట్స్, అండ్ స్వీట్స్ ఫెస్టివల్‌కు ఆదరణ పెరిగిందన్నారు. ఉచిత బస్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఫెస్టివల్‌ను సందర్శించాలని సూచించారు. పురావస్తు శాఖ పనితీరును మెరుగుపరిచి, పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారు.

ఈ కైట్ ఫెస్టివల్‌లో 16 దేశాలకు చెందిన 40 మంది అంతర్జాతీయ కైట్ ఫ్లైయర్లు, వివిధ రాష్ట్రాల నుంచి 60 మంది కైట్ ఫ్లైయర్లు పాల్గొంటున్నారు. సుమారు 450 రకాల దేశీయ, అంతర్జాతీయ స్వీట్స్, ఫుడ్ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. 100కు పైగా హ్యాండీ క్రాఫ్ట్స్ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. దేశం నలుమూలల వివిధ ప్రాంతాలకు చెందిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. మంగళ, బుధవారాల్లోనూ ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు ఫెస్టివల్ కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్ పర్సన్ వెన్నెల గద్దర్, రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్, పర్యాటక శాఖ సంచాలకులు జెండగే హనుమంతు కొండిబా, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**అమ్మవారు.. ఆదివాసీ కట్టుబొట్టు**



కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో సోమవారం పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క పర్యటించారు. కెరమెరి మండలంలోని మహరాజ్‌గూడ అడవుల్లో కొలువైన జంగుబాయి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సీతక్క, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆదివాసీ గిరిజన సంప్రదాయ చీరకట్టు, ఆభరణాలతో ఆకట్టుకున్నారు.

కెరమెరి (ఆసిఫాబాద్)

## బోనాలతో భోగి..


మోత్కూరు: యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో సోమవారం భోగి పండుగను వినూత్న రీతిలో జరుపుకున్నారు. భోగి రోజు బోనాల ఊరేగింపు నిర్వహించారు. గౌడకులస్తులు కంఠమహేశ్వర స్వామి ఆలయానికి, ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మతల్లి ఆలయానికి బోనాలు తీసుకెళ్లి నైవేద్యంగా సమర్పించారు.



## కంకల్‌ను హెరిటేజ్ విలేజ్‌గా ప్రకటించాలి

### ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలోని కంకల్‌ను వారసత్వ గ్రామం(హెరిటేజ్ విలేజ్)గా ప్రకటించాలని చరిత్ర పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి కోరారు. ఆ గ్రామంలో వెయ్యేళ్ల క్రితం నాటి నుంచి వివిధ కాలాలకు చెందిన 50కి పైగా శిల్పాలు ఉన్నాయని, పరిశోధకులు, పర్యాటకుల ఆదరణ చూరగొనే అవకాశం ఉంటుందన్నారు. సోమవారం ఆయన స్థానిక వారసత్వ ప్రేమికులు సంపత్‌కుమార్ సింహాద్రి వెంకటరామిరెడ్డిలతో కలిసి గ్రామాన్ని సందర్శించారు. చెల్లాచెదురుగా విసిరేసినట్టు ఉన్న బాదామి చాళుక్య, రాష్ట్రకూట, కల్యాణి చాళుక్య, కాకతీయుల కాలపు అపురూప శిల్పాలను పరిశీలించారు. జైన, శైవ, శాక్తమతాలకు చెందిన ఇన్ని శిల్పాలను వీరభద్రాలయ ప్రాంగణానికి తరలించి..పీఠాలపై ప్రతిష్ఠించి, చారిత్రక వివరాలు తెలిపే బోర్డులు ఏర్పాటు చేయించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన గట్టుపల్లి మల్లేశ్, నీరటి రాములు, చిన్నికృష్ణ, ఆలయ పూజారులు పాల్గొన్నారు.



కంకల్ గ్రామంలోని వెయ్యేళ్ల క్రితం నాటి జైన విగ్రహాలను పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి

## గేమ్‌ఛేంజర్ సినిమాకు పైరసీ దెబ్బ

సాక్షి, హైదరాబాద్: గేమ్‌ఛేంజర్ సినిమాకు పైరసీ దెబ్బ తగిలింది. చిత్రాన్ని పైరసీ చేసి సోషల్‌మీడియాలో పోస్టు చేయడంతోపాటు నెగెటివ్ పబ్లిసిటీ చేస్తున్న ఓ ముఠాపై చిత్రయూనిట్ ఆదివారం హైదరాబాద్ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. దాదాపు 45 మందితో కూడిన గ్యాంగ్ ఈ పని చేసినట్టు ఫిర్యాదుదారులు కొన్ని ఆధారాలను పోలీసులకు అందించారు. ఈ సినిమా విడుదల ముందే చిత్ర యూనిట్‌లోని కొందరు కీలక వ్యక్తులకు సోషల్ మీడియా ద్వారా బెదిరింపులు వచ్చాయి. తాము అడిగిన మొత్తం ఇవ్వకుంటే సినిమా పైరసీ ప్రింట్ లీక్ చేస్తామని హెచ్చరించారు. దీనిని చిత్ర యూనిట్ పట్టించుకోలేదు. సినిమా విడుదలకు రెండు రోజుల ముందే కొన్ని కీలక సన్నివేశాలు సోషల్‌మీడియాలో షేర్ అయ్యాయి. సినిమా థియేటర్లలోకి వచ్చిన తర్వాత హెచ్‌డీ ప్రింట్ లీక్ చేసిన గ్యాంగ్ సోషల్‌మీడియా ద్వారా షేర్ చేసింది. దీని వెనుక 45 మందితో కూడిన ముఠా ఉన్నట్టు చిత్ర యూనిట్ ఆరోపిస్తోంది. పైరసీ ప్రింట్‌ను లీక్ చేయడంతోపాటు సినిమాపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. టెలిగ్రామ్‌తోపాటు 'ఎక్స్', ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్‌ల్లో సినిమాపై దుష్ప్రచారం చేస్తున్నట్టు, చిత్రంలోని కొన్ని కీలక ట్విస్టులు ముందే చూపించేస్తూ ప్రేక్షకులకు సినిమాపై ఆసక్తి తగ్గేలా వ్యవహరిస్తున్నారని చిత్ర యూనిట్ సైబర్ క్రైమ్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లింది.

## ఆన్‌లైన్ మోసాలపై అవగాహనకు సైబర్ జాగృతి

- ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్న టీజీసీఎస్‌బీ

సాక్షి, హైదరాబాద్: సైబర్ మోసాలపై ప్రజల్లో అవగాహన పెంచే లక్ష్యంతో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) సైబర్ జాగృతి పేరిట ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తోంది. జనవరి నెలాఖరు వరకు పలు ప్రాంతాల్లో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా జరుగుతున్న డిజిటల్ అరెస్టు, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, ఓఎల్‌ఎక్స్‌లో అమ్మకాల పేరిట మోసాలు, సైబర్ బుల్లీయింగ్, లాటరీ, సర్‌ప్రైజ్ గిఫ్టుల పేరిట మోసాలు ఇలా పలు తరహా నేరాలపై వివరిస్తున్నారు. ఇందుకోసం టీజీసీఎస్‌బీ అధికారులు అవగాహన ర్యాలీలు, వర్క్‌షాపులు, కమ్యూనిటీ ఔట్రీచ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల కాలంలో పెరిగిన డిజిటల్ అరెస్టుపై ప్రధానంగా వివరిస్తున్నారు. సైబర్ మోసాలకు సంబంధించిన సందేహాల నివృత్తికి, ఇతర సహాయం కోసం 1930 టోల్‌ఫ్రీ నంబర్‌లో సంప్రదించాలని సూచిస్తున్నారు. సైబర్ సేఫ్ తెలంగాణే లక్ష్యంగా ఈ ఏడాదిని సైబర్ విజిలెన్స్, సేఫ్టీ సంవత్సరంగా మార్చాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నట్టు టీజీసీఎస్‌బీ అధికారులు తెలిపారు.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. 

# పిండివంటలూ ఆర్డరే

- ప్రస్తుత తరంలో తగ్గుతున్న ఓపిక
- బయట షాపుల్లో పిండివంటల కొనుగోళ్లు
- ప్రజల జీవన విధానంలో మార్పులు


పిండి వంటల తయారీ కేంద్రం


ప్యాకింగ్ చేసి అమ్మకానికి సిద్ధంగా

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సంక్రాంతి పండుగ అంటే సకినాలు, బెల్లం అరిసెలు, మురుకులు తప్పకుండా గుర్తొస్తాయి. ఒకప్పుడు అమ్మలు, అమ్మమ్మలు, నాన్నమ్మలు, పిన్నమ్మలు, అత్తయ్యలు ఈ పిండి వంటల తయారీలో స్పెషలిస్టులుగా ఉండేవారు. కానీ ఇప్పుడు ట్రెండ్ ఛేంజ్ అయ్యింది. పిండి వంటలు కూడా ఔట్ సోర్సింగ్‌లో చేయించుకుంటున్నారు.


సమష్టిగా పిండివంటలు చేసుకుంటున్న గ్రామీణ జనం

### ముచ్చట్లు పెడుతూ

1980, 90వ దశకాల్లో పుట్టిన వారితోపాటు అంతకుముందు తరానికే సకినాలు, అరిసెలు, మురుకుల వంటి పిండి వంటల తయారీ నైపుణ్యం ఉండేది. ఓపిగ్గా గిర్నీల్లో పిండి పట్టించి, సమపాళ్లలో ఉప్పు, కారం తదితర దినుసులు కలిపి సకినాలు, అరిసెలు, గారెలు, మురుకులు చేసేవారు. ఒకరింట్లో చేస్తే పక్కింటి వారు సాయానికి వచ్చేవారు. ఓ వైపు ముచ్చట్లు సాగుతుంటే మరోవైపు కట్టెల పొయ్యిపై పెట్టిన పెద్ద కలాయిలో కావాల్సినన్ని పిండివంటలు చకచకా తయారయ్యేవి.

### తరం మారుతోంది..



90వ దశకం తర్వాత తరంలో ఎక్కువమంది చదువు, ఉద్యోగాలతో బిజీగా ఉంటున్నారు. పైగా యూట్యూబ్, ఇన్‌స్టా రీల్స్ చూస్తూ ఎప్పటికప్పుడు సరదా సరదాగా సరికొత్త వంటలు వండేస్తున్నారు. సండే, హాలిడే స్పెషల్స్ పేరిట ప్రత్యేక వంటకాలు చేసుకునే ట్రెండ్ అందరి ఇళ్లలోనూ ఇప్పుడు పెరిగింది. దీంతో పండుగ సమయంలో ఎంజాయ్ చేయకుండా పిండివంటల పని పెట్టుకునేందుకు సుముఖంగా లేరు. ఇక ఇంటిల్లిపాదికి పిండి వంటలు చేయడం శ్రమతో కూడుకున్న వ్యవహారంగా మారింది.

### పండుగకు ఫుల్ డిమాండ్..



మా కుటుంబ సభ్యులం గతంలో టిఫిన్ సెంటర్ నడిపేవాళ్లం. పిండి వంటలకు ఉన్న గిరాకీ చూసి టిఫిన్ సెంటర్ బంద్ పెట్టి పిండి వంటల తయారీ కేంద్రం పెట్టాం. ఏడాది తిరిగేలోగా ఆరుగురు వర్కర్లను పెట్టుకోవాల్సి వచ్చింది. ఉదయం చేస్తే సాయంత్రానికే స్టాక్ అయిపోతోంది.

– వరలక్ష్మి,
పిండి వంటల తయారీ కేంద్రం, ఇల్లెందు

### బయట ఆర్డర్ ఇస్తున్నాం



ఇంతకు ముందు ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. పండుగ వచ్చిందంటే ఒక్కటిగా చేరి వంటలు చేసేవారు. ఇప్పుడు ఆ కుటుంబాలు తగ్గిపోయాయి. పిల్లలు చదువు కోసం బయట ఉంటున్నారు. పండుగ సెలవుల్లో వంటల పని పెట్టుకుంటే పిల్లలతో గడపలేం. అందుకే బయట ఆర్డర్ ఇస్తున్నాం.

– కె.లక్ష్మీస్వరాజ్యం, మణుగూరు

### ఏడాది అవుతోంది...



గతంలో ఓ పిండి వంటల తయారీ కేంద్రంలో పని చేసేదాన్ని. ఈ వంటలకు రోజురోజుకు గిరాకీ పెరుగుతోంది. దీంతో గతేడాది కొత్త సెంటర్ ఏర్పాటు చేశాం. ఆరంభంలో కొంచెం భయం ఉండేది. కానీ ఏడాది తిరిగే సరికి ఫుల్ ఆర్డర్స్ వస్తున్నాయి. పండుగలకుకస్టమర్లు వెయిట్ చేయాల్సి వస్తోంది.

– లక్ష్మి, పిండి వంటల తయారీ కేంద్రం, కొత్తగూడెం

### కొన్నిచోట్ల సమష్టిగానే...

పిండివంటల తయారీ కేంద్రాలు కొత్తగా వస్తున్నా, ఇప్పటికీ చిన్న పట్టణాలు, పల్లెల్లో ఇరుగు పొరుగు కుటుంబాల వారు ఒకరికి ఒకరు సాయం చేసుకుంటూ పిండివంటలు చేసుకునే సంప్రదాయం కొనసాగుతోంది. టీవీ సీరియళ్లు, రీల్స్, షార్ట్స్‌కు అలవాటు పడిన వారు సైతం పిండి వంటల తయారీ సందర్భంగా జరిగే ముచ్చట్లలో పాల్గొంటున్నారు. ఇదే సమయాన వంటల తయారీలో ఓనమాలు, మెళకువలు నేర్చుకుంటున్నారు.



### ఆర్డర్ ఇస్తే చాలు

పిండివంటలు చేసేందుకు కట్టెల పొయ్యిలే మేలు. ఇప్పుడేమో ఇళ్లలోకి గ్యాస్‌స్టవ్‌లు వచ్చాయి. గంటల తరబడి పిండి వంటలు చేయడం కష్టమైన పనిగా మారింది. ఇంట్లో తల్లులు కష్టపడి పిండి వంటలు చేయడాన్ని పిల్లలు సైతం అడ్డుకుంటున్నారు. దీంతో పండుగలు, పేరంటాలకు పిండి వంటలు చేసే ఆనవాయితీ తగ్గుముఖం పడుతోంది. ఈ లోటు భర్తీ చేసేందుకు నగరాల్లో స్వగృహ ఫుడ్స్ పేరుతో మొదలైన ఈ ట్రెండ్ ఇప్పుడు కుటీర పరిశ్రమ స్థాయికి చేరుకుంది. చిన్న చిన్న పట్టణాలు, మండల కేంద్రాల్లోనూ పిండి వంటలు తయారు చేసే కేంద్రాలు పదుల సంఖ్యలో వెలుస్తున్నాయి. అప్పటికప్పుడు కేజీల వంతున పిండి వంటలు కొనుగోలు చేయడం లేదంటే ప్రత్యేకంగా ఆర్డర్ ఇచ్చి తయారు చేయించుకుంటున్నారు.



---


దివంగత మాజీ ముఖ్యమంత్రి డా.మర్రి చెన్నారెడ్డి జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారు

### మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



సాక్షి, హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆరోపించారు. సోమవారం ఆయన తెలంగాణభవన్‌లో బీఆర్‌ఎస్ నేత చింతం సదానందంతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ముగ్గురు మంత్రుల సాక్షిగా కరీంనగర్‌లో ఆదివారం జరిగిన అరాచకాన్ని ఖండిస్తున్నామన్నారు. ఆరు గ్యారంటీలపై జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ప్రభుత్వాన్ని పొగుడుతుంటే ఏ పార్టీ గురించి మాట్లాడుతున్నారని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారని, దానిలో తప్పేముందన్నారు. కౌశిక్‌రెడ్డిపై కేసులు పెట్టారని, అదే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేస్తే అరికెపూడి గాంధీపై కేసు పెట్టారా అని నిలదీశారు. భువనగిరిలో బీఆర్‌ఎస్ కార్యాలయంపై దాడి చేసిన వారిపై ఎందుకు కేసు పెట్టలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. సంజయ్ సిగ్గు లేకుండా స్పీకర్‌ను కలిశారని, దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలన్నారు.

## జర్నలిస్టు అనిల్‌కుమార్ మృతిపై సీఎం దిగ్భ్రాంతి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ టుడే సీనియర్ జర్నలిస్టు అనిల్‌కుమార్ ఆకస్మిక మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జర్నలిస్టుగా పత్రికారంగానికి ఆయన అందించిన సేవలను సీఎం గుర్తు చేశారు. అనిల్‌కుమార్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**కేసీఆర్, కేటీఆర్ సంతాపం**

సీనియర్ జర్నలిస్టు అనిల్ కుమార్ అకాల మృతి పట్ల బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపం ప్రకటించారు. అనిల్‌కుమార్ కుటుంబ సభ్యులకు వారు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## నేరుగా మీరే కౌంటర్ వేయండి

### నవీన్‌మిత్తల్‌కు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: విధుల నిర్వహణలో వస్తున్న ఆరోపణలపై నేరుగా వ్యక్తిగతంగా కౌంటర్ దాఖలు చేయాలని సీసీఎల్‌ఏ, రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిత్తల్‌ను హైకోర్టు ఆదేశించింది. ఇతర అధికారులు, శ్రీ ఇందూ ఇంజనీరింగ్ కాలేజీలు కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామం సర్వే నంబర్ 221లోని 3.20 ఎకరాలకు సంబంధించి ఎలాంటి లావాదేవీలు నిర్వహించరాదని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 4కు వాయిదా వేసింది. కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)లను ప్రతివాదులుగా ఉపసంహరించుకునేందుకు అనుమతి ఇవ్వాలని పిటిషనర్ న్యాయవాది కోరగా, న్యాయస్థానం అనుమతిచ్చింది. సర్వే నంబర్ 221లోని 3.20 ఎకరాలకు సర్కార్ భూమి అన్యాక్రాంతం అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ బీఎస్పీ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు మచ్చ మహేందర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమణదారుల నుంచి రక్షించాలంటూ పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా పట్టించుకోలేదన్నారు. వెంటనే చర్యలు చేపట్టేలా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌లకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఇందూ కాలేజీపై ఆరోపణలు చేస్తూ.. ప్రతివాదిగా చేర్చారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సీవీ.భాస్కర్‌రెడ్డి విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. వ్యక్తిగతంగా ఆక్రమణలకు సహకరిస్తున్నారని ఆరోపణలున్నందున నేరుగా కౌంటర్ దాఖలు చేయాలని నవీన్‌మిత్తల్‌ను ఆదేశించారు. ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, విచారణ వాయిదా వేశారు.




సోమవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఇంటర్నేషనల్ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ ప్రారంభమైంది. పలువురు ఔత్సాహికులు వైవిధ్యభరితమైన పతంగులను ఎగురవేసి సందడి చేశారు

## ఆలస్యానికి కారణం అదొక్కటే కాదు



'మీతో–సాక్షి'లో పాఠకుల సందేహాలకు ఆర్‌పీఓ జొన్నలగడ్డ స్నేహజ సమాధానాలు

**పోలీసు వెరిఫికేషన్ పూర్తయినా పాస్‌పోర్టు జారీ ఆలస్యమవుతోంది, కారణమేమిటి?** – జానీమియా, సూర్యాపేట

ఆర్‌పీఓ: పోలీసు వెరిఫికేషన్ పూర్తయినా ఆ రిపోర్టు క్లియర్‌గా ఉందా? లేదా? అనేది దరఖాస్తుదారుడికి తెలియదు. ఆలస్యానికి ఇదొక కారణం. కొన్ని సందర్భాల్లో అవసరమైన పత్రాలు, గుర్తింపుకార్డులన్నీ సమర్పించి ఉండకపోవచ్చు. అలాంటప్పుడు అదనపు/అవసరమైన వివరాలను తీసుకున్నాకే ఓకే చేస్తాం.

**డాక్యుమెంట్లను తిరిగి సమర్పించాలంటూ నా పాస్‌పోర్టు రెన్యువల్ దరఖాస్తును ఆర్‌పీఓ కార్యాలయం హోల్డ్‌లో పెట్టింది. నేరుగా ఆర్‌పీఓ కార్యాలయానికి వచ్చి రీ సబ్మిట్ చేయవచ్చా?** – అంజద్ ఖాన్, కోదాడ

ఆర్‌పీఓ కార్యాలయానికి వచ్చి రీ సబ్మిట్ చేసుకోవచ్చు. సోమ, మంగళ, శుక్రవారాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో అపాయింట్‌మెంట్ తీసుకోవాలి. గురువారం మాత్రం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 మధ్య ఎలాంటి నేరుగా ఆర్‌పీఓ కార్యాలయానికి రావచ్చు.

**తత్కాల్ పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసేప్పుడు చిరునామా కోసం కరెంట్ బిల్లు, పుట్టినతేదీ ధ్రువపత్రంగా పాన్‌కార్డు జత చేయవచ్చా?**

– డి.జగదీశ్వర్‌రెడ్డి, మధురానగర్, హైదరాబాద్

ఆ కరెంటు బిల్లు దరఖాస్తుదారు పేరుతోనే ఉండాలి. పాన్‌కార్డు, ఓటర్ ఐడీ, బర్త్ సర్టిఫికెట్, టెన్త్ క్లాస్ సర్టిఫికెట్ వీటిలో ఏదైనా పుట్టినతేదీ ధ్రువీకరణగా పనిచేస్తుంది. తత్కాల్ పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకోవాలంటే కనీసం మూడు గుర్తింపు పత్రాలు సమర్పించాలి.

**పాస్‌పోర్టు వ్యాలిడిటీ ఎన్నాళ్లు ఉంటుంది?**

– సీహెచ్ గోరఖ్‌నాథ్, ఆదిలాబాద్ టౌన్

సాధారణ పరిస్థితుల్లో వయోజనులకు జారీచేసే పాస్‌పోర్టు వ్యాలిడిటీ పదేళ్లు ఉంటుంది. 15 ఏళ్లలోపు పిల్లలకు ఐదేళ్ల కాలపరిమితి ఉంటుంది. 15 నుంచి 18 ఏళ్ల మధ్య వయసువారు మైనార్టీ తీరే వరకు లేదా పదేళ్ల కాలపరిమితితో పాస్‌పోర్టులు తీసుకోవచ్చు. పాస్‌పోర్టు గడువు పూర్తయిన తర్వాత ఎప్పుడైనా రీ ఇష్యూ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

**నా పాస్‌పోర్టు గడువు త్వరలో ముగిసిపోతుంది. అందులో మరింత కాలపరిమితి ఉన్న వీసాలు ఉన్నాయి. రెన్యూవల్ చేయించుకుంటే వీసాల సంగతేంటి?** – రాజు, హైదరాబాద్

కొత్త పాస్‌పోర్టు జారీ చేసినా పాత పాస్‌పోర్టులో ఉన్న వీసాల వేలిడిటీ అలానే ఉంటుంది. ప్రయాణించేటప్పుడు రెండింటినీ వెంట తీసుకువెళ్లాల్సి ఉంటుంది.

**టెన్త్ సర్టిఫికెట్‌కు భిన్నంగా నా ఆధార్, పాన్‌కార్డుల్లో పూర్తిపేరు కాకుండా షార్ట్ నేమ్ ఉంది. వాటితో పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకోవచ్చా?**

– ఉదయ్‌రెడ్డి, ఖైరతాబాద్

అన్ని గుర్తింపుకార్డులు, ధ్రువీకరణ పత్రాల్లో ఇంటిపేరు, పేరు, పుట్టిన తేదీ ఒకేలా ఉండటం ఉత్తమం. మీరు దరఖాస్తు చేసుకోండి. ఆయా వివరాలు, సర్టిఫికెట్ల ఆధారంగా పాస్‌పోర్టు సేవా కేంద్రాల సిబ్బంది అవసరమైన సూచనలు చేస్తారు.

**పాస్‌పోర్టులోని నా సంతకాన్ని మార్చుకోవాలని అనుకుంటున్నా.. సాధ్యమా? ఏ సర్టిఫికెట్లు సమర్పించాలి?** – రాకేశ్‌కుమార్, కరీంనగర్

సంతకం మార్చుకోవచ్చు. డిక్లరేషన్ లేఖతోపాటు దరఖాస్తు చేసుకోవాలి. పోలీసు వెరిఫికేషన్ తర్వాత మారిన సంతకంతో కూడిన పాస్‌పోర్టు జారీ చేస్తాం.

**నా పాస్‌పోర్టును ఇమ్మిగ్రేషన్ చెక్ రిక్వైర్డ్ (ఈసీఆర్) నుంచి ఇమ్మిగ్రేషన్ చెక్ నాట్ రిక్వైర్డ్‌కు (ఈసీఎన్‌ఆర్) ఎలా మార్చుకోవాలి?** – జి.చంద్రమోహన్, బండ్లగూడ జాగీర్

ఈసీఎన్‌ఆర్‌గా మార్చుకోవడానికి కనీసం పదో తరగతి ఉత్తీర్ణతకు సంబంధించి ధ్రువపత్రం జత చేయాలి. లేదా ఒక ఏడాది ఆదాయ పన్ను రిటర్నుతో గానీ, 50 ఏళ్లు నిండిన వారు సంబంధించిన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి.

### అదనపు డాక్యుమెంట్లు అక్కడే ఇవ్వాలి

పీఎస్‌కే, పీఓపీఎస్‌కేలలో దరఖాస్తు సమర్పించినప్పుడు అవసరమైతే వాళ్లు మరికొన్ని డాక్యుమెంట్లు అడుగుతారు. వాటిని సమర్పించడానికి కొంత సమయం ఇస్తారు. వాటిని అక్కడికే తీసుకువెళ్లి దాఖలు చేయాలి. అవసరమైతే మరికొంత సమయం కోరవచ్చు. ఇది తెలియక అనేక మంది ఆర్‌పీఓ కార్యాలయానికి వస్తున్నారు. ఆర్‌పీఓ నుంచి ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా (rpo.hyderabad@mea.gov.in) కు ఈ–మెయిల్ చేయవచ్చు.

– జొన్నలగడ్డ స్నేహజ, ఆర్‌పీఓ, హైదరాబాద్

## క్లుప్తంగా...

### డిసెంబర్ పెన్షన్లు ఖాతాలో జమయ్యాయి

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం వర్సిటీల్లోని సర్వీస్, ఫ్యామిలీ పెన్షనర్స్‌కు డిసెంబర్ పెన్షన్‌ను సోమవారం జమ చేసినట్లు వర్సిటీ పెన్షనర్స్ అధ్యక్షుడు ఎం.శివ ప్రసాదరావు ఓ ప్రకటనలో తెలిపారు. పండగ సందర్భంగా పెన్షన్‌ను విడుదల చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెప్పారు.

### అంతర్జాతీయ జంప్ రోప్‌లో స్వర్ణ పతకం


బంగారు పతకంతో వెంకటేష్

చిల్లకూరు: తిరుపతి జిల్లా చిల్లకూరు మండలంలోని నెలబల్లిరెట్టపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థి అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించినట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయిని ఎస్‌కే మస్తాన్‌బీ సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన ఎం వెంకటేష్ అనే విద్యార్థి పాఠశాలలో చదువుతూ గత ఏడాది డిసెంబర్‌లో అనంతపురం జిల్లా కదిరి గ్రామంలో 5వ రాష్ట్ర స్థాయిలో జరిగిన జంప్ రోప్ క్రీడల్లో పాల్గొని జాతీయ, అంర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యాడని తెలిపారు. ఈ క్రమంలో జనవరి 6–8 వ తేది వరకు నేపాల్‌లో జరిగిన ఇండో – నేపాల్, ఇంటర్ నేషనల్ టోర్నమెంట్‌లో పాల్గొని బంగారు పతకం సాధించాడని తెలిపారు.

### ఎస్‌ఐ తీరుపై హెచ్‌ఆర్సీకి ఫిర్యాదు

శాంతిపురం: ఎస్‌ఐ తనను బెదిరించి, దుర్భాషలాడినా పోలీసు ఉన్నత అధికారులు పట్టించుకోలేదని ఓ యువకుడు జాతీయ మానవహక్కుల కమిషన్, రాష్ట్ర లోకాయుక్తలను ఆశ్రయించాడు. చిత్తూరు జిల్లా శాంతిపురం మండలంలోని అబకలదొడ్డి పంచాయతీ గంగాపురానికి చెందిన ఎస్ వి సురేష్ కథనం మేరకు.. జంగాలపల్లికి చెందిన తన మిత్రుడి కుమారుడు కనిపించటం లేదని బాధితులు గత నెలలో రాళ్లబూదుగూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పురోగతిని తెలుసుకునేందుకు బాధిత కుటుంబంతో కలసి గత నెల 24న తను పోలీసు స్టేషన్ వద్దకు వెళ్లాడు. అక్కడ స్టేషన్ ఎదుట సురేష్‌ను చూసిన ఎస్సై నరేష్ అందరి ముందే బూతులు తిడుతూ, ఎన్‌కౌంటర్ చేస్తానని బెదిరించాడు. దీనిని వీడియో తీసే ప్రయత్నం చేసిన సురేష్ నుంచి కానిస్టేబుల్ బీఆర్ నాయక్ ఫోనును బలవంతంగా లాక్కుని వీడియోను డిలీట్ చేశాడు. ఈ వ్యవహారంపై అదేరోజు బాధితుడు కుప్పం డీఎస్పీకి ఫిర్యాదు చేశాడు. జిల్లా ఎస్పీతో పాటు పోలీసు శాఖలోని ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోయిందని దీంతో జాతీయ మానవహక్కుల కమిషన్, లోకాయుక్తలను ఆశ్రయించినట్టు చెప్పాడు. రెండు విచారణ సంస్థలు తన పిర్యాదులను విచారణకు స్వీకరించినట్టు తెలిపారు.

### ఎంబీయూలో సంక్రాంతి సంబరాలు

పాల్గొన్న మోహన్ బాబు, మంచు విష్ణు



చంద్రగిరి: మోహన్ బాబు యూనివర్సిటీలో భోగి సంబరాలు వేడుకగా జరిగాయి. సీనియర్ నటుడు, ఎంబీయు చాన్సలర్ మోహన్ బాబు కుటుంబ సభ్యులు బోగి మంటలు వేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తిరుపతి జిల్లా ఏ.రంగంపేట సమీపంలోని ఎంబీయూ వర్సిటీలో సోమవారం ఛాన్సలర్ మంచు మోహన్ బాబు, ప్రో ఛాన్సలర్ మంచు విష్ణు కుటుంబ సభ్యులు బోగి సంబరాలు వేడుకగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మోహన్ బాబు మాట్లాడుతూ అందరూ క్షేమంగా ఉంటే మనం క్షేమంగా ఉంటామని అన్నారు. మన సంస్కృతి, సంప్రదాయల పట్ల నేతి యువత తప్పకుండా అవగాహన కలిగి ఉండాలన్నారు.

# మనసే కోవెలగా..

- గ్రామగ్రామాన ఆధ్యాత్మిక సౌరభాలు
- మార్మోగుతున్న హరినామ సంకీర్తనలు
- మేలుకొలుపులతో మానసిక ప్రశాంతత

అచ్యుతాపురం: అనకాపల్లి జిల్లాలోని గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి వెల్లివిరుస్తోంది. భక్తి పారవశ్యం మానసిక ప్రశాంతత చేకూరుస్తోంది. సనాతన సంప్రదాయాలకు మళ్లీ పెద్దపీట వేస్తూ దేవుని పూజలతో తన్మయత్వం పొందుతున్నారు భక్తులు. చిన్న, పెద్ద తేడా లేకుండా అందరూ ధనుర్మాసం పూజల్లో నిమగ్నం అవుతున్నారు. పెద్ద పండుగ ముందు పల్లెలన్నీ హరినామ సంకీర్తనతో మార్మోగిపోతున్నాయి. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మేలుకొలుపు కార్యక్రమాలు అన్ని గ్రామాలకు విస్తరిస్తున్నాయి. చలికాలం వచ్చిందంటే కాసింత వెచ్చని ఎండ వచ్చే వరకూ నిద్ర లేవని వారు సైతం హరినామ సంకీర్తనలో మమేకం అవుతున్నారు. అచ్యుతాపురం మండలంలోని జగ్గన్నపేటలో ఐదేళ్ల క్రిందట ప్రారంభమైన మేలుకొలుపులు ఇప్పుడు మండలంలోని 12 గ్రామాలకు పైగా విస్తరించింది. తిమ్మరాజుపేట, హరిపాలెం, జగన్నాథపురం, కొండకర్ల, ఎర్రవరం, ఉప్పవరం, చీమలాపల్లి, దుప్పుతూరు, దోసూరు, గండివానిపాలెం, నరేంద్రంపురం గ్రామాల్లో మేలుకొలుపులు నెలగంట కొట్టిన రోజు నుంచి ప్రారంభమయ్యాయి. ఉత్తరాయనంలో 6 నెలల పాటు దేవతలు సంచరించే సమయంలో సూర్యుడు మకర రాశిలో ప్రవేశించినప్పుడు దేవుడిని ఆరాధిస్తే మంచి జరుగుతుందనేది భక్తుల నమ్మకం. మేలుకొలుపు కార్యక్రమం వల్ల తెల్లవారుజాము నుంచే భక్తులు లేచి పుణ్య స్నానాలు ఆచరించి హరినామ సంకీర్తన చేస్తున్నారు. అయ్యప్ప మాలధారులు స్వామి సన్నిధికి వెళ్లిన తర్వాత మళ్లీ భక్తితత్వంలో కొనసాగేందుకు మేలుకొలుపులు ఉపయోగపడుతున్నాయని సమరసత సేవా ఫౌండేషన్ యలమంచిలి డివిజన్ ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు చెబుతున్నారు. అన్ని వర్గాల ప్రజలకు మానసిక ప్రశాంతత, ఉల్లాసం లభిస్తోందని భక్తులు పేర్కొనడం గమనార్హం.


సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్న దృశ్యం


కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు

### హరిదాసుల సందడి

నెలగంట పెట్టిన రోజు నుంచి గ్రామాల్లో హరిదాసుల సందడి మొదలయ్యింది. అక్షయ పాత్రను తలపై పెట్టుకొని హరినామస్మరణతో వీధుల్లో సంచరిస్తూ ఆధ్యాత్మిక సౌరభాలను వెదజల్లుతున్నారు. గంగిరెద్దుల సందడి, గాలిపటాలతో చిన్నారుల కోలాహలం, ముగ్గుల పోటీల్లో మహిళల కళా కౌశలం ఊరూరా ప్రతిఫలిస్తోంది. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏకాదశి రోజున నగర సంకీర్తన, వారం వారం భజనలు, పౌర్ణమి రోజున సామూహిక హారతి, సత్సంగం, కార్తీక పౌర్ణమి రోజున వెన్నెలలో పాలను మరిగించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పలు గ్రామాల్లో మహిళలు కీర్తనలు, కోలాటాలు నేర్చుకొని దేవాలయాల్లో ప్రదర్శనలు ఇస్తున్నారు. ఇది కూడా వారిలో భక్తి భావం పెంపొందించడంతోపాటు, శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడుతోంది.


హరిదాసుల అక్షయ పాత్రలో బియ్యం వేస్తున్న మహిళ


గ్రామాల్లో మేలుకొలుపులు



ఈ చిత్రంలో కూరగాయల వ్యాపారం చేస్తున్న వ్యక్తి పేరు చిలకా నారాయణ. 30 ఏళ్లుగా ఊనగట్ల వారపు సంతలో కూరగాయలు విక్రయిస్తున్నాడు. గత ఏడాది ఇదే సమయానికి రూ.40 వేల వరకూ వ్యాపారం చేశాడు. ప్రస్తుతం కొనేవారు లేకపోవడంతో రూ.10 వేలు కూడా దాటని దుస్థితి నెలకొందని వాపోతున్నాడు. ప్రజల వద్ద డబ్బులు లేకపోవడంతో కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదని ఆవేదన చెందుతున్నాడు.



నిర్మానుష్యంగా కనిపిస్తున్న ఈ ప్రాంతం ఊనగట్లలోని వారపు సంత. మూడు గ్రామాల పరిధిలోని సుమారు 10 వేల మంది ప్రజలకు ఈ సంతే ప్రధానం. ప్రతి ఆదివారం నిర్వహించే ఈ సంతకు వచ్చి ఆయా గ్రామాల ప్రజలు నిత్యావసరాలు కొనుగోలు చేస్తారు. గత ఏడాది ఇదే సమయానికి ఈ సంత కొనుగోలుదారులతో కిటకిటలాడేది. ప్రస్తుతం జనం లేక వెలవెలబోతోంది.

# పల్లె కన్నీరు పెడుతోందో..

### గ్రామాల్లో పూర్తి స్థాయిలో కానరాని సంక్రాంతి సందడి

- మందగించిన వ్యాపారాలు
- తగ్గిన పిండివంటల ఘుమఘుమలు
- గత వైఎస్సార్ సీపీ పాలనలో విస్తృతంగా సంక్షేమం
- జనం చేతిలో పుష్కలంగా డబ్బు

సాక్షి, రాజమహేంద్రవరం/చాగల్లు: సంక్రాంతి వస్తోందంటే గోదావరి వాసుల అతిథి మర్యాదలే గుర్తుకొస్తాయి. గోదారోళ్లా మజాకా అనిపిస్తారు. అందుకే ఎక్కడున్నా ఈ పెద్ద పండగకు వారం నుంచి మూడు రోజుల ముందే స్వగ్రామాలకు వచ్చేస్తారు. ఆటపాటలు, కోడి పందేలు, బావామరదళ్ల అల్లర్లతో అసలు తగ్గేదేలే అన్నట్టుగా సంబరంగా ఈ పండగ నిర్వహించుకుంటారు. నచ్చిన వంటకాలు చేసుకుంటారు. కుటుంబమంతా ఒక్కచోటకు చేరి సంతోషంగా గడుపుతారు. కొత్త అల్లుళ్లకు పదుల సంఖ్య వంటలు వండి విందుభోజనం పెడతారు. గోదావరి జిల్లాల్లో ఎంతో ప్రాధాన్యం సంతరించుకున్న సంక్రాంతి సందడి ఈ ఏడాది ఆశించిన మేర కనిపించడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వివిధ సంక్షేమ పథకాల అమలుతో ప్రజల వద్ద పుష్కలంగా డబ్బులుండేవి. వేడినీళ్లకు చన్నీళ్ల తోడన్నట్టుగా.. జనం కష్టపడి సంపాదించుకున్నదానికి ప్రభుత్వం అందించే సొమ్ము తోడయ్యేది. ఫలితంగా గత ఏడాది సంక్రాంతి పండగను ప్రజలు ఎంతో సంబరంగా నిర్వహించుకున్నారు. కానీ, ఈ ఏడాది ఆ సందడి కానరావడం లేదు. కూటమి ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు నిలిచిపోవడం.. వరుస విపత్తులతో ఖరీఫ్ పంటలు దెబ్బ తినడం.. ఆర్థిక సమస్యలు.. పెరిగిన ధరలు వంటి కారణాలతో ప్రజల వద్ద డబ్బు లేకుండా పోయింది. దీంతో ఈ ఏడాది దాదాపు ఏ వ్యాపారమూ ఆశించిన మేర జరగడం లేదు. గ్రామీణ ప్రజల్లో పండగ జోష్ కూడా కనిపించడం లేదు.

**ఊనగట్ల.. పండగ కనబడటంలే..**

మూడు గ్రామాలకు వ్యాపార కేంద్రంగా ఉన్న ఊనగట్ల జనాభా 7,500. గ్రామంలో 5,300 మంది ఓటర్లున్నారు. ఉదయం 9 గంటల సమయంలో 'సాక్షి' బృందం ఆ గ్రామంలోకి అడుగు పెట్టింది. మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విస్తృతంగా పర్యటించింది. కనబడిన ప్రతి ఒక్కరినీ పలకరించింది. గత ఏడాది ఈపాటికే గ్రామంలో కొద్ది రోజుల ముందే సంక్రాంతి సందడి కనిపించేది. కానీ ఈసారి భోగి పండగ ముందు రోజు కూడా వీధుల్లో సంక్రాంతి ముగ్గులు, ఇళ్లల్లో బంధువుల సందడి కనిపించలేదు. గొబ్బెమ్మల కోలాహలమే లేదు. దుకాణాలు ఖాళీగా దర్శనమిచ్చాయి. నిత్యావసరాల ధరలు పెరగడంతో పిండివంటలు వెతికినా దొరకని పరిస్థితి. అదేమని గ్రామస్తులను ఆరా తీస్తే అసలు విషయం వెల్లడైంది. 'గత ఏడాదే నయం. చేతి నిండా డబ్బుండేది. పండగ ధూంధాంగా చేసుకునే వాళ్లం' అంటూ నిట్టూర్చారు.

### వైఎస్సార్ సీపీ హయాంలో రూ.51.07 కోట్ల మేర సంక్షేమం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలు పెద్ద ఎత్తున అమలు చేసింది. ఈ క్రమంలో ఊనగట్ల గ్రామానికి 33 పథకాల ద్వారా ప్రత్యక్ష నగదు బదిలీ, పరోక్ష చెల్లింపుల విధానంలో ఏకంగా రూ.51.07 కోట్ల మేర లబ్ధి చేకూరింది. డీబీటీ ద్వారా రూ. 33,70,37,857, నాన్ డీబీటీ ద్వారా మరో రూ. 14,28,32,390 కోట్ల మేర లబ్ధి కలిగింది. ఇవి కాకుండా నాడు – నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధి చేపట్టారు. ఇంటి స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించారు. ప్రభుత్వ సేవలను ప్రజల చెంతకే చేర్చారు. అమ్మ ఒడి, పింఛన్లు, చేయూత, జగనన్న విద్యా, వసతి దీవెన వంటి అనేక పథకాలతో ఆర్థిక ఆసరా కల్పించారు. పండగ సమయానికి ఏదో ఒక పథకం కింద మహిళల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేసేవారు. దీంతో అప్పట్లో సంక్రాంతి పండగను సంతోషంగా నిర్వహించుకునే వారమని పలువురు 'సాక్షి'కి చెప్పారు.

### వైఎస్సార్ సీపీ హయాంలో గ్రామాభివృద్ధి



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాభివృద్ధికి కృషి చేశాం. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాం. డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా గ్రామానికి రూ.51.07 కోట్ల లబ్ధి చేకూర్చాం. రూ.1.30 కోట్లతో పాఠశాలలు అభివృద్ధి చేశాం. రూ.80 లక్షలతో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్ భవన నిర్మాణాలు చేపట్టాం. రూ.2.20 కోట్లు వెచ్చించి పేదలకు ఇంటి స్థలాలు కేటాయించాం. 204 ఇళ్ల నిర్మాణాలకు నాంది పలికాం. రూ.1.03 కోట్లతో ఊనగట్ల – అమ్ముగుంట రోడ్డు పనులు నిర్వహించాం. రూ.50 లక్షలతో ఊనగట్ల – కలవలపల్లి రోడ్డు నిర్మాణం చేపట్టాం. ప్రస్తుతం పథకాలేవీ అందకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– మట్టా వెంకట్రావు, ఊనగట్ల,సర్పంచ్


తూర్పుగోదావరి జిల్లాలోని ఊనగట్ల గ్రామం


వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన జగనన్న కాలనీ ఇళ్లు

అతని పేరు రవి. విజయనగరం పట్టణంలోని వీటీ అగ్రహారంలో ఉంటున్నాడు. కూటమి ప్రభుత్వం ఉచితంగా గ్యాస్ ఇస్తుందంటే కుటుంబ ఆర్థిక భారం తగ్గుతుందని సంబరపడ్డాడు. పథకం అమలు తరువాత రెండుసార్లు గ్యాస్ సిలిండర్ విడిపించారు. ఒక్క దానికి కూడా నగదు జమ కాలేదు. మొదటి సిలిండర్‌కు నగదు జమ కాలేదని విజయనగరం జిల్లా పౌర సరఫరాల శాఖ, గ్యాస్ ఏజెన్సీ, బ్యాంకుల చుట్టూ తిరిగారు. ఈకైవేసీ చేయించమంటే చేయించారు. అయినా నగదు జమ కాలేదు.



# అందరికీ కాదు.. కొందరికేనా..!

- ఉచిత గ్యాస్ ఉత్తిదేనా...!
- ఆరు నిబంధనలతో అనర్హత వేటు
- ఈకైవేసీ సాకుతో నగదు జమ కాని వైనం
- నీరుగారుతున్న పథకం
- విజయనగరం జిల్లాలో రెండు నెలలుగా ఆరు వేల మంది ఎదురు చూపులు
- బ్యాంకులు, అధికారుల చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణ

విజయనగరం అర్బన్:

'ఆడపడుచుల కష్టం తీర్చుతా.. మీకు తెల్లకార్డు ఉంటే చాలు.. ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తాం.. నా మాట నమ్మండి..' ఇదీ గడిచిన ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీ. అధికారంలోకి వచ్చిన తరువాత ఉచిత గ్యాస్‌కు సిక్స్ స్టెప్ వెరిఫికేషన్ అమలు పేరుతో గ్యాస్ తుస్సుమనిపించారు. అన్ని అర్హతలుండీ సిలిండర్లు పొందిన వారిలోనూ వేలాది మందికి ఎగనామం పెట్టారు. మహిళలకు ఉచిత గ్యాస్ పేరిట మరోసారి పొగపెట్టారు. ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితం మాట మూన్నాళ్ల ముచ్చటగా మారింది. డబ్బులిచ్చి గ్యాస్ కొంటే నగదు రానంటోంది. ఉచిత గ్యాస్ డబ్బులు కోసం జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయం, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. రెండు నెలలుగా లబ్ధిదారులు నగదు కోసం ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం తీరుపై మహిళ లు మండిపడుతున్నారు. సూపర్ సిక్స్ ప్రామాణికంగా కూటమిలో టీడీపీ ఇచ్చిన హామీ ఉచిత గ్యాస్ పథకం. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల తరువాత ఉచిత గ్యాస్ పథకాన్ని హడావుడిగా తెరపైకి తీసుకొచ్చింది. ఉచితం అంటూ లబ్ధిదారులపై తొలుత భారం వేసి ఆ తరువాత నగదు బ్యాంకు ఖాతాకు జమ వేసేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని గట్టిగా హామీ ఇచ్చింది. అయితే ఈ గ్యాస్ ఉత్తి గ్యాస్ అని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీపావళి రోజున ప్రకటించిన ఈ ఉచిత గ్యాస్ బండ పేలని టపాసులా మిగిలింది.


నగదు జమ కాని విషయమై జిల్లా పౌర సరఫరాల కార్యాలయంలో ప్రశ్నిస్తున్న లబ్ధిదారులు

### టోల్ ఫ్రీ కూడా డమ్మీ

సమస్య పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబరు 1967కి తెలియజేయొచ్చని విస్తృత ప్రచా రం చేసారు. అయితే ఈ నంబరు డమ్మీలాగ ఉంది. ఎన్ని సార్లు ఫోన్ చేసినా ప్రయోజనం ఉండడం లేదు. ఈ కారణంగా గ్యాస్ ఏజెన్సీ వద్ద లబ్ధిదారు లు క్యూ కడుతున్నారు. వారు కూడా ఏ రకమైన సమాధానం ఇవ్వడం లేదు. దీంతో ఉచిత గ్యాస్ పథకం అందరికీ కాదని.. కొందరికేనా... అని ప్రజలు విమర్శిస్తున్నారు.

**కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న 6 వేల మంది**

జిల్లాలో 5.5 లక్షల మంది తెల్లకార్డుదారులు ఉన్నా రు. వీటిలో దాదాపు 3 లక్షల మంది వరకు మూడు గ్యాస్ ఏజెన్సీల నుంచి గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. పథకం అమలు చేసిన తరువాత సిలిండర్ కోసం బుకింగ్ చేసిన 3 లక్షల 60 వేల 461 మహిళామణులలో 6 వేల మందికి ఇప్పటికీ డబ్బులు అకౌంట్ లో జమ కాలేదు. నిర్ణీత సమయంలోపు వంట గ్యా స్ నగదు ఖాతాల్లో జమ కాకపోవడంతో లబ్ధిదారు లు దిక్కుతోచని స్థితిలో ఆందోళన చెందుతున్నారు. ఈ గ్యాస్ నగదు వివరాల కోసం ఎవరిని అడిగి తెలుసుకోవాలో తెలియక తికమకపడుతున్నారు.

### ఈకేవైసీ సాకు..

ఉచిత గ్యాస్ కనెక్షన్ కోసం డబ్బులు బ్యాంకుల్లో పడకపోవడంతో లబ్ధిదారులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. దీంతో అధికారులు వారికి సమాధానం చెప్పలేక కసురుకుంటున్నారు. తమకు సంబంధం లేదని చెబుతున్నారు. దీంతో ఏజెన్సీల వద్దకు వెళ్తే ఈకేవైసీ చేయించారా..? లేదా చూసుకొండనే సమాధానం వినిపిస్తోంది. ఈకేవైసీ చేయించిన వారికి కూడా రాయితీ డబ్బులు పడడం లేదని చెబుతున్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అయితే ఇదంతా వలంటీరుల చూసుకునే వారు. ఎలాంటి సమస్య వచ్చినా వారి దృష్టికి తీసుకెళితే చాలు చిటికెలో పనిచేసి పెట్టేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

# పండగ పూట రహదారులు రక్తసిక్తం

- శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో రెండు రోడ్డు ప్రమాదాలు
- నలుగురు దుర్మరణం
- మృతుల్లో ఇద్దరు చిన్నారులు

వెంకటాచలం/గుడ్లూరు: శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో భోగి పండగ రోజు జాతీయ రహదారులు రక్తసిక్తం అయ్యాయి. వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం చెందారు. వీరిలో ఇద్దరు తండ్రీకొడుకులు, మరో చిన్నారి ఉంది. వివరాల్లోకి వెళ్తే.. ఇందుకూరుపేట మండలం లేబూరుకు చెందిన షేక్ కాలేషా(45), కుమారుడు 6వ తరగతి చదువుతున్న అబ్దుల్ హమీద్ (12), భార్య జవహీర అలియాస్ యాస్మిన్‌తో కలిసి సోమవారం ఉదయం లేబూరు నుంచి సైదాపురం మండలం గిద్దలూరు గ్రామానికి వెళ్లేందుకు బయలుదేరారు. వెంకటాచలంలోని కసుమూరు రోడ్డు దాటిన తర్వాత ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీకొనడంతో కాలేషా, అబ్దుల్ హమీద్ తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

### బైక్‌ను ఢీకొన్న కారు..

మోటార్ బైక్‌ను కారు ఢీకొని ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటన గుడ్లూరు మండలం చేవూరు వద్ద సోమవారం జరిగింది. నెల్లూరు వైపు నుంచి ఒంగోలు వెళ్తున్న కారు లారీని ఓవర్ టేక్ చేసి బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో బైక్‌పై ఉన్న సరస్వతి వెంకటేశ్వర్లు (60) అక్కడికక్కడే మృతి చెందాడు. గుడ్లూరు మండలం రావూరు గ్రామానికి చెందిన సరస్వతి వెంకటేశ్వర్లు కావలికి వెళ్లి ఎరువులు తీసుకుని వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి పైకి లేచి కింద పడడంతో కారులో ఉన్న చిన్నారి మంత్తెన అద్వైక రాజ్ (4) తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో కావలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల జిల్లా కొత్తపల్లి మండలం భీమవరం గ్రామానికి చెందిన మంత్తెన రాజ్‌కుమార్ కుటుంబ సభ్యులు చెన్నై నుంచి తిరిగి వస్తుండగా ఈ విషాద ఘటన జరిగింది. వెంకటేశ్వర్లు మృతదేహాన్ని కందుకూరు ఏరియా వైద్యశాలకు, చిన్నారి మృతదేహాన్ని కావలికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.


చేవూరు సమీపంలో జాతీయ రహదారిపై బైక్‌ను ఢీకొని ప్రమాదానికి కారణమైన కారు, పక్కనే వెంకటేశ్వర్లు మృతదేహం

# వైకుంఠవాసా.. భారం మోయలేమయ్యా

- అహోబిలంలో ధరల దందా
- సామాన్య భక్తుడికి దూరంగా సేవలు
- పేరు మఠంది..పెత్తనం టీడీపీ నేతలది

ఆళ్లగడ్డ: అహోబిల లక్ష్మీ నారసింహుడు..ఈ మాట వింటేనే భక్తులు పరవశించిపోతారు. కానీ ఆయన దర్శనభాగ్యం సామాన్యుడికి దూరం చేసే పరిస్థితిని అహోబిలం దేవస్థానం తీసుకువచ్చింది. దీంతో భక్తుల రాకను నిలువరించేందుకు కుట్ర జరుగుతోందని హైందవ సంఘాలు ఆరోపిస్తున్నాయి. శ్రీ అహోబిలం మఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అహోబిలం దేవస్థానంలో అధికారులు అధికార పార్టీ నేతలకు మడుగులొత్తుతున్న తీరుతో భక్తులు మనోవేదనకు గురవుతున్నారు. జేబులకు చిల్లులు పడుతున్నాయి. అధికార పార్టీ నేతలకు దోచిపెట్టే క్రమంలో ఆ నష్టాన్ని పూడ్చుకునేందుకు సామాన్య భక్తులపై భారం మోపుతున్నారు. కొందరు అర్చకులు అపోహలు సృష్టించి దండలు, దారాలు పేరుతో భక్తులను దోపిడీకి గురిచేస్తున్నారు.

**పెత్తనం తమ్ముళ్లదే**

2022లో అహోబిలం దేవస్థానం దేవదాయ శాఖ నుంచి మఠం ఆధీనంలోకి వెళ్లింది. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేవస్థానంలో తెలుగు తమ్ముళ్ల పెత్తనం శ్రుతి మించింది. అడ్మినిస్ట్రేషన్‌తో పాటు వైదిక కైంకర్యాల్లో సైతం పెత్తనం చెలాయిస్తున్నారు. ఈ ఉదంతం వెనుక ప్రస్తుత అధికారులు తమ వంతు సహాయ సహకారాలు సంపూర్ణంగా అందిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దర్శనార్థం శని, ఆదివారల్లో భక్తులు రోజుకు వెయ్యి నుంచి 2 వేల మంది వరకు వస్తుంటారు. పండుగలు, ప్రత్యేక రోజుల్లో అయితే రోజుకు 20 నుంచి 30 వేల మంది భక్తులు స్వామిని దర్శించుకొంటుంటారు. వీరందరి జేబులు కానుకలు సమర్పించకుండానే ఖాళీ అవుతున్నాయి. దేవస్థానం పొలిమేరలో అడుగుపెట్టినప్పటి నుంచి వాహనాల గేట్, కేశ ఖండన, సీఘ్ర దర్శనం, ఇలా ఒక్కటేంటి ? ప్రతి దాంట్లోను అందినకాడికి దోచుకుంటున్నారు. మొన్నటి వరకు దిగువ అహోబిలంలో మాత్రమే ఉన్న వాహనాల గేటు గత వారం రోజుల నుంచి ఎగువ అహోబిలం వెళ్లే వాహనానికి రూ. 70 వసూలు చేస్తున్నారు. రూ. 10 ఉన్న లడ్డూ ధర రూ. 20 కి పెంచారు. తలనీలాలు రూ. 10 నుంచి రూ. 50, పుట్టు వెంట్రుకలు రూ. 20 నుంచి రూ. 100, శీఘ్ర దర్శనం రూ. 50 నుంచి రూ. 100 పెంచారు. ఎవరితోనూ చర్చించకుండా కనీసం పనిచేసే సిబ్బందికి సైతం ఏమాత్రం తెలియకుండా అర్థంతరంగా పెంచడంతో పాటు పాత ధరలు ఉన్న రసీదులతోనే పెంచిన ధరలు వసూలు చేస్తున్నారు.


అహోబిలం దేవస్థానం


అహోబిలం ట్రస్ట్ అని దేవస్థానం ముందు ఉంచిన వాహనం

### దోచుకున్నోళ్లకు దోచుకున్నంత

- హైదరాబాద్‌కు చెందిన కొందరు వ్యక్తులు 'అహోబిలం ట్రస్ట్'అని ఏర్పాటు చేశారు. ఈ ట్రస్ట్ ద్వారా స్వామి పార్వేట పల్లకీ వెళ్లే గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతామని మరో రెండు ఎన్‌జీఓ లతో ఎంఓయూ కూడా చేసుకున్నారు. అభివృద్ధి చేస్తున్నామని చూపించుకునేందుకు మహారాష్ట్ర రిజిస్ట్రేషన్ ఉన్న ఓ పాత మొబైల్ మెడికల్ సర్వీస్ వాహనం తెచ్చి దేవాలయం ఎదురుగా ఉంచారు. ఇది చూపిస్తూ ఎన్ని రూ.లక్షలు వసూలు చేస్తున్నారో ఎవరికి అర్థం కావడం లేదు.
- గతంలో ఉత్తరప్రదేశ్‌లో గుడి కడుతున్నామని దేవస్థానం ఖాతా నుంచి రూ 3.25 కోట్లు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్న విషయం తీవ్ర దుమారం లేపింది. దీంతో 6 నెలలకు తిరిగి అదే ఖాతాకు నగదు జమ చేయడం జరిగింది. అయితే ఎందుకు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారో ?, ఈ ఆరు నెలల వడ్డీ ఎవరు భరాయించారో అనే సవాలక్ష సమాధానం లేని ప్రశ్నలు భక్తుల మదిలో మిగిలిపోయాయి.
- అధికారే సొంత సంస్థ ఏర్పాటు చేసి ఆ సంస్థ తరుపున ఒక్కొక్కరి నుంచి రూ . 2 లక్షలు తీసుకోవడంతో పాటు నెలనెలా వారి జీతాల్లో నుంచి భారీగా కమీషన్ కూడా పట్టుకునే విధంగా ఒప్పందం చేసుకుని కొంత మంది రిటైర్డ్ ఉద్యోగులను ఉద్యోగాల్లో తీసుకున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్న ఉద్యోగులకే జీతాలు సక్రమంగా ఇచ్చే పరిస్థితి లేదని చెబుతున్న దేవస్థానం కొత్తగా ఇంత మందిని ఉద్యోగాల్లోకి తీసుకోవడంతో పాటు 15 నుంచి 20 సంవత్సరాలుగా ఇక్కడ పని చేస్తున్న ఉద్యోగులకంటే వీరికి రెండింతలు జీతం ఇచ్చి తీసుకోవడం ఒక ఎత్తైతే వీరికి ఏ పని చెప్పకుండా గేట్ల దగ్గర నిల్చోబెట్టి రూ. లక్షల జీతాలు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది.

### ఉన్నతాధికారులు ఆదేశానుసారమే



అహోబిలం ట్రస్ట్‌తో దేవస్థానానికి ఎటువంటి సంబంధం లేదు. మొబైల్ మెడికల్ సర్వీస్ వాహనం ఇక్కడ ఉన్నది వాస్తవమే. దేవస్థానం పేరు చెప్పి వసూలు చేస్తున్నారి ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. టిక్కెట్ ధరల పెంపు ఉన్నతాధికారుల ఆదేశానుసారమే చేశాము.

– మురళీధన్, జనరల్‌మేనేజర్, అహోబిలం దేవస్థానం

డైట్

గట్

ఫిట్

# గట్ బయోమ్ 'పవర్' హౌస్






డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి
ఛైర్మన్ అండ్ చీఫ్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ,
ఏఐజీ హాస్పిటల్స్,
హైదరాబాద్

ఒకప్పుడు జీర్ణవ్యవస్థ అంటే ఆహారాన్ని జీర్ణం చేయడం వరకే దాని పని అనుకునేవారు. కానీ... దాని పని 'అంతకు మించి' అంటూ ఇటీవలి ఎన్నో పరిశోధనలు తెలుపుతున్నాయి. జీర్ణ వ్యవస్థ అనేది చాలా సంక్లిష్టమైన వ్యవస్థ అంటూ కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇందులో కోటాను కోట్ల (ట్రిలియన్ల కొద్దీ) బ్యాక్టీరియా, వైరస్‌లు, ఫంగీ వంటి జీవులు నివసిస్తుంటాయి. వాటినే సంక్షిప్తంగా 'గట్ బయోమ్'గా పేర్కొంటున్నారు. ఈ జీవులే మానవుల సంపూర్ణారోగ్య నిర్వహణకు తోడ్పడుతున్నాయనీ, ఇవి కేవలం ఒక జీర్ణం చేసే పనే కాకుండా... ఆ వ్యక్తి తాలూకు వ్యాధి నిరోధక వ్యవస్థ, మానసిక ఆరోగ్యం వంటివాటినీ సమర్థంగా నిర్వహిస్తున్నాయని అధ్యయనాల్లో తేలింది. అంతేకాదు... ఓ వ్యక్తికి వచ్చే దీర్ఘకాలిక వ్యాధుల ముప్పు(రిస్క్)లు కూడా ఆ బయోమ్‌పైనే ఆధారపడి ఉన్నట్లు పరిశోధనలు చెబుతున్నాయి. దీన్నిబట్టి తెలిసేదేమిటంటే... ఓ వ్యక్తి తీసుకునే ఆహారంపైనే అతడి గట్ బయోమ్ ఆధారపడి ఉండటం, ఇక దాని మీదనే అతడి సంపూర్ణ ఆరోగ్యం కూడా ఆధారపడి ఉంటోంది.

## సూక్ష్మ సమాచార వారధి

జీర్ణవ్యవస్థలో ఉండే గట్ బయోమ్ అన్నది దేహానికి మేలు చేసే అనేక రకాల సూక్ష్మజీవుల సముదాయం. ఈ అనేక రకాల సూక్ష్మజీవుల సముదాయం తాలూకు సమతౌల్యత మీదే ఓ వ్యక్తి తాలూకు సంపూర్ణ ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. ఆ జీవవైవిధ్యత వల్లనే ఆహారం సరిగా జీర్ణం కావడం, జీర్ణమైనది ఒంటికి పట్టడం, జీవక్రియలన్నీ సక్రమంగా జరగడం, అన్నిటి కంటే ముఖ్యంగా ఆ బయోమ్ కారణంగానే అతడి వ్యాధి నిరోధక శక్తి ఇనుమడించడం జరుగుతుంది. ఇంకా చెప్పాలంటే ఈ బయోమ్ వల్లనే జీర్ణవ్యవస్థకూ, మెదడుకూ మధ్య నిరంతరం ఓ సమాచార వ్యవస్థ (గట్-బ్రెయిన్ ఏక్సిస్) నడుస్తుంటుంది. ఈ బయోమ్ వ్యవస్థ బాగుంటేనే... ఓ వ్యక్తితాలూకు భావోద్వేగాలు (మూడ్స్), నిద్ర, అతడి మానసిక ఆరోగ్యం ఇవన్నీ బాగుంటాయి.

## నేచురల్ సమతౌల్యం



మంచి సమతులాహారం తీసుకుంటూ గట్ మైక్రోబయోమ్ తాలూకు సమతౌల్యతను కాపాడుకోవడం ద్వారా ఓ వ్యక్తి తాలూకు జీవనశైలిని సానుకూలంగా అంటే పాజిటివ్‌గా మలచేందుకు ఆస్కారముంటుంది. భారతీయ సంప్రదాయ ఆహారంలోనివి... అంటే ముఖ్యంగా మొక్కలు, వృక్షాల నుంచి లభ్యమయ్యే చిరుధాన్యాలు, సుగంధద్రవ్యాలు, పులవడానికి సిద్ధంగా ఉన్న ఆహారాల వంటివి ఈ గట్‌బయోమ్ సమతౌల్యాన్ని స్వాభావికంగా (నేచురల్‌గా) నిర్వహితమయ్యేలా చేస్తాయి. మన జీర్ణవ్యవస్థలోని గట్ బయోమ్ సరిగా వృద్ధిచెందడానికైనా లేక అవి సరిగా అభివృద్ధి చెందకపోవడానికైనా మన ఆహారమే కారణమవుతుంది. మంచి ఆహారం తీసుకుంటే అవి సానుకూలంగా అభివృద్ధి చెందుతాయి. ఉదాహరణకు పీచుపదార్థాలు పుష్కలంగా ఉండే ఆహారాలు, పప్పులు (దాల్), శెనగలు, ఆకుపచ్చరంగులో ఉండే పాలకూర, గోంగోర వంటి ఆకుకూరల వల్ల జీర్ణవ్యవస్థలో మనకు మేలు చేసే బ్యాక్టీరియా వృద్ధి చెందుతాయి.



## మంచి ఆరోగ్యం కోసం...

కేవలం ఆహారంపైనే కాకుండా మన జీవనశైలి కూడా గట్ మైక్రోబియమ్ మీద ప్రభావం చూపుతుంది. మన ప్రపంచంలోని వివిధ ఖండాల్లో చాలా ఆరోగ్యకరమైన రీతిలో ప్రజలు నివసించే ప్రాంతాలను బ్లూ జోన్స్‌గా పరిగణిస్తుంటారు. ఈ బ్లూ జోన్స్‌లో నివసించే వారు మిగతా ప్రజల కంటే సుదీర్ఘ కాలం జీవిస్తుంటారు. అలాగే వారు సంపూర్ణారోగ్యంతో జీవనం సాగిస్తుంటారు. ఈ బ్లూ జోన్స్‌గా గుర్తించిన ప్రాంతాలు... సార్డీనియా (ఇటలీ), నికోయా (కోస్టా రికా), ఇకారియా (గ్రీస్), లోమా లిండా (కాలిఫోర్నియా) వంటివి. వీటిల్లో నివసించే వాళ్లను, వారి జీవనశైలిని పరిశీలించినప్పుడు... వారి జీవన శైలి మూలంగా జీర్ణవ్యవస్థ తాలూకు ఆరోగ్యం మెరుగుపరుచుకోడానికి అవలంబించాల్సిన కొన్ని పద్ధతులు తెలిశాయి. అవి...



● 'నిద్ర'పోదాం
నాణ్యత లేని నిద్ర, తరచూ నిద్రాభంగం కావడం వంటి సమస్యల వల్ల జీర్ణవ్యవస్థలోని గట్ బయోమ్ దెబ్బతింటుంది. దాంతో జీర్ణసమస్యలు వస్తాయి. బ్లూజోన్‌లోని ప్రజలు కంటి నిండా నిద్రపోవడంతో పాటు వేళకు నిద్రకు ఉపక్రమిస్తారు. ఇది కూడా వాళ్ల ఆరోగ్యానికి కావడం వల్ల ఆరోగ్యాన్ని కోరుకునేవారంతా రోజూ కనీసం 7 – 8 గంటల నాణ్యమైన నిద్రకు ప్రాధాన్యమివ్వాలి. దీనివల్ల వాళ్లకు గట్ ఆరోగ్యంతో పాటు సంపూర్ణ ఆరోగ్యమూ సిద్ధిస్తుంది.

● చురుగ్గా ఉందాం...
మనలో రోజువారీ కదలికలు ఎక్కువగా ఉంటే... అలా ఉండటం వల్ల సమకూరే వ్యాయామం కారణంగా జీర్ణవ్యవస్థలోని మైక్రోబయోమ్ ఆరోగ్యంగా ఉండటం, ఆహారం బాగా జీర్ణం కావడం జరుగుతుంది. బ్లూజోన్‌లోని ప్రజలు తమ స్వాభావికమైన కదలికలతోనే తమ రాకపోకలు సాగిస్తుంటారు. ఉదాహరణకు నడక, సైక్లింగ్ వంటివి. అలాగే తోటపని లాంటి పనుల వల్ల దేహపు కదలికలు బాగా చురుగ్గా జరుగుతుంటాయి. అంతేకాకుండా నడక, యోగా, వంటి తేలికపాటి వ్యాయామాలు, దేహపు కదలికల వల్ల... వాళ్ల జీర్ణవ్యవస్థ మరింత మెరుగ్గా, ఆరోగ్యంగా ఉంటుంది.



● నీళ్లు తాగుదాం...
నీళ్లు తాగడమన్నది మంచి జీర్ణవ్యవస్థకూ, ఆహారం బాగా జీర్ణం కావడానికీ, తిన్నవి బాగా ఒంటికి పట్టడానికి తోడ్పడుతుంది. బ్లూజోన్‌లోని ప్రజలు కూడా నీళ్లు తాగడాన్ని ఓ మంచి అలవాటుగా పాటిస్తారు. వాళ్లు చక్కెరతో కూడిన తియ్యటి పానీయాలను చాలా పరిమితంగా తీసుకుంటారు. మంచి ఆరోగ్యం కోసం రోజంతా తరచూ కొద్దికొద్దిగా నీళ్లు తాగుతూ ఉండటం, అలాగే తీయ్యటివీ, కెఫిన్‌తో కూడిన పానీయాలు చాలా పరిమితంగా తీసుకుంటూ ఉండాలి.



● ఒత్తిడిని ఎదుర్కొందాం...
దీర్ఘకాలికమైన ఒత్తిడి జీర్ణవ్యవస్థలో ఇన్‌ఫ్లమేషన్‌కూ, ఆహారం సరిగ్గా జీర్ణం కాకపోవడానికీ... అది మళ్లీ జీర్ణవ్యవస్థలో మైక్రోబియమ్ బలహీనపడటానికి దారితీస్తుంది. ధ్యానం, బాగా లోతుగా శ్వాస తీసుకోవడం, ప్రకృతితో సమన్వయమై వీలైనంత ఎక్కువసేపు గడపటం వంటి అంశాలు ఒత్తిడిని గణనీయంగా తగ్గిస్తాయి. ఉదాహరణకు జపాన్‌లోని 'ఒకినవా' అనే ప్రాంతంలోని ప్రజలు 'ఇకిగయి' అనే జీవనవిధానం ద్వారా ఒత్తిడి తగ్గించుకుని, మానసిక ప్రశాంతతను పొందుతారు. ఇలాంటి ఆరోగ్యకరమైన జీవన విధానాలను అనుసరించడం ద్వారా మానసిక ఆరోగ్యమూ సమకూరుతుంది. తద్వారా జీర్ణవ్యవస్థ ఆరోగ్యమూ మెరుగుపడుతుంది.




● విచక్షణతో తిందాం...
బ్లూ జోన్‌లో ఉన్న ఆరోగ్యవంతులైన ప్రజలు తమ కడుపు 80 శాతం నిండగానే తినడం ఆపేస్తారు. దీనివల్ల తిన్నది బాగా జీర్ణమవుతుంది. వాళ్లు భోజనాన్ని బాగా ఆస్వాదిస్తూ, మెల్ల మెల్లగా నములుతూ హాయిగా తింటారు. దీని వల్ల కడుపుబ్బరం, అజీర్తి, గ్యాస్ వంటి సమస్యలేవీ రావు. గట్‌కూ, మెదడుకూ మంచి సమన్వయమూ ఉంటుంది.

## ప్రో బయాటిక్



పులవడానికి సిద్ధంగా ఉండే ఆహారాలైన పెరుగు, ఇడ్లీ, దోశ వంటివి ప్రోబయాటిక్ ఆహారాలుగా పనిచేస్తూ... గట్‌లో ఉండే సూక్ష్మజీవరాసుల వృద్ధికీ, సమతౌల్యతకూ తోడ్పడతాయి. మళ్లీ వీటి కారణంగానే వ్యాధి నిరోధక శక్తి వృద్ధి చెందుతుంది. వీటితో పాటు ప్రీ-బయాటిక్ సమృద్ధిగా ఉండే వెల్లుల్లి, ఉల్లి, అరటి, ఓట్స్ వంటి ఆహారాలతో గట్‌లో ఉండే సూక్ష్మవృక్షజీవరాసులు అభివృద్ధి చెందుతాయి. అలాగే పసుపు, అల్లం, జీలకర్ర వంటి వాటితో దేహంలోని వాపు, మంట తగ్గించే (యాంటీ ఇన్‌ఫ్లమేటరీ) ప్రక్రియ జరుగుతుంది. మరీ ముఖ్యంగా చెప్పాలంటే పసుపులో ఉండే కర్కుమైన్ అనే సంక్లిష్ట పోషకాలు దేహంలోని ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తాయి. ఇక కాయధాన్యాలైన వరి, బార్లీతో పాటు చిరుధాన్యాల్లో పీచుపదార్థం సమృద్ధిగా ఉంటుంది. ఇవన్నీ జీర్ణవ్యవస్థలో ఉండే గట్ బయోమ్‌ను ఆరోగ్యకరంగానూ, సమతౌల్యంతోనూ పెరిగేలా చూస్తాయి.

## టేక్... కేర్



● భోజనంలోని ఆహారాల్లో... తగినన్ని కాయధాన్యాలు, ఆకుకూరలు, కాయగూరలు, పప్పులు, పండ్లు ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి ● పులవడానికి సిద్ధంగా ఉన్న ఆహారాలను ఆహారంలో భాగం చేయాలి. ● ప్రాసెస్‌డ్ ఆహారాలూ, చక్కెరతో కూడిన ఆహారాలు గట్ మైక్రోబయోమ్‌ను దెబ్బతీస్తాయి కాబట్టి వాటిని చాలా పరిమితంగా మాత్రమే తీసుకోవాలి ● ఒళ్లంతా మంచి కదలికలతో రోజంతా చాలా చురుగ్గా ఉండాలి ● స్ట్రెస్‌ను అదుపులో ఉంచుకోడానికి మంచి రిలాక్సేషన్ టెక్నిక్స్ అవలంబించాలి ● వేళకు కంటి నిండా నిద్రపోతూ గట్ – బ్రెయిన్ ఆరోగ్యం కోసం ప్రయత్నించాలి.

## దీర్ఘాయుష్మాన్‌భవ...

జీర్ణాశయం ఆరోగ్యం కోసం ప్రయత్నించడమంటే అది కేవలం గట్ తాలూకు ఆరోగ్యం కోసం మాత్రమే కాదు... నిజానికి అది సంపూర్ణారోగ్యం కోసం చేసే ప్రయత్నమని గుర్తుంచుకోవాలి. బ్లూజోన్‌లో నివసించేవాళ్ల నుంచి స్ఫూర్తి పొందుతూ అందరమూ మన జీవనశైలినీ, భారతీయ సంప్రదాయ ఆహారాలైన మొక్కల నుంచి లభ్యమయ్యేవీ, పులిసేందుకు సిద్ధంగా ఉండేవీ, పీచుపదార్థాలు ఎక్కువగా ఉండే ఆహారాలను తీసుకోవాలి. ఇది కేవలం జీర్ణవ్యవస్థ ఆరోగ్యం కోసం మాత్రమే కాకుండా ఓ వ్యక్తి తాలూకు సంపూర్ణారోగ్యానికి దోహదపడుతుంది.

## ఐపీవో స్ట్రీట్

### జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ సై..

- సెబీ గ్రీన్ సిగ్నల్
- రూ. 4,000 కోట్ల సమీకరణ



**న్యూఢిల్లీ:** ప్రయివేట్ రంగ కంపెనీ జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఇందుకు తాజాగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆమోదముద్ర వేసింది. ఇష్యూలో భాగంగా కంపెనీ రూ. 2,000 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 2,000 కోట్ల విలువైన షేర్లను ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి రూ. 4,000 కోట్లు సమీకరించనుంది. నిజానికి కంపెనీ 2023 ఆగస్ట్‌లోనే ప్రాస్పెక్టస్ దాఖలు చేసినప్పటికీ ఇటీవలే అనుమతి పొందింది. కాగా.. ఇష్యూ నిధుల్లో రూ. 800 కోట్లు నాగౌర్(రాజస్తాన్) యూనిట్‌పై, మరో రూ. 720 కోట్లు రుణ చెల్లింపులకు వినియోగించనుంది. 2024 మార్చి31కల్లా కంపెనీ రుణ భారం రూ. 8,933 కోట్లుగా నమోదైంది. 2023-24లో జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ ఆదాయం రూ. 6,028 కోట్లను తాకగా.. నికర లాభం రూ. 62 కోట్లకు చేరింది. సిమెంట్ తయారీ సామర్థ్యం 20.6 ఎంటీపీఏగా నమోదైంది.

### విద్యా వైర్స్ ప్రాస్పెక్టస్ దాఖలు

**న్యూఢిల్లీ:** వైండింగ్, కండక్టివిటీ ప్రొడక్టుల కంపెనీ విద్యా వైర్స్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుమతించమంటూ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా కంపెనీ రూ. 320 కోట్ల షేర్లను తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో కోటి షేర్లను ప్రమోటర్లు ఆఫర్ చేయనున్నారు. అనుబంధ సంస్థ ఏఎల్‌సీయూ చేపట్టనున్న కొత్త ప్రాజెక్టులకు ఇష్యూ నిధులను సమకూర్చనుంది. వీటితోపాటు రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. విద్యుత్ ప్రసారం, పంపిణీ, ఎలక్ట్రికల్ వ్యవస్థలు, ఎలక్ట్రిక్ మోటార్లు తదితర విభాగాలలో కంపెనీ ప్రొడక్టులను వినియోగిస్తారు.

## బోర్డు సమావేశాలు

హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ, నెట్‌వర్క్ 18 మీడియా, షాపర్స్ స్టాప్, హాత్‌వే కేబుల్, ఎస్ఆర్ఎం ఎనర్జీ, బెనారస్ హోటల్స్, గోల్కొండ డైమండ్స్-జువెలర్స్, ఎకో హోటల్స్

## కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

14-1-2025

| | |
|---|---|
| విశాఖ | 520-00 |
| చిత్తూరు | 523-00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 515-00 |
| విజయవాడ | 515-00 |
| రిటైల్ ధర (డజను) | 72.00 |
| హైదరాబాద్ | 490-00 |
| వరంగల్ | 492-00 |
| రిటైల్ ధర | 5.50 |

## నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| TCS | 4,299.00 | 0.78 |
| INDUSINDBK | 943 | 0.58 |
| AXISBANK | 1,045.50 | 0.46 |
| HINDUNILVR | 2,445.10 | 0.12 |
| RELIANCE | 1,240.75 | 0.09 |

## నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| ADANIENT | 2,227.00 | -6.21 |
| TRENT | 6,228.50 | -5.4 |
| BPCL | 265.45 | -4.39 |
| BEL | 259.15 | -4.37 |
| POWERGRID | 287.45 | -4.09 |

## స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్ఈ | 8,776 |
| ఎన్ఎస్ఈ | 1,05,028 |
| ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్) | 1,94,620 |
| ఎఫ్ఐఐ | - 4,893 |
| డీఐఐ | + 8,066 |

## ముడిచమురు... (బ్యారల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 77.36 (రాత్రి 11.30కు) | $ 75.75 (క్రితం ముగింపు) |
| బ్రెంట్ | 81.01 (రాత్రి 11.30కు) | $ 79.76 (క్రితం ముగింపు) |

# హెచ్‌సీఎల్ టెక్ లాభం ప్లస్

- క్యూ3లో రూ. 4,591 కోట్లు
- 4.5-5 శాతానికి గైడెన్స్ పెంపు
- షేరుకి రూ. 18 డివిడెండ్



**న్యూఢిల్లీ:** ఐటీ సేవల దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్‌లో నికర లాభం 5.5 శాతం బలపడి రూ. 4,591 కోట్లను తాకింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 4,350 కోట్లు ఆర్జించింది. పూర్తి ఏడాదికి ఆదాయ ఆర్జన అంచనా(గైడెన్స్)ను తాజాగా 4.5-5 శాతానికి సవరించింది. ఇంతక్రితం 3.5-5 శాతంగా అంచనా వేసిన సంగతి తెలిసిందే. డిమాండ్ వాతావరణంతోపాటు విచక్షణా వ్యయాలు పెరుగుతున్నట్లు కంపెనీ సీఈవో, ఎండీ సి.విజయకుమార్ పేర్కొన్నారు. దీంతో గైడెన్స్‌ను మెరుగుపరచినట్లు తెలియజేశారు. తాము అందిస్తున్న డిజిటల్, ఏఐ సేవలపట్ల విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. కాగా.. మొత్తం ఆదాయం సైతం 5 శాతం పుంజుకుని రూ. 28,446 కోట్లకు చేరింది. త్రైమాసికవారీగా ఆదాయం 8.4 శాతం, నికర లాభం 3.6 శాతం చొప్పున వృద్ధి చూపాయి. వాటాదారులకు షేరుకి రూ. 18 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. దీనిలో రూ.6 ప్రత్యేక డివిడెండ్ కలసి ఉంది.

**ఆర్డర్లు ఓకే**

క్యూ3లో హెచ్‌సీఎల్ టెక్ 2.1 బిలియన్ డాలర్ల విలువైన డీల్స్ కుదుర్చుకుంది. క్యూ3లో 2,134 మంది ఉద్యోగులను జత చేసుకోగా.. మొత్తం సిబ్బంది సంఖ్య 2,20,755కు చేరింది. జనవరి-మార్చి(క్యూ4)లో 1,000 మందికి కొత్తగా ఉపాధి కల్పించనున్నట్లు హెచ్ఆర్ అధికారి ఆర్ సుందరరాజన్ తెలియజేశారు. వచ్చే ఏడాది(2025-26) ఉద్యోగులను తీసుకోవడంకంటే స్పెషలైజేషన్‌పై అధిక దృష్టి పెట్టనున్నట్లు వివరించారు. యూఎస్‌లో కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై స్పందిస్తూ అక్కడి తమ ఉద్యోగుల్లో 80 శాతం స్థానికులేనని విజయకుమార్ వెల్లడించారు. దీంతో హెచ్1బీ వీసాలపై అతి తక్కువగానే ఆధారపడుతున్నట్లు తెలియజేశారు. ఇవి ఏడాదికి 500-1,000వరకూ మాత్రమే ఉంటాయని తెలియజేశారు. వెరసి తమ బిజినెస్‌పై ఇలాంటి అంశాలు ప్రభావం చూపబోవని స్పష్టం చేశారు.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌సీఎల్ టెక్ షేరు బీఎస్ఈలో 0.5 శాతం నష్టంతో రూ. 1,985 వద్ద ముగిసింది.

# 5.2 శాతానికి రిటైల్ ద్రవ్యోల్బణం

- డిసెంబర్‌లో నాలుగు నెలల కనిష్టం
- ఆర్‌బీఐ రేటు కోతకు మార్గం సుగమం!



**న్యూఢిల్లీ:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి విధానానికి ప్రాతిపదిక అయిన వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం డిసెంబర్‌లో ఊరట నిచ్చింది. నాలుగు నెలల కనిష్ట స్థాయిలో 5.2 శాతంగా (2023 ఇదే నెలతో పోల్చి) నమోదైంది. రిటైల్ ద్రవ్యోల్బణం 2 శాతం అటు ఇటుగా 4 శాతం వద్ద ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశిస్తోంది. పూర్తిగా 4 శాతానికి దిగిరాకపోయినప్పటికీ, నిర్దేశిత శ్రేణిలోకి రిటైల్ ద్రవ్యోల్బణం వచ్చినందున, రెపో రేటును (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు) ప్రస్తుత 6.50 శాతం నుంచి ఆర్‌బీఐ పావుశాతం తగ్గించే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే రిటైల్ ద్రవ్యోల్బణం 4 శాతానికి తగ్గించడమే లక్ష్యమని గతంలో ప్రకటిస్తూ వచ్చిన మాజీ గవర్నర్ శక్తికాంతదాస్, రెపో రేటు తగ్గింపునకు సానుకూలత చూపకపోవడం గమనార్హం. తాజా గణాంకాల్లో కొన్ని ముఖ్యాంశాలు..

- ఒక్క ఫుడ్ బాస్కెట్ ద్రవ్యోల్బణం నవంబర్‌లో 9.04 శాతం ఉంటే, డిసెంబర్‌లో 8.39 శాతానికి తగ్గింది.
- కూరగాయలు, పప్పు దినుసులు, చక్కెర, తీపి పదార్థాలు, తృణ ధాన్యాలు, పర్సనల్ కేర్ ప్రొడక్టుల ధరలు తగ్గాయి.
- డిసెంబర్ 2024లో భారీగా ధరలు పెరిగిన తొలి ఐదు ప్రొడక్టుల్లో బఠానీలు (89.12 శాతం), బంగాళదుంప (68.23 శాతం), వెల్లుల్లి (58.17 శాతం), కొబ్బరి నూనె (45.41 శాతం), క్యాలీఫ్లవర్ (39.42 శాతం) ఉన్నాయి.
- డిసెంబరులో తక్కువ ధరల పెరుగుదల నమోదయిన ప్రొడక్టుల్లో జీరా, అల్లం, ఎండు మిరపకాయలు, ఎల్‌పీజీ (రవాణా మినహాయించి) ఉన్నాయి.
- సమీక్షా నెల్లో గ్రామీణ ప్రాంతాల్లో 5.76 శాతం రిటైల్ ద్రవ్యోల్బణం నమోదయితే, పట్టణాల్లో ఇది 4.58 శాతంగా ఉంది.

## రూపాయి బలహీనపడినా..

# ఎగుమతిదారులకు లాభాలు అంతంతే..!



### దిగుమతుల బిల్లు భారం..సవాళ్లు

- ప్రపంచ మార్కెట్ల అనిశ్చితి ప్రభావం
- నిపుణుల అభిప్రాయం

**న్యూఢిల్లీ:** ఒక దేశం కరెన్సీ బలహీనపడితే, ఆ దేశం ఎగుమతిదారులకు లాభాలు భారీగా వచ్చిపడతాయన్నది ఆర్థిక సిద్ధాంతం. అయితే భారత్ ఎగుమతిదారుల విషయంలో ఇది పూర్తి స్థాయిలో వాస్తవ రూపం దాల్చడం లేదు. రూపాయి బలహీనపడినా.. వారికి వస్తున్న లాభాలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయన్నది నిపుణుల విశ్లేషణ. వారు చేస్తున్న విశ్లేషణల ప్రకారం ఎగుమతి అవుతున్న ఉత్పత్తుల తయారీ.. ముడి వస్తువుల దిగుమతులపై ఆధారపడుతుండడం.. ఈ నేపథ్యంలో దిగుమతుల బిల్లు తడిసి మోపెడవుతుండడం దీనికి ఒక కారణం. దీనికితోడు ప్రపంచ మార్కెట్‌లో నెలకొన్న అనిశ్చితి దేశీయ ఎగుమతిదారులకు పరిమిత ప్రయోజనాలను అందిస్తోంది. గత ఏడాది జనవరి నుంచి డాలర్ మారకంలో రూపాయి విలువ 4 శాతానికిపైగా పతనమైంది. గత ఏడాది జనవరి 1వ తేదీన రూపాయి విలువ 83.19 పైసలు అయితే 2025 జనవరి 13వ తేదీన ఒకేరోజు భారీగా 66 పైసలు పడిపోయి 86.70కి చేరింది.

**అన్ని రకాలుగా ఇబ్బందే...**




రూపాయి దిగువముఖ ధోరణులు ఎగుమతిదారులకు లాభాలు పంచలేకపోతున్నాయి. రూపాయి విలువ క్షీణించడం వల్ల దిగుమతయ్యే ముడి పదార్థాలు, విడిభాగాలు, ఇతర ఉత్పత్తుల ధరలు డాలర్లలో పెరుగుతాయి. ఈ వ్యయాల పెరుగుదల బలహీనమైన రూపాయి నుండి పొందిన పోటీ ప్రయోజనాన్ని దెబ్బతీస్తోంది. ఫార్మా, రత్నాలు-ఆభరణాల వంటి రంగాలను ఇక్కడ ప్రస్తావించుకోవాలి. ఇంకా షిప్పింగ్, బీమా, మార్కెటింగ్ వంటి ఖర్చులు కూడా డాలర్-డినామినేట్ అవుతాయి. ఇది కూడా క్షీణించిన రూపాయి ప్రయోజనాలు ఎగుమతిదారుకు దక్కకుండా చేస్తోంది. ఇక డాలర్ మారకంలో చైనీస్ యువాన్, జపనీస్ యెన్, మెక్సికన్ పెసో వంటి ఇతర పోటీ దేశాల కరెన్సీలు కూడా భారత రూపాయితో పోలిస్తే మరింత క్షీణించాయి. ఎగుమతిదారులకు ఇదీ ఒక ప్రతికూల అంశమే. చాలా మంది ఎగుమతిదారులు కరెన్సీ హెచ్చుతగ్గుల సమస్యను ఎదుర్కొనడానికి హెడ్జింగ్ కవర్ తీసుకుంటారు. ఎందుకంటే వారి ఇన్‌పుట్ ఖర్చు పెరుగుతుంది. రూపాయి బలహీనత వల్ల వారికి తగిన ప్రయోజనం లభించడం లేదు. - సంజయ్ బుధియా, సీఐఐ (ఎగ్జిమ్) నేషనల్ కమిటీ చైర్మన్

**అనిశ్చితిని భరించలేం..**



రూపాయి విలువ పడిపోతోందా? పెరుగుతోందా? అన్నది ఇక్కడ సమస్య కాదు. బాధ కలిగిస్తున్న అంశం రూపాయి విలువలో అస్థిరత. కరెన్సీలో స్థిరత్వం ఉండాలి. అస్థిరత ఉంటే అనిశ్చితిని ఎలా నిర్వహించాలో ఎవరికీ తెలియదు. ఇదే ఇప్పుడు పెద్ద సమస్య. - ఎస్ సి రాల్హాన్, ఇంజనీరింగ్ ఉత్పత్తుల ఎగుమతిదారు (లూథియానా)

# హైదరాబాద్‌కు గోద్రెజ్ ప్రాపర్టీస్



**న్యూఢిల్లీ:** రియల్టీ రంగ సంస్థ గోద్రెజ్ ప్రాపర్టీస్ హైదరాబాద్‌లో అడుగుపెట్టింది. కోకాపేట వద్ద గోద్రెజ్ మాడిసన్ అవెన్యూ పేరుతో ప్రీమియం రెసిడెన్షియల్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. 12 లక్షల చదరపు అడుగుల సేలబుల్ ఏరియాతో ఇది ఏర్పాటు కానుంది.

ఈ ప్రాజెక్టు ద్వారా కంపెనీ రూ.1,300 కోట్ల ఆదాయం ఆశిస్తోంది. గోద్రెజ్ ప్రాపర్టీస్ ఇప్పటికే ముంబై మెట్రోపాలిటన్ రీజియన్, ఢిల్లీ ఎన్‌సీఆర్, బెంగళూరు, పుణే తదితర మార్కెట్లలో బలంగా విస్తరించింది.

# హైదరాబాద్‌లో 24.5% ఆఫీస్ స్పేస్ ఖాళీ

- 2026 మార్చి నాటికి తలెత్తనున్న పరిస్థితి
- తాజాగా వెల్లడించిన రేటింగ్ ఏజెన్సీ ఇక్రా



**న్యూఢిల్లీ:** డిమాండ్‌కు మించి తాజా సరఫరా తోడవుతున్నందున 2026 మార్చి నాటికి హైదరాబాద్‌లోని మొత్తం కార్యాలయ స్థలంలో 24.5 శాతం ఖాళీగా ఉండవచ్చని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా వెల్లడించింది. వేకెన్సీ స్థాయి 2023 మార్చిలో 14.1 శాతం, 2025 సెప్టెంబర్‌లో 19.3 శాతంగా ఉందని తెలిపింది. 'హైదరాబాద్ మార్కెట్‌లో గ్రేడ్-ఏ ఆఫీస్ స్పేస్ ఆక్యుపెన్సీ 2026 మార్చి నాటికి 75.5-76 శాతానికి చేరవచ్చు. 2023 మార్చి నాటికి ఇది 86 శాతం నమోదైంది. నికర ఆక్యుపెన్సీతో పోలిస్తే సరఫరా ఎక్కువగా ఉంటుంది. హైదరాబాద్‌లో 2016-17 నుంచి 2023-24 మధ్య ఆఫీస్ స్పేస్ సరఫరా వార్షిక వృద్ధి రేటు ఏటా 14 శాతం దూసుకెళ్లింది. టాప్-6 ఆఫీస్ మార్కెట్లలో ఇది సుమారు 7 శాతం నమోదైంది. ఈ ఆరు మార్కెట్లలో 2024 మార్చి 31 నాటికి అందుబాటులో ఉన్న మొత్తం కార్యాలయ సరఫరాలో హైదరాబాద్ వాటా 15 శాతం. 2026 మార్చి నాటికి ఇది 17 శాతానికి చేరవచ్చు' అని నివేదిక వివరించింది.

**అంచనాలు లేకుండా..**

అపరిమిత ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ (ఎఫ్ఎస్ఐ) నియమాన్ని కలిగి ఉన్న ఏకైక ప్రముఖ భారతీయ నగరం హైదరాబాద్ అని ఇక్రా కార్పొరేట్ రేటింగ్స్ వైస్ ప్రెసిడెంట్, కో-గ్రూప్ హెడ్ అనుపమ రెడ్డి తెలిపారు. 'ఈ నిబంధనలను సద్వినియోగం చేసుకుని కొంతమంది డెవలపర్లు సమీప కాలంలో లీజింగ్‌పై సరైన అంచనాలు లేకుండా భారీగా ఊహించుకుని నిర్మాణాలు చేపడుతున్నారు. ఫలితంగా డిమాండ్-సరఫరా మధ్య భారీగా అసమతుల్యత ఏర్పడింది' అని అన్నారు. '2023-24 ఆర్థిక సంవత్సరంలో హైదరాబాద్‌లో 1.9 కోట్ల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్ తోడైంది. ఇది హైదరాబాద్ చరిత్రలో అత్యధికం. అలాగే ఇతర టాప్ నగరాలతో పోలిస్తే ఇక్కడే ఎక్కువ. ఈ అధిక సరఫరా ధోరణి 2024-25, 2025-26 వరకు కొనసాగుతుంది. ఏటా 1.7-2 కోట్ల చదరపు అడుగుల కొత్త సరఫరా తోడు కానుంది.

# ప్రభుత్వ మూలధన వ్యయాలు తగ్గుతాయ్!

- ద్రవ్యలోటు కట్టడికి బడ్జెట్ అధిక ప్రాధాన్యత
- గోల్డ్‌మన్ శాక్స్ అంచనా



**ముంబై:** ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1వ తేదీన ప్రవేశపెట్టే కేంద్ర బడ్జెట్‌లో మూలధన వృద్ధికి కోత పెట్టే అవకాశం ఉందని విదేశీ బ్రోకరేజ్ గోల్డ్‌మన్ శాక్స్ అంచనావేసింది. మార్చితో ముగిసే 2023-24 వార్షిక బడ్జెట్‌లో మూలధన వృద్ధి రేటు 17 శాతం అయితే, రానున్న 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఈ వృద్ధి రేటు 7 శాతానికి పరిమితం కావచ్చని విశ్లేషించింది. ప్రభుత్వ ఆదాయాలు-వ్యయాలకు మధ్య నికర వ్యత్యాసం ద్రవ్యలోటును 4.5 శాతానికి (2024-25లో 4.9 శాతం) కట్టడి చేయడమే లక్ష్యంగా కొత్త బడ్జెట్లో మూలధన వ్యయాలకు కోత పెట్టే వీలుందని పేర్కొంది. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో కొన్ని ముఖ్యాంశాలు పరిశీలిస్తే...

- లోక్‌సభలో బీజేపీకి మెజారిటీ సీట్లు రాని నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాలకు, సంక్షేమ పథకాలకు బడ్జెట్ నిధులు కేటాయింపు పెరిగే అవకాశం ఉంది.
- సెప్టెంబరు త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు 11 త్రైమాసిక కనిష్ట స్థాయి 5.4 శాతం తగ్గుదలకు ప్రభుత్వ మూలధన వ్యయాల్లో తగ్గుదల ఒక కారణం. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి కఠిన విధానమూ ఇందుకు దారితీసింది.
- దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 2047 నాటికి 100 ఏళ్లు పూర్తవనున్న నేపథ్యంలో వచ్చే బడ్జెట్ దీర్ఘకాలిక ఆర్థిక విధానం గురించి కూడా విస్తృత స్థాయిలో చర్చించే వీలుంది.
- ఉపాధి అవకాశాలు ఎక్కువగా లభించే తయారీ, సూక్ష్మ, లఘు, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, ఆయా రంగాలకు రుణ లభ్యత, గ్రామీణ గృహ నిర్మాణాలకు ప్రోత్సాహం, ధరల స్థిరత్వానికి ఫుడ్ చైన్ పటిష్టత వంటి అంశాలపై బడ్జెట్ దృష్టి సారించే వీలుంది.

# ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.16.90 లక్షల కోట్లు

**జనవరి 12 నాటికి 16 శాతం అప్**



**న్యూఢిల్లీ:** ప్రత్యక్ష పన్ను నికర వసూళ్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జనవరి 12వ తేదీ నాటికి (2024 ఏప్రిల్ 1 నుంచి) 16 శాతం పెరిగి రూ.16.90 లక్షల కోట్లకు ఎగశాయి. కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డ్ (సీబీడీటీ) గణాంకాల ప్రకారం మొత్తం ప్రత్యక్ష పన్నుల వసూళ్లలో వ్యక్తిగత పన్ను వసూళ్లు రూ.8.74 లక్షల కోట్లు. కార్పొరేట్ వసూళ్లు రూ. 7.68 లక్షల కోట్లు. సెక్యూరిటీ లావాదేవీల పన్ను వసూళ్లు రూ.44,538 కోట్లు.

**రిఫండ్స్ రూ.3.74 లక్షల కోట్లు**

స్థూలంగా చూస్తే, జనవరి 12 నాటికి స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లు 20.64 లక్షల కోట్లు. ఇందులో రిఫండ్స్ రూ.3.74 లక్షల కోట్లు. (వార్షికంగా 42.49 శాతం పెరుగుదల). వెరసి నికర వసూళ్లు రూ. 16.90 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.

**లక్ష్యం రూ.22.07 లక్షల కోట్లు**

ప్రత్యక్ష పన్నుల ద్వారా మార్చితో ముగిసే ప్రస్తుత 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.22.07 లక్షల కోట్లు వసూలు చేయాలన్నది వార్షిక బడ్జెట్ లక్ష్యం. ఇందులో కార్పొరేట్ పన్ను వసూళ్ల వాటా రూ.10.20 లక్షల కోట్లు. వ్యక్తిగత ఆదాయ, ఇతర పన్నుల ద్వారా వసూళ్లు రూ.11.87 లక్షల కోట్లు.

# ఫండ్స్‌లో పెట్టుబడులకు క్యూ

- 2024లో రూ. 1.18 లక్షల కోట్లు
- ఎంఎఫ్‌లపై ఇన్వెస్టర్ల మక్కువ
- థిమాటిక్, సెక్టోరల్, ఈటీఎఫ్‌ల హవా



**న్యూఢిల్లీ:** గత క్యాలండర్ ఏడాది(2024)లో మ్యూచువల్ ఫండ్స్(ఎంఎఫ్‌లు) పట్ల ఇన్వెస్టర్లు అత్యంత ఆసక్తిని ప్రదర్శించారు. దీంతో 239 కొత్త ఫండ్ ఆఫరింగ్స్(ఎన్ఎఫ్‌వోలు) ద్వారా మొత్తం రూ. 1.18 లక్షల కోట్లను అందుకున్నాయి. వీటిలో సెక్టోరల్ లేదా థిమాటిక్ ఈక్విటీ ఫండ్స్ ఇన్వెస్టర్లను గరిష్టంగా ఆకట్టుకున్నట్లు జెర్మినేట్ ఇన్వెస్టర్ సర్వీసెస్ రీసెర్చ్ నివేదిక పేర్కొంది. కాగా.. 2023లో 212 ఎన్ఎఫ్‌వోలు ఉమ్మడిగా రూ. 63,854 కోట్లు సమీకరించగా.. 2022లో 228 పథకాలకు రూ. 62,187 కోట్లు లభించాయి. అంతక్రితం అంటే 2020లో 81 కొత్త పథకాలు మాత్రమే ప్రారంభమయ్యాయి. తద్వారా ఫండ్స్ రూ. 53,703 కోట్లు సమీకరించాయి. వీటితో పోలిస్తే గతేడాది రెట్టింపు పెట్టుబడులు అందుకోవడం గమనార్హం! ఇది ఇన్వెస్టర్లలో పెరిగిన విశ్వాసంతోపాటు.. పటిష్ట వృద్ధి పథాన్ని ప్రతిబింబిస్తోంది.

**మార్కెట్ల ఎఫెక్ట్**

సాధారణంగా స్టాక్ మార్కెట్లు పురోగమిస్తున్నప్పుడు ఎన్ఎఫ్‌వోలు వెలువడుతుంటాయని విశ్లేషకులు పేర్కొన్నారు. సానుకూల సెంటిమెంటు, ఇన్వెస్టర్ల ఆశావహ దృక్పథం ప్రభావం చూపుతుంటాయి. ఇన్వెస్టర్ల ఆసక్తి ఆధారంగా కొత్త పథకాలకు ఫండ్స్ తెరతీస్తుంటాయి. దీంతో పెట్టుబడులను సమకూర్చుకోగలుగుతాయి. వెరసి 2024లో అధిక ఎన్ఎఫ్‌వోల ద్వారా భారీగా పెట్టుబడులను సమీకరించాయి. గతేడాది స్టాక్ ఇండెక్స్‌లలో సెన్సెక్స్ 5,899 పాయింట్లు(8.2 శాతం) జంప్‌చేయగా.. నిఫ్టీ 1,913 పాయింట్లు(8.8 శాతం) ఎగసింది.


**ఈఎస్‌జీ సైతం**

గతేడాది పెట్టుబడుల్లో థిమాటిక్, సెక్టోరల్, ఇండెక్స్, ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్(ఈటీఎఫ్‌లు) అధిక శాతం ఇన్వెస్టర్ల పెట్టుబడులను ఆకట్టుకున్నాయి. నివేదిక ప్రకారం 53 ఎన్ఎఫ్‌వోల ద్వారా ఫండ్స్‌కు రూ. 79,109 కోట్లు లభించాయి. ఇన్వెస్టర్ల ఆసక్తికి అనుగుణంగా రూపొందించిన థీమ్స్ లేదా థిమాటిక్, సెక్టోరల్ ఫండ్స్ ఇందుకు సహకరించాయి. తయారీ, టెక్నాలజీ, పర్యావరణం, సామాజిక, సుపరిపాలన(ఈఎస్‌జీ) విభాగాలను ఇందుకు ప్రస్తావించవచ్చు. విడిగా చూస్తే హెచ్‌డీఎఫ్‌సీ మ్యాన్యుఫాక్చరింగ్ ఫండ్ ఎన్ఎఫ్‌వో గత ఏప్రిల్‌లో రూ. 12,500 కోట్లు అందుకుంది. డిసెంబర్‌లో అత్యధిక ఎన్ఎఫ్‌వోలు మార్కెట్లను తాకడం ప్రస్తావించదగ్గ అంశం!

# అరాజెన్‌కి 100 మిలియన్ డాలర్ల పెట్టుబడులు



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** కాంట్రాక్ట్ రీసెర్చ్, అభివృద్ధి, తయారీ సేవల సంస్థ అరాజెన్‌లో క్వాడ్రియా క్యాపిటల్ మైనారిటీ వాటాలు కొనుగోలు చేసింది. ఇందుకోసం 100 మిలియన్ డాలర్ల ఇన్వెస్ట్ చేసింది. ఈ డీల్‌కి సంబంధించి అరాజెన్ వేల్యుయేషన్‌ని 1.4 బిలియన్ డాలర్లుగా లెక్కగట్టారు. అమెరికా, యూరప్‌లో ఆవిష్కర్తల నుండి నెలకొన్న డిమాండ్‌కి అనుగుణంగా మౌలిక సదుపాయాలు, సామర్థ్యాలను విస్తరించుకునేందుకు కంపెనీ ఈ నిధులను ఉపయోగించుకోనుంది. వేగంగా విస్తరిస్తున్న మార్కెట్లో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఇది తోడ్పడుతుందని సంస్థ సీఈవో మన్ని కంటిపూడి తెలిపారు. ఫార్మా ఔట్‌సోర్సింగ్ విభాగంలో గణనీయంగా వృద్ధి అవకాశాలు ఉన్నాయని క్వాడ్రియా క్యాపిటల్ ఎండీ అమిత్ వర్మ చెప్పారు.




## భారత్ X పాక్

### నెట్‌ఫ్లిక్స్‌లో దాయాది జట్ల డ్రామా

**న్యూఢిల్లీ:** ప్రపంచ క్రికెట్‌లో భారత్, పాకిస్తాన్ జట్ల మధ్య మ్యాచ్ అంటే ఉండే ఉత్కంఠ, ఉత్సాహమే వేరు. ఈ రెండు దాయాది జట్ల మధ్య ఇన్నేళ్లలో ఎన్నో గొప్ప మ్యాచ్‌లు జరిగాయి. టెస్టులైనా, వన్డేలైనా, టి20లైనా ప్రతీ పోరు ప్రత్యేకమే. మైదానంలో ఇరు జట్ల వైరానికి సంబంధించి ఎన్నో ఘటనలను అభిమానులు ఎవరూ ఎప్పటికీ మర్చిపోలేరు. అలాంటి ఆసక్తికర ఘటనలు, వ్యాఖ్యలు, వివాదాలతో నెట్‌ఫ్లిక్స్ సంస్థ కొత్త డాక్యుమెంటరీని రూపొందించింది. 'ద గ్రేటెస్ట్ రైవల్‌రీ' పేరుతో సిద్ధం చేసిన ఈ డాక్యుమెంటరీ ఫిబ్రవరి 7న ప్రసారం కానుంది. గ్రే మ్యాటర్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మించిన ఈ డ్రామాకు చంద్రదేవ్ భగత్, స్టివార్ట్ సగ్ దర్శకత్వం వహించారు. ఇరు దేశాలకు చెందిన మాజీ క్రికెటర్లు సునీల్ గావస్కర్, జావేద్ మియాందాద్, వకార్ యూనిస్, సౌరవ్ గంగూలీ, ఇంజమాముల్ హక్, వీరేంద్ర సెహ్వాగ్, షోయబ్ అఖ్తర్, రవిచంద్రన్ అశ్విన్ ఇంటర్వ్యూలు ఇందులో ఉంటాయి. 'రెండు దేశాల మధ్య మ్యాచ్‌లలో ఉండే భావోద్వేగాలు, తీవ్రతవంటివి ఇందులో చూపించాం. మీ అంచనాలకు తగ్గకుండా ఉత్కంఠభరితంగా దీనిని రూపొందించాం. మైదానంలో ఆట మాత్రమే కాదు. మైదానం బయట ఎన్నో ఆసక్తికర అంశాలను ఇందులో చూడవచ్చు' అని రూపకర్తలు పేర్కొన్నారు.

## కెప్టెన్‌గా కమిన్స్

### చాంపియన్స్ ట్రోఫీకి ఆస్ట్రేలియా జట్టు ప్రకటన



**సిడ్నీ:** వచ్చే నెలలో పాకిస్తాన్, యూఏఈలలో జరిగే అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) చాంపియన్స్ ట్రోఫీలో ప్యాట్ కమిన్స్ సారథ్యంలో ఆస్ట్రేలియా బరిలోకి దిగనుంది. ఇటీవల గాయాల వార్తలతో కమిన్స్ వన్డే మెగా ఈవెంట్ ఆడటంపై సందిగ్ధం నెలకొన్నప్పటికీ తాజా ఎంపికతో అవన్నీ తొలగిపోయాయి. కాలిపిక్క కండరాల గాయంతో బాధపడుతున్న సహచర పేసర్ హాజల్‌వుడ్‌ను కూడా జట్టులోకి తీసుకోవడం అనూహ్య పరిణామం. ఈ సీనియర్ సీమర్ గాయం తీవ్రత కారణంగా మెల్‌బోర్న్, సిడ్నీ టెస్టులకు దూరంగా ఉన్నాడు. ఇప్పుడు అతనితో పాటు ఐదో టెస్టుకు ఫామ్‌లేమీ కారణంగా జట్టు నుంచి తీసేసిన ఆల్‌రౌండర్ మిచెల్ మార్ష్‌కు ఆస్ట్రేలియా వన్డే జట్టులో చోటు కల్పించారు. చాంపియన్స్ ట్రోఫీలో ఆసీస్ గ్రూప్ 'బి'లో ఉంది. ఇందులో అఫ్గానిస్తాన్, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా జట్లున్నాయి. ఆసీస్ తమ రౌండ్ రాబిన్ లీగ్ మ్యాచ్‌ల్ని లాహోర్, రావల్పిండి వేదికల్లో ఆడుతుంది.

**ఆస్ట్రేలియా జట్టు:** కమిన్స్ (కెప్టెన్), ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, లబుషేన్, స్టీవ్ స్మిత్, అలెక్స్ కేరీ, మ్యాక్స్‌వెల్, స్టొయినిస్, ఆరోన్ హార్డీ, నాథన్ ఎలీస్, మిచెల్ మార్ష్, మాథ్యూ షార్ట్, మిచెల్ స్టార్క్, ఆడమ్ జంపా, హాజల్‌వుడ్.

## దక్షిణాఫ్రికా జట్టులోకి ఇన్‌గిడి, నోర్జే


ఇన్‌గిడి


నోర్జే

**జొహన్నెస్‌బర్గ్:** గాయాలతో జట్టుకు దూరమైన పేసర్లు లుంగి ఇన్‌గిడి, అన్రిచ్ నోర్జేలు తిరిగి దక్షిణాఫ్రికా వన్డే జట్టులోకి వచ్చారు. పాకిస్తాన్, యూఏఈ ఆతిథ్యమివ్వనున్న 'ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ' కోసం దక్షిణాఫ్రికా సోమవారం ప్రకటించిన జట్టులో వాళ్లిద్దరు అనుభవజ్ఞులకు చోటు కల్పించారు. గజ్జల్లో గాయంతో ఇన్‌గిడి శ్రీలంక, పాకిస్తాన్ సిరీస్‌లకు దూరమవగా, కాలి బొటనవేలి గాయం కారణంగా నోర్జే పాక్‌తో సిరీస్‌కు గైర్హాజరయ్యాడు. 2023 వన్డే ప్రపంచకప్‌లో సెమీఫైనలిస్ట్ అయిన దక్షిణాఫ్రికా... వచ్చేనెలల జరిగే మెగా ఈవెంట్‌లో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లాంటి గట్టి ప్రత్యర్థులున్న గ్రూప్ 'బి'లో ఉంది. అఫ్గానిస్తాన్ మరో జట్టు కాగా ఈ టోర్నీలో సఫారీ తమ తొలి మ్యాచ్‌ను ఫిబ్రవరి 21న కరాచీలో అఫ్గానిస్తాన్‌తో ఆడుతుంది. తిరిగి 25న రావల్పిండిలో ఆస్ట్రేలియాతో, అక్కడే మార్చి 1న ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఇంగ్లండ్‌తో తలపడుతుంది. ఫిబ్రవరి 19న మొదలయ్యే ఈ ఈవెంట్ మార్చి 9న జరిగే టైటిల్ పోరుతో ముగియనుంది.

**దక్షిణాఫ్రికా జట్టు:** తెంబా బవుమా (కెప్టెన్), మార్క్‌రమ్, టోని డి జోర్జి, క్లాసెన్, ట్రిస్టన్ స్టబ్స్, వాన్‌డెర్ డసెన్, డేవిడ్ మిల్లర్, ముల్డర్, మార్కో యాన్సెన్, లుంగి ఇన్‌గిడి, అన్రిచ్ నోర్జే, రబడ, రికెల్టన్, తబ్రేజ్ షమ్సీ, కేశవ్ మహరాజ్.

# 'గత విజయాలే నాకు ప్రేరణ'



- ముమ్మందు సాధించాల్సింది చాలా ఉంది
- ఈ ఏడాది ఎంపిక చేసిన టోర్నీల్లోనే ఆడతా
- కొత్త సీజన్ బరిలో పీవీ సింధు

భారత బ్యాడ్మింటన్ స్టార్ పూసర్ల వెంకట (పీవీ) సింధు సాధించిన ఘనతలు, రికార్డుల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ప్రతిష్టాత్మక ఒలింపిక్స్‌లో రజత, కాంస్యాలు... వరల్డ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సహా ఐదు పతకాలు మాత్రమే కాదు... ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడల్లో పతకాలతో తోడు పెద్ద సంఖ్యలో బీడబ్ల్యూఎఫ్ ట్రోఫీలతో ఆమె ఎన్నో అద్భుత విజయాలతో ఆమె తనకంటూ ప్రత్యేక అధ్యాయాన్ని సృష్టించుకుంది. అయితే గత ఏడాది కాలంగా ఆమె కెరీర్ కాస్త ఒడిదుడుకులకు లోనవుతోంది. ఆశించిన స్థాయిలో ఆమె ప్రదర్శన ఉండటం లేదు. దాంతో 29 ఏళ్ల సింధు భవిష్యత్తుపై సందేహాలు వస్తున్నాయి. కానీ సింధు వీటన్నింటిని కొట్టిపారేసింది. ఆటలో మరింత కాలం కొనసాగే సత్తా తనలో ఉండటమే కాదు... విజయాలు సాధించాలనే తపన, ఆకలి కూడా మిగిలి ఉన్నాయని ఆమె స్పష్టం చేసింది. సరిగ్గా చెప్పాలంటే తాను సాధించిన గత విజయాలు తనకు స్ఫూర్తినిస్తాయని ఆమె పేర్కొంది. 'ముమ్మందు కెరీర్‌లో ఇంకా ఎన్నో **విజయాలు సాధించాలని తపన** నాలో ఇంకా ఉందనడంలో ఎలాంటి **సందేహం లేదు. నేను** గొప్ప విజయాలు అందుకున్న గత **వీడియోలు చూస్తే** ఎంతో సంతోషం కలగడమే కాదు **అవి ఎంతో స్ఫూర్తి**నిస్తాయి కూడా. వాటిని చూస్తే చాలు **కొత్త** ఉత్సాహం వచ్చేస్తుంది. ముఖ్యంగా **కొన్ని** టైటిల్స్ నేను చాలా చిన్న వయసులో**నే** గెలుచుకున్నాను. అప్పుడు అంతా బాగా చేయగా లేనిది ఇప్పుడు చేయలేనా అనే ప్రశ్న నాలో మొదలవుతుంది. అక్కడినుంచే మళ్లీ విజయాల వేట మొదలవుతుంది' అని సింధు వ్యాఖ్యానించింది.

### కోలుకొని చెలరేగడం కొత్త కాదు...

గతంలో తాను వివిధ సందర్భాల్లో వేర్వేరు కారణాలతో వెనుకబడిపోయానని, కానీ ఎప్పుడూ ఆశలు వదులుకోలేదని ఆమె వెల్లడించింది. 'క్రీడల్లో నేను ఎంతో నేర్చుకున్నాను. గాయాలతో ఆటకు దూరమై అసలు తిరిగొస్తానో లేదో **అనే** సందేహాల మధ్య కూడా నాపై నేను న**మ్మకం** ఉంచాను. 2015లో నేను గాయపడి**నప్పుడు** ఇలా జరిగింది. కానీ ఆ తర్వాత కోలుకొని **రియో** ఒలింపిక్స్‌లో రజతం గెలిచాను. కెరీర్ **ఆరంభించిన**ప్పటి నుంచి ఇప్పటి వరకు ఎన్నో **విజయాలు,** అవార్డులు, రివార్డులు సాధించాను. **ఇన్ని గెలిచిన** నేను ఎంతో అదృష్టవంతురాలిని. అ**వన్నీ నాతో** ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి. గెలు**పోటములు** ఆటలో, జీవితంలో భాగం. కష్టసమయా**ల్లో ఓపిగ్గా** ఉండటం అనేది నేను నేర్చుకున్నా**ను. సరైన** సమయం కోసం ఎదురు చూడటం ఎంతో ముఖ్యం' అని సింధు విశ్లేషించింది.

### గడ్డు కాలం అధిగమించాను...

2024లో ఆడిన చివరి టోర్నీ సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్‌లో విజేతగా నిలవడం మినహా గత ఏడాది సింధు చెప్పుకోగ్గ ఫలితాలు సాధించలేకపోయింది. మరో పతకం ఆశలతో బరిలోకి దిగిన పారిస్ ఒలింపిక్స్‌లో కూడా నిరాశపర్చింది. అయితే ఇలాంటి దశను దాటి ముమ్మందు మంచి విజయాలు అందుకుంటానని ఆమె ఆత్మవిశ్వాసం వ్యక్తం చేసింది. 'మనం అనుకున్న విజయాలు **సాధించన**ప్పుడు, **కోర్టులో కష్ట సాగుతున్నప్పుడు సహజంగానే బాధ వేస్తుంది. ఇలాంటి**ప్పుడు మరింత పట్టుదలగా ఉండాలి. నేను ఎన్నో మ్యాచ్‌లలో గెలుపునకు బాగా చేరువగా వచ్చి కూడా ఓడిపోయాను. నాకు ఇలా జరుగుతోందేమిటి అని ఆలోచించిన సందర్భాలు కూడా చాలా వచ్చాయి. అయితే ఈ గడ్డు సమయంలో మన సన్నిహితులు అండగా నిలవడం కీలకం. అప్పుడే మనపై మనకు నమ్మకం పెరుగుతుంది. నా తల్లిదండ్రులిద్దరూ క్రీడాకారులు కావడం నా అదృష్టం. గెలుపోటముల సమయంలో ఎలా ఉండాలో వారు నాకు నేర్పారు. ఇంకా సాధించాల్సింది, నిరూపించుకోవాల్సింది ఏమీ లేకపోయినా సరే ఓటములు **బాధించడం సహజం. నాకు సంబంధించి ఫిట్‌గా ఉంటే నేను ఇంకా చాలా ఆడగలనని, ఎన్నో టోర్నీలు గెలవగలననే నమ్మకం ఉంది'** అని సింధు స్పష్టం చేసింది.

### ఫిట్‌నెస్ ప్రధానం...

2025లో తన ప్రణాళిక ప్రకారం ఎంపిక చేసిన టోర్నీల్లో పాల్గొంటూ ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటానని సింధు వెల్లడించింది. 'ప్రతీ నెలలో పెద్ద సంఖ్యలో టోర్నమెంట్‌లు జరుగుతాయి. దాదాపు 15–20 రోజులు బయటే ఉండాల్సి ఉంటుంది. కాబట్టి టోర్నీలను ఎంపిక చేసుకొని బరిలోకి దిగుతాను. పూర్తి ఫిట్‌నెస్‌తో ఉంటేనే వంద శాతం అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వగలం. బీడబ్ల్యూఎఫ్ నిబంధనల ప్రకారం తప్పనిసరిగా ఆడాల్సిన **టోర్నీ**లు కాకుండా మిగతా వాటిలో కొన్నింటిని **ఆట**గాళ్లు ఎంచుకోవడం సహజం. వరల్డ్ చాంపియ**న్‌షిప్**‌లో మరో పతకం, ఆల్ ఇంగ్లండ్‌లో పతకం **గెల**వడం నా ప్రణాళికల్లో ఉన్నాయి. ఎన్ని గెలిచినా **మైదా**నంలో దిగగానే ఎవరైనా ఇంకా గెలవాలనే **కోరు**కుంటారు' అని ఆమె చెప్పింది.

### ఇంకా నేర్చుకుంటున్నా...

**ఇన్నేళ్ల** కెరీర్ తర్వాత ఇంకా తాను ఆటలో ఇంకా **ఎన్నో** విషయాలు నేర్చుకుంటున్నానని... ఆటలో వస్తున్న కొత్త మార్పులకు అనుగుణంగా తనను తాను మార్చుకుంటున్నానని సింధు పేర్కొంది. 'బ్యాడ్మింటన్‌లో ఎన్నో మార్పులు వస్తున్నాయి. ప్లేయర్ల డిఫెన్స్ చాలా దుర్భేద్యంగా మారుతోంది. దానిని బద్దలు కొట్టాలంటే మరింత శ్రమించాలి. ప్రతీసారి అటాక్ చేసే అవకాశం అందరికీ రాదు. ముఖ్యంగా నేను ఎత్తుగా ఉంటాను కాబట్టి నేను ఎక్కువగా అటాక్ చేయకుండా వారు జాగ్రత్తలు తీసుకుంటారు. నా డిఫెన్స్ కూడా మరింత మెరుగు పర్చుకోవాల్సి ఉంది. భారత బ్యాడ్మింటన్‌లో నా తర్వాత ఎంతో మంది యువ తారలు వేగంగా దూసుకొస్తున్నారు. ఉన్నతి, మాళవికల ఆట బాగుంది. వారికి సరైన మార్గనిర్దేశనం లభిస్తే మంచి ఫలితాలు వస్తాయి' అని సింధు అభిప్రాయపడింది.

### కొత్త కోచ్ అండగా...

సింధు కొత్త సీజన్‌లో కొత్త కోచ్ శిక్షణలో బరిలోకి దిగనుంది. ఇండోనేసియాకు చెందిన ఇర్వాన్‌స్యా ఆది ప్రతమ ఆమెకు ఇకపై కోచ్‌గా వ్యవహరిస్తాడు. ఈ విషయాన్ని సింధు ఖరారు చేసింది. గత కొద్ది రోజులుగా బెంగళూరులో ప్రతమ పర్యవేక్షణలో సింధు సాధన చేస్తోంది. నేటి నుంచి జరిగే ఇండియా ఓపెన్ సూపర్–750 టోర్నమెంట్ వీరిద్దరి భాగస్వామ్యంలో తొలి టోర్నీ కానుంది. 'కోచ్, ప్లేయర్ మధ్య సమన్వయం ఎంతో ముఖ్యం. అది కుదిరేందుకు కొంత సమయం పడుతుంది. మరి కొన్ని ప్రాక్టీస్ సెషన్ల తర్వాత ఒకరిపై మరొకరికి స్పష్టమైన అవగాహన రావచ్చు. ప్రతమ గురించి చాలా విన్నాను. నాకు సరైన కోచ్‌గా అనిపించి ఈ నిర్ణయం తీసుకున్నాను' అని సింధు వెల్లడించింది.

## అజరెంకా అవుట్

### తొలి రౌండ్‌లోనే ఓడిన మాజీ చాంపియన్



**మెల్‌బోర్న్:** ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో రెండుసార్లు చాంపియన్, ప్రపంచ మాజీ నంబర్‌వన్ విక్టోరియా అజరెంకా (బెలారస్) తొలి రౌండ్‌లోనే ఓడిపోయింది. 2 గంటల 13 నిమిషాలపాటు జరిగిన పోరులో లూసియా బ్రాన్‌జెట్టి (ఇటలీ) 6–2, 7–6 (7/2)తో అజరెంకాను బోల్తా కొట్టించింది. 17వసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆడిన 26వ సీడ్ అజరెంకా తొలి రౌండ్‌లో ఓడిపోవడం నాలుగోసారి మాత్రమే కావడం గమనార్హం. 2012, 2013లలో విజేతగా నిలిచిన అజరెంకా ఆ తర్వాత ప్రపంచ నంబర్‌వన్‌గా అవతరించింది. బ్రాన్‌జెట్టితో జరిగిన మ్యాచ్‌లో అజరెంకా 37 అనవసర తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకుంది. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో 2017 ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్, 16వ సీడ్ ఒస్టాపెంకో (లాత్వియా) 3–6, 6–7 (6/8)తో బెలిండా బెన్‌చిచ్ (స్విట్జర్లాండ్) చేతిలో ఓడిపోయింది. మరోవైపు రెండో సీడ్ స్వియాటెక్ (పోలాండ్), మూడో సీడ్ కోకో గాఫ్ (అమెరికా), ఏడో సీడ్ జెస్సికా పెగూలా (అమెరికా), మాజీ చాంపియన్ నయోమి ఒసాకా (జపాన్) తొలి రౌండ్‌లో గెలిచి రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టారు. స్వియాటెక్ 6–3, 6–4తో సినియకోవా (చెక్ రిపబ్లిక్)పై, కోకో గాఫ్ 6–3, 6–3తో 2020 చాంపియన్ సోఫియా కెనిన్ (అమెరికా)పై, పెగూలా 6–3, 6–0తో మాయా జాయింట్ (ఆస్ట్రేలియా)పై, 2019, 2021 విజేత ఒసాకా 6–3, 3–6, 6–3తో కరోలినా గార్సియా (ఫ్రాన్స్)పై విజయం సాధించారు.

## తమిళనాడు డ్రాగన్స్ పైచేయి



**రూర్కెలా:** హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్)లో తమిళనాడు డ్రాగన్స్ తమ అగ్ర స్థానాన్ని మరింత పటిష్టపర్చుకుంది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో డ్రాగన్స్ 3–2 గోల్స్ తేడాతో ఢిల్లీ ఎస్‌జీ పైపర్స్‌పై విజయం సాధించింది. తమిళనాడు తరఫున జిప్ జాన్‌సెన్ (6వ నిమిషంలో), నేతన్ ఇఫ్రామ్స్ (19వ నిమిషంలో), బ్లేక్ గోవర్స్ (21వ నిమిషంలో) గోల్స్ సాధించగా... ఢిల్లీ ఆటగాళ్లలో టోమస్ డొమీన్ (2వ నిమిషంలో, 37వ నిమిషంలో) ఒక్కడే రెండు గోల్స్ కొట్టాడు. తొలి క్వార్టర్‌లో ముందుగా ఢిల్లీ గోల్‌తో శుభారంభం చేసినా... డ్రాగన్స్ సమం చేసింది. రెండో క్వార్టర్స్‌లో మరింత జోరు ప్రదర్శిస్తూ తమిళనాడు రెండు గోల్స్ సాధించింది. మూడో క్వార్టర్‌లో ఢిల్లీ ఒక గోల్ చేసిన ఆధిక్యాన్ని తగ్గించగా... చివరి క్వార్టర్‌లో స్కోరు సమం చేసేందుకు ఆ జట్టు చేసిన ప్రయత్నం ఫలించలేదు. తాజా ఫలితం తర్వాత ఒక్క విజయం కూడా లేకుండా ఢిల్లీ పాయింట్ల పట్టికలో అట్టడుగున కొనసాగుతోంది.

### సూర్మా క్లబ్ దూకుడు...

మహిళల లీగ్‌లో ఫేవరెట్ సూర్మా హాకీ క్లబ్ ఘన విజయంతో బోణీ చేసింది. తమ తొలి మ్యాచ్‌లో సూర్మా క్లబ్ 4–1 గోల్స్ తేడాతో శ్రాచి రార్ బెంగాల్ టైగర్స్‌ను చిత్తు చేసింది. కేవలం 9 నిమిషాల వ్యవధిలో సూర్మా ఏకంగా నాలుగు గోల్స్ నమోదు చేయడం విశేషం. జట్టు తరఫున ఒలీవియా షెనాన్ (38వ నిమిషంలో), చార్లెట్ ఎంగల్‌బర్ట్ (42వ నిమిషంలో), సలీమా టెటె (44వ నిమిషంలో), సోనమ్ (47వ నిమిషంలో) గోల్స్ సాధించారు. బెంగాల్ తరఫున హానా కాటర్ (7వ నిమిషంలో) ఏకైక గోల్ చేసింది.

## వార్మప్ మ్యాచ్‌లో భారత్ గెలుపు

### అండర్–19 మహిళల టి20 ప్రపంచకప్


త్రిష

**కౌలాలంపూర్:** ఐసీసీ మహిళల అండర్–19 టి20 ప్రపంచకప్‌కు ముందు డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు వార్మప్ మ్యాచ్‌లో భారీ విజయంతో శుభారంభం చేసింది. సోమవారం జరిగిన ఈ సన్నాహక పోరులో భారత్ ఏకంగా 119 పరుగుల భారీ తేడాతో స్కాట్లాండ్‌పై జయభేరి మోగించింది. ముందుగా బ్యాటింగ్ చేపట్టిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 164 పరుగులు చేసింది. కమలిని (23 బంతుల్లో 32) టాప్‌స్కోరర్ కాగా, తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష (26), కెప్టెన్ నికీ ప్రసాద్ (25) సనిక చల్కే (17) సహచరులకూ బ్యాటింగ్ ప్రాక్టీస్ అవకాశమిచ్చేందుకు రిటైర్డ్ అవుట్‌గా వెనుదిరిగారు. ప్రత్యర్థి బౌలర్లలో అమీ బల్లీ (2/13) కాస్త ప్రభావం చూపింది. 3 ఓవర్లు వేసిన ఆమె 13 పరుగులే ఇచ్చింది. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన స్కాట్లాండ్‌ను భారత బౌలర్లు 18.5 ఓవర్లలో 45 పరుగులకే ఆలౌట్ చేశారు. వైజాగ్‌కు చెందిన షబ్నమ్ షకీల్, వైష్ణవి శర్మ, సోనమ్ యాదవ్ తలా 2 వికెట్లు తీశారు. సోమవారం జరిగిన మిగతా వార్మప్ మ్యాచ్‌ల్లో ఆస్ట్రేలియా 140 పరుగుల తేడాతో ఆతిథ్య మలేసియాను ఓడించగా, వెస్టిండీస్ 9 పరుగుల తేడాతో నేపాల్‌పై గట్టెక్కింది. అమెరికా జట్టు 13 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌కు షాక్ ఇచ్చింది. బంగ్లాదేశ్ 4 వికెట్ల తేడాతో శ్రీలంకపై గెలుపొందగా, ఇంగ్లండ్ 9 వికెట్ల తేడాతో సమోవాపై ఘనవిజయం సాధించింది. పాకిస్తాన్ 11 పరుగులతో నైజీరియాను ఓడించింది. ప్రధాన టోర్నీ ఈనెల 18 నుంచి జరుగుతుంది. అయితే భారత జట్టు తమ తొలి మ్యాచ్‌ను ఆదివారం వెస్టిండీస్‌తో ఆడుతుంది. రెండేళ్ల క్రితం 2023లో దక్షిణాఫ్రికాలో తొలిసారిగా నిర్వహించిన మహిళల అండర్–19 మెగా ఈవెంట్‌లో భారత్ విజేతగా నిలిచింది. ఫైనల్లో 7 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను కంగుతినిపించింది.

## 'మా డిఫెన్స్ మెరుగవ్వాలి'

### బ్యాడ్మింటన్ ప్లేయర్ చిరాగ్ శెట్టి వ్యాఖ్య



**న్యూఢిల్లీ:** భారత బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్ ద్వయం సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి గత రెండేళ్లుగా నిలకడగా రాణిస్తూ పలు టోర్నీలు గెలుచుకున్నారు. అయితే పారిస్ ఒలింపిక్స్‌లో పతకావకాశాలు కోల్పోయిన ఈ జోడీ ఇటీవల చైనా ఓపెన్ మాస్టర్స్, మలేసియా సూపర్–1000 టోర్నీలలో సెమీఫైనల్‌కు పరిమితమైంది. అయితే ఇప్పుడు కొత్త డబుల్స్ కోచ్ టాన్ కిమ్ పర్యవేక్షణలో తమ ఆటను మెరుగు పర్చుకుంటామని చిరాగ్ శెట్టి విశ్వాసం వ్యక్తం చేశాడు. టాన్ కిమ్‌తో కలిసి పని చేయడం సాత్విక్–చిరాగ్‌కు ఇది మొదటిసారేమీ కాదు. వీరిద్దరిని 2015లో జోడీగా మార్చింది అతనే కావడం విశేషం. ఆ తర్వాత నాలుగేళ్ల పాటు భారత కోచ్‌గా వ్యవహరించిన ఈ మలేసియన్ ఇప్పుడు దాదాపు ఆరేళ్ల విరామం తర్వాత మళ్లీ అదే బాధ్యతలు చేపడుతున్నాడు. ఈ క్రమంలో తమ డిఫెన్స్ లోపాలు సరిదిద్దుకోవడంపై దృష్టి పెట్టినట్లు చిరాగ్ చెప్పాడు. 'మేం సాధించిన ఘనతల్లో అతని పాత్ర ఎంతో ఉంది. అయితే కిమ్‌తో గతంలో కలిసి పని చేసినప్పుడు మేం పూర్తిగా కొత్తవాళ్లం. అప్పుడు అంతా నేర్చుకోవడంపైనే దృష్టి పెట్టాం. ఇప్పుడు చాలా మారింది. పలు విజయాల తర్వాత మాకు గుర్తింపు వచ్చింది కాబట్టి ఇకపై మాకు ఏం కావాలో, అవసరం ఏమిటో స్పష్టంగా చెప్పి దానిపై చర్చించగలం. ఆయన తగిన సూచనలు ఇవ్వగలరు. మా ఆటలో ప్రస్తుతం స్వల్ప మార్పులు, మెరుగుదల అవసరం. ముఖ్యంగా మా డిఫెన్స్‌ను చాలా మెరుగుపర్చుకోవాల్సి ఉంది. ప్రస్తుతానికి ఫర్వాలేదనిపించేలా ఉన్నా అత్యుత్తమ డిఫెన్స్ మాత్రం కాదు. ఒలింపిక్స్‌లో మా ఓటమికి కారణమైన నెట్ గేమ్‌ను కూడా మెరుగుపర్చుకోవాల్సి ఉంది' అని చిరాగ్ వివరించాడు. ఇటీవల రెండు టోర్నీల్లో సెమీఫైనల్‌కు పరిమితం కావడం నిరాశ కలిగించిందని అతను అన్నాడు. పారిస్ ఒలింపిక్స్ సన్నాహకాల కోసం గత ఏడాది పరిమిత సంఖ్యలోనే టోర్నీలు ఆడామని... 2025లో సాధ్యమైనన్ని ఎక్కువ టోర్నీల ఆడటం లక్ష్యంగా పెట్టుకున్నామని చిరాగ్ వెల్లడించాడు.





చిరుత అమాంతం గాల్లోకి ఎగురుతున్నట్లు, సొరచేపలు, డాల్ఫిన్లు, చిన్నారి ఈదుతున్నట్లుగా ఉన్న ఇవన్నీ వింతవింత ఆకారాల్లో ఉన్న పతంగులు.. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరుగుతున్న ఇంటర్నేషనల్ కైట్స్ ఫెస్టివల్‌లో సోమవారం చూపరులను అలరించిన దృశ్యాలివీ..

# ఆరున క్రిస్మస్.. 13న న్యూ ఇయర్!!

## మరెన్నో విశేషాల సమాహారంగా బ్రిటన్ బుల్లి దీవి 'ఫౌలా'

2025 ఏడాది మొదలై ఇప్పటికే రెండు వారాలు పూర్తయింది. ప్రపంచవ్యాప్తంగా కొత్త తీర్మానాలతో, ఆనందక్షణాలతో బంధుమిత్రుల సమక్షంలో జనమంతా నూతన సంవత్సరానికి స్వాగతం పలికేసి తమతమ పనుల్లో బిజీ అయిపోయారు. కానీ బ్రిటన్‌లోని 'ఫౌలా'దీవంలో మాత్రం అత్యంత ఆలస్యంగా అంటే సోమవారం (జనవరి 13) రోజు ఘనంగా కొత్త ఏడాది వేడుకలు జరిగాయి. అందరూ డిసెంబర్ 31 రాత్రి నుంచే సెలబ్రేషన్లు మొదలెట్టి ముగించేస్తే వీళ్లేంటి ఇంత ఆలస్యంగా వేడుకలు చేస్తున్నారని ఆశ్చర్యపోకండి. వాళ్ల దృష్టిలో జనవరి 13వ తేదీనే అసలైన కొత్త ఏడాది. ఎందుకంటే వాళ్లు మనలా ఆధునిక గ్రెగోరియన్ క్యాలెండర్‌ను పాటించరు. ప్రాచీనకాలంనాటి సంప్రదాయ జూలియన్ క్యాలెండర్‌ను మాత్రమే అనుసరిస్తారు. జూలియన్ క్యాలెండర్ స్థానంలో నాలుగు శతాబ్దాల కిందట కొత్తగా గ్రెగరీ క్యాలెండర్ వచ్చిన సంగతి తెల్సిందే. 400 సంవత్సరల క్రితం నాటి 13వ పోప్ గ్రెగరీ కొత్త క్యాలెండర్‌ను రూపొందించారు. ఈ కొత్త క్యాలెండర్ ఆయన పేరిటే తర్వాత కాలంలో గ్రెగోరియన్ క్యాలెండర్‌గా స్థిరపడిపోయింది. కానీ ఫౌలా ద్వీపవాసులు మాత్రం తన ఐలాండ్‌లో వేడుకలను పాత జూలియన్ క్యాలెండర్‌ను అనుసరించి మాత్రమే జరుపుకుంటారు. అందుకే జూలియన్ క్యాలెండర్ ప్రకారం కొత్త ఏడాదిని జనవరి 13వ తేదీన మాత్రమే జరుపుకున్నారు. దీంతో ఆదివారం ద్వీపంలో సంబరాలు అంబరాన్ని తాకాయి. క్రిస్మస్‌ను సైతం వాళ్లు జూలియన్ క్యాలెండర్ ప్రకారమే చేసుకుంటారు. అందరూ డిసెంబర్ 25న క్రిస్మస్ చేసుకుంటే వీళ్లు మాత్రం జనవరి ఆరో తేదీన క్రిస్మస్‌ను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు.

### ఎక్కడుందీ ఫౌలా?

బ్రిటన్‌లోని అత్యంత మారుమూల ద్వీపంగా గుర్తింపు పొందిన ఈ ఫౌలా.. షెట్‌ల్యాండ్ అనే ప్రధాన ద్వీపానికి 16 మైళ్ల దూరంలో ఉంది. ఫౌలా ద్వీపం పొడవు కేవలం ఐదు మైళ్లు. ప్రధాన భూభాగం నుంచి ఇక్కడికి విద్యుత్‌లైన్ల వ్యవస్థ లేదు. అందుకే ఇక్కడ జనం సొంతంగా విద్యుత్ వ్యవస్థను ఏర్పాటుచేసుకున్నారు. పవన విద్యుత్, చిన్నపాటి జల విద్యుత్ వ్యవస్థ, సౌర ఫలకాలతో సౌర విద్యుత్‌ను సమకూర్చుకుంటున్నారు. ప్రధాన ద్వీపసముదాయమైన షెట్లాండ్‌లోని టింగ్‌వాల్ విమానాశ్రయం నుంచి ఇక్కడికి విమాన సర్వీసులు ఉన్నాయి. బ్రిటన్‌లోని అత్యంత మారుమూల ద్వీపాల్లో ఒకటైన ఫౌలాలో అత్యంత పురాతన నార్న్ భాషను మాత్రమే మాట్లాడతారు. ఇక్కడి జనాభా కేవలం 40 మంది మాత్రమే.

**రెండూ అద్భుతమైనవే: రాబర్ట్ స్మిత్**

రెండు వారాల వ్యవధిలో రెండు క్రిస్మస్‌లు, రెండు నూతన సంవత్సర వేడుకలు రావడం నిజంగా బాగుంటుందని 27 ఏళ్ల రాబర్ట్ స్మిత్ వ్యాఖ్యానించారు. విద్యాభ్యాసం కోసం కొంతకాలం షెట్లాండ్ ద్వీపసముదాయంలో ఉన్న రాబర్ట్.. మళ్లీ ఫౌలాకు వచ్చేశారు. అందరు ద్వీపవాసుల మాదిరిగానే ఆయనా అనేక పనులు చేస్తాడు. పడవను నడపడం, నీటి శుద్ధి కర్మాగారంలో పని చేయడం, టూర్లు, అవసరమైతే ఉత్తరాలు అందించడం అన్ని పనుల్లో పాలు పంచుకుంటాడు. ''ఉరుకుల పరుగుల షెట్లాండ్ లైఫ్‌ను చూశా. ప్రశాంతమైన ఫౌలా జీవితాన్ని గడుపుతున్నా. ఆస్వాదించగలిగే మనసున్న ఫౌలా స్వాగతం పలుకుతోంది. ఇక్కడ అందరం ఒకే కుటుంబంలా నివసిస్తాం. ఎప్పుడూ సంగీతం వింటాం. సాధారణంగా ఏ ద్వీపంలోనైనా వృద్ధులు, మధ్యవయస్కులు ఉంటారు. కానీ ఫౌలాలో ఎక్కువ మంది యువత, చిన్నారులే. గతంలో ఇక్కడి మెజారిటీ జనాభా పక్షుల వేటనే ప్రధాన వృత్తిగా ఎంచుకునేది. పక్షులను కొట్టి తెచ్చి కూర వండుకుని తినేయడమే. ఇప్పుడంతా మారిపోయింది. ఎన్నో వృత్తులు వచ్చాయి. తోటపని, చేపలు పట్టడం, కళాకారునిగా పనిచేయడం ఇలా...''అని రాబర్ట్ అన్నారు. ''ఇక్కడి వాళ్లు అందరితో కలుపుగోలుగా ఉంటారు. ప్రతి ఒక్కరి ఇంటికీ వెళ్తాం. ఆనందంగా పాడతాం. ఆడతాం. రాబర్ట్ గతంలో గిటార్ వాయించేవాడు. తర్వాత మాండలీన్ పట్టుకున్నాడు. ఇప్పుడేమో ఫిడేల్ నేర్చుకుంటున్నాడు'అని ద్వీపంలోని మరో వ్యక్తి చెప్పారు.

ప్రస్తుతం 36 మంది మాత్రమే ఉంటున్నారు. పని చేయడానికి బయటి నుంచి ఎవరూ రారు. మన పని మనం చేసుకోవాల్సిందే. ప్రకృతిని ఆస్వాదిస్తూనే ఇక్కడి జనమంతా పనుల్లో బిజీగా ఉంటారు.


**- సాక్షి, నేషనల్ డెస్క్**

# సైనికుల్ని మార్చుకుందాం

### రష్యాకు జెలెన్‌స్కీ ఆఫర్

**కీవ్:** నిర్బంధంలో ఉన్న సైనికులను మార్చుకుందామంటూ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ రష్యాకు ప్రతిపాదించారు. రష్యా నిర్బంధంలోని తమ సైనికులను వదిలేస్తే పట్టుబడ్డ ఉత్తర కొరియా సైనికులను ఆ దేశానికి అప్పగించేందుకు సంసిద్ధత వెలిబుచ్చారు. ఇద్దరు ఉత్తర కొరియా సైనికులను పట్టుకున్నామన్న ఉక్రెయిన్ ప్రకటనను దక్షిణ కొరియా ధ్రువీకరించడం తెలిసిందే. ''మా దగ్గర మరింతమంది కొరియా సైనికులున్నారు. రష్యా పట్టుకున్న మా సైనికులను అప్పగిస్తే ఉత్తర కొరియాకు వారి సైనికులను అప్పగించడానికి సిద్ధం''అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధాన్ని గురించిన వాస్తవాలను బయట పెట్టేవారికి, శాంతి స్థాపనకు ప్రయత్నించే వారికి అవకాశం కల్పిస్తామన్నారు. బెడ్‌పై పడుకొన్న, దవడకు బ్యాండేజ్‌తో మంచంపై కూర్చున్న ఇద్దరు ఉత్తర కొరియా యుద్ధ ఖైదీల వీడియోను పోస్ట్ చేశారు. అందులో అనువాదకుల సహాయంతో జెలెన్‌స్కీ వారితో మాట్లాడుతూ కన్పించారు. ''ఉక్రెయిన్‌తో పోరాడతామని నాకు తెలియదు. శిక్షణ మాత్రమేనని మా కమాండర్లు చెప్పారు''అని ఆ సైనికులు చెప్పుకొచ్చారు. వారిలో ఒకరు ఉత్తరకొరియా తిరిగి వెళ్లాలని భావిస్తుండగా, అవకాశమిస్తే ఉక్రెయిన్‌లోనే ఉండిపోతానని రెండో సైనికుడు చెప్పాడు.

2022లో ఉక్రెయిన్‌పై దాడి మొదలైనప్పటి నుంచి రష్యా, ఉత్తర కొరియా సైనిక సహకారాన్ని పెంచుకుంటున్నాయి. రష్యాకు దన్నుగా ఉత్తర కొరియా ఇప్పటికే 10,000 మందికి పైగా సైనికులను పంపిందని ఉక్రెయిన్, అమెరికా, దక్షిణ కొరియా ఆరోపించాయి. దీన్ని ఆ దేశాలు కొట్టిపారేశాయి. కానీ రష్యా సైన్యం ఉత్తర కొరియా సైనిక సాయంపైనే ఆధారపడి ఉందనడంలో సందేహం లేదని జెలెన్‌స్కీ అన్నారు.



# బుద్ధుడిలా ట్రంప్ విగ్రహాలు

### చైనా కళాకారుని తయారీ • 2,700 డాలర్ల దాకా ధర

డొనాల్డ్ ట్రంప్. ఎప్పుడూ కాసింత చిరాకు ప్రతిబింబించే ముఖం. అలాంటి ముఖానికి హాంగ్ జిన్ షి అనే చైనా గ్రామీణ కళాకారుడు బుద్ధుడి ప్రశాంతతను ఆపాదించాడు. శాంతచిత్తంతో ఉన్న ట్రంప్ విగ్రహాలను తయారు చేశాడు. బుద్ధుని మాదిరిగా కళ్లు మూసుకుని దైవ చింతనలో కూర్చుని ఉన్న విగ్రహాలను పింగాణీతో రూపొందించాడు. సైజును బట్టి వీటిని 140 నుంచి 2,700 డాలర్ల దాకా విక్రయిస్తున్నాడు. 2021లో ఇ-కామర్స్ ప్లాట్‌ఫాం టావోబావోలో వైరలైన ఈ ట్రంప్ విగ్రహాలు ఆయన రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో మరోసారి ఆకర్షిస్తున్నాయి.

### సరదాగా మొదలెట్టి...

47 ఏళ్ల హాంగ్ ఇప్పటిదాకా కొన్ని వందల సిరామిక్ వస్తువులను తయారు చేశాడు. ''రాజకీయ నాయకులు సాధారణంగా బోరింగ్‌గా ఉంటారు. కానీ ట్రంప్ అందుకు భిన్నమైన నేత. అందుకే తొలుత సరదాగా ఆయన విగ్రహాలను రూపొందించా. ట్రంప్ వ్యక్తిత్వం, విగ్రహం ఆకారం పరస్పరం విరుద్ధంగా ఉంటాయి. దాంతో వాటిని కొనేందుకు బాగా ఇష్టపడుతున్నారు''అని చెప్పుకొచ్చాడు. 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్'నినాదంతో ట్రంప్ గెలిస్తే, హాంగ్ మాత్రం ప్రతి విగ్రహం ప్యాక్‌పైనా 'మీ కంపెనీని మళ్లీ గొప్పగా చేయండి'అని రాస్తున్నాడు. దీన్ని అనుసరిస్తూ అమెరికాలో పలు ఆన్‌లైన్ షాపింగ్ ప్లాట్‌ఫాంలలో కొన్ని వెర్షన్లు వచ్చాయి. ట్రంప్ పాలనలో ప్రధాన పాత్ర పోషించనున్న కుబేరుడు ఎలాన్ మస్క్ విగ్రహాన్ని కూడా హాంగ్ డిజైన్ చేస్తున్నాడు. అందులో మస్క్‌ను ఐరన్ మ్యాన్‌గా చూపిస్తున్నాడు. ట్రంప్‌కు చైనాలో ఇప్పటికీ చాలామంది అభిమానులున్నారని చెప్పాడు చెప్పారు.

**- సాక్షి, నేషనల్ డెస్క్**

# యూన్ వేతనం పెరిగింది!

### ఆగ్రహం వ్యక్తం చేస్తున్న దక్షిణ కొరియా పౌరులు

**సియోల్:** దేశంలో స్వల్ప కాలం మార్షల్ లా అమలు చేసినందుకు అభిశంసనకు గురైన దక్షిణకొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ వార్షిక వేతనం భారీగా పెరిగింది. అధికార ప్రమాణాలను అనుసరించి మూడు శాతం మేర పెరిగి రూ.1.27 కోట్ల నుంచి రూ.1.55 కోట్లకు చేరింది. యూన్‌కే కాదు, ఆయన స్థానంలో బాధ్యతలు చేపట్టి అభిశంసనకు గురైన తాత్కాలిక అధ్యక్షుడు హన్ డక్-సూకు వార్షిక వేతనంలో మూడు శాతం పెరిగి, రూ.1.19కోట్లకు చేరుకోవడం గమనార్హం. యూన్‌ను డిసెంబర్‌లో పార్లమెంట్ అభిశంసించింది. దేశంలో తిరుగుబాటుకు యత్నించడం, అధికార దుర్వినియోగం ఆరోపణలపై దర్యాప్తు విభాగాలు అరెస్టుకు చేస్తున్న యత్నాలను ఆయన అడ్డుకుంటున్నారు. ఫలితంగా దేశంలో రాజకీయ సంక్షోభం కొనసాగుతోంది. ఆయనకు ఎలాంటి అధికారాలు లేనప్పటికీ అభిశంసనపై దక్షిణకొరియా రాజ్యాంగ ధర్మాసనం తీర్పు వెలువరించే వరకు అధికార నివాసం, కార్యాలయంలోనే కొనసాగేందుకు అవకాశముంటుంది. సస్పెన్షన్‌కు గురైన అధ్యక్షుడికి ఇప్పటికీ వేతనం అందుకుంటున్న విషయం తెలీన ప్రజలు..తాజా పెంపు విషయం తెలిసి ఆగ్రహంతో ఉన్నారు. దేశంలో కనీస వేతనానికి రెట్టింపు మొత్తంలో యూన్ వేతనం పెరగడమేంటని ప్రశ్నిస్తున్నారు. సాధారణ ఉద్యోగులకు 1.7 శాతం మాత్రమే పెరగ్గా యూన్ 3%కి ఎలా పెంచుతారని నెటిజన్లు పళ్లు కొరుకుతున్నారు. ఈ నేపథ్యంలో యూన్‌ను ఎలాగైనా అరెస్ట్ చేసి తీరుతామని అవినీతి నిరోధక విభాగం స్పష్టం చేస్తోంది. ఈసారి పోలీసులను వెంటబెట్టుకుని వెళతామని, భద్రతా సిబ్బంది, ప్రజాప్రతినిధులు సహా అడ్డు వచ్చిన వారిని సైతం అరెస్ట్ చేస్తామని హెచ్చరిస్తోంది.

# కెనడా అమ్మకానికి లేదు

### ట్రంప్‌కు కెనడా నేత జగ్మీత్ వార్నింగ్

**ఒట్టావా:** అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలపై కెనడా న్యూ డెమొక్రటిక్ పార్టీ (ఎన్డీపీ) నాయకుడు జగ్మీత్ సింగ్ మండిపడ్డారు. కెనడాను అమెరికాలో విలీనం చేయాలని ఇటీవల ట్రంప్ పదేపదే అంటుండటం తెలిసిందే. వాటిపై జగ్మీత్ తీవ్ర అభ్యంతరాలు వెలిబుచ్చారు. ''ట్రంప్ కోసం ఓ సందేశం. ఇప్పుడే కాదు, కెనడా ఎప్పటికీ అమ్మకానికి లేదు. కెనేడియన్లకు తమ దేశమంటే ఎనలేని గౌరవం! దేశం కోసం ఎంతకైనా పోరాడేందుకు వాళ్లు సిద్ధంగా ఉన్నారు''అంటూ హెచ్చరించారు. లాస్ ఏంజెలెస్ కార్చిచ్చులో సహాయక చర్యల్లో కెనడా అగ్నిమాపక సిబ్బందీ పాలుపంచుకుంటున్నారని జగ్మీత్ గుర్తు చేశారు. ''కెనడా అంటే అదీ! పొరుగువారికి మద్దతిచ్చే మంచి దేశం. మా దేశంపై సుంకాలు విధిస్తే అమెరికా మీద ప్రతీకారం తప్పదు! తాను తలచుకుంటే కెనడాతో యుద్ధం చేసేయగలనని ట్రంప్ అనుకుంటే అందుకు మూల్యం చెల్లించుకోక తప్పదు''అంటూ హెచ్చరించారు. ఈ మేరకు ఎక్స్‌లో వీడియో పోస్ట్ చేశారు. అమెరికాలో కెనడా 51వ రాష్ట్రంగా చేరాలని ఆ దేశ పౌరుల్లో చాలామంది కోరుతున్నారని ట్రంప్ పదేపదే అంటుండటం తెలిసిందే. తద్వారా కెనడాకు ఎంతో ప్రయోజనమని ఆయన చెప్పుకొచ్చారు. ''కెనడావాసులకు పన్నులు 60 శాతానికి పైగా తగ్గుతాయి. వారి వ్యాపారాలు తక్షణం రెట్టింపవుతాయి. ప్రపంచంలో మరెక్కడా లేనంతగా వారికి సైనిక రక్షణ కల్పిస్తాం''అని పేర్కొన్నారు.

# కోవిడ్ తర్వాత అధికార పార్టీలు ఓడాయి

- పాడ్‌కాస్ట్‌లో జుకర్‌బర్గ్ వ్యాఖ్య
- మేం గెలిచాం: దీటైన బదులిచ్చిన అశ్వనీ వైష్ణవ్

**న్యూఢిల్లీ:** ప్రపంచవ్యాప్తంగా కోవిడ్‌కాలంలో అధికారం అనుభవించిన అధికార పార్టీలు, ప్రభుత్వాలు ఆ తర్వాతి 2024 ఎన్నికల్లో ఓడిపోయాయని ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ స్పందించారు. ''64 కోట్లకుపైగా ఓటర్లు పాల్గొన్న 2024 లోక్‌సభ ఎన్నికల్లో మూడోసారి మోదీ ప్రభుత్వం విజయం సాధించింది. జుకర్‌బర్గ్ అబద్ధాలు చెబుతున్నారు. మోదీ నాయకత్వంపై విశ్వాసంతో ఎన్డీఏ ప్రభుత్వానికే భారతీయులు తమ మద్దతు పలికారు. కోవిడ్ తర్వాత ప్రభుత్వాలన్నీ కూలాయన్న జుకర్‌బర్గ్ వాదన తప్పు''అని వైష్ణవ్ వ్యాఖ్యానించారు. ''80 కోట్ల మందికి ఉచిత ధాన్యం, 220 కోట్ల కోవిడ్ వ్యాక్సిన్లు ఉచితంగా పంపిణీ, కోవిడ్ సంక్షోభం వేళ మిత్ర దేశాలకు సాయం చేసిన భారత్ ఇప్పుడు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా మారింది''అని వైష్ణవ్ అన్నారు. ''స్వయంగా జుకర్‌బర్గ్ తప్పుడు సమాచారాన్ని పంచుకోవడం బాధాకరం. వాస్తవాలు, విశ్వసనీయతకే పట్టంకడదాం''అంటూ వైష్ణవ్ తన వ్యాఖ్యలను మెటాకు ట్యాగ్‌చేశారు. జోయ్ రోగన్‌తో పాడ్‌కాస్ట్ వేళ జుకర్‌బర్గ్ ఈ వ్యాఖ్యలు చేయడం తెల్సిందే.

# మోదీ వయస్సుతో పోలిస్తే.. రూపాయి విలువ వేగంగా క్షీణిస్తోంది

### కాంగ్రెస్ నేత జై రాం రమేశ్ ఎద్దేవా

**న్యూఢిల్లీ:** ప్రధాని మోదీ హయాంలో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ వేగంగా పడిపోతోందని కాంగ్రెస్ పేర్కొంది. ఈ పతనాన్ని ఆయనే ముందుండి నడిపిస్తున్నారని దుయ్యబట్టింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ సోమవారం ఒక్క రోజే ఏకంగా 55 పైసలు క్షీణించి 86.59కి పడిపోయింది. అమెరికా కరెన్సీ డాలర్ బలపడటంతోపాటు అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరగడం ఇందుకు కారణమని చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జై రాం రమేశ్ 'ఎక్స్'లో ఇందుకు సంబంధించి ప్రభుత్వంపై పలు వ్యాఖ్యలు చేశారు. 'మొదటిసారి ప్రధానిగా పగ్గాలు చేపట్టినప్పుడు మోదీ వయస్సు 64 ఏళ్లు. అప్పట్లో డాలర్‌తో మారకం విలువ రూ.58.58గా ఉండేది. తన కంటే ముందున్న కాంగ్రెస్ ప్రభుత్వం రూపాయిని బలమైన స్థానంలో నిలబెట్టలేకపోయిందంటూ తరచూ ఆయన విమర్శలు చేసేవారు. ఇప్పుడు చూస్తే, మోదీ వయస్సు సుమారు 75 ఏళ్లు. డాలర్‌తో మారకంలో రూపాయి విలువ 86కు మించిపోతోంది. రూపాయి పతనానికి మోదీయే సారథ్య వహిస్తున్నారు'అని కాంగ్రెస్ నేత పేర్కొన్నారు. 'తను కూడా మానవమాత్రుడే అన్న విషయం మోదీ తెలుసుకునే సరికి, పెట్టుబడులు తగ్గిపోయాయి, విదేశీ పెట్టుబడులు వెనక్కి మళ్లుతున్నాయి, స్టాక్ మార్కెట్లు పడిపోతున్నాయి'అని ఆయన వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

# హజ్‌కు ఈసారి 1.75 లక్షల మంది

### సౌదీ అరేబియా-భారత్ మధ్య అంగీకారం

**న్యూఢిల్లీ:** ఈ ఏడాది మన దేశం నుంచి హజ్‌కు 1,75,025 మంది యాత్రికులు వెళ్లనున్నారు. ఈ మేరకు సౌదీఅరేబియా ప్రభుత్వంతో కేంద్రం అంగీకారానికి వచ్చింది. జెద్దాలో జరిగిన చర్చల్లో సౌదీ హజ్, ఉమ్రాల శఖూఖ మంత్రి తౌఫిక్ బిన్ ఫౌజాన్ అల్-రబియా మన మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు ఇందుకు సంబంధించిన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఇందులో హజ్ గ్రూపులకు 30 శాతం అంటే 52, 507 మందిని పంపుకునే అవకాశముంటుందన్నారు. హజ్ -2025 తీర్థ యాత్రికులకు సాధ్యమైనంత మేర అన్ని రకాల సేవలను అందిస్తామని మంత్రి రిజిజు సోమవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. మన హజ్ యాత్రికులకు ఇది అద్భుతమైన వార్త అంటూ ప్రధాని మోదీ ఈ పరిణామంపై స్పందించారు.

# కేరళ యూడీఎఫ్ ఎమ్మెల్యే రాజీనామా

**తిరువనంతపురం:** అధికార ఎల్డీఎఫ్ నుంచి ఇటీవల తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)లో చేరిన కేరళ ఎమ్మెల్యే పీవీ అన్వర్ సోమవారం శాసనసభ సభ్యత్వానికి సైతం రాజీనామా చేశారు. నిలంబర్ నియోజకవర్గం ఎమ్మెల్యే అయిన అన్వర్ అసెంబ్లీ స్పీకర్ ఏఎన్ శంషీర్‌ను ఆయన చాంబర్‌లో కలిసి రాజీనామా లేఖను అందజేశారు. పార్టీ మారినందుకు అన్వర్‌పై అనర్హత వేటు వేసేందుకు ఎల్డీఎఫ్ ప్రయత్నాలు చేస్తున్న క్రమంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. అన్వర్ రాజీనామా విషయం ప్రకటించగానే పశ్చిమబెంగాల్‌లోని టీఎంసీ నాయకత్వం ఆయన్ను కేరళ రాష్ట్ర పార్టీ కన్వీనర్‌గా నియమిస్తూ ఒక ప్రకటన విడుదల చేసింది. అన్వర్ అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. నిలంబర్ నుంచి ఉప ఎన్నిక బరిలో దిగబోనని, కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ అభ్యర్థికి మద్దతిస్తామన్నారు. సీఎం పినరయి విజయన్ 'పినరయిజం'పై పోరాటం కొనసాగిస్తామనని ప్రకటించారు.

# భారీ ర్యాలీగా వెళ్లి సీఎం ఆతిశీ నామినేషన్

**న్యూఢిల్లీ:** ఢిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి 5వ తేదీన జరిగే ఎన్నికలకు గాను సీఎం ఆతిశీ సోమవారం కల్కాజీ నియోజకవర్గం నుంచి నామినేషన్ దాఖలు చేశారు. అంతకుముందు, ఆమె ఆప్ నేత మనీశ్ సిసోడియాతో కలిసి గిరి నగర్‌లో ఉన్న గురుద్వారా శ్రీ గురు గోవింద్ సాహిబ్‌ను సందర్శించడంతోపాటు కల్కాజీలోని కాళీ మాత ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ర్యాలీగా తరలివెళ్లి నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి అందజేశారు. సీఎం ఆతిశీకి బీజేపీ సీనియర్ నేత రమేశ్ బిధూరీ నుంచి గట్టి పోటీ ఎదురవనుంది. అదేవిధంగా, మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు ఆల్కా లాంబా కూడా ఇదే బరి నుంచి పోటీకి దిగారు.

# జపాన్‌ను కుదిపేసిన భూకంపం

**టోక్యో:** జపాన్ నైరుతి ప్రాంతాలను సోమవారం ఉదయం బలమైన భూకంపం కుదిపేసింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 6.9గా నమోదైందని ప్రభుత్వం తెలిపింది. అదేవిధంగా, సునామీ సంభవించే ప్రమాదమున్నందున తీర ప్రాంతాలకు దూరంగా వెళ్లాలని ప్రజలను హెచ్చరించింది. క్యుషులోని భూమిలో 30 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు తెలిపింది. భూకంపం కేంద్రంగా ఉన్న క్యుషు ద్వీపంలోని మియాజకి ప్రిఫెక్చర్‌కు, సమీపంలోని షికోకు ద్వీపంలోని కొచ్చి ప్రిఫెక్చర్‌కు సునామీ హెచ్చరికలు పంపింది. భూకంపం కారణంగా వాటిల్లిన నష్టంపై ఎలాంటి వివరాలు వెల్లడికాలేదు. ముందు జాగత్తగా, మియాజకీ స్టేషన్‌లో రైళ్లను నిలిపి వేశారు. విద్యుత్ సరఫరాకు కూడా ఎటువంటి అంతరాయం ఏర్పడలేదని, అణు విద్యుత్ ప్లాంట్ల వద్ద ఎలాంటి సమస్యలూ ఉత్పన్నం కాలేదని అధికారులు తెలిపారు. సముద్రంలో ఒక మీటరు ఎత్తున అలలు ఎగిసి పడినట్లు అధికార ఎన్‌హెచ్‌కే టీవీ తెలిపింది.

# సముద్రంలో నౌక నుంచి చైనా ఉపగ్రహ ప్రయోగం

**బీజింగ్:** చైనా తన అంతరిక్ష సామర్థ్యాన్ని మరోసారి చాటుకుంది. సముద్రంలోని వేదిక్పై నుంచి చేపట్టిన ప్రయోగంలో ఏకంగా ఎనిమిది ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. షాండోంగ్ ప్రావిన్స్‌లోని హయియాంగ్ సముద్రంలో చేపట్టిన ఈ ప్రయోగంలో జియెలాంగ్-3 రాకెట్‌ను ప్రయోగించింది. ఈ ఘన ఇంధన రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లడం ఇది రెండోసారి. సముద్రంలోని వేదికల పైనుంచి వాణిజ్య ఉపగ్రహాలను కక్ష్యలోకి తీసుకెళ్లేందుకు చైనా ప్రత్యేకంగా ఈ రాకెట్‌ను అభివృద్ధి చేసుకుంది. ఓ షిప్‌నే ఇలా రూపుమార్చి మొబైల్ లాంచ్ పాడ్‌గా తయారు చేసింది. అంతర్జాతీయ జలాల్లో అనువైన స్థానాల నుంచి ప్రయోగాలు చేపట్టేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుంది.



### డ్రోన్ యుద్ధ తంత్రం కోసం కొత్త యుద్ధ నౌక

యుద్ధ నౌకను డ్రోన్లతో మిళితం చేసి అభివృద్ధి పరిచిన కొత్త రకం యుద్ధ నౌకను చైనా నేవీ సోమవారం ప్రారంభించింది. డ్రోన్ క్యారియర్‌లా పనిచేస్తూ సైనికులతో అవసరం లేకుండా జరిగే నేలపైనా, నీటిలోనూ పోరాట పటిమను పెంచుతుందని ఓ అధికారి తెలిపారు.

# 'నాగ్ ఎంకే2' క్షిపణి పరీక్ష సక్సెస్

**న్యూఢిల్లీ:** దేశీయంగా అభివృద్ధి పరిచిన మూడో తరం యాంటీ ట్యాంక్ గైడెడ్ మిస్సైల్ నాగ్ ఎంకే-2 క్షేత్ర స్థాయి పరీక్షలు విజయవంతమయ్యాయి. రాజస్తాన్‌లోని పొఖ్రాన్‌లో ఇటీవల ప్రయోగ పరీక్షలను చేపట్టినట్లు రక్షణ శాఖ సోమవారం తెలిపింది.మూడు పర్యాయాలు జరిగిన ప్రయోగ పరీక్షల్లో అన్ని లక్ష్యాలను పూర్తి కచ్చితత్వంతో క్షిపణి వ్యవస్థలు ఛేదించాయని పేర్కొంది.

# ఓటేసిన మహిళలు 25 శాతం పెరిగారు..!

### ఎన్నికల్లో మహిళా ఓటర్ల భాగస్వామ్యంపై ఎస్‌బీఐ నివేదిక

**సాక్షి, న్యూఢిల్లీ:** దేశంలో అక్షరాస్యత రేటులో ఒక శాతం పెరుగుదలతో ఎన్నికల్లో మహిళా ఓటర్ల భాగస్వామ్యం 25 శాతం పెరిగింది. ఎన్నికల్లో మహిళా ఓటర్ల భాగస్వామ్యానికి సంబంధించి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన తాజా నివేదికలో ఈ విషయం వెల్లడైంది. గత లోక్‌సభ ఎన్నికల్లో మహిళా ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. ఇవే కాకుండా వివిధ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా మహిళా ఓటర్లు ఎక్కువ మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని నివేదిక తెలిపింది. 2019తో పోలిస్తే 2024 లోక్‌సభ ఎన్నికల్లో మహిళా ఓటర్ల సంఖ్య 1.8 కోట్లు పెరిగింది. వీరిలో అక్షరాస్యత శాతం పెరగడం వల్ల 45 లక్షల మంది ఓటర్లు ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో మహిళల భాగస్వామ్యం పెరగడానికి అక్షరాస్యత రేటుతో పాటు ప్రధానమంత్రి ముద్రా యోజన వంటి ఉపాధి పథకాలు కూడా ముఖ్యమైన పాత్ర పోషించాయి. దీని కారణంగా సుమారు 36 లక్షల మంది మహిళా ఓటర్లు ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్నారు. పరిశుభ్రత కూడా ఒక కీలక అంశంగా మారి, మహిళలు తమ ఓటుహక్కును వినియోగించుకునేలా ప్రభావితం చేసింది. పరిశుభ్రత ప్రచారం, దాని ప్రభావం కారణంగా మహిళా ఓటర్ల సంఖ్య సుమారు 21 లక్షలు పెరిగిందని ఎస్‌బీఐ నివేదిక పేర్కొంది. ఇవే కాకుండా స్వచ్ఛమైన తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా తదితర అంశాలు కూడా మహిళా ఓటర్లపై సానుకూల ప్రభావం చూపాయి. అయితే వీటి వల్ల ఓటు వేయాలనే స్ఫూర్తిని పొందిన మహిళల సంఖ్యలో పెద్దగా మార్పు కనిపించలేదు. ఎన్నికలలో మహిళా ఓటర్ల భాగస్వామ్యాన్ని పెంచడంలో మహిళలకు గృహ యాజమాన్య హక్కులు కూడా ముఖ్యమైనవిగా పరిగణించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కారణంగా 2024 సార్వత్రిక ఎన్నికల్లో దాదాపు 20 లక్షల మంది మహిళా ఓటర్లు పెరిగారు. పీఎం ఆవాస్ యోజన కింద కేటాయించిన ఇళ్లలో 74 శాతం మహిళలే ఉన్నారు. ఇది మహిళా సాధికారతపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపించడంతో పాటు ఎన్నికల ప్రక్రియలో పాల్గొనేందుకు వారిని ప్రేరేపించింది. విద్య, ఉపాధి, ప్రాథమిక అవసరాలపై దృష్టి సారించడం ద్వారా మహిళా సాధికారతను బలోపేతం చేయడంతో పాటు ఎన్నికల ప్రక్రియలోవారి భాగస్వామ్యాన్ని పెంచవచ్చని నివేదిక పేర్కొంది.

# నలుగురిని కనండి.. లక్ష పట్టుకెళ్లండి

### బ్రాహ్మణ కుటుంబాలకు పండిత్ విష్ణు రాజోరియా ఆఫర్

**ఇండోర్:** సమాజంలో బ్రాహ్మణుల జనాభా తగ్గిపోతోందని, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతి బ్రాహ్మణ జంట నలుగురిని కనాలని, నలుగురిని కన్న జంటలకు రూ.1 లక్ష బహుమతి ఇస్తానని మధ్యప్రదేశ్ పరశురామ్ కళ్యాణ్ బోర్డు చీఫ్ పండిత్ విష్ణు రాజోరియా వ్యాఖ్యానించారు. ఆదివారం ఇండోర్‌లో సనాఢ్య బ్రాహ్మణ వర్గాల్లో పెళ్లీడు యువతీయువకుల పరిచయ సమ్మేళనం, వివాహ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. ''బ్రాహ్మణ యువ జంటలు చక్కటి సంపాదన, ఉద్యోగం ఉండి కూడా కేవలం ఒక సంతానంతో సరిపెట్టేస్తున్నారు. ఈ పద్ధతి మంచి కాదు. సమాజంలో బ్రాహ్మణుల జనాభా తగ్గుతోంది. స్వాతంత్ర్య వచ్చినప్పటితో పోలిస్తే సగానికి సగం తగ్గిపోయింది. హిందూయేతర జనాభా అమాంతం పెరుగుతోంటే మన వర్గీయులు జనాభా వ్యవహారాలపై దృష్టిపెట్టడమే మానేశారు. ఇకనైనా ప్రతి బ్రాహ్మణ జంట కనీసం నలుగురిని కనాలి. అలా నలుగురు సంతానం ఉన్న బ్రాహ్మణ కుటుంబాలకు తలో లక్ష రూపాయలు నగదు బహుమతిగా ఇస్తా. నేను పదవి నుంచి దిగిపోయాక కూడా ఇదే నజరానా కొనసాగేలా చూస్తా''అని రాజోరియా అన్నారు. దీనిపై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ఆయన వివరణ ఇచ్చారు. ''పరశురామ్ కళ్యాణ్ బోర్డ్‌తో దీనికి సంబంధం లేదు. నా స్వంత ఖర్చులతో, సమాజంలోని కొన్ని వర్గాల మద్దతుతో నగదు బహుమతి అందిస్తా. ఇలాంటి పథకంతో మధ్యప్రదేశ్ బీజేపీ ప్రభుత్వానికి సంబంధం లేదు''అని చెప్పారు.

# రెండో పరిపాలనా సంస్కరణల సంఘం అధ్యక్షుడు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ



## కేంద్ర - రాష్ట్ర సంబంధాలు

### సర్కారియా కమిషన్ సిఫారసులు

**అత్యవసర పరిస్థితి (అధికరణం 356)**

అత్యవసర అధికారాలు దేశ సమగ్రత, ఐక్యతను కాపాడటానికేగానీ కేంద్రానికి మితిమీరిన అధికారాలు కావని సర్కారియా కమిషన్ పేర్కొంది. కాబట్టి అధికరణం 356ను ఆచితూచి ఉపయోగించాలని, చిట్టచివరి అవకాశంగా మాత్రమే ప్రయోగించాలని సూచించింది. అలాంటి కొన్ని సందర్భాలు..

- రాజకీయ అనిశ్చిత పరిస్థితి
- అంతర్గత విచ్ఛిన్నకర పరిణామాలు
- రాజ్యాంగ నిర్దేశాల అమల్లో నిర్లక్ష్యం
- పరిపాలనా యంత్రాంగం వైఫల్యం

రాష్ట్రపతి పాలన ప్రకటనను పార్లమెంటు ఆమోదించాక రాష్ట్ర విధాన సభను రద్దు చేయొద్దు. అప్పుడే పార్లమెంటుకు రాష్ట్రపతి పాలనకు సంబంధించిన విషయాల మీద తగిన నియంత్రణ అవకాశం లభిస్తుంది. అంతేకాకుండా ఏ పరిస్థితుల్లో రాష్ట్రపతి పాలన విధించాల్సి వచ్చిందో ప్రకటనలో పేర్కొనాలి. అప్పుడే న్యాయ సమీక్ష జరిపే వీలుంటుంది. రాజస్థాన్ రాష్ట్రం- భారత ప్రభుత్వాల వివాదం, మినర్వా మిల్లుల వివాదం సందర్భంగా సుప్రీంకోర్టు ఈ అభిప్రాయాన్ని వెలిబుచ్చింది.

**రాష్ట్రాలకు ఆదేశాల విషయంలో..**

సర్కారియా కమిషన్ 256, 257 అధికరణల ప్రకారం కార్యనిర్వాహక విషయాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి ఉన్న ఆధిపత్యంలో ఎలాంటి మార్పులు చేయనవసరం లేదని భావించింది. అయితే 258 అధికరణను ఉదారంగా అన్వయించి వికేంద్రీకరణను ప్రోత్సహించాలని సూచించింది.

**కేంద్ర సాయుధ దళాల మొహరింపు**

సాయుధ దళాల మొహరింపు నిర్ణయాధికారం పూర్తిగా కేంద్ర ప్రభుత్వానిదే. కానీ ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్నీ సంప్రదించాలి. ఇలాంటి చర్య కొన్నిసార్లు చట్టబద్ధంగా సహేతుకమైనప్పటికీ, రాజకీయంగా సరైన నిర్ణయం కాకపోవచ్చని కమిషన్ అభిప్రాయం.

**అఖిల భారత సర్వీసులు**

అఖిల భారత సర్వీసులను కొనసాగించాలని వాటిని శక్తివంతం చేయాలని సర్కారియా కమిషన్ భావించింది. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా నిర్ణయాలు తీసుకోవాలి. దీని కోసం క్యాబినెట్ సెక్రెటరీ ఆధ్వర్యంలో ఒక సలహా సంఘాన్ని నియమించాలి. మరిన్ని అఖిల భారత సర్వీసుల ఏర్పాటుకు రాష్ట్రాలు సిద్ధం కావాలి.

**అంతర్రాష్ట్ర మండలి (అధికరణం-236)**

శాశ్వత అంతర్రాష్ట్ర మండలిని అంతర్ ప్రభుత్వ మండలి పేరుతో అధికరణం-263 కింద ఏర్పరచి సామాజిక, ఆర్థిక, ప్రణాళికేతర విషయాల మీద శ్రద్ధ తీసుకోవాలి. జాతీయ అభివృద్ధి మండలి అలాగే కొనసాగాలి. కానీ జాతీయ అభివృద్ధి మండలి స్థాయిని లాంఛనప్రాయం చేసి అధికరణం-263 కింద పునర్నిర్మించి జాతీయ ఆర్థిక అభివృద్ధి మండలి అనే కొత్త పేరు ఇవ్వాలని కమిషన్ అభిప్రాయపడింది.

**అధికార భాష**

భాషను రాజకీయం చేయడం దేశ ఐక్యత, సమగ్రతకు మంచిదికాదు. అధికార భాషా విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవడానికి సర్కారియా కమిషన్ కొన్ని సిఫారులు చేసింది. త్రి భాషా సూత్రాన్ని అన్ని రాష్ట్రాలు అమలు చేయాలి.

**ప్రసార సాధనాలు (మీడియా)**

ప్రసార సాధనాలను ఉమ్మడి జాబితా లేదా రాష్ట్ర జాబితాకు బదిలీ చేయడానికి కమిషన్ సుముఖత చూపలేదు. కానీ ఆకాశవాణి, దూరదర్శన్‌ల విషయంలో సహేతుకమైన అధికార వికేంద్రీకరణ చేపట్టాలని సూచించింది. జాతీయ ప్రయోజనాలకు,రాష్ట్రాల అవసరాలకు మధ్య సమతుల్య పూర్వక సయోధ్య ఉండాలని కమిషన్ సూచించింది.

**విచారణ చట్టం**

విచారణ చట్టాన్ని సవరించాలని, కేంద్ర రాష్ట్ర మంత్రులపై విచారణ సంఘాన్ని వీలైనంత వరకూ నియమించొద్దని కమిషన్ అభిప్రాయపడింది. విచారణ సంఘాన్ని నియమించే ముందు పార్లమెంటు ఉభయ సభలు మెజారిటీ ఓటు ద్వారా తీర్మానం ఆమోదించాలని కమిషన్ సూచించింది. విచారణ సంఘం నియామకానికి ముందు ఈ విషయాన్ని అంతర్ ప్రభుత్వ మండలిలో ఉంచాలని కమిషన్ అభిప్రాయం.

**అంతర్రాష్ట్ర వివాదాలు**

అంతర్రాష్ట్ర నదీ జలాల ట్రిబ్యునల్‌కు సంబంధించిన చట్టాన్ని సవరించాలని, అయిదేళ్లలోపు నిర్ణయాలు అమలు జరగాలని సూచించింది.

**హైకోర్టు జడ్జిల నియామకం**

రాజ్యాంగాన్ని సవరించి నిర్ణీత కాలంలో కేంద్ర రాష్ట్రాలు పరస్పరం సంప్రదించుకొని హైకోర్టు జడ్జిలను నియమించేలా చట్టాన్ని రూపొందించాలని సర్కారియా కమిషన్ సూచించింది.

### డి.ఆర్. గాడ్గిల్ ఫార్ములా

దేశం అనుసరిస్తున్న సమాఖ్య తరహా వ్యవస్థలో కేంద్ర, రాష్ట్రాల మధ్య సరైన రీతిలో ఆర్థిక వనరుల పంపిణీ కోసం మార్గదర్శక సూత్రాలు, సహేతుకమైన సూచనలు చేయాల్సిందిగా మాజీ ప్రణాళిక సంఘం డిప్యూటీ చైర్మన్ డి.ఆర్. గాడ్గిల్ అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వం కమిటీని నియమించింది. ఈ కమిటీ కేంద్ర ప్రభుత్వం అందించే ప్రణాళిక సహాయాన్ని రాష్ట్రాల మధ్య పంపిణీ చేయడానికి ఒక ఫార్ములా (సూత్రాన్ని)రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి 1971లో అందించింది. డి.ఆర్.గాడ్గిల్ నివేదికపై 1981లో ఒకసారి, 1992లో మరోసారి సమీక్ష నిర్వహించి నిర్ణయాలు తీసుకున్నారు. ఈ గాడ్గిల్ ఫార్ములాను అనుసరించి జనాభా ఆధారంగా 60 శాతం నిధులు, తలసరి ఆదాయం ఆధారంగా 25 శాతం నిధులు రెవెన్యూ వ్యయాలను సరిచూసుకొని ఫిస్కల్ డెఫిసిట్‌ను తగ్గించినందుకు 7.5 శాతం, ఎడారి, కొండ ప్రాంతాలు, శిశుమరణాలు, ఆరోగ్యం తదితర సమస్యల ఆధారంగా 7.5 శాతం నిధులను కేటాయించాలని స్పష్టంగా విశదీకరించింది.

**నోట్:** కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాలకు సహాయాన్ని అందిస్తుంది. కానీ వెనుకబడిన, పేద రాష్ట్రాలకు ఈ ఫార్ములా ప్రకారం నిధుల పంపిణీ అంత ఉపయోగకరంగా లేదు.

విత్త రంగంలో చూపిన క్రమశిక్షణను గాడ్గిల్ ఫార్ములా ప్రోత్సహించేలా లేదని కొందరు నిపుణుల అభిప్రాయం.

### జస్టిస్ మదన్‌మోహన్ పూంఛీ కమిషన్

కేంద్ర, రాష్ట్ర సంబంధాలను అధ్యయనం చేసి సూచనలు చేయడానికి సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మదన్‌మోహన్ పూంఛీ అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వం 2007 ఏప్రిల్ 28న ఈ కమిషన్‌ను ఏర్పాటు చేసింది.

**కమిషన్ సభ్యులు**

1. ధీరేంద్రసింగ్ (హోంశాఖ మాజీ కార్యదర్శి)
2. అమరేశ్ బాంగ్చీ (మాజీ డైరెక్టర్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ)
3. వినోద్ కుమార్ దుగ్గల్ (హోంశాఖ మాజీ కార్యదర్శి)
4. డాక్టర్ ఎన్ఆర్ మాధవ మీనన్ (మాజీ డైరెక్టర్, జాతీయ న్యాయ అకాడమీ, భోపాల్)

పూంఛీ కమిషన్ తన నివేదికను 7 అధ్యాయాలుగా రూపొందించి 2010 ఏప్రిల్ 20న కేంద్ర ప్రభుత్వానికి అందించింది.

**నివేదికలోని ముఖ్య అధ్యాయాలు**

1. కేంద్ర, రాష్ట్ర సంబంధాల పరిణామ క్రమాన్ని మొదటి అధ్యాయంలో వివరించింది.
2. పౌరహక్కులు, భావ ప్రకటన స్వేచ్ఛను తెలిపే 19వ అధికరణం,అత్యవసర పరిస్థితిని వివరించే 353 అధికరణం, రాష్ట్రాల సంక్షేమం, సంరక్షణను కేంద్ర ప్రభుత్వ బాధ్యతగా తెలిపే 355అధికరణం, రాష్ట్రపతి పాలనను తెలిపే 356 అధికరణం, అంతర్రాష్ట్ర మండలిని తెలిపే 263 అధికరణం గురించి అధ్యయనం చేసి సమగ్ర వివరాలను 2వ అధ్యాయంలో కమిషన్ వివరించింది.
3. కేంద్ర, రాష్ట్రాల మధ్య ఆర్థిక సంబంధాలు, విత్త సంబంధాలు, ప్రాంతీయ అసమానతలను 3వ అధ్యాయంలో పొందుపరిచింది.
4. 73,74 రాజ్యాంగ సవరణలు, 6వ షెడ్యూల్‌కు సంబంధించిన సూచనలను 4వ అధ్యాయంలో పొందుపరిచింది. తీవ్రవాదం, తిరుగుబాట్లు, నక్సలిజం, హింస, మత కల్లోలాలు, జాతీయ అంతరంగిక భద్రతను 5వ అధ్యాయంలో పొందుపరిచింది. పర్యావరణ సమస్యలు, వనరుల విభజనకు సంబంధించి 6వ అధ్యాయంలో పేర్కొంది. సామాజికాభివృద్ధి, సుపరిపాలన, ఎలక్ట్రానిక్ సేవలను 7వ అధ్యాయంలో పొందుపరిచింది. ఇలా 7 అధ్యాయాలుగా కమిషన్ నివేదికను తయారుచేసింది.

**సిఫారసులు**

- తీవ్రవాద సమస్యకు గురైన ప్రాంతాలను పరిమిత కాలం పాటు కేంద్ర ప్రభుత్వం పాలనలోకి తెచ్చేందుకు 355, 356వ అధికరణలను సవరించాలి.
- 355, 356 అధికరణల కింద అత్యవసర నిబంధనలను స్థానికీకరణం చేయాలంటే రాష్ట్రం మొత్తం రాష్ట్రపతి పాలన విధించకుండా సమస్యాత్మక,యంత్రాంగం వైఫల్యం చెందిన ప్రాంతాల్లో మాత్రమే రాష్ట్రపతి పాలన విధించాలి. రాష్ట్రపతి పాలనను 3 నెలలకు మించకుండా చూడాలని కమిషన్ సిఫారసు చేసింది.
- రాష్ట్రాల్లో మత కల్లోలాలు, హింస, అంతరంగిక ప్రాంతీయ వైషమ్యాలు సంభవించినప్పుడు కేంద్ర బలగాలు నేరుగా మొహరించాలి. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల అనుమతి లేకుండా కేంద్ర బలగాలను పంపాలి. ఇలాంటి ప్రత్యేక పరిస్థితులు ఉత్పన్నమైనప్పుడు వారం పాటు నిరంతర పర్యవేక్షణ, కేంద్ర బలగాలను, కేంద్ర హోంశాఖ సమీక్షించాలి.
- రాష్ట్రాల మంత్రి మండలి సలహాకు వ్యతిరేకంగా ప్రాసిక్యూట్ చేయడానికి అనుమతించే హక్కు గవర్నర్లకు ఉండాలి. విశ్వవిద్యాలయాలకు చైర్మన్లుగా గవర్నర్లను నియమించొద్దని కమిషన్ అభిప్రాయపడింది.
- సరైన కారణాలు తెలపకుండా గవర్నర్ల తొలగింపు సరికాదని పేర్కొంది. గవర్నర్ పదవీ కాలాన్ని ఐదేళ్లుగా నిర్ణయించాలని తెలిపింది. రాష్ట్రపతి మహాభియోగతీర్మానం ద్వారానే గవర్నర్లను తొలగించాలని అభిప్రాయపడింది.
- అధికరణం 163(2) ద్వారా గవర్నర్లకు సంక్రమించిన విచక్షణాధికారాల పరిధిని రాజ్యాంగ సవరణ చేసి తగ్గించాలి. బిల్లులను తన వద్ద అట్టిపెట్టుకొనే అధికారాన్ని తగ్గించి 4 నెలల్లోగా కచ్చితంగా బిల్లుపై తన అభిప్రాయాన్ని వ్యక్తం చేయాలని సూచించింది.
- జాతీయ సమగ్రతా మండలి ఏడాదికోసారి సమావేశం కావాలని చెప్పింది. జాతీయ పరిశోధనా ఏజెన్సీ వంటి కొత్త సంస్థలను అధ్యయనం చేసి నివేదించింది.

వీరప్ప మొయిలీ అధ్యక్షతన రెండో పరిపాలనా సంస్కరణల సంఘాన్ని కేంద్ర ప్రభుత్వం 2005 ఆగస్టు 31న నియమించింది. దీనిలో సభ్యులు.

1. వి. రామచంద్రన్ 2. డాక్టర్ ఏ.పి.ముఖర్జీ
3. డాక్టర్ ఎ.హెచ్. ఖత్రో
4. డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ (రాజీనామా చేశారు)
5. శ్రీమతి వినితా రాయ్ (కార్యదర్శి)

వీరప్పమొయిలీ అధ్యక్షతన నియమించిన రెండో పరిపాలనా సంస్కరణ సంఘం ప్రభుత్వం, పాలనా వ్యవస్థను సమగ్రంగా అధ్యయనం చేసి బాధ్యతాయుత, జవాబుదారీతనం, సమర్థ పాలనకు సంబంధించి మొత్తం 15 అధ్యయన నివేదికలను కేంద్రప్రభుత్వానికి సమర్పించింది.

### గతంలో అడిగిన ప్రశ్నలు

1. కింది వాటిలో కేంద్ర, రాష్ట్ర సంబంధాలతో సంబంధం లేనిది?
   ఎ) ఇంద్రజిత్ గుప్తా కమిటీ
   బి) పశ్చిమబెంగాల్ ప్రభుత్వ మెమొరాండం
   సి) రాజమన్నార్ కమిటీ
   డి) సర్కారియా కమిషన్
2. రెండో పరిపాలనా సంస్కరణల సంఘం అధ్యక్షుడు ఎవరు?
   ఎ) సి. రంగరాజన్
   బి) వినోద్ రాయ్
   సి) వీరప్పమొయిలీ
   డి) వినితారాయ్
3. ఎన్నికల అజమాయిషీ, సూచనలు, నియంత్రణ ఎన్నికల సంఘం చేతుల్లో ఉండాలని ఏ రాజ్యాంగ అధికరణ తెలుపుతుంది?
   ఎ) 324 బి) 323
   సి) 325 డి) 326
4. కింది వాటిలో ఏ కేసు విషయంలో సుప్రీంకోర్టు తీర్పు కేంద్ర, రాష్ట్ర సంబంధాలను పునర్ నిర్వచించింది?
   ఎ) ఇంద్ర సహానీ కేసు
   బి) రాయనరావు కేసు
   సి) ఎస్.ఆర్. బొమ్మయ్ కేసు
   డి) ఐ.ఆర్. కొయల్‌హో కేసు
5. కేంద్ర,రాష్ట్ర సంబంధాలకు సంబంధించి డి.ఆర్. గాడ్గిల్ సూత్రాన్ని ఎందుకు ఉపయోగిస్తారు?
   ఎ) పన్నుల రాబడుల విభజన
   బి) రాష్ట్ర రుణాల మాఫీ
   సి) రాష్ట్రాలు కొత్త అప్పులు చేయకుండా ఉండటానికి
   డి) రాష్ట్రాలకు కేంద్ర సహాయాన్ని సమకూర్చడానికి
6. సర్కారియా కమిషన్ అధ్యయన నివేదికను ఎప్పుడు సమర్పించింది?
   ఎ) 1988 బి) 1989
   సి) 1987 డి) 1986
7. అఖిల భారత సర్వీసులను ముఖ్యంగా ఐఏఎస్, ఐపీఎస్‌లను రద్దు చేయాలని సిఫారసు చేసిన కమిటీ ఏది?
   ఎ) సర్కారియా కమిషన్
   బి) రాజమన్నార్ కమిషన్
   సి) ఖేర్ కమిషన్ డి) కాకా కలేల్కర్ కమిషన్

**సమాధానాలు**

1) ఎ; 2) సి; 3) ఎ; 4) సి; 5) డి; 6) సి; 7) బి.

---

శరీరంలో జరిగే అన్ని జీవక్రియలు నాడీ వ్యవస్థ ఆధీనంలో ఉంటాయి. మానవ నాడీ వ్యవస్థలో మూడు భాగాలు ఉంటాయి. అవి.. కేంద్ర నాడీవ్యవస్థ, పరధీయ నాడీవ్యవస్థ, స్వయం చోదిత నాడీవ్యవస్థ. కేంద్ర నాడీ వ్యవస్థలో మెదడు, వెన్నుపాము ఉంటాయి. వీటిని ఆవరించి ఉండే మూడు పొరలను మెనింజస్ అంటారు. మెదడు.. తలలోని దృఢమైన ఎముకల పెట్టె(కపాలం)లో, నీటి అలల మధ్య తేలుతూ పటిష్ట భద్రత మధ్య ఉంటుంది. మెదడును వివిధ పరికరాలతో స్కానింగ్ చేసి దానిలోని మార్పులను గుర్తించి వ్యాధులను నిర్ధారించడాన్ని బ్రెయిన్ మ్యాపింగ్ అంటారు.

# నార్కో అనాలసిస్‌లో వాడే రసాయనాలు?




### మానవ నాడీ వ్యవస్థ

మానవుడిలో మెదడు.. తలలోని దృఢమైన ఎముకల పెట్టె (కపాలం)లో, నీటి అలల మధ్య తేలుతూ పటిష్ట భద్రత మధ్య ఉంటుంది. కపాలం అధ్యయనాన్ని క్రేనియాలజీ అంటారు. శరీరంలో జరిగే అన్ని జీవక్రియలు నాడీ వ్యవస్థ ఆధీనంలో ఉంటాయి. ఈ వ్యవస్థ శరీరానికి వెలుపల, లోపల జరిగే మార్పులకు ప్రతిచర్యలను కలిగిస్తుంది. నాడీ వ్యవస్థ అధ్యయనాన్ని న్యూరాలజీ అంటారు. మానవ నాడీవ్యవస్థలో మూడు భాగాలు ఉంటాయి. అవి.. కేంద్ర నాడీవ్యవస్థ, పరధీయ నాడీవ్యవస్థ, స్వయం చోదిత నాడీవ్యవస్థ.

### కేంద్ర నాడీ వ్యవస్థ

ఇందులో రెండు భాగాలు ఉంటాయి. ఒకటి.. మెదడు. రెండు.. వెన్నుపాము. వీటిని ఆవరించి ఉండే మూడు పొరలను మెనింజస్ అంటారు. ఆ పొరలు (వెలుపలి నుంచి లోపలి వైపునకు వరుసగా).. వరాశిక, లౌతుకళ, మృద్వి. ఈ పొరలకు బ్యాక్టీరియా (నిస్సేరా మెనింజైటిస్) సంక్రమిస్తే మెనింజైటిస్ వ్యాధి వస్తుంది. ఈ పొరల మధ్య ఉండే ద్రవ పదార్థాన్ని మస్తిష్క మేరుద్రవం(సెరిబ్రో స్పైనల్ ఫ్లూయిడ్) అంటారు. ఈ ద్రవం మెదడుకు, వెన్నుపాముకు రక్షణ కల్పి స్తుంది. మెదడులోని నాడీకణాలకు ఆహారాన్ని, ఆక్సిజన్‌ను సరఫరా చేస్తుంది.

### మెదడు

మెదడు అధ్యయనాన్ని 'ఫ్రినాలజీ' అంటారు. అప్పుడే పుట్టిన శిశువు మెదడు 300-400 గ్రాముల బరువు ఉంటుంది. వయోజనుల మెదడు 1350-1400 గ్రాములు, పురుషుల్లో 1375 గ్రాములు, స్త్రీల్లో 1275 గ్రాముల బరు వు ఉంటుంది. మెదడులో 75 శాతానికి పైగా నీరు ఉంటుంది.

జంతువుల్లో అత్యంత బరువైన మెదడు (8 కిలోలు)తిమింగలంలో ఉంటుంది. ఏనుగు మెదడు 5 కిలోలు ఉంటుంది. నాడీ కణాల సంఖ్య మాత్రం మానవుల మెదడులోనే ఎక్కు వ. ఏనుగు మెదడులో 2,300 కోట్ల నాడీ కణా లు, చింపాంజీలో 700 కోట్లు, మానవుడిలో 8,600 కోట్లు ఉంటాయి.

నాడీ వ్యవస్థ నిర్మాణాత్మక, క్రియాత్మక ప్రమాణం నాడీకణం (న్యూరాన్). మెదడు పనితీరుకు మూలం న్యూరాన్. మెదడు కణాల్లో న్యూరాన్లు పది శాతం ఉంటాయి. మిగతా 90 శాతం గ్లియల్ కణాలు ఉంటాయి. ఈ కణాలు పోషక పదార్థాలను అందించడంతోపాటు మెద డును శుభ్రం చేస్తాయి. మెదడు బరువు ఎక్కువ ఉన్నవారు ఎక్కువ తెలివితేటలు కలిగి ఉంటారని ఫ్రెడరిక్ టిడ్‌మాన్ పేర్కొన్నాడు.

- మానవుడి దేహం బరువులో మెదడు బరు వు రెండు శాతం మాత్రమే. కానీ శరీరం లోని మొత్తం శక్తిలో దాదాపు 20 శాతం, ఆక్సీజన్‌లో 20 శాతం, గ్లూకోజ్‌లో 25 శాతాన్ని వినియోగించుకుంటుంది.
- చుంచెలుక శరీరం మొత్తం బరువులో మెదడు బరువు 10 శాతం ఉంటుంది. మెదడుకు 5 నుంచి 7 సెకన్ల పాటు ఆక్సీజన్ అందకుంటే బ్రెయిన్ డెడ్ అవుతుంది.
- శరీరం లాగే మెదడుకూ విశ్రాంతి (నిద్ర) అవసరం.
- పెద్దవారు రోజుకు ఆరు గంటలు నిద్రపోవాలి
- క్రీడాకారులు 9 గంటలు, 18 ఏళ్ల లోపు వారు 8 గంటలు, నవజాత శిశువులు 18 గంటలు విశ్రాంతి తీసుకోవాలి.

### బ్రెయిన్ మ్యాపింగ్

అత్యాధునిక స్కానింగ్, మ్యాపింగ్ పరిశోధనల వల్ల మెదడు పనితీరుపై అవగాహన ఏర్పడింది. మెదడును వివిధ పరికరాలతో స్కానింగ్ చేసి దానిలోని మార్పులను గుర్తించి వ్యాధులను నిర్ధారించడాన్ని బ్రెయిన్ మ్యాపింగ్ అంటారు. మెదడు వ్యాధుల గుర్తింపు పరీక్షలు..

1. ఎలక్ట్రో ఎన్‌సెఫలో గ్రామ్ (ఈఈజీ)
2. మ్యాగ్నెటిక్ ఎన్‌సెఫలో గ్రామ్ (ఎంఈజీ)
3. మ్యాగ్నెటిక్ రెజొనెన్స్ ఇమేజింగ్(ఎంఆర్ఐ)
4. కంప్యూటెడ్ టోమోగ్రఫీ (సీటీ స్కాన్)
5. ఫంక్షనల్ మ్యాగ్నెటిక్ రెజొనెన్స్ ఇమేజింగ్ (ఎఫ్ఎంఆర్ఐ)

- స్కానింగ్‌లో రేడియోధార్మిక కిరణాలను ఉపయోగిస్తారు.
- కండరాల నొప్పులు, పక్షవాతం చికిత్సలో పరారుణ కిరణాలను వాడతారు.

### నార్కో అనాలసిస్

- మెదడులోని సమాచారాన్ని యథావిధిగా బయటకు చెప్పించే ప్రక్రియ నార్కో అనాలసిస్ టెస్ట్.
- ఈ పరీక్షను అంతర్జాతీయ ఉగ్రవాదులు, ఆర్థిక నేరస్తులు, కుంభకోణాలకు పాల్పడిన వ్యక్తుల నుంచి నిజాలను రాబట్టడానికి ఉపయోగిస్తారు.
- ఈ పరీక్షలో వాడే రసాయనాలు.. సోడియం అమైటాల్, సోడియం పెంటాథాల్.

**నోట్:** ఈ పరీక్ష రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం వ్యక్తి స్వేచ్ఛకు, జీవించే హక్కుకు వ్యతిరేకం. కాబట్టి తప్పనిసరి పరిస్థితుల్లో కోర్టు అనుమతితో దీన్ని నిర్వహించాలి.

### మెదడు - నిర్మాణం

మెదడులో మూడు భాగాలు ఉంటాయి. అవి.. ముందు మెదడు, మధ్య మెదడు, వెనక మెదడు.

### ముందు మెదడు

ముందు మెదడునే సెరిబ్రమ్/మస్తిష్కం/పెద్ద మెదడు అని అంటారు. సెరిబ్రమ్ 995 గ్రాముల బరువు ఉంటుంది. దీనిలోని ఎత్తైన ప్రదేశాలను(గట్లను) గైరై అని, లోతైన ప్రదేశాలను సల్సై అని అంటారు. మస్తిష్కం 2 మస్తిష్కార్ధగోళాలు గా విభజితమవుతుంది. కుడి మస్తిష్కార్ధ గోళం ఎడమ కాళ్లు, చేతులను; ఎడమ మస్తిష్కార్ధగోళం కుడి కాళ్లు, చేతులను నియంత్రిస్తాయి.

- కుడి మస్తిష్కార్ధ గోళానికి గాయమైతే దేహంలోని ఎడమ వైపు భాగాలకు, ఎడ మ గోళానికి దెబ్బ తగిలితే కుడి వైపు భాగాలకు పక్షవాతం వస్తుంది. ఈ మస్తిష్కార్ధ గోళాలను నాడీదండం కలుపుతుం ది. మస్తిష్కానికి, మధ్య మెదడుకు మధ్యద్వారగోర్ధం ఉంటుంది. ఇది రాంబాయిడ ల్ ఆకారంలో కనిపిస్తుంది. థలామస్,హైపోథలామస్‌గా విభజితమవుతుంది.

**హైపోథలామస్ విధులు**

1) భావోద్వేగాల నియంత్రణ
2) ఆకలి, దప్పిక
3) నిద్ర, మెలకువ
4) నీటి సమతుల్యత, రక్తపీడనం, శరీర ఉష్ణోగ్రత క్రమత
5) లైంగిక వాంఛ

- హైపోథలామస్..పీయూష గ్రంథిని నియంత్రిస్తుంది.మానవుడిలో ఈ గ్రంథి ప్రధానమైంది.
- దృశ్య, శ్రవణ, స్పర్శ, వాసన, రుచిని తెలుసుకోవడానికి మస్తిష్కంలో ఐదు జ్ఞాన కేంద్రాలు ఉంటాయి.
- మస్తిష్కాన్ని ఉదర తలం నుంచి చూస్తే అందులో గదాకృతి నిర్మాణాలు కనిపిస్తా యి. వాటిని ఘ్రాణ లంబికలు అంటారు.

**మస్తిష్కం విధులు**

1) జ్ఞాపక శక్తి 2) తెలివితేటలు
3) ఆలోచన 4) ఊహా శక్తి
5) వివేచన 6) సమస్యల పరిష్కారం
7) అభ్యాసం 8) మాట్లాడటం

### మధ్య మెదడు

- ఇది మందంగా, దృఢంగా ఉన్న చిన్న కాడ వంటి భాగం.
- ఇది హైపోథలామస్‌కు, పాన్స్‌వెరోలికి మధ్య ఉంటుంది. మధ్య మెదడు పృష్ఠ భాగంలో నాలుగు లంబికలతో 'కార్పొరా క్వాడ్రిజమైనా' అనే నిర్మాణం ఉంటుంది. ఇది దృశ్య, శ్రవణ జ్ఞానాలను కలిగిస్తుంది.

### వెనక మెదడు

ఇది మెదడు చివరి భాగం. దీనిలో మూడు భాగాలు ఉంటాయి. అవి..

1) అనుమస్తిష్కం
2) పాన్స్ వెరోలి
3) మజ్జాముఖం.

### అనుమస్తిష్కం (సెరిబెల్లమ్)

- దీన్ని లిటిల్ బ్రెయిన్ (చిన్న మెదడు) అని కూడా అంటారు.
- ఇది తల వెనక భాగంలో (మస్తిష్కానికి దిగువన, మజ్జాముఖానికి పైన) ఉంటుంది.

**విధులు**

1) శరీర సమతాస్థితిని కాపాడటం
2) నియంత్రిత కండరాల చలనాలను క్రమబద్ధీకరించడం

**నోట్:** మత్తుమందు ఇచ్చినప్పుడు, మద్యా న్ని అధికంగా సేవించినప్పుడు ఈ భాగం సక్రమంగా పనిచేయక మనిషి అదుపు తప్పుతాడు.

### పాన్స్ వెరోలి

- ఇది మజ్జాముఖానికి వెనక, మధ్య మెదడుకు కింద ఉంటుంది. శ్వాస కండరాల కదలికలను నియంత్రించి, ఉచ్ఛ్వా సలో పీల్చే వాయువుల ఘనపరిమాణాన్ని క్రమపరుస్తుంది.

### మజ్జాముఖం

ఇది మెదడు చివరి భాగం. మెదడును, వెన్నుపామును కలిపే సంధానకర్త/వారధి. ఇది అనియంత్రిత కండరాలకు సమాచారాన్ని అందిస్తుంది.

**విధులు**

1) శ్వాసక్రియ, నాడీ స్పందన, రక్తపీడనం, హృదయ స్పందన, పేగులు, జీర్ణాశయం, ఆహార వాహిక, మూత్రాశయం చలనాలను నియంత్రిస్తుంది.
2) వాసోమోటర్‌గా పనిచేస్తుంది(రక్తనాళా ల్లో జరిగే చర్యల వల్ల వాటి వ్యాసం మారుతుంది)
3) మింగడం, దగ్గడం, తుమ్మడం, వాంతులు, వెక్కిళ్లను నియంత్రిస్తుంది.

- మానవ మెదడులో మజ్జాముఖం అతి ముఖ్య భాగం. దీనికి తీవ్ర గాయమైతే (శ్వాసక్రియకు అంతరాయం కలిగి) వ్యక్తి మరణిస్తాడు.

### వెన్నుపాము

మజ్జాముఖం.. వెనక వైపునకు విస్తరించి వెన్నుపాముగా మారి మొండెం చివరి వరకు ప్రయాణిస్తుంది. ఇది 42 నుంచి 45 సెం.మీ. పొడవు ఉంటుంది. వెన్నుపాము దాని అడ్డుకోతలో హెచ్ లేదా సీతాకోకచిలుక ఆకారంలో కనిపిస్తుంది. వెన్నుపాము లోపలి వైపు బూడిద రంగు పదార్థం, వెలుపలి వైపు తెలుపు పదార్థం ఉంటాయి. వెన్నుపాము మెదడుకు, శరీర భాగాలకు మధ్యవర్తిగా, సంధానకర్తగా పనిచేస్తుంది. అందువల్ల వెన్నుపామును టెలిఫోన్ ఎక్స్ఛేంజ్/రిలే సెంటర్ అని పేర్కొంటారు.

**విధులు**

అసంకల్పిత ప్రతీకార చర్యలను చూపడం. అంటే అనుకోకుండా వేగంగా, వెంటనే, అప్రయత్నంగా జరిగే చర్యలు. ఈ చర్యలు వెన్నుపాము ఆధీనంలో మాత్రమే ఉంటాయి. వీటికి మెదడుతో సంబంధం లేదు.

**ఉదాహరణలు:**

- వేడి వస్తువులను తాకగానే చేతిని వెనక్కి లాగడం.
- కీటకం అకస్మాత్తుగా కంటి వద్దకు రాగానే కనురెప్పలు మూయడం.
- చీకట్లో ఒక్కసారిగా కాంతి పడగానే కళ్లు మూసుకోవడం.

### గతంలో అడిగిన ప్రశ్నలు

1. శరీరంలో ఉష్ణ నియంత్రణ కేంద్రం?
   1) కశేరు నాడీదండం
   2) హైపోథలామస్
   3) అనుమస్తిష్కం
   4) వెన్నుపాము
2. తుమ్మడం, మింగడం, వాంతులు, వెక్కిళ్లు దేని నియంత్రణలో ఉంటాయి? (గ్రూప్-1, 1990)
   1) మస్తిష్కం 2) అనుమస్తిష్కం
   3) మజ్జాముఖం 4) వెన్నుపాము
3. ఆల్కహాల్, అనస్థీషియా.. మెదడులోని ఏ భాగంపై ప్రభావం చూపుతాయి?
   1) సెరిబ్రమ్ 2) సెరిబెల్లమ్
   3) మెడుల్లా అబ్లాంగేట 4) వెన్నుపాము
4. మెదడును ఆవరించి ఉన్న పొరలేవి (వెలుపలి నుంచి లోపలి వైపునకు వరుసగా)?
   1) మృద్వి 2) వరాశిక
   3) లౌతుకళ 4) ప్లూరా
   1) 1, 2, 3, 4 2) 2, 3, 4, 1
   3) 2, 3, 1 4) 3, 2, 1
5. అనుమస్తిష్కం (సెరిబెల్లమ్) దేనికి సంబంధించింది? (ఏపీ టౌన్ ప్లానింగ్, 2010)
   1) కండర కదలికల సమన్వయం
   2) గ్రాహకాంగం 3) జ్ఞాపకశక్తి
   4) దృష్టి
6. మెదడులోని ఏ భాగం జ్ఞాపకశక్తికి మూలం? (జేఎల్, 2004)
   1) మస్తిష్కం 2) అనుమస్తిష్కం
   3) దవ్వ 4) అధో పర్యంకం
7. మానవ మెదడు సగటు బరువు?
   1) 1300 గ్రా॥ 2) 1400 గ్రా॥
   3) 1500 గ్రా॥ 4) 1350 గ్రా॥
8. ఆకలి, దప్పిక, లైంగిక వాంఛ, శరీర ఉష్ణోగ్రత దేని ఆధీనంలో ఉంటాయి? (గ్రూప్-1, 2000)
   1) మస్తిష్కం 2) అనుమస్తిష్కం
   3) మజ్జాముఖం 4) హైపోథలామస్
9. శరీరంలో వార్తలను గ్రహించి విశ్లేషించి సమన్వయపరిచే కేంద్రం?(జేఎల్, 2003)
   1) గుండె 2) కాలేయం
   3) మూత్రపిండాలు 4) మెదడు
10. పార్కిన్సన్ వ్యాధి ఏ అవయవానికి వస్తుంది? (ఏఈఈ, 2006)
   1) గుండె 2) చర్మం
   3) మెదడు 4) కాలేయం

**సమాధానాలు**

1) 2; 2) 3; 3) 2; 4) 3; 5) 1; 6) 1; 7) 2; 8) 4; 9) 4; 10) 3.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

సాక్షి ప్లస్
మంగళవారం : 14-1-2025

# మానవుడు ఉపయోగించిన మొదటి లోహం?

## లోహాల ఉనికి

భూమి వల్కలంలో అత్యంత విస్తారంగా లభించే మూలకం ఆక్సిజన్(45.5 శాతం). ఆక్సిజన్ తర్వాత విస్తృతిని సిలికాన్(27 శాతం) ఆక్రమిస్తుంది. భూపటలంలో లభించే మూలకాల్లో మూడోది, లోహాల్లో మొదటిది అల్యూమినియం(8.3 శాతం). రెండోది ఇనుము(5శాతం). మూలకాల్లో నాలుగో స్థానం, మనిషి ఉపయోగించిన మొదటి లోహం రాగి (కాపర్). అత్యధికంగా వినియోగించే లోహం ఇనుము(ఐరన్).

## లోహ సంగ్రహణ

బంగారం(గోల్డ్), ప్లాటినం లాంటి కొన్ని లోహాలు మాత్రమే ప్రకృతిలో స్వాభావికంగా లభిస్తాయి. కార్బన్, సల్ఫర్ భూమి పైపొరల్లో స్వేచ్ఛాస్థితిలో ఉంటాయి. ఉత్కృష్ట వాయువులు గాలిలో స్వేచ్ఛగా ఉంటాయి. ఆక్సిజన్, నైట్రోజన్లు గాలిలో స్వేచ్ఛాస్థితిలో ఉన్నప్పటికీ ఇతర మూలకాల్లో సంయోగ పదార్థాలను ఏర్పరుస్తాయి. దాదాపు మిగిలిన మూలకాలన్నీ ఒకదానితో మరొకటి కలిసి భూమి పొరల్లో సంయోగ పదార్థాలుగా ఉంటాయి. సహజంగా లభించే లోహ సంయోగ పదార్థాల నుంచి లోహాన్ని నిష్కర్షించి వేరు చేసే పద్ధతిని 'లోహ నిష్కర్షణ' అంటారు. సమ్మేళనాల నుంచి లోహాలను సంగ్రహించడం, శుద్ధి చేయడంతోపాటు వివిధ మిశ్రమ లోహాలు తయారు చేయడం లోహ సంగ్రహణశాస్త్ర పరిధి లోకి వస్తాయి.

## ఖనిజాలు (మినరల్స్)

ప్రకృతిలో లభించే లోహ సమ్మేళనాలు ఇసుక, రాళ్లు, బంకమన్ను మొదలైన మలినాల తో కలిసి ఉంటాయి. ఈ విధంగా లభించే లోహాల ముడి పదార్థాలను ఖనిజాలు అంటారు. గనుల నుంచి తవ్వి ఖనిజాలను వెలికి తీస్తారు. అయితే అన్ని ఖనిజాల నుంచి లోహాన్ని వేరు చేయడం లాభదాయకం కాదు. వాణిజ్యపరంగా ఏ ఖనిజం నుంచి లాభదాయకంగా లోహాన్ని వేరు చేస్తారో దాన్ని ఆ లోహధాతువు(ఓర్) అంటారు. ఉదాహరణకు అల్యూమినియం.. బాక్సైట్ రూపంలో, కయోలినైట్ అనే బంకమన్ను.. కోరండం, డయాస్పోర్లుగా లభిస్తాయి. ఇవన్నీ అల్యూమినియం ఖనిజాలు. కానీ అల్యూమినియం లోహాన్ని 'బాక్సైట్' నుంచి మాత్రమే లాభసాటిగా సంగ్రహిస్తారు. అందువల్ల బాక్సైట్‌ను అల్యూమినియం ధాతువుగా పరిగణిస్తారు.


ఎక్కువ శాతం లోహాలు ఆక్సైడ్లుగా లభిస్తాయి. ఇతరత్రా కార్బొనేట్లు, సల్ఫేట్లు, సల్ఫైడ్లు, క్లోరైడ్ల రూపాల్లో లభిస్తాయి.

| ఖనిజ రూపం | ఖనిజాలు |
|---|---|
| ఆక్సైడ్ | బాక్సైట్, హెమటైట్, మాగ్నటైట్, మోనోజైట్, సిలికా, జింకైట్ (ఫిలాసఫర్స్ ఊల్). |
| కార్బొనేట్ | సున్నపురాయి, మాలకైట్, కాలమైన్, డోలమైట్, సిడరైట్ |
| సల్ఫేట్ | బెరైటీస్, జిప్సం. |
| సల్ఫైడ్ | పైరైటీస్, సిన్నబార్, గెలీనా, కాపర్ గ్లాన్స్. |
| క్లోరైడ్ | కార్నలైట్, హార్న్ సిల్వర్, రాతి ఉప్పు(రాక్‌సాల్ట్). |

ధాతువును ఎంచుకునేటప్పుడు కేవలం ఆర్థికాంశాలే కాకుండా పర్యావరణ అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ఉదాహరణకు సల్ఫైడ్ ఖనిజమైన 'ఐరన్ పైరైటీస్' నుంచి ఐరన్‌ను సంగ్రహిస్తే అది వాతావరణాన్ని కలుషితం చేసి ఆమ్ల వర్షాలకు కారణమయ్యే 'సల్ఫర్ డై ఆక్సైడ్'ను విడుదల చేస్తుంది. కాబట్టి ఆక్సైడ్ ఖనిజాలైన హెమటైట్ లాంటి ఖనిజాలను ఉపయోగిస్తారు.

## సాంద్రీకరణ

ముడి ఖనిజాల్లో చాలా వరకు మాలిన్యాలు ఉంటాయి. వీటి నుంచి శుద్ధ లోహాన్ని పొందడానికి కొన్ని రసాయన ప్రక్రియల ద్వారా మలినాలను తొలగిస్తారు. ఈ పద్ధతిని 'సాంద్రీకరణ' అంటారు.



## సాంద్రీకరణ పద్ధతులు

**లెవిగేషన్:** గురుత్వాకర్షణ సూత్రంపై ఆధారపడిన సాంద్రీకరణ పద్ధతిలో వేగంగా వచ్చే నీటి ధారతో చూర్ణం చేసిన ముడి ఖనిజాన్ని కడుగుతారు. తేలికైన మాలిన్య కణాలు నీటి ప్రవాహంతో కొట్టుకుపోగా బరువైన శుద్ధి ముడి ఖనిజ కణాలు నిలిచిపోతాయి. ఇది భౌతిక పద్ధతి.

**ప్లవన క్రియ:** సల్ఫైడ్ ఖనిజాల నుంచి మలినాలను తొలగించడానికి ఈ పద్ధతిలో చూర్ణం చేసిన ముడి ఖనిజాన్ని నీటిలో అవలంబనం చేస్తారు. అనంతరం నూనె సమక్షంలో గాలిని పంపిస్తూ గిలకరించడం వల్ల పైన ఏర్పడే నురుగులోకి ఖనిజ కణాలు వస్తాయి. నురుగు కోసం పైన్ ఆయిల్, కొవ్వు ఆమ్లాలు, గ్జాంథేట్‌లను కలుపుతారు. జింక్, లెడ్ లాంటి లోహాల ఖనిజాలను ఈ విధంగా సాంద్రీకరిస్తారు. ఇది కూడా భౌతిక పద్ధతి.

**లీచింగ్ (నిక్షాళనం):** ఇది ఒక రసాయన పద్ధతి. ఇందులో ధాతువు రసాయన స్వభావాన్ని అనుసరించి, తగిన కారకాన్ని ఉపయోగించి, ధాతువు మాత్రమే ద్రావణంలో కరిగేలా చేస్తారు. కరగకుండా మిగిలిపోయిన మలినాలను వడపోత ద్వారా వేరు చేస్తారు. ఉదాహరణకు బాక్సైట్‌ను సోడియం హైడ్రాక్సైడ్‌ను ఉపయోగించి లీచింగ్ చేస్తారు.

**అయస్కాంత వేర్పాటు పద్ధతి:** ముడి ఖనిజానికి కానీ, మలినానికి కానీ అయస్కాంత ధర్మం ఉంటే ఈ పద్ధతిలో సాంద్రీకరిస్తారు. చూర్ణం చేసిన ముడి ఖనిజాన్ని అయస్కాంత రోల్లర్ మీద తిరిగే కన్వేయర్ బెల్ట్ మీద పడేలా చేస్తే ఖనిజం మాలిన్యం నుంచి వేరు అవుతుంది. ఈ పద్ధతిలో ఇనుప ఖనిజాలను, టిన్ స్టోన్‌ను సాంద్రీకరిస్తారు.

## కొన్ని ముఖ్యమైన లోహాలు - వాటి ఖనిజాలు

| లోహం | ముఖ్య ఖనిజాలు |
|---|---|
| అల్యూమినియం | బాక్సైట్, కోరండం, డయాస్పోర్, కయోలినైట్ |
| బేరియం | బెరైటీస్ |
| కాపర్ | కాపర్ పైరెటీస్, చాల్కో పైరెటీస్, మాలకైట్, క్యూప్రైట్, కాపర్ గ్లాన్స్. |
| ఐరన్ | ఐరన్ పైరెటీస్ (ఫూల్స్ గోల్డ్), హెమటైట్, మాగ్నటైట్, సిడరైట్, లియొనైట్, సిడరైట్. |
| కాల్షియం | సున్నపురాయి (కాల్షియం కార్బొనేట్), జిప్సం. |
| మెగ్నీషియం | కార్నలైట్, మాగ్నసైట్, ఎప్సం లవణం. |
| థోరియం | మోనోజైట్ |
| మెర్క్యూరీ | సిన్నబార్ |
| జింక్ | కాలమైన్, జింక్‌బ్లెండ్, జింకైట్. |
| మాంగనీస్ | పైరోలుసైట్ |
| సిల్వర్ | అర్జెంటైట్, హార్న్ సిల్వర్ |
| లెడ్ (సీసం) | గెలీనా |
| సోడియం | రాతి ఉప్పు (రాక్ సాల్ట్), చిలీ సాల్ట్ పీటర్. |

## ముడి లోహాన్ని సంగ్రహించడం

ధాతువు నుంచి లోహాన్ని సంగ్రహించడానికి కొన్ని రసాయన ప్రక్రియలను అవసరానికి తగినట్లు ఉపయోగిస్తారు. వాటిలో ముఖ్యమైన ప్రక్రియలు.

**భస్మీకరణం(కాల్సినేషన్):** ధాతువును గాలి లేకుండా బాగా వేడి చేసి బాష్పశీల (వాయురూప) మలినాలను తొలగించే పద్ధతిని భస్మీకరణం అంటారు. కార్బొనేట్, బైకార్బొనేట్ ఖనిజాలకు ఈ పద్ధతిని ఎక్కువగా ఉపయోగిస్తారు. ఉదాహరణకు కాల్షియం కార్బొనేట్ (సున్నపురాయి)ని భస్మీకరణం చేస్తే కాల్షియం ఆక్సైడ్ (సున్నం) ఏర్పడుతుంది. కార్బన్ డై ఆక్సైడ్ వేరు పడుతుంది.

**భర్జనం(రోస్టింగ్):** గాలి సరఫరా చేస్తూ లోహ ద్రవీభవన స్థానం కంటే తక్కువ ఉష్ణోగ్రత వద్ద కొలిమిలో ముడి ఖనిజాన్ని వేడి చేసే ప్రక్రియ భర్జనం. ప్రధానంగా సల్ఫైడ్ ఖనిజాలను ఆక్సైడ్లుగా మార్చేందుకు ఈ పద్ధతిని ఉపయోగిస్తారు. ఉదాహరణకు రివర్బరేటరీ కొలిమిలో కాపర్ సల్ఫైడ్ ఖనిజాన్ని భర్జనం చేస్తారు.

**ప్రగలనం:** ధాతువును ద్రవకారి(ధాతువు ద్రవీకరణ ఉష్ణోగ్రతను తగ్గించే పదార్థం) కలిపి కానీ లేకుండా కానీ వేడిచేసి లోహాన్ని ద్రవస్థితిలో పొందే ప్రక్రియను ప్రగలనం అంటారు.

**క్షయకరణం:** లోహ ఆక్సైడ్‌లను సాధారణంగా కోక్(కార్బన్) లేదా కార్బన్ మోనాక్సైడ్(CO) కలిపి వేడి చేస్తారు. ఈ ప్రక్రియలో అవి ఆక్సిజన్‌ను కోల్పోయి లోహాలుగా క్షయకరణం చెందుతాయి. ఉదాహరణకు 'బ్లాస్ట్ ఫర్నేసు'లో కోక్ మండటం వల్ల ఏర్పడిన కార్బన్ మోనాక్సైడ్.. ఐరన్ ఆక్సైడ్‌ను ఐరన్‌గా క్షయకరణం చేస్తుంది.

గ్రూప్స్,
ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
రసాయన శాస్త్రం

## లోహ సంగ్రహణ - ముఖ్యాంశాలు

- ధాతువులో లోహంతోపాటు ఉండే మలినాలను 'గాంగ్' అంటారు.
- ఇనుము సంగ్రహణలో 'బ్లాస్ట్ కొలిమి'ని ఉపయోగిస్తారు. కొలిమిలోకి ప్రవేశపెట్టే కోక్, ధాతువు, సున్నపురాయిల మిశ్రమాన్ని చార్జ్ అంటారు.
- రివర్బరేటరీ కొలిమిలో ప్రగలనం, వేడి చేయడం ద్వారా కాపర్‌ను నిష్కర్షణ చేస్తారు.
- గలన స్థితిలో ఉండే లోహాన్ని పచ్చి కర్రలతో కలియబెట్టి మాలిన్యాలను వేరు చేస్తారు. ఈ పద్ధతిని 'పోలింగ్' అంటారు.
- విద్యుద్విశ్లేషణ పద్ధతిలో లోహాన్ని శుద్ధి చేసే ప్రక్రియలో అపరిశుద్ధ లోహాన్ని ఆనోడ్‌గా, శుద్ధమైన లోహ రేకును కాథోడ్‌గా వాడతారు.
- బ్లాస్ట్ ఫర్నేసులో 750° సెంటీగ్రేడ్ వద్ద ఏర్పడిన ఇనుము ఘన స్థితిలో, గుల్లబారి ఉంటుంది. దీన్ని 'స్పాంజ్ ఐరన్' అంటారు.
- స్పాంజ్ ఐరన్ కొలిమి అడుగు భాగం ద్రవరూపంలోకి మారుతుంది. ఈ స్థితిలో కార్బన్, ఫాస్ఫరస్, సిలికా చేరి దుక్క ఇనుము లేదా పోత ఇనుము(కాస్ట్ ఐరన్)గా మారుతుంది. దీనిలో కార్బన్ 3 నుంచి 4 శాతం ఉంటుంది.
- దుక్క ఇనుము సంఘటనలో మార్పుల ద్వారా చేత ఇనుము(వ్రాట్ ఐరన్), స్టీల్ తయారు చేస్తారు.
- చేత ఇనుము శుద్ధమైన ఇనుము. ఇందులో కార్బన్ 0.1 – 0.25 శాతం మాత్రమే ఉంటుంది.
- ఉక్కు(స్టీల్)లో కార్బన్ 0.1-1.5 శాతం మాత్రమే. కార్బన్ శాతం పెరుగుతున్న కొద్దీ పెలుసుదనం పెరుగుతుంది.
- ఉక్కు ప్రధానంగా ఇనుము, కార్బన్ల మిశ్రమ లోహం. కార్బన్‌తోపాటు వివిధ పరిమాణాల్లో మాంగనీస్, నికెల్, క్రోమియం, మాలిబ్డినం, వెనేడియం, టంగ్‌స్టన్ మొదలైన లోహాలను మిశ్రమం చేసి ప్రత్యేక ధర్మాలు ఉన్న ఉక్కును తయారు చేస్తారు.
- స్టెయిన్‌లెస్ స్టీల్‌లో ఇనుము, కార్బన్‌తోపాటు క్రోమియం, నికెల్ ఉంటాయి.
- దుక్క ఇనుము నుంచి స్టీల్ తయారీకి 'ఓపెన్ హార్త్ కొలిమి'ని ఉపయోగిస్తారు.

## మాదిరి ప్రశ్నలు

1. సిన్నబార్ దేని ధాతువు?
   1) బంగారం 2) యురేనియం
   3) సీసం 4) మెర్క్యూరీ
2. చార్జ్ అంటే ఏమిటి?
   1) విద్యుదావేశం 2) ఖనిజ చూర్ణం
   3) కోక్, సున్నపురాయి, ధాతువుల మిశ్రమం
   4) కోక్, ధాతువుల మిశ్రమం
3. బ్లాస్ట్ ఫర్నేస్‌లో లభించే గుల్లబారిన ఇనుమును ఏమంటారు?
   1) స్టీల్ 2) బ్లిస్టర్ ఐరన్
   3) స్పాంజ్ ఐరన్ 4) చేత ఇనుము
4. చేత ఇనుములో కార్బన్ శాతం?
   1) 2 శాతం 2) 0.1 శాతం
   3) 0.8 శాతం 4) 0.2 శాతం
5. గాలి లేకుండా ధాతువును వేడి చేసి బాష్పశీల మలినాలను తొలగించే ప్రక్రియ?
   1) భస్మీకరణం 2) భర్జనం
   3) నిక్షాళనం 4) పోలింగ్

**సమాధానాలు**

1) 4; 2) 3; 3) 3; 4) 4; 5) 1.

## గతంలో అడిగిన ప్రశ్నలు

1. పైరైటీస్ రూపంలో ఇండియాలో లభించే ముడి ఖనిజం?
   1) అల్యూమినియం 2) ఇనుము
   3) బంగారం 4) ప్లాటినం
2. అల్యూమినియం లోహం ధాతువు?
   1) బాక్సైట్ 2) బెరైటీస్
   3) సిన్నబార్ 4) హెమటైట్
3. భూపటలంలో పుష్కలమైన లోహం?
   1) ఇనుము 2) బంగారం
   3) అల్యూమినియం 4) లెడ్
4. ఫిలాసఫర్స్ ఊల్ అంటే ఏమిటి?
   1) జింక్ బ్రోమైడ్ 2) జింక్ నైట్రేట్
   3) జింక్ ఆక్సైడ్ 4) జింక్ క్లోరైడ్

**సమాధానాలు**

1) 2; 2) 1; 3) 3; 4) 3.

# Banks in India can be classified under..



BANK EXAMS
BANKING AWARENESS

1. Co-operative Banks come under the control of RBI by virtue of certain provisions of:
   a) Reserve Bank of India Act 1934
   b) Banking Laws (Application to Co-operative Societies) Act 1965
   c) Banking Regulation Act 1949
   d) Negotiable Instruments act 1881
   e) All the above
2. Which among the following is part of the banking business under the provisions of section 6(1) of B R Act:
   a) Collecting and transmitting of money
   b) Negotiating loans and advance
   c) Acquiring and holding the investments
   d) All the above
   e) None of the above
3. Which one of the following is not Appropriate:
   a) A Commercial bank is prohibited in selling insurance products
   b) An urban co-operative bank can sell mutual fund products
   c) A Private Sector bank can issue a Credit card
   d) A Nationalized bank is permitted to accept articles under safe custody
   e) None of the above
4. Which kind of assistance is provided by EXIM Bank to Indian companies?
   a) Direct loans to exporters
   b) Technology services
   c) Consultancy services
   d) Credit for export of capital goods
   e) All the above
5. Banks in India can be classified under ______ categories:
   a) A body corporate constituted under a special statute
   b) Company registered under the companies act
   c) Foreign company
   d) a, b only e) All a, b and c
6. Central government can exempt a particular bank from the provisions of banking regulation act:
   a) On the recommendations of the RBI.
   b) If the central government is satisfied with the case
   c) If requested by the board of directors of the bank
   d) If unanimous resolution passed by shareholders of the bank
   e) All the above
7. Other than the Governor, Deputy Governors of RBI, the other directors are :
   a) Appointed b) Nominated
   c) Selected d) Elected
   e) Any of the above
8. Which of the following statements is not correct regarding nominations?
   a) Two or more persons can be nominated by a depositor or group of depositors. A Bank will have a full discharge of its liability if it makes the payment to the nominee.
   b) Bank is not obliged to receive any notice of claim from any other person other than the depositor
   c) The Bank will take due notice of any order or certificate from competent jurisdiction relating to deposits where nominee is appointed.
   d) Nominee should be individual and not an institution.
   e) Only a & b
9. Which of the following statements is correct?
   a) RBI approval is required for appointment of a chairman of a Bank.
   b) RBI is empowered to remove top managerial personnel of a Bank.
   c) RBI may appoint suitable person in place of the person so removed.
   d) Only b & c e) All the above
10. If RBI cancels the license of a bank, the bank has the remedy option of:
    a) Filling a review application before governor of RBI
    b) Filling an appeal with RBI after passing a general body resolution
    c) Appealing to central government
    d) Appeal after recommendations of general body and governor to central government
    e) Any of the above
11. Which of the following statements is correct?
    a) The RBI may decide the maximum amount of advance which a Bank may provide to one company or firm or individual.
    b) RBI may advice the Bank for which maximum amount of guarantee may be given to any one company or firm
    c) RBI is empowered to determine other terms and conditions to be followed by a Banking company while considering the loans and advances.
    d) Only b & d e) All the above
12. A bank has refused to open the account without any valid reasons. When the matter was referred to the Bank's Regional Office, no response received even after two months. Then:
    a) The person can refer the matter to Banking Ombudsman.
    b) Even though he is yet to become the customer of the bank, he can refer the matter to Banking Ombudsman.
    c) Since he is the non customer he loses the right to refer the matter to Banking Ombudsman
    d) The person can refer the matter to the Head Office/ Corporate Office of the Bank and then only can approach Banking Ombudsman
    e) None of the above
13. Most of the banks have established ________ for giving focused attention to a particular aspect of banking:
    a) Specialized branches
    b) Large branches
    c) Medium branches
    d) Overseas branches
    e) None of the above
14. If a co-operative bank fails, the depositors of such a bank is protected up to Rs.1 lakh subject to the provision that:
    a) The depositor is not having more than Rs.1 lac at the time of failure of the bank
    b) The bank has registered with the DICGC
    c) The depositor has is not having more than one deposit account
    d) The depositor has opted for insurance coverage specifically
    e) If the bank is paying Insurance Premium to LIC regularly
15. Which of the following statements not correct?
    a) The Nationalized Banks may go to public to raise capital
    b) Public Sector Banks can raise foreign equity up to 49 per cent.
    c) Private Sector Banks can raise capital from the public
    d) Regional Rural Banks cannot raise capital from the public
    e) None of the above
16. Which of the following is correct regarding Capital Adequacy ratio?
    a) The objective of Capital adequacy is to strengthen the financial stability of banks
    b) Capital is divided into two tiers, tier I and tier II
    c) Assets are assigned risk weight from 0-100 based on intensity of risk
    d) Only b is correct
    e) All the above
17. What are the implications of moral suasion?
    a) It has only psychological advantage
    b) It has no legal sanction
    c) It may or may not be an effective tool
    d) It is only a trial of RBI to exercise its function to control the economic system
    e) All the above
18. The limits for FPI investment in govt. securities (G-sec) will be raised in phases (by March 2018) to what per cent of the outstanding stock as per RBI?
    a) 2 % b) 3% c) 4%
    d) 5% e) 6%
19. Which of the following agencies maintain RIDF (Rural Infrastructure Development Fund)?
    a) Ministry of Rural Development
    b) Reserve Bank of India
    c) NABARD d) SIDBI
    e) None of the above
20. RBI announced in its fourth policy review on 29 September that India's GDP growth for 2015-16 can be estimated as:
    a) 7.6 % b) 7.4% c) 7.2%
    d) 7.1% e) 6.9%
21. Which of the following PSBs is NOT among the 8 public sector banks which received the capital infusion of Rs 13,955cr by the Central govt. recently?
    a) Andhra bank
    b) Corporation bank
    c) Dena bank d) Canara bank
    e) None of these
22. The RBI has reduced the benchmark Repo rate on 29 September 2015 and present Repo rate is:
    a) 6.50% b) 6.25%
    c) 6.75% d) 7.75%
    e) 7.25%
23. The gilt-edged security market is the market for which of the Following?
    a) Market for trading in gold
    b) Market for trading in silver
    c) Market for government securities
    d) Market for industrial securities
    e) None of the above
24. Which of the following can be called as intermediary in the financial System?
    a) Insurance companies
    b) Banking companies
    c) Mutual funds
    d) Financial institutions
    e) All of the above
25. Acceptance is required in the case of:
    a) Usance Bill b) Demand bill
    c) Cheque d) Demand Draft
    e) None of these
26. Matured, but not paid, term deposits are treated as :
    a) Demand liability
    b) Time liability
    c) No liability
    d) Contingent liability
    e) None of the above
27. Urban cooperative banks are controlled by:
    a) Registrar of societies
    b) State governments
    c) Reserve bank d) b & c
    e) None of the above
28. A Cheque drawn in favour of Raju & Co. and endorsement is duly confirmed by the collecting banker. Will the paying banker get protection?
    a) Will not get, as endorsement is irregular
    b) Will get protection as endorsement is confirmed by the collecting banker
    c) Will get only if payee has rectified the action
    d) Paying banker is not concerned with the genuineness of endorsement
    e) None of the above
29. The holder of a Negotiable instrument is Holder in due course if:
    a) He receives the instrument in good faith and without negligence
    b) He receives the instrument before its maturity
    c) He receives the instrument for lawful consideration
    d) All of the above
    e) None of the above
30. An inchoate instrument is one which does not have:
    a) The Amount b) The Date
    c) Name of the payee
    d) Signature of the drawer
    e) a, b & c
31. Leasing, Hire purchase and Bill discounting are the main functional domains of:
    a) NBFCs b) Banks
    c) Mutual funds
    d) Insurance Companies
    e) Only b & c
32. A co-operative Bank operating in different states are regulated by :
    a) State co-operative societies Act
    b) Banking regulation Act
    c) Multi Unit Co-operative societies Act
    d) Banking Laws (application to co-operative societies)
    e) None of the above

**KEY**

1) e; 2) d; 3) a; 4) e;
5) e; 6) a; 7) b; 8) a;
9) e; 10) c; 11) e; 12) a;
13) a; 14) b; 15) b; 16) e;
17) e; 18) d; 19) c; 20) b;
21) e; 22) c; 23) c; 24) e;
25) a; 26) a; 27) d; 28) a;
29) d; 30) e; 31) a; 32) c.